ఈనాడు

విజయవాడ 30-1-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 170
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఎన్నికల పిలుపు



'జమిలి' జమానా రావాలి

- ఏకకాలంలో ఎన్నికలపై ఏకాభిప్రాయానికి రండి
- పార్టీలకు రాష్ట్రపతి పిలుపు

11లో

దేశంలో నిత్యం ఏదోఒక చోట ఎన్నికలు జరుగుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీటివల్ల ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతోంది. జమిలి ఎన్నికల నిర్వహణపై నిరంతర చర్చ జరగాలి. రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలి.

కాఫీ కబురు




అరకు ఇన్‌స్టంట్ మార్కెట్లో

- జీసీసీ ద్వారా విక్రయం
- 2 గ్రా, 10 గ్రా సాచెట్లలో లభ్యం

అరకు వ్యాలీ కాఫీ పొడి ఇక ఇన్‌స్టెంట్ కాఫీగా మార్కెట్‌లో లభిస్తుంది. గిరిజన సహకార సమాఖ్య (జీసీసీ) ఈ మేరకు సాచెట్లు తయారు చేసి సోమవారం విడుదల చేసింది. అరకులో ప్రసిద్ధి చెందిన కాఫీని గిరిజనులు 3లక్షల ఎకరాలలో పండిస్తున్నారు. 5లో

గుర్తింపు సులువు



గాలి నాణ్యతకో యాప్

మనం పీల్చే గాలి స్వచ్ఛమైనదేనా? అందులో కాలుష్య కారకాలేమైనా ఉన్నాయా? అనే విషయాలు ఇకపై ఒక్క మీట నొక్కి తెలుసుకోవచ్చు. ఏ ప్రాంతంలో గాలి నాణ్యత ఎలా ఉందనేది గుర్తించడమే కాదు, దానివల్ల కలిగే ప్రభావాన్ని తెలుసుకుని అప్రమత్తంకావొచ్చు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సిద్ధం చేసిన "పర్యావరణ్" యాప్ ఇందుకు దోహదం చేస్తుంది. 2లో

వృద్ధి రేటు పరుగు


ఆర్థికం.. ముమ్ముందుకే..

- జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు ప్రభావం ఉండదిక..
- ముడి చమురు ధరలతో సవాళ్లు

2018–19 అంచనా

7% నుంచి 7.5%





1 ఉద్యోగాలు: యువతకు సరైన ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది. ముఖ్యంగా మహిళా మానవ వనరులను సరైన రీతిలో ఉపయోగించుకోవాలి.

2 విద్య: విద్యావంతులైన, ఆరోగ్యకరమైన కార్మిక సిబ్బందిని సృష్టించుకోవాలి.

3 వ్యవసాయం: పంటల దిగుబడిని పెంచుకోవాలి.

ఆర్థిక సర్వే

ఈనాడు – హైదరాబాద్

జీఎస్టీ అమలు, పెద్ద నోట్ల రద్దు ప్రభావాన్ని తోసిరాజని.. వచ్చే ఆర్థిక సంవత్సరం భారత ఆర్థిక వృద్ధి 7-7.5 శాతం నమోదు కావొచ్చు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తన రాజసాన్ని కొనసాగించనుంది. భాజపా ప్రభుత్వం వెలువరించనున్న అయిదో, తుది పూర్తిస్థాయి బడ్జెట్‌కు రెండు రోజుల ముందు విడుదలైన ఆర్థిక సర్వే ఈ విషయాన్ని వెల్లడించింది. ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ నేతృత్వంలో సిద్ధమైన ఈ సర్వేను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. వృద్ధి అంచనాలు బాగున్నప్పటికీ.. కొన్ని సవాళ్లు ఎదురుకావొచ్చని సర్వే హెచ్చరించింది. ముఖ్యంగా పెరుగుతున్న ముడి చమురు ధరల నుంచి సవాలు ఎదురుకావొచ్చని చెబుతోంది. నిధులకు కొరత ఉన్నా విద్య, ఆరోగ్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యం లభిస్తోందని తెలిపింది. ప్రస్తుత ఏడాది జీడీపీ వృద్ధిరేటు 6.75 శాతంగా నమోదు కానుంది. కేంద్ర గణక కార్యాలయం అంచనా వేసిన 6.5 శాతం కంటే ఇది ఎక్కువే. వచ్చే ఏడాది ఎగుమతులు, పెట్టుబడులు తిరిగి పుంజుకోనున్నాయి. 2016-17లో 7.1%, అంతక్రితం ఏడాది 8%, 2014-15లో 7.5 శాతం చొప్పున వృద్ధి నమోదైన విషయం తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిపై జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు ప్రభావం పడింది.

సానుకూలతలు మొదలవుతాయ్..

జీఎస్టీ అమలు, పెద్దనోట్ల (మిగతా 2లో)

ప్రత్యేక కథనాలు
13, 14, 15 పేజీల్లో

పర్యాటకుల్లో రాష్ట్ర స్థానం **3**

ఇళ్లకు 100% విద్యుత్తు ఇచ్చిన రాష్ట్రాల జాబితాలో చోటు



రాష్ట్ర తలసరి ఆదాయం **1,22,376** (2016–17)

ఆర్థిక సర్వేలో...

మగపిల్లాడు పుట్టేవరకు పిల్లల్ని కంటూ ఉండే సంప్రదాయం చాలామందిలో ఉంది. దీనివల్ల సహజంగానే 'అవాంఛిత' ఆడపిల్లల సంఖ్య పెరుగుతోంది. ఇలాంటివారు దాదాపు 2.10 కోట్ల మంది ఉంటారు.

ఆరుబయట మల విసర్జన అలవాటు నుంచి 8 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు పూర్తిగా బయటపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో మరుగు అవసరాల కోసం ఆరుబయలు స్థలాలకు వెళ్లేవారు 2014 అక్టోబరులో 55 కోట్లు ఉంటే ఇప్పుడు 25 కోట్లకు తగ్గారు.

పురుషులంతా పట్టణాలకు వలస వెళ్తుండడంతో వ్యవసాయం చేయాల్సిన బాధ్యత మహిళలపై పడింది. వారు కూడా రైతులు, కార్మికులు తదితర పాత్రలను సమర్థంగా పోషిస్తున్నారు.

భారతీయుల ఆరోగ్య స్థితిగతులు గణనీయంగా మెరుగుపడ్డాయి. 1990 నుంచి 2015 మధ్య కాలంలో జీవన కాలం దాదాపు పదేళ్లు పెరగడమే దీనికి నిదర్శనం.

కేసుల కారణంగా విద్యుత్తు, రైల్వేలు, రహదారుల మంత్రిత్వ శాఖలు చేపడుతున్న పనులు ఆగిపోతున్నాయి. ఇలాంటి కేసుల విలువ దాదాపు రూ.52 వేల కోట్లుగా ఉంది.

దేశంలో నీటి కొరత పెరుగుతోంది.. చైనా, అమెరికాలకన్నా రెట్టింపు స్థాయిలో భూగర్భ జలాలు తోడేస్తుండటంతో గత 30ఏళ్లలో 13% తగ్గిపోయాయి.

వర్షాకాలంలో అత్యంత వేడిగా ఉండే రోజులు 4.8% నుంచి 6.5% పెరిగాయి. మరోవైపు చల్లగా ఉండే రోజులు 7 నుంచి 3 శాతానికి తగ్గాయి.

అవినీతికి ప్రణాళిక



అనిశాకు చిక్కిన ప్రదీప్‌కుమార్

ప్రదీప్ ఇంట లభించిన కత్తి

- అనిశాకు చిక్కిన వుడా అదనపు సీయూపీ
- తెలుగు రాష్ట్రాల్లో 12చోట్ల సోదాలు
- ఆస్తుల విలువ రూ.40 కోట్ల పైనే

ఈనాడు, విశాఖపట్నం: ఉద్యోగంలో చేరినప్పుడు ఆయన నెల జీతం కేవలం రూ.1,300.. ప్రస్తుతమది రూ.90వేలు.. వారసత్వ ఆస్తులేం లేవు.. ఇప్పుడు మాత్రం ఆదాయానికి మించిపోయాయ్! ఆయన గడించిన ఆస్తుల పుస్తక విలువ రూ.4కోట్లయితే.. మార్కెట్ విలువ ప్రకారం రూ.40కోట్ల పైమాటే! 15 బ్యాంకు ఖాతాలు, ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఇంట్లోనే మూడు లాకర్లు, బంగారు ఆభరణాలు.. ఇదంతా అవినీతి నిరోధక శాఖకు చిక్కిన విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ(వుడా) అదనపు ముఖ్య నగర ప్రణాళిక అధికారి(అడిషనల్ సీయూపీ) పసుపర్తి ప్రదీప్‌కుమార్ ఆర్జన. గుంటూరులో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగంలో సంయుక్త సంచాలకులుగా పనిచేస్తూ ఈనెల 2న డిప్యుటేషన్‌పై వుడాలో ఆయన విధుల్లో చేరారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నారన్న సమాచారం మేరకు రహస్య విచారణ జరిపిన అనిశా.. ఆంధ్రప్రదేశ్ డీజీ ఆర్పీ ఠాగూర్ ఆదేశాల మేరకు ఏకకాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 12 చోట్ల సోదాలు నిర్వహించింది. ప్రదీప్‌కుమార్ నివాసాలతోపాటు, స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఐదుచోట్ల సోమవారం ఉదయం ఐదింటి నుంచి తనిఖీలు సాగాయి. హైదరాబాద్, అనంతపురం, ఒంగోలు, విజయవాడ, గుంటూరులలోనూ (మిగతా 2లో)

అనిశా గుర్తించిన ఆస్తులు:

ఇంటి స్థలాలు: 5, **ఫ్లాట్లు:** 4,
సాగు భూములు: 9.20 ఎకరాలు.
వాహనాలు: మారుతి బ్రిజ్జా (ఏపీ31 డీకే123), రెండు ద్విచక్రవాహనాలు.
బంగారం: 2.7కిలోలు (విలువ రూ.70లక్షలు), **ప్లాటినం ఉంగరాలు:** రెండు, **వెండి ఆభణాలు:** 12.5 కిలోలు (విలువ రూ. 4 లక్షలు).
నివాసంలో గుర్తించిన ఇంటి సామగ్రి ఖరీదు: రూ. 21 లక్షలు

దిల్లీలో పోలవరం భేటీ నేడు

- కేంద్ర మంత్రి గడ్కరీ వద్ద సమావేశం
- నవయుగ, ట్రాన్స్‌ట్రాయ్‌ల మధ్య కొలిక్కి రాని అంశం
- గుత్తేదారులు, జలవనరుల మంత్రి, అధికారుల హాజరు
- మళ్లీ టెండర్ల వైపు మొగ్గు తప్పదా?


ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై దిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వద్ద మంగళవారం మరో కీలక భేటీ జరగబోతోంది. ప్రాజెక్టులో స్పిల్‌వే కాంక్రీటు, స్పిల్ ఛానల్ పనులు కొత్త గుత్తేదారుకి అప్పగించే అంశానికి సంబంధించే ఈ సమావేశం జరగనుంది. టెండర్ల ప్రక్రియ ఇప్పటివరకు ముందుకు సాగలేదు. మరోవైపు నవయుగ కంపెనీ పాతధరలకే పనిచేస్తానంటూ ముందుకొచ్చినా ప్రధాన గుత్తేదారుతో ఒప్పందం కొలిక్కి రాలేదు. వారి మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ (మిగతా 2లో)

ఫిబ్రవరి నుంచి జలసంరక్షణ

- తర్వాత సాగునీటి ఎన్నికలు
- ముఖ్యమంత్రి నిర్ణయాలు
- వైకుంఠపురం బ్యారేజి, గోదావరి సాగర్ మళ్లింపుపై మళ్లీ భేటీ
- పోలవరం పనులకు ప్రత్యేక నిధి

ఈనాడు – అమరావతి

ఫిబ్రవరి నుంచి 116రోజుల పాటు రాష్ట్రంలో జలసంరక్షణ ఉద్యమం ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఇప్పటివరకు చేసిన పనుల వల్ల రూ.400కోట్ల విలువైన విద్యుత్తును ఆదా చేశామన్నారు. అదే స్ఫూర్తితో సమర్థ నీటి నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. అమరావతి సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి పోలవరం సహా ప్రాధాన్య ప్రాజెక్టులు, జలవనరుల పనులపై సమీక్షించారు. అన్ని ప్రాజెక్టులపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించారు. భూగర్భజలాలు పెరగడం ద్వారా వ్యవసాయ విద్యుత్తు వినియోగంలో మిగులు సాధించామని సీఎం వివరించారు. దీన్ని ప్రభుత్వ విజయంగా పేర్కొంటూ కాలువలు, చెరువులు పటిష్ఠపరచడంతో పాటు చెక్‌డ్యాంల మరమ్మతులు వేగంగా పూర్తిచేయాలని నిర్దేశించారు. ఇవి పూర్తయ్యాక జూన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో సగటున 10.45మీటర్ల లోతున భూగర్భజలాలు ఉన్నాయని అధికారులు చెప్పగా.. 100మీటర్ల కన్నా దిగువన భూగర్భజలాలున్న ప్రాంతాలపై తొలుత దృష్టిసారించాలని సీఎం సూచించారు. భూగర్భాన్ని పెద్ద జలాశయంగా మార్చాలనేది తన ఆశయమని చంద్రబాబు చెప్పారు. వచ్చే మార్చినాటికి పూర్తిచేయాలని తలపెట్టిన 28 ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఇప్పటికే ఏడింటిని ప్రారంభించగా మరో 6 ప్రారంభానికి సిద్ధంగా ఉండగా.. మిగిలిన 15ప్రాజెక్టుల పురోగతిపై (మిగతా 2లో)



ప్రకాశం జిల్లా కొనకనమిట్లలో కాయకపోవడంతో రాలుతున్న నిమ్మకాయలు

ఉద్యానం ఉసూరు

- కడియంలో పూలతోటల తొలగింపు
- పొలాల్లోనే టమోటా
- నిమ్మకోతలూ భారమే..
- గిట్టుబాటు ధర లేక రైతన్నలు విలవిల

పూల సాగుకు పెట్టింది పేరైన కడియంలో తోటలు తొలగిస్తున్నారు.. రాయలసీమలో టమోటా సాగు చేసిన రైతులు కోయలేక వదిలేస్తున్నారు.. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో నిమ్మరైతుకు కన్నీరే మిగులుతోంది.. ఇవన్నీ ఉద్యానపంటలే. సాగు విస్తీర్ణం కోటి ఎకరాలకు పెంచాలని ప్రభుత్వం ఒకవైపు లక్ష్యాలు నిర్దేశిస్తుంటే.. మరోవైపు, తోటలు వేసిన రైతులకు గిట్టుబాటు ధర లేక కన్నీళ్లే మిగులుతున్నాయి. వారికి గిట్టుబాటు ధరలు కల్పించడంపై మార్కెటింగ్‌శాఖ దృష్టి పెట్టడం లేదు. ఉద్యానశాఖ రైతు ఉత్పత్తి సంఘాలతో సాగదీతలకే పరిమితం అవుతోంది. ధరలు దక్కకపోవడం ఒక ఎత్తైతే.. వ్యాపారుల దోపిడీ మరో తంతుగా మారింది. నిబంధనల ప్రకారం మార్కెట్లో 4శాతం కమిషన్ వసూలు చేయాల్సిఉంటే పది% దండుకుంటున్నారు. తరుగుల పేరిట 20% సరకు అదనంగా తీసుకుంటున్నారు. ఇదంతా (మిగతా 2లో)

ఇదీ సంగతి!



మల్లెపూలూ, మల్లెపూలూ, పాతిక రూపాయలకొకటి. పాతిక రూపాయలకు ఒకటీ...

అవినీతికి ప్రణాళిక



స్వాధీనం చేసుకున్న పంచలోహ విగ్రహాలు

- **పేరు:** పసుపర్తి ప్రదీప్‌కుమార్
- **హోదా:** అదనపు ముఖ్య నగర ప్రణాళిక అధికారి
- **ప్రస్తుత విధులు:** విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ(వుడా)
- **అభియోగం:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని..
- **సోదాలు:** తెలుగు రాష్ట్రాల్లో 12 చోట్ల..



అనిశా అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

(మొదటి పేజీ తరువాయి)

ఏకకాలంలో సోదాలు జరిపారు. పెద్దఎత్తున స్థిర, చరాస్తులు గుర్తించారు విశాఖలోని వుడా కార్యాలయంలోని ప్రదీప్‌కుమార్ ఛాంబర్‌లోనూ తనిఖీలు సాగాయి. వీటికి కృష్ణా జిల్లా అనిశా డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాద రావు ఆధ్వర్యం వహించారు. ప్రదీప్‌కుమార్‌ను అరెస్ట్‌చేసి విజయవాడ అనిశా కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.

ఇదీ గత చరిత్ర..

ప్రదీప్‌కుమార్ విశాఖలోని వాల్తేరు క్లబ్ ఎదురుగా నటరాజ్ టవర్‌లో ఉంటున్నారు. ఈయన స్వగ్రామం కర్నూలు జిల్లాలోని పోతికొండ మండలంలోని చక్రాల. 1984లో ప్రభుత్వ సేవల్లో చేరిన ప్రదీప్‌కుమార్ అనంతపురం జిల్లా గుంతకల్‌లో బిల్డింగ్ ఇన్‌స్పెక్టరుగా పనిచేశారు. 1991లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా.. 1999లో టౌన్ ప్లానింగ్ అధికారిగా.. 2013లో సిటీ ప్లానర్(డిప్యూటీ డైరెక్టర్)గా.. ఈ ఏడాది టౌన్ ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ వుడాకు వచ్చారు. 2015-16లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి సిటీప్లానర్‌గానూ పనిచేశారు. గతంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్న ప్రదీప్‌కుమార్ విశాఖలో బాధ్యతలు స్వీకరించిన తక్కువ కాలంలోనే అనిశా దాడుల్లో చిక్కారు.

అక్రమార్జన చాంతాడంత..

(అనిశా అధికారులు వెల్లడించిన మేరకు)

ప్రదీప్ పేరిట..

- విశాఖ నగర పరిధి మధురవాడలో 2005లో రూ. 2.40లక్షలతో కొన్న 500చ.గ. ఇంటి స్థలం..
- విశాఖలోని కిర్లంపూడి లేఅవుట్‌లో 2012లో రూ. 40లక్షలతో కొన్న ఫ్లాట్
- అనంతపురం శివాజీనగర్‌లో 2010లో రూ. 19 లక్షలతో కొన్న ఇల్లు

భార్య లత పేరిట..

- విశాఖ మధురవాడలో 2006లో రూ. 3,11,110లతో కొన్న 311చ.గ. స్థలం.. అక్కడే 2007లో రూ. 7.78లక్షలతో కొన్న మరో ఇంటి స్థలం
- విజయవాడ దేవినగర్‌లో ప్రదీప్, ట్రెండ్‌సెట్ బిల్డర్స్ మధ్య 2016లో కుదిరిన ఒప్పందం ప్రకారం పొందిన రూ. 56.74లక్షల విలువైన 166చ.గ. స్థలం.
- కడప జిల్లా మైదుకూరులో 4.08ఎకరాల సాగు భూమి (2005లో రూ. 1.37లక్షలకు కొన్నట్లు చూపారు)
- అనంతపురం మూర్తినగర్‌లో 4.5ఎకరాల సాగుభూమి. (2005లో రూ. 2.85లక్షలకు కొన్నట్లు చూపారు)
- కృష్ణా జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరులో 1.07ఎకరాల సాగుభూమి(2007లో రూ. 1,60,500కు కొన్నట్లు చూపారు)

తండ్రి పి.వెంకటరాజు పేరిట..

- రాజమహేంద్రవరం నరసింహరావుపేటలో 253 చ.గ. ఇంటిస్థలం(2005లో రూ. 4.32 లక్షలకు కొన్నట్లు చూపారు)

బావమరిది బి.కృష్ణమోహన్ పేరిట..

- విశాఖ మధురవాడలో 2006లో రూ. 8,98,500తో కొన్న 599 చ.గ. స్థలం

చిన్నాన్న నారాయణరాజు పేరిట..

- విశాఖ మధురవాడ ప్రాంతంలో 2017లో రూ. 60లక్షలు వెచ్చించి కొన్న 200చ.గ. స్థలం

విదేశాల్లో చదువులు..
స్వదేశంలో వ్యాపారం..

- అదనపు చీఫ్ అర్బన్ ప్లానర్ ప్రదీప్‌కుమార్ భార్య లత ప్రస్తుతం స్నేహితురాళ్లతో సింగపూర్ పర్యటనలో ఉన్నారు. ఇంట్లో మూడు లాకర్లను అధికారులు గుర్తించారు. అందులో బంగారు ఆభరణాలు ఉన్నాయని, ఆమె వచ్చాక వీటిని తెరిపిస్తామని చెప్పారు. ఖరీదైన పట్టుచీరలు ,అలంకరణ సామగ్రి, తదితరాలను అధికారులు గుర్తించారు.
- పెద్ద కుమారుడు హేమంత్‌సాయి స్కాట్లండ్‌లో ఇంజినీరింగ్.. యూఎస్‌లో ఎంఎస్ చదివారని, ఇందుకోసం రూ.లక్షలు వెచ్చించినట్లు గుర్తించారు. చదువు పూర్తయ్యాక హెచ్ఎస్ కనస్ట్రక్షన్స్ పేరుతో మధురవాడలో వ్యాపారం ప్రారంభించినట్లు అనిశా గుర్తించింది. కిర్లంపూడి ప్రాంతంలో నిర్మించిన అతిథిగృహం అద్దెకిచ్చేందుకు సిద్ధమయింది. హేమంత్‌సాయి పెళ్లికి కల్యాణమండపం అద్దె, భోజన ఖర్చులకే రూ. 30 లక్షలు ఖర్చుచేసినట్లు గుర్తించారు.
- చిన్న కుమారుడు జయంత్‌సాయి మణిపాల్ రాష్ట్రంలో ఇంజినీరింగ్ చదువుతున్నట్లు గుర్తించిన అధికారులు ఇందుకు ఇప్పటివరకు రూ. 10 లక్షలకుపైనే ఖర్చుచేసినట్లు తేల్చారు.

పరుగు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు వల్ల ప్రతికూల ప్రభావాలు కనిపించాయి. ఇక ఇప్పుడు ఆ రెండింటి వల్ల ఏర్పడ్డ పరిస్థితులు సద్దుమణిగిన కారణంగా.. ఇక అసలు ప్రభావం అంటే సానుకూల ప్రభావాలు వచ్చే ఏడాది నుంచి కనిపించనున్నాయి. ఈ ఏడాది పలు రాష్ట్రాల ఎన్నికలు, వచ్చే ఏడాది సాధారణ ఎన్నికల ముందు ఇది చోటు చేసుకోవడం మంచి పరిణామమే.

ముడి చమురు ప్రభావం ఇలా..

ఎగుమతులు పుంజుకుంటే.. వృద్ధిరేటు 7.5 శాతం కంటే అధికంగానే నమోదవుతుంది. అయితే ముడి చమురు ధరల కారణంగా కొంత ప్రతికూలతలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ముడి చమురు ఎగుమతులు 14 శాతం మేర పెరగవచ్చు. 2018-19లో మరో 10-15 శాతం మేర పెరిగే అవకాశాలు ఉండొచ్చు. దీనివల్ల జీడీపీపై 0.2-0.3 శాతం; ద్రవ్యోల్బణంపై 0.2-0.3 శాతం మేర ప్రభావం పడే అవకాశం ఉంది. అదే సమయంలో పీపా ముడి చమురు ధర 10 డాలర్లు పెరిగితే కరెంట్ ఖాతా లోటు మరింత పెరిగే అవకాశం ఉంది.

ఇవీ సానుకూల అవకాశాలు..

ముడి చమురు ప్రభావాల నేపథ్యంలో విధానపరంగా పర్యవేక్షణ అవసరం. ఎందుకంటే అధిక ధరలు కొనసాగితే.. అది పెట్టుబడులపై ప్రభావం చూపుతుంది. మరోపక్క, ప్రపంచ వృద్ధిరేటు 2018లో మోస్తరుగా నమోదు కావొచ్చు. జీఎస్టీలో మరింత స్థిరత్వం కనిపిస్తుంది. పెట్టుబడుల స్థాయిలూ పుంజుకోవచ్చు. ప్రస్తుత నిర్మాణాత్మక సంస్కరణలూ కొనసాగుతున్నాయి.. వీటన్నిటి వల్ల అధిక వృద్ధికి ఊతం లభిస్తుంది. మొత్తం మీద 2018-19లో ఆర్థిక పనితీరులో ఎంచదగ్గరీతిలో మార్పు కనిపిస్తుంది.

ఆర్థిక వృద్ధి వేగంగా నమోదు కావడానికి కావలసిన అత్యంత ముఖ్యమైన రెండు అంశాలైన ప్రైవేటు పెట్టుబడులు, ఎగుమతులను మెరుగుపరచుకోవాలి. వచ్చే ఏడాది ఆర్థిక, రాజకీయ ముఖచిత్రం కారణంగా ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు ఎదురయ్యే అవకాశమైతే ఉంది. ఇక వ్యాపారాలను సులువుగా చేసుకోవడానికి మరింత సరళమైన విధానాలు రావాలి. అప్పిలేట్, కోర్టుల్లో జాప్యాలను తగ్గించాల్సిన అవసరం ఉంది. ఈ జాప్యాలు అనేక ప్రాజెక్టుల అమలుపైనా ప్రభావం చూపిస్తున్నాయి.

సమాచార సాంకేతిక విజ్ఞానపరంగా మనం ఇప్పుడెలా ఉన్నాం, ఎలా మారాలి అనేది ఆర్థిక సర్వే విశ్లేషించింది. చైనా వంటి దేశాల నుంచి పోటీ గట్టిగా ఎదురవుతున్నా మన భవితకేం ఢోకా ఉండదని భరోసా ఇచ్చింది. మౌలిక సదుపాయాల పరంగా మాత్రం నిధుల కొరత తప్పేలా లేదని అప్రమత్తం చేసింది. అనేక సామాజిక అంశాలనూ స్పృశించింది. మగపిల్లాడే కావాలంటూ కాన్పులపై కాన్పులకు వెళ్తుండడం, లేదా భ్రూణహత్యలకు పాల్పడుతుండడం వల్ల లింగ నిష్పత్తిపై ఎలాంటి ప్రభావం పడుతోందో గణాంకాలతో వివరించింది. సరకు రవాణా రుసుములను క్రమేపీ పెంచుకుంటూ వెళ్తుండడం వల్ల రైల్వే పరిస్థితి ఎలా మారిందో విశ్లేషించింది. విధాన నిర్ణయాల్లో మహిళల పాత్ర తక్కువగానే ఉంటోందనీ, పనిచేసే మహిళల శాతమూ తగ్గిపోయిందనీ గుర్తించింది.



కడియపులంకలో ధరలేక నష్టాలొస్తుండడంతో పూలతోటను కూలీలతో కలిసి తొలగిస్తున్న రైతు వెంకటేశ్వరరావు

తూర్పుగోదావరి జిల్లా మడికి గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం ఉదయం కడియపులంక మార్కెట్‌కు చేమంతి పూలతో వెళితే కిలో రూ.20 చొప్పున కొన్నారు. రెండో గంప తీసుకెళ్లేసరికి కిలోకు రూ.10 మాత్రమే ఇచ్చారు. పూల కోత డబ్బు కూడా రావడం లేదనే ఆవేదనతో ఆయన తోటనే తొలగించేందుకు సిద్ధమయ్యాడు. ఎకరా తోటను కొడవళ్లతో కోసేశాడు. పొలం దున్నించి మరో పంట వేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఇవే పూలు విజయవాడ మార్కెట్లో కిలో రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. 25 కిలోల పువ్వులను కోయడానికి రూ.350 కూలి అవుతుంటే వాటికి మార్కెట్లో రూ.300 కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. పలువురు రైతులు ధర దక్కక పూలను గోదావరి కాలువల్లో పడేస్తున్నారు.

అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మద్దిపల్లికి చెందిన కొండయ్య చిత్తూరు జిల్లాలోని మదనపల్లి మార్కెట్‌కు 150 పెట్టెల్లో 4,500 కిలోల టమోటాను తెస్తే రూ.9,600 వచ్చాయి. అంటే కిలోకు రూ.2.13 మాత్రమే. ఇందులో కమిషన్, ఖర్చులు, కోతకూలి, బాడుగ పోను చేతికొచ్చింది రూ.1,140 మాత్రమే. అంటే కిలోకు దక్కిన మొత్తం 25పైసలు. ఇదే టమోటా విజయవాడ రైతు బజార్లలో కిలో రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు.

ప్రకాశం జిల్లా కొనకనమిట్లకు చెందిన కరేటి బాలయ్య అయిదెకరాల్లో నిమ్మతోట వేశారు. సంక్రాంతి సమయంలో క్వింటాలు రూ.2వేల చొప్పున కొనుగోలు చేసిన నిమ్మకాయలకు ఇప్పుడు రూ.800 నుంచి రూ.1,000 మధ్యనే ఇస్తున్నారు. కమిషన్, బాడుగ, కోత ఖర్చులు మినహాయిస్తే రైతుకు దక్కేది కిలోకు రూ.4.90 మాత్రమే. విజయవాడ మార్కెట్లో మాత్రం డజను నిమ్మకాయలు రూ.15కు తగ్గడం లేదు. కిలోల లెక్కనైతే రూ.22 అమ్ముతున్నారు.

ఉద్యానం ఉసూరు

(మొదటి పేజీ తరువాయి)

తెలిసినా మార్కెటింగ్‌శాఖ నియంత్రించే ప్రయత్నం చేయడం లేదు.

కడియంలో కన్నీళ్లు..

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కడియపులంక పూల మార్కెట్లో మునుపెన్నడూ చూడని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో వారం, పదిరోజులు ధరలు తగ్గినా తర్వాత పెరిగేవి. ఇప్పుడు నెలన్నరగా గిట్టుబాటు ధరలే దక్కడం లేదు. గతేడాదితో పోలిస్తే ధరలు సగంకంటే తక్కువకు పడిపోయాయి. కిలో చామంతికి రూ. 50 నుంచి రూ. 70 మధ్య లభిస్తేనే లాభదాయకం. ప్రస్తుతం రూ. 10 నుంచి రూ. 30 లోపుగానే ఉంది. ఈ ఏడాది విస్తీర్ణం పెరగడంతోపాటు వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించలేదు. పూలు చిన్నమొగ్గలు, సన్నకాడతో ఉండడంతో వాటికి ధర లభించడం లేదు. తూర్పుగోదావరి జిల్లా కడియం, ఆలమూరు, ఆత్రేయపురం మండలాల పరిధిలో సుమారు ఐదు వేల ఎకరాల్లో పూల సాగు చేస్తున్నారు. గతంతో పోలిస్తే సాగు విస్తీర్ణం రెట్టింపైంది. కడప, అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాల్లోనూ పూల రైతుల సంఖ్య పెరుగుతోంది. సాగు పెరగడం, శుభకార్యాలకు మంచిరోజులు లేకపోవడం, మూఢం వల్ల ఈ దుస్థితి నెలకొంది. మార్కెట్లో చామంతులు చెన్నై, హైదరాబాద్, ఉభయగోదావరి జిల్లాలు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా ప్రాంతాలకు వెళుతుంటే కుప్పం నుంచి రోజుకు మూడు లారీల బంతి పువ్వులు కడియం మార్కెట్‌కు వస్తున్నాయి. ఎకరాకు రూ. 70వేల కౌలు, సాగు చేసినందుకు రూ. లక్ష పెట్టుబడి అవుతోందని రైతులు కర్రి జనార్ధనస్వామి, ఉండమట్ల జార్జిప్రకాశ్, కొప్పిలి సత్తిబాబు వివరించారు. 1980 నుంచి ఇంత దారుణమైన రోజులు ఎన్నడూ చూడలేదని పూల వ్యాపారి పి.సత్తిరాజు పేర్కొన్నారు.

టమోటా కోయలేక..

రాష్ట్రంలో ఏడాదికి 26.13 లక్షల టన్నుల టమోటా ఉత్పత్తి వస్తుండగా రూ. 2,157 కోట్ల ఆదాయం లభిస్తున్నట్లు ఉద్యానశాఖ అంచనా వేసింది. అదేసమయంలో సాగు చేస్తున్న రైతులకు ఆదాయం ఎంతమేర దక్కుతుందనే అంశంపై దృష్టి పెట్టడం లేదు. ఎకరాకు రూ. 50వేల నుంచి రూ. 75వేల పెట్టుబడి పెడుతున్నా ఆదాయం అందులో సగం కూడా లభించడం లేదు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరాది రాష్ట్రాల్లో ఇప్పుడు టమోటా పంట వస్తోంది. దీంతో అక్కడి వ్యాపారులు రాష్ట్రానికి రావడం లేదు. డిమాండ్ తగ్గడంతో ధరలు పడిపోయాయి. కర్నూలు జిల్లాలో 17వేల హెక్టార్లలో టమోటా సాగు చేశారు. ధర పడిపోవడం వల్ల బాడుగ ఖర్చులు కూడా రావడం లేదని పత్తికొండకు చెందిన వన్నూరు సాహెబ్ ఆవేదన వ్యక్తంచేశారు. అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో పలు చోట్ల కోత ఖర్చులు కూడా రాకపోవడంతో టమోటాను కోయకుండా వదిలేస్తున్న వైనం నెలకొంది.

అప్పులపాలవుతున్న నిమ్మరైతు

నిమ్మ రైతులు పెట్టుబడులూ రాక అప్పులపాలవుతున్నారు. ప్రకాశం, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో నిమ్మ పండిస్తున్నారు. పెట్టుబడి ఎకరానికి రూ. 60వేల నుంచి రూ. లక్ష అవుతోంది. ప్రకాశం జిల్లాలో కూలీలతో కోయించలేక తోటలో అలానే వదిలేస్తున్నారు. కోత ఖర్చులకు రూ. 25వేల వరకు అవుతున్నాయని తెనాలి సమీపంలోని అంగలకుదురు రైతు వీరమాచినేని వెంకటేశ్వర్లు వివరించారు. ఏడెకరాలు సాగు చేస్తే అంతా నష్టమే వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

పూల ధరలు(కిలోకు రూపాయల్లో)

పూల రకం	ప్రస్తుతధర	గతేడాది ఇదే సమయంలో
చామంతి (పసుపు చందమామ)	10 -25	80. -20
పసుపు క్రీం -	20- 30	70- 100
ఎరుపు (కుంకుమ)	25 - 50	80 -100
నీలం	30- 60	70 -100
బంతి	20-30	50 -60
లిల్లీ	40	80

ఆధారిత పరిశ్రమలు ఏర్పడితేనే..

రైతుల నుంచి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతు బజార్లలో విక్రయించే అవకాశాలున్నా.. ప్రభుత్వం చెప్పేవరకు అధికారులు రంగంలోకి దిగడం లేదు. టమోటాలో సాస్, డ్రై టమోటా, ఇతర ఉత్పత్తులకు అవకాశాలున్నాయి. రాష్ట్రంలో పూల సాగు పెరుగుతున్న నేపథ్యంలో ఎగుమతులు, సుగంధ ద్రవ్యాల తయారీ పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వం సత్వరం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. పంట ఆధారిత పరిశ్రమలు ఏర్పడితేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

-ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే బృందం

ఫిబ్రవరి నుంచి జలసంరక్షణ

(మొదటి పేజీ తరువాయి)

సీఎం ప్రశ్నించారు. కుప్పం కాలువ పనులు పూర్తిచేసి మార్చి 15 నాటికి నీరివ్వాలని సూచించారు. ఏప్రిల్ 15కల్లా అడవిపల్లి రిజర్వాయర్ సిద్ధంచేసి చిత్తూరుకు నీరందించాలన్నారు. మార్చికల్లా కొండవీటి వాగుకు 5 పంపులు బిగిస్తామని అధికారులు సీఎంకు చెప్పారు.

ఫిబ్రవరి 5న ప్రత్యేక భేటీ

కృష్ణానదిపై వైకుంఠపురం బ్యారేజి నిర్మాణం, అక్కడే ఎత్తిపోతల నిర్మించి గోదావరి నీటిని సాగర్ కుడికాలువ ఆయకట్టుకు మళ్లించే అంశాలపై ఫిబ్రవరి 5న ప్రత్యేకంగా చర్చిద్దామని సీఎం చెప్పారు. వ్యాప్కోస్ ఆ రోజుకు పూర్తి స్థాయి ప్రాజెక్టు నివేదిక ఇవ్వనుంది. వ్యాప్కోస్, హైడ్రాలజీ అధికారులు, జలవనరులశాఖ అధికారులు కలిసి చర్చించి ఈ ప్రాజెక్టులను కొలిక్కి తేనున్నారు. భైరవానితిప్ప, ఎగువ పెన్నార్ ఎత్తిపోతల పథకాలకు ఫిబ్రవరిలో టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. డిసెంబర్‌కల్లా ఈ పనులు పూర్తిచేయాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పనులనూ వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. పట్టిసీమ తరహాలోనే పనులు జోరుగా చేస్తూ ఎప్పటికప్పుడు ఆ ఫలితం అందించేలా చూడాలన్నారు.

కాంక్రీటు పనులు ఆగకుండా...

పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపైనా చర్చించారు. ఫుజ్‌మీయిస్టర్ సంస్థకు చెల్లింపులు ఆగిపోవడంతో వారు కాంక్రీటు పనులు నిలిపివేశారు. దీంతో తక్షణమే ప్రత్యేక నిధి రూ. 10కోట్లు విడుదల చేసి అందులో వారికి కొంత చెల్లింపులు జరిపి పనులు ప్రారంభించేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. సమీక్షలో జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, అధికారులు శశిభూషణ్‌కుమార్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి గిరిజాశంకర్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





'జీడీపీ వృద్ధిరేటు క్షీణత, వ్యవసాయం అంతంత మాత్రం, ఉద్యోగాల పెరుగుదల దాదాపుగా శూన్యం వంటి ఏవో చిన్న చిన్న సమస్యలే తప్ప ఇవి మంచి రోజులే మరి' అంటూ మోదీ సర్కారుపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యంగ్యోక్తి విసిరారు. సోమవారం ఆర్థిక సర్వే నివేదిక విడుదల అనంతరం ఆయన ఇలా స్పందించారు.

దిల్లీలో పోలవరం భేటీ నేడు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో కొత్త మార్గంలో ముందుకెళ్దామని రాష్ట్ర జలవనరులశాఖ ప్రతిపాదించింది. ఆ అంశానికి కేంద్రం నుంచి ఆమోదం పొందవలసి ఉంటుంది. అది సమ్మతించకపోతే వారి అనుమతి మేరకు టెండర్లు తెరిచే అవకాశమూ పరిశీలనలో ఉంది.

పోలవరం ప్రాజెక్టులో స్పిల్‌వే కాంక్రీటు, స్పిల్ ఛానల్ పనులకు సంబంధించి రూ. 1483కోట్ల విలువైన పనులకు రాష్ట్రప్రభుత్వం టెండర్లు పిలవగా కేంద్రం అభ్యంతరాలు వ్యక్తం చేయడం- నెల్లాళ్ల ప్రస్తుత గుత్తేదారుకు గడువివ్వడం, పనుల వేగం పెరగకపోవడంతో కొత్త టెండర్లపై ప్రాజెక్టు అథారిటీ భేటీ నిర్వహించడం తదితరాలు తెలిసినవే. పాత ధరలకే పనిచేస్తామని నవయుగ సంస్థ ముందుకు రావడంతో టెండర్ల ప్రక్రియను రాష్ట్రప్రభుత్వం తాత్కాలికంగా పక్కన పెట్టింది. నవయుగ, ట్రాన్స్‌ట్రాయ్ ఒప్పందం కుదుర్చుకుని రాతపూర్వకంగా తెలియజేస్తే దాన్ని అంగీకరిస్తామని రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. అయితే.. 10రోజులుగా ట్రాన్స్‌ట్రాయ్, నవయుగ కంపెనీల మధ్య అంశాలు కొలిక్కి రాలేదు. ఉపగుత్తేదారుగా వచ్చినా ఎస్క్రో ఖాతా ద్వారా నవయుగ ప్రతినిధులు నేరుగా చెల్లింపులు కోరుకుంటున్నారని అధికారులు చెప్పారు. స్పిల్ వే కాంక్రీటు, స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులకు సంబంధించి పని పరిమాణం విషయంలో నవయుగ, ట్రాన్స్‌ట్రాయ్‌ల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఈపీసీ ప్రకారం ఐబీఎం అంచనాల్లో ఎంత పరిమాణం కాంక్రీటు ఉంటే అంతకే తాము ధర చెల్లిస్తామని ట్రాన్స్‌ట్రాయ్ అంటోంది. తమకు ఉపగుత్తేదారుగా పని విభజించి కొన్ని పనులే అప్పచెబుతున్నందున తామెంత మేర పనిచేస్తే ఆ పరిమాణం ప్రకారం చెల్లింపులు ఉండాలనేది నవయుగ వాదన. తమకు ఎంత చెల్లిస్తారో తామంతే ఇస్తామని అంతకన్నా తాము అధికంగా ఎలా చెల్లిస్తామని ట్రాన్స్‌ట్రాయ్ చెబుతోంది. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని కొలిక్కి తెచ్చేందుకు రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు మళ్లీ 60సి ని తెరపైకి తీసుకువచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు. దీని ప్రకారం ఈపీసీలో 60సి కింద పని తొలగించి ఎల్ ఎస్ పద్ధతిలో నవయుగకు అదే పాత ధరలకు పని అప్పగిస్తారు. ఇలా చేయడం వల్ల ధరలో మార్పు ఉండకపోయినా- ఆ పని పరిమాణం మేరకు విడిగా మళ్లీ ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకు కేంద్రం సమ్మతిస్తుందా లేక...టెండర్లు తెరుచుకోవడానికి అనుమతిస్తుందా లేక కొత్త పరిష్కారం చూపుతుందా అన్నది మంగళవారం దిల్లీలో తేలాలి.

ఒక్క మీటతో గాలి నాణ్యత తెలుసుకోవచ్చు!

ఈనాడు, అమరావతి: మనం పీల్చే గాలి స్వచ్ఛమైనదేనా? అందులో కాలుష్య కారకాలేమైనా ఉన్నాయా? వాటి తీవ్రత ఏ స్థాయిలో ఉంది? అనే విషయాలు ఇకపై ఒక్క మీట నొక్కి తెలుసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ ప్రాంతంలో గాలి నాణ్యత ఎలా ఉందనేది గుర్తించడమే కాదు, దాని వల్ల కలిగే ప్రభావాన్ని తెలుసుకుని అప్రమత్తంకావొచ్చు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సిద్ధం చేసిన "పర్యావరణ్" యాప్ ఇందుకు దోహదం చేస్తుంది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా దీని పనితీరును పరిశీలిస్తున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా దీన్ని ఆవిష్కరిస్తారు. గాలి నాణ్యత తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కేంద్రాల్లో వెల్లడైన ఫలితాలు రియల్‌టైమ్‌లో ఈ యాప్‌లో కనిపించనున్నాయని కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ బీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు.

- "పర్యావరణ్" పేరుతో ఉండే ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి మొబైళ్లలో నిక్షిప్తం చేసుకోవాలి. యాప్‌లోకి వెళ్లి మనకు కావాల్సిన నగరాన్ని ఎంపిక చేసుకుంటే, దాని మ్యాప్‌పైన పలు చోట్ల ముదురు పచ్చ, లేత పచ్చ, పసుపు, నారింజ, ఎరుపు, ముదురు ఎరుపు రంగులతో కూడిన చిన్న వృత్తాలు కనిపిస్తాయి. ఆ రంగుల వృత్తాలపైన క్లిక్ చేస్తే కాలుష్య కారకాలైన ఎన్‌హెచ్3, పీఎం 10, ఎస్‌వో2లు నిర్దేశిత ప్రమాణాల మేరకు ఎంత స్థాయిలో ఉండాలి? అవి ఎంత స్థాయిలో ఉన్నాయి? అనే అంశాలపైన అక్కడే నివేదిక వస్తుంది.
- మన కళ్ల ముందే వాయు కాలుష్యాన్ని పెంచే చర్యలకు కొందరు పాల్పడుతుంటారు? ఇలాంటి వాటిపైన ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఎలా చేయాలి? అనేది ఇప్పటివరకూ పెద్ద సమస్య. పర్యావరణ్ యాప్‌లో అందుకు కూడా అవకాశం కల్పించారు. "ఇన్సిడెంట్ రిపోర్టు" అనే విభాగంలోకి వెళ్తే...అక్కడ వాయు కాలుష్యం ఏర్పడటానికి గల కారణాలు నిర్దేశిత నమూనాల్లో నింపాలి. ఆ ఘటనకు సంబంధించిన చిత్రం లేదా దృశ్యాన్ని ఫోన్‌లో తీసుకుని పొందుపరచాలి. ఏ ప్రాంతంలో జరుగుతుందనేది చిరునామా ఇవ్వడంతో పాటు మీ పేరు, ఫోన్ నెంబరు, ఈ మెయిల్ ఐడీ తదితర వివరాలను ఇవ్వాలి. బాధ్యులపై చర్యలు తీసుకున్న తర్వాత..ఆ సమస్య పరిష్కారమయ్యిందా? లేదా అనేది తెలుసుకునేందుకు అధికారులు సంప్రదిస్తారు.
- వీటితో పాటు అధికారిక లాగిన్ కూడా ఉంటుంది. వినియోగ నామం, రహస్య సంకేతం ద్వారా యాప్‌లోకి ప్రవేశించి, రాష్ట్రంలో ఎక్కడెక్కడ గాలి కాలుష్య తీవ్రత అధికంగా ఉందనేది పరిశీలించి, వాటి ఆధారంగా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు దీని ద్వారా అవకాశం లభిస్తుంది.

మ్యాప్‌లపై కనిపించే రంగులు కాలుష్య తీవ్రతను ఎలా సూచిస్తాయో వివరించే పట్టిక

గాలి నాణ్యత సూచీ	తీవ్రత	రంగు	ఆరోగ్యంపై ప్రభావం
0-50	ఉత్తమం	ముదురు పచ్చరంగు	నామమాత్రం
51-100	సంతృప్తికరం	లేత పచ్చరంగు	ఆరోగ్యపరంగా సున్నితమైన వారికి శ్వాస తీసుకోవడంలో స్వల్ప ఇబ్బందులు ఎదురవుతాయి
101-200	మధ్యస్థం	పసుపు	అస్మా, గుండె జబ్బులు, ఊపిరితిత్తులు తదితర వ్యాధులతో బాధపడుతున్న వారు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడతాయి.
201-300	బాగా లేదు	నారింజ రంగు	ఆరోగ్యంగా ఉన్న వారికి కూడా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి.
301-400	అసలు బాగాలేదు	ఎరుపు రంగు	శ్వాసకోశ వ్యవస్థ పనితీరుపై ప్రభావం పడుతుంది.
401-500	ప్రమాదకరం	ముదురు ఎరుపు	ఆరోగ్యకరమైన వారిపైన ప్రభావం చూపుతుంది. అనారోగ్యంతో బాధపడేవారిపై తీవ్రమైన ప్రభావం ఉంటుంది.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.8	31.0
హన్మకొండ	12.0	31.0
మెదక్	12.8	34.6
కరీంనగర్	13.0	30.2
రామగుండం	13.0	31.0
నిజామాబాద్	16.0	31.0
అనంతపురం	16.4	30.8
శ్రీకాకుళం	16.5	33.0
హైదరాబాద్	16.8	30.0
మహబూబ్‌నగర్	17.1	33.4
గుంటూరు	17.2	32.9
తిరుపతి	17.6	30.8
కడప	18.0	33.0
విశాఖపట్నం	18.2	29.3
సూర్యాపేట	19.0	34.0
కర్నూలు	19.2	33.3
రాజమహేంద్రవరం	19.5	33.5
నరసాపురం	19.9	30.2
నెల్లూరు	20.0	30.0
విజయవాడ	20.0	30.0
తాడేపల్లిగూడెం	20.0	30.5
ఒంగోలు	20.8	31.1
ఖమ్మం	21.0	32.0

గ్రహం అనుగ్రహం

30–1–2018 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
చతుర్దశి: రా. 10-05 తదుపరి పూర్ణిమ
పునర్వసు నక్షత్రం: రా. 8-12 తదుపరి పుష్యమి
అమృత ఘడియలు: సా. 5-57 నుంచి 9-27 వరకు
వర్జ్యం: ఉ. 9-01 నుంచి 10-30 వరకు
తిరిగి తె. 3-40 నుంచి 5-10 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-50 నుంచి 9-35 వరకు
తిరిగి రా. 10-56 నుంచి 11-47 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-50

వచ్చే నెల 2 వరకు మార్పులకు అవకాశం

టెట్ కన్వీనర్ వెల్లడి

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పేపర్-3 దరఖాస్తుల పరిశీలనకు శుక్రవారం వరకు గడువు ఇచ్చినట్లు టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు. పేపర్-2 నుంచి పేపర్-3కి మారే క్రమంలో చాలా అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఇబ్బందులు తలెత్తాయి. ముఖ్యంగా ఆంగ్ల భాషా పండితులకు పేపర్ మార్పిడి జరిగినా ఏ సబ్జెక్టుకు మారిందో ఆన్‌లైన్‌లో తెలియలేదు. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు వచ్చే నెల రెండో తేదీవరకు సమయం ఇచ్చారు. అభ్యర్థులు స్వయంగా పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌కు వచ్చి పేపర్ మార్పునకు సంబంధించిన లోపాలు, తప్పిదాలు ఉంటే సరిచేసుకోవచ్చని వివరించారు. సోమవారం 150మంది అభ్యర్థుల పేపర్ మార్పును సరి చేయడం జరిగిందన్నారు.

పీహెచ్‌డీ ప్రకటన జారీపై మంత్రి ఆగ్రహం

ఈనాడు, అమరావతి: ఉపకులపతుల సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి విరుద్ధంగా పీహెచ్‌డీ ప్రవేశాలకు అనంతపురం జేఎన్‌టీయూ ప్రకటన జారీ చేయడంపై మంత్రి గంటా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడిగా పీహెచ్‌డీ ప్రకటన ఇవ్వాలని గతంలో ఉపకులపతుల సమావేశంలో నిర్ణయించామని వెల్లడించారు. ఆ నిర్ణయాన్ని జేఎన్‌టీయూ అనంతపురం పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా వర్సిటీలు సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని ఆదేశించారు.

కోడిపందేల నిర్వాహకుల వివరాలివ్వండి

- సీఎస్, డీజీపీలకు హైకోర్టు ఆదేశం
- పందేలు నిర్వహించి తీరుతామన్న ప్రజాప్రతినిధులపై ఆగ్రహం
- కోర్టు ఉత్తర్వులను అపహాస్యం చేశారు
- వారి సంగతి మేము చూసుకుంటామని ఘాటు వ్యాఖ్య
- అధికారులపై తీసుకున్న చర్యలేమిటో చెప్పండని ఆదేశం
- సీఎస్‌కు హాజరు నుంచి మినహాయింపు

ఈనాడు - హైదరాబాద్

కోర్టు ఉత్తర్వులను కాదని.. కోడిపందేలు నిర్వహించి తీరుతామంటూ టీవీల ముందు ప్రకటన చేసిన ప్రజాప్రతినిధులపై హైకోర్టు మండిపడింది. ఎమ్మెల్యే, ఎంపీలే కాకుండా సర్పంచ్‌లు మండల స్థాయి ప్రజాప్రతినిధులు టీవీల ముందు ప్రకటనలు చేశారని.. వారందరి వివరాలిస్తే వారి సంగతి మేము చూసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోడిపందేలను జాతీయ మీడియా సైతం ప్రసారం చేశాయని.. టీవీ ఫుటేజ్‌ను పరిశీలించి ఆ ప్రజాప్రతినిధులెవరో తెలుసుకుంటామని



పేర్కొంది. ప్రజాప్రతినిధుల ఒత్తిడికి లోనై తమ ఆదేశాల్ని అమలు చేయకుండా అధికారులు నిస్సహాయులుగా మారినట్లున్నారని వ్యాఖ్యానించింది. సంక్రాంతికి పందేలు నిర్వహించకుండా 144 సెక్షన్ విధిస్తే అంతమంది ఎందుకు పందేల వద్దకు చేరగలిగారని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వులను అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో గుర్తించిన 809 కోడిపందేల బరుల్లో/మైదానాల్లో పోటీలు నిర్వహించిన వారి పేర్లు, చిరునామా తదితర వివరాల్ని సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) దినేష్‌కుమార్, డీజీపీ మాలకొండయ్యలను ఆదేశించింది. తామిచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంలో విఫలమైన తహశీల్దార్లు, ఎస్సైలను గుర్తించి ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని ఆదేశించింది. మరోవైపు 2017లో సంక్రాంతికి కోడిపందేలను నిలువరించడంలో విఫలమైన 48 మంది ఎస్సైలు, 43 మంది తహశీల్దార్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని పేర్కొంది. విచారణను ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది. సీఎస్‌కు తదుపరి విచారణకు హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎమ్మెస్కే జైశ్వాల్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఈమేరకు ఆదేశాలు జారీచేసింది.

2018 సంక్రాంతికి కోడిపందేలను నిలువరించడంలో తీసుకున్న చర్యల వివరాల్ని నివేదిక రూపంలో దాఖలు చేయనందుకు ఏపీ సీఎస్‌ను హాజరుకావాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం సీఎస్ దినేష్‌కుమార్ హైకోర్టుకు హాజరయ్యారు. సీఎస్, డీజీపీలు వేర్వేరుగా కోర్టుకు నివేదికలు సమర్పించారు.

సీఎస్, డీజీపీల తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. తూర్పు గోదావరి జిల్లాలో 136, పశ్చిమ గోదావరి జిల్లాలో 673 మొత్తం 809 కోడిపందేల బరులను గుర్తించారన్నారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి, అరెస్టులు చేశామన్నారు. వివరాలు సమర్పించేందుకు కొంత గడువు కావాలని ఏజీ కోరారు. 2017 నాటి ఉత్తర్వులను అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉన్నందుకే..2018లోనూ అధికారులకు కోర్టు ఉత్తర్వులంటే లెక్కలేకుండా పోయిందని వ్యాఖ్యానించింది. విచారణను వాయిదా వేసింది.

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కోడిపందేలు తగ్గాయని సీఎస్ నివేదికలో పేర్కొన్నారు. నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ సంప్రదాయ క్రీడ అనే కారణం చూపుతూ కొన్ని సంస్థలు పందేలు నిర్వహించాయి. పిల్లలు, మహిళలు పాల్గొనడం వల్ల పోలీసు బలగాల్ని వినియోగించలేదు.

పేరూరుకు నిధుల విడుదలపై మంత్రి కృతజ్ఞతలు

ఈనాడు అమరావతి: అనంతపురం జిల్లాలోని పేరూరు ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసినందుకు మంత్రి పరిటాల సునీత, ఆమె కుమారుడు శ్రీరామ్ సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. సీఎంకు, జలవనరులశాఖ మంత్రికి జిల్లా రైతాంగం తరపున ధన్యవాదాలు తెలియజేసినట్లు సునీత చెప్పారు. పేరూరు ప్రాజెక్టుకు రూ. 803 కోట్లు మంజూరు చేస్తూ పరిటాల రవి వర్ధంతి రోజునే ఉత్తర్వులు వెలువడటంతో ఆయన కల నెరవేరినట్టయిందని సునీత పేర్కొన్నారు. అనంతపురం రైతులకు తానెప్పుడూ అండగా ఉంటానని సునీతకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. పేరూరు ప్రాజెక్టు వల్ల 25 వేల ఎకరాల ఆయకట్టుకి నీరందుతుంది.

గనుల లీజు కాలవ్యవధి 20ఏళ్లు!

ఈనాడు అమరావతి: గనుల లీజు, అనుమతుల పునరుద్ధణ కాలవ్యవధి ఇకపై 20 ఏళ్లపాటు ఉంటుందని గనుల శాఖ వెల్లడించింది. ఇంతకుముందు ఉన్న ఐదు సంవత్సరాల వ్యవధిని 20 ఏళ్లకు పెంచుతూ గనుల శాఖ కార్యదర్శి శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్త వాటికి.. అనుమతుల పునరుద్ధరణను ఆన్‌లైన్ ద్వారా చేస్తామని పేర్కొన్నారు.

తిరుమలలో.. దర్శనాలు నియంత్రిద్దామా?

- భక్తులు సూచనలు ఇవ్వండి
- ప్రముఖ ఆలయాలన్నింటిలోను శ్లాట్ విధానం
- దేవదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు వెల్లడి

ఈనాడు - అమరావతి

తిరుమలలో ఏటా పరిమిత సంఖ్యలో దర్శన అవకాశం కల్పిస్తే ఎలా ఉంటుందో ప్రజలు సూచనలు ఇవ్వాలని దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు కోరారు. ఈ అంశాన్ని ప్రజల ముందు చర్చకు పెడుతున్నామని, ఇంకా ఎలాంటి విధాన నిర్ణయమూ తీసుకోలేదని చెప్పారు. ఏడాదికి ఎన్నిసార్లు దర్శనం కల్పిస్తే బాగుంటుంది? భక్తులు మరింత సులభంగా దర్శనం చేసుకోవాలంటే ఏం చేస్తే బాగుంటుందో చెప్పాలన్నారు. అమరావతిలోని సచివాలయంలో సోమవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. సాంకేతికత ఆధారంగా ఆధార్‌ను లింకు చేస్తూ తరచూ వచ్చేవారు కాకుండా కొత్తవారికి తొలి ప్రాధాన్యం ఇచ్చేలా ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో తెలియజేయాలన్నారు. వీఐపీలకు కూడా ఇది వర్తింపజేస్తామని, సిఫార్సు లేఖలే లేకుండా చేయాలని యోచిస్తున్నట్లు మంత్రి చెప్పారు. తిరుమలలో అమలు చేస్తున్న శ్లాట్ విధానాన్ని రాష్ట్రంలోని మిగిలిన ప్రముఖ ఆలయాల్లోను త్వరలోనే అమలు చేయనున్నామని చెప్పారు. దర్శన సమయానికి గంట ముందు క్యూ లైన్లోకి వెళ్లేలా



సమయం నిర్దేశిస్తామని చెప్పారు. దివ్యదర్శనం కార్యక్రమం కింద ఈ ఏడాది నుంచి 1.3లక్షల మందికి అమలు చేయనున్నామని చెప్పారు. రవాణా, వసతి, దర్శనం అన్నీ ఉచితంగానే కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం దేవాదాయ, ధర్మాదాయశాఖగా వ్యవహరిస్తున్న తమశాఖ పేరును మారుస్తున్నామని మంత్రి చెప్పారు. దేవాలయాలు, ధర్మ సంస్థల నుంచి ప్రభుత్వానికి ఆదాయం సంపాదించే శాఖగా ఇది అర్థం వస్తోందని అందుకనే మార్పు చేస్తున్నామని చెప్పారు. పండితుల సూచన మేరకు సీఎంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఇక నుంచి దేవదాయ, ధర్మదాయశాఖగా వ్యవహరించనున్నట్లు మాణిక్యాలరావు వివరించారు. ఈ శాఖలో పనిచేసే ఆలయ ఉద్యోగులు అనారోగ్య కారణాల వల్ల ఉద్యోగాలకు దూరమైతే వారి ఇంట్లో అర్హులైన ఒకరికి ఉద్యోగం కల్పించేలా ఉత్తర్వులు ఇస్తున్నట్లు చెప్పారు.

మిత్రధర్మం పాటిస్తున్నాం

తెదేపాతో మిత్రధర్మం పాటిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తమ వాళ్లని నియంత్రిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారని, తామూ మా వాళ్లని నియంత్రిస్తామని చెప్పారు. రెండు పార్టీలు సఖ్యంగా ఉన్నాయని చెప్పారు. కొన్ని ఇబ్బందులున్నా.. పరిష్కరించుకుంటున్నామని మంత్రి చెప్పారు.

అంతర్జాలంలో కత్తుల అమ్మకం

- స్నాప్‌డీల్ సంస్థపై పోలీసుల కేసు
- అమేజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకూ తాఖీదులు

ఈనాడు, హైదరాబాద్: మారణాయుధాల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించి అంతర్జాలం ద్వారా కత్తులు, డాగర్లు విక్రయిస్తున్నందుకు దేశంలోని ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ స్నాప్‌డీల్ పైనా, ఆ సంస్థ ఎండీ పైనా కేసులు నమోదు చేశారు. అలాగే కత్తులు, డాగర్లు అమ్ముతున్న అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలకూ తాఖీదులు పంపించారు. హైదరాబాదీ యువకులు కొందరు వీటిని ఎక్కువగా కొంటున్నట్లు తెలియడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఉంచారు. 15 మందిని అరెస్ట్ చేశారు. మరో 70 మంది యువకులు కత్తులు, డాగర్లు కొన్నట్లుగా గుర్తించారు. వీరందరికీ కత్తులు, డాగర్లను స్నాప్‌డీల్ సంస్థ ఎక్కువగా విక్రయించిందని తెలియడంతో మారణాయుధాల నిరోధక చట్టం ప్రకారం ఆ సంస్థపై కేసులు నమోదు చేశారు.

విశాఖ భూకబ్జాలపై సిట్ దర్యాప్తు పూర్తి

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ జిల్లాలో చోటుచేసుకున్న భూకబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) తన నివేదికను పూర్తి చేసింది. వివిధ కబ్జాలకు సంబంధించిన సమగ్ర వివరాలు, కబ్జాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన చర్యలు, సిఫార్సులతో కూడిన నివేదికను సిట్ అధిపతి వినీత్‌బ్రిజ్‌లాల్, సభ్యులు విశాఖ సంయుక్త కలెక్టర్ సృజన, డిప్యూటీ కలెక్టర్ విజయసారధి సోమవారం విశాఖ సీపీ యోగానంద్‌కు అందజేశారు. ప్రజల నుంచి మొత్తం 2,875 ఫిర్యాదులను స్వీకరించిన సిట్ వాటిలో ప్రభుత్వ ఉత్తర్వుల పరిధిలోకి వచ్చిన 333 ఫిర్యాదులపైనా, ప్రజాప్రతినిధులు ఇచ్చిన మరో 11 ఫిర్యాదులపైనా, స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులకు జారీ చేసిన 68 నిరభ్యంతర పత్రాలపైనా సమగ్ర దర్యాప్తు చేసింది. బాధ్యులైన ప్రైవేటు వ్యక్తులు, అధికారులు, ఉద్యోగులను కూడా గుర్తించి చర్యలకు సిఫార్సు చేసింది. సిట్ రూపొందించిన నివేదికను అధ్యయనం చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందిస్తామని విశాఖ సీపీ యోగానంద్ తెలిపారు.

డీపీసీ, స్క్రీనింగ్ కమిటీల పునర్నియామకం

ఈనాడు అమరావతి: ప్రభుత్వ విభాగాల్లో వివిధ స్థాయుల అధికారుల పదోన్నతులకు సంబంధించి డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీలు(డీపీసీ), స్క్రీనింగ్ కమిటీలను పునర్నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విభాగాధిపతులు(నాన్‌కేడర్), అదనపు/సంయుక్త కార్యదర్శుల(నాన్‌కేడర్)కు సంబంధించిన డీపీసీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఉంటారు. నాలుగో స్థాయి గెజిటెడ్ అధికారులు, దానికి పైస్థాయి పోస్టులకు డీపీసీ, మూడో స్థాయి గెజిటెడ్ అధికారుల పదోన్నతుల స్క్రీనింగ్ కమిటీలకు... కొన్ని విభాగాలకు సంబంధించి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, కొన్ని విభాగాలకు సీసీఎల్ఏ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేటా, కొన్ని విభాగాలకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ ఛైర్మన్‌లుగా ఉంటారు. ఈ కమిటీలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. 2020 జనవరి 1 వరకు ఇవి కొనసాగుతాయి.

పర్యావరణ పరీక్షలో యథేచ్ఛగా చూచిరాత

బల్లికురవ, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా బల్లికురవ మండలంలోని బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్ పర్యావరణ విద్య పరీక్షలో విద్యార్థులు యథేచ్ఛగా చూచిరాతకు పాల్పడ్డారు. అధ్యాపకులే వీరికి పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎథిక్స్, మానవీయ విలువలు, పర్యావరణ విద్యపై పరీక్షలకు గతంలో ఆయా కళాశాలల యాజమాన్యాలే స్వయంగా ప్రశ్నపత్రాలను రూపొందించి వ్యవహారాన్ని పూర్తి చేసేవి. ఈసారి ఇంటర్‌బోర్డు ప్రశ్నపత్రాలను రూపొందించి ఆన్‌లైన్‌లో ఆయా కళాశాలలకు అందజేసింది. దీంతో చూచిరాతకు పాల్పడుతున్నారు. 'బల్లికురవ జూనియర్ కళాశాలలో పకడ్బందీగానే పరీక్షను పూర్తి చేశాం. ఎటువంటి లోపాలకు ఆస్కారం లేద'ని ఆర్ఐవో మనోహరబాబు పేర్కొన్నారు.

చెన్నై విమానాశ్రయంలో విజయవాడ యువకుడి దుర్మరణం



చైతన్య మృతదేహం

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నైలోని స్వదేశీ విమానాశ్రయంలో సోమవారం విజయవాడ యువకుడు ప్రమాదవశాత్తు 50 అడుగుల వంతెనపై నుంచి పడిపోయి మృతి చెందాడు. ఉదయం 6.45 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మృతుడు విజయవాడకు చెందిన చైతన్య (30)గా గుర్తించారు. చరవాణిలో మాట్లాడుతూ అదుపుతప్పి వంతెనపై నుంచి కిందపడినట్లు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. చైతన్య బెంగళూరులో పనిచేస్తున్నట్లు తెలిసింది.

ఈనాడు

ఆర్థిక దిక్సూచి

భారత ఆర్థిక వ్యవస్థ గతిరీతులపై నిరుడు మూడు నెలల వ్యవధిలో రెండు కీలక అంచనాలు వెలుగుచూశాయి. సంస్కరణల పథాన దూసుకెళ్తున్న ఇండియా పొరుగున జనచైనాను తోసిరాజని విశ్వ ఆర్థిక కేంద్రంగా అవతరించిందన్న హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యయనం, మొదటిది. వచ్చే పదేళ్ల ఈ ఆధిపత్యం అప్రతిహతంగా కొనసాగుతుందని అది జోస్యం చెప్పింది. స్వల్పకాలానికి వృద్ధిరేటు కొంత మందగించినా భారతావని ఆర్థికానికి ఇప్పట్లో ఢోకా లేదన్న అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సారథి క్రిస్టీన్ లగార్డే మదింపు రెండోది. వాటితో పూర్తిగా విభేదిస్తూ 'న్యూయార్క్ టైమ్స్' మొన్నీ మధ్య వెలువరించిన వివరణాత్మక కథనం గగ్గోలు పుట్టించింది. భారత ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉందన్న 'టైమ్స్' వాదనల్ని చెల్లాచెదురు చేస్తున్న రీతిగా, నిన్న పార్లమెంటుకు సమర్పించిన తాజా ఆర్థిక సర్వే ప్రధానంగా హార్వర్డ్, ఐఎంఎఫ్ బాణీలనే ప్రతిధ్వనించింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం మనదేనన్న సర్వే 2018-19 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు ఏడు నుంచి ఏడున్నర శాతం దాకా ఉండవచ్చునంటోంది. వృద్ధిరేటు పట్టాలకు ఎక్కడం, రెవిన్యూ వసూళ్లు పుంజుకోవడం, ద్రవ్యోల్బణ నియంత్రణలో ఉండటం ఆశావహ పరిణామాలనడంలో ఇంకో మాట లేదు. జీఎస్‌టీ (వస్తు సేవల పన్ను) అమలు తరవాత పరోక్ష పన్ను చెల్లింపుదారుల పరిధి 50శాతం మేర విస్తరించింది. పెద్దనోట్ల రద్దు దరిమిలా వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపుదారుల సంఖ్యలో పెంపుదల సుమారు 18 లక్షలు. ఇలా ఆర్థికసర్వే క్రోడీకరించిన సానుకూలాంశాలన్నీ ఒకెత్తు. సేద్యం, ఎగుమతులకు సంబంధించి ఆవిష్కరించిన వాస్తవిక చిత్రణ మరొకెత్తు.

ఆరుగాలం శ్రమించినా రెండు పూటలా నోట్లోకి నాలుగు వేళ్లూ వెళ్లే భాగ్యానికి నోచని రైతాంగానికి నిజంగా దక్కుతున్నది అరకొరేనని ప్రధానికి ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ గతలోనే స్పష్టీకరించారు. రైతుల రాబడిని రెండింతలు చేసేందుకు 14.5 శాతం మేర ఉండాల్సిన వ్యవసాయాభివృద్ధి రేటు సంతృప్తికర స్థాయిలో వానలు కురిసిన ఏడాది సుమారు రెండు శాతానికి పరిమితం కావడం- విధానాల మందభాగ్యానికి రుజువు. అదే అరవింద్ నేతృత్వాన తాజా ఆర్థిక సర్వే, మరింత ఆందోళనకర పార్శ్వాన్ని ఆవిష్కరించింది. పల్లెల్లో వలసలు జోరెత్తి పొలం పనులకు ఎక్కువగా మహిళలే దిక్కవుతున్నారు. భీకర ఉష్ణోగ్రతలు, తీవ్ర కరవు నెలకొంటున్న దేశంలో వాతావరణ మార్పుల దుష్ప్రభావాలు వ్యవసాయ రంగాన్ని చెండుకు తింటున్నాయి. ఈ ఒడుదొడుకుల కారణంగా సేద్యరాబడి 20-25 శాతం మేర క్షీణిస్తుందన్న ఆర్థిక సర్వే- బిందు సేద్యం, సాగునీటి సమర్థ నిర్వహణ, సాంకేతిక మెలకువల అత్యావశ్యకతను ప్రత్యేకంగా ప్రస్తావించింది. నీటిపారుదలలో 'నాటకీయ' ప్రగతి, నవీన పరిజ్ఞాన వినియోగం, విద్యుత్-ఎరువుల రాయితీల సువ్యవస్థీకరణల ద్వారా రైతుకు ఆసరాగా నిలవాలన్నది ఆర్థిక సర్వే మానవీయ సిఫార్సు. అన్నదాత జీవన భద్రతను లక్షిస్తూ డాక్టర్ స్వామినాథన్ చేసిన మేలిమి సిఫార్సులెన్నో దస్త్రాల్లో పోగుపడి ఉన్నాయి. కంటితుడుపు మద్దతు, ప్రకృతి ప్రకోపాలు, వ్యాపారులూ దళారుల దగాకోరు దందా, దేశం నెత్తిన కత్తిలా వేలాడుతున్న ఆహార అభద్రత... వీటన్నింటికీ విరుగుడు పథం ఏమిటో స్వామినాథన్ ఏనాడో ఉద్బోధించారు. కొన్ని ద్రవ్య సూచీలు మెరుగ్గా ఉన్నా, సాయం కొరవడి వ్యవసాయం దిగాలుగా అలమటించినన్నాళ్లూ దేశార్థికం కుదుటపడదన్న భావం నిన్నటి ఆర్థిక సర్వేలోనూ ప్రస్ఫుటమైంది. రైతు జీవన భద్రతకు ప్రభుత్వాలు గొడుగు పడితేనే గ్రామీణార్థికం స్థిరంగా దిద్దుకుని పట్టాలకెగిరేది!

ఆర్థిక సర్వే కూర్పు, సమర్పణలపరంగా మోదీ పాలనలో నూతన సంప్రదాయాలు నెలకొంటున్నాయి. అయిదు నెలల క్రితం మొట్టమొదటిసారి మధ్యంతర ఆర్థిక సర్వే విడుదలైంది. ఇప్పుడు రాష్ట్రాలనుంచి జరిగే విదేశీ ఎగుమతుల్ని తొలిసారి సర్వేలో ప్రస్తావించారు. ఈ కసరత్తు మూలాన రెండు కీలకాంశాలు వెల్లడయ్యాయి. ఎగుమతుల్లో, ఇరుగు పొరుగు రాష్ట్రాలతో వ్యాపారాల్లో చురుగ్గా ఉన్న రాష్ట్రాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాయన్నది మొదటిది. బ్రెజిల్, జర్మనీ, మెక్సికో, అమెరికాల్లోని దిగ్గజ సంస్థలతో పోలిస్తే ఎగుమతుల పద్దులో దేశీయ బడా సంస్థల వాటా చిన్నగా ఉంటుందన్నది రెండోది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో వాణిజ్య కార్యకలాపాల ప్రాముఖ్యాన్ని తెలియజెప్పిన ఆర్థిక సర్వే- బడ్జెట్ రూపకల్పనను ఏ మేరకు ప్రభావితం చేయగలదో చూడాలి. ప్రజాపద్దుల కింద రుణాలు మినహాయిస్తే గత సెప్టెంబరు నాటికే కేంద్రం అప్పుల పద్దు రూ.65 లక్షల కోట్లకు పైబడింది. ఆ భారం మరింత విస్తరించకుండా కేంద్రం నట్టు ఎలా బిగిస్తుందన్నది ఉత్కంఠ రేపుతున్న మరో అంశం. 'శ్రేష్ఠ భారత్'ను అభిలషిస్తున్న మోదీ ప్రభుత్వం పరిశోధనలకు పెద్దపీట వేయడమెంత అవసరమో నిన్నటి ఆర్థిక సర్వే విపులీకరించింది. వందల సంఖ్యలో ప్రయోగశాలలు, అంకుర ఆలోచనల్ని పొదిగే కేంద్రాలకు 'నీతి ఆయోగ్' దరఖాస్తులు ఆహ్వానించిన నేపథ్యంలో- రంగాలవారీగా సృజన పౌరుషం రగుల్కొలిపే నిర్ణాయక పాత్ర పోషణలో కేంద్రం కృతకృత్యం కావాలి. నిరుటి ఆర్థిక సర్వే 'ఉపాధిరహిత అభివృద్ధి'పై ఆందోళన చెందినా కార్యాచరణలో పెద్దగా మార్పులు చోటు చేసుకోలేదు. ఉద్యోగాల కొరత, విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వాల పేలవమైన పనితీరు వంటి వివిధ సూచీల్లో భారత్ వెలవెలబోవడానికి పుణ్యం కట్టుకుంటున్నాయి. వృద్ధి రేటుతోపాటు ఉపాధి కల్పనలో, నాణ్యమైన మెలకువలు మప్పి మానవ వనరుల్ని సద్వినియోగపరచుకోవడంలో, సామాజిక అంతరాలు తగ్గించడంలో ప్రణాళికాబద్ధ కృషి- జాతి ప్రగతికి వన్నెలద్దుతుంది. పొలాలనుంచి మౌలిక రంగం దాకా బాగుసేతకు చేపట్టే చర్యలే ప్రజానీకానికి 'అచ్ఛేదిన్'ను చేరువ చేస్తాయి. నిన్నటి ఆర్థిక సర్వే స్థూల సందేశమిదే!

పెట్టుబడులను ప్రోత్సహించేలా...



ఎస్.మహేంద్రదేవ్

చాలా కీలక సమయంలో కేంద్ర బడ్జెట్ వెలువడనుంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఫిబ్రవరి ఒకటిన పార్లమెంటుకు సమర్పించేది ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి అయిదో బడ్జెట్. 2019 లోక్‌సభ ఎన్నికల ముందు ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టే చిట్టచివరి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. ప్రతి ఏటా బడ్జెట్ అనగానే వివిధ వర్గాలు కొత్త ఆశలు పెట్టుకుంటాయి. కొత్త డిమాండ్లు చేస్తాయి. వాటన్నింటినీ నెరవేర్చడం ఏ ప్రభుత్వానికైనా కష్టమే. దీనికి బదులు బడ్జెట్‌లో ఏయే అంశాలకు ప్రాధాన్యమివ్వాలో అంచనా వేయడం ఉత్తమం. మొదట స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ని పెంచడానికి అగ్ర ప్రాధాన్యమివ్వాలి. 2015-16లో ఎనిమిది శాతంగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు 2016-17లో 7.1 శాతానికి, 2017-18లో 6.5 శాతానికి తగ్గింది. పెద్ద నోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జీఎస్టీ) జీడీపీ వృద్ధిపై స్వల్పకాలిక ప్రభావం చూపడమే దీనికి కారణం. దీన్ని అధిగమించి మధ్యకాలంలో, దీర్ఘకాలంలో వృద్ధిరేటు పెంచడంపై దృష్టి పెట్టాలి. తదనుగుణంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ బడ్జెట్ అభివృద్ధికి అంకితమవుతుందని నొక్కి చెప్పారు.

ద్రవ్య చలామణీ కీలకం

మందగించిన ఆర్థిక వ్యవస్థకు కొత్త జవసత్వాలు ఇవ్వాలంటే ఎలాంటి ఆర్థిక విధానాలను అనుసరించాలనే అంశంపై ఇటీవల చర్చ మొదలైంది. బడ్జెట్ అనేది పన్నులు, వ్యయాలు, సబ్సిడీలతో కూడిన పెద్ద పద్దు. భారత్‌తో సహా అనేక ప్రపంచ దేశాలు రెండు రకాల స్థూల ఆర్థిక విధానాలను అనుసరిస్తాయి. ఒకటి- సరఫరా ఆధారిత సంప్రదాయ విధానం. దీని ప్రకారం దేశ ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ద్రవ్యలోటును తగ్గించడానికి, వ్యవస్థాగత సంస్కరణలను ప్రవేశపెట్టడానికి ప్రాధాన్యమివ్వాలి. రెండో విధానం గిరాకీ ఆధారితం. దీని కింద ఉపాధి, అభివృద్ధిని పెంచడానికి అవసరమైతే ద్రవ్యలోటును పెంచుకోవచ్చు. ప్రభుత్వ ఆదాయంకన్నా వ్యయం ఎక్కువైనా రుణాలు తెచ్చుకోవడం, ద్రవ్య సరఫరా పెంచడం ద్వారా అభివృద్ధి సాధించి ఉపాధి అవకాశాలు సృష్టించాలని ఈ విధానం లక్షిస్తుంది. భారత ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనానికి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఏ విధానాన్ని అనుసరిస్తుందనేది ఆసక్తికరం. భారత్ ప్రస్తుతం సంప్రదాయ సరఫరా ఆధారిత విధానాన్ని పాటిస్తోంది. దీనికింద ద్రవ్యలోటును 2017-18లో 3.2 శాతానికి, 2018-19లో మూడు శాతానికి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. ద్రవ్యలోటును తగ్గించడం వల్ల ఆర్థికాభివృద్ధి స్తంభిస్తుందని గిరాకీ ఆధారిత అభివృద్ధివాదులు హెచ్చరిస్తున్నారు. ద్రవ్యలోటును తగ్గించాలనే ఆరాటం వదిలిపెట్టి జనం చేతిలో, పరిశ్రమల చేతిలో ఎక్కువ డబ్బు చేరేట్లు చూస్తే- వస్తుసేవలకు గిరాకీ అధికమై అభివృద్ధి, దానితోపాటే ఉపాధీ పెరుగుతాయని వాదిస్తున్నారు. మూడీస్ వంటి అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు మాత్రం ద్రవ్యలోటు తగ్గించాలంటాయి. ఈ సంస్థల మెప్పుపొంది రేటింగ్ పెంచుకోవడం కోసం ప్రభుత్వం ద్రవ్యలోటును తగ్గించాలని చూస్తోంది. గిరాకీ ఆధారిత అభివృద్ధి నమూనాకు వస్తుసేవల వినియోగం, ఎగుమతులు, పెట్టుబడుల పెంపును పునాదులుగా పరిగణించాలి.

ప్రస్తుతం దేశీయ ఆర్థిక పరిస్థితి అంత గొప్పగా లేదు. భారత్‌లో 2014-15లో పెట్టుబడులు జీడీపీలో 30.4 శాతాన్ని చేరుకోగా, అవి 2017-18నాటికి 26.4 శాతానికి పడిపోయాయి. ప్రైవేటు, ప్రభుత్వ రంగాలు రెండూ కొత్త పెట్టుబడులు పెట్టడం లేదని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. ఉపాధి అవకాశాలు పెరగకపోవడానికి ఇదే ప్రధాన కారణం. కార్పొరేట్ రంగ లాభాలు మెరుగుపడలేదు. కంపెనీలకు అప్పులిచ్చిన ప్రభుత్వరంగ బ్యాంకులు వాటిని రాబట్టలేకపోవడంతో నిరర్థక ఆస్తుల సమస్య తీవ్రరూపం దాల్చింది. పెట్టుబడి మార్గాలు లేకపోవడం వల్ల జనం స్టాక్ మార్కెట్ల వైపు పరుగుతీస్తున్నట్లుంది. నేడు భారత్‌లో కళకళలాడుతున్నది స్టాక్ మార్కెట్ మాత్రమే. మరోవైపు చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం తలెత్తబోతోంది. ఎగుమతులకన్నా దిగుమతులు ఎక్కువై కరెంటు ఖాతాలోటు పెరిగేట్లుంది. దేశ అభివృద్ధి రథానికి ఊపు తీసుకురావాలంటే మౌలిక వసతుల కల్పనపై పెట్టుబడులు పెంచకతప్పదు. తదనుగుణంగా రహదారులు, రేవుల విస్తరణకు రూ.7,50,000 కోట్ల భారత్‌మాల ప్రాజెక్టు చేపట్టడానికి కేంద్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. దీనిపై బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వాలి. అమెరికా, ఐరోపా ఆర్థిక వ్యవస్థలు మళ్ళీ పుంజుకొంటున్న దృష్ట్యా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కూడా ఈ ఏడాది, వచ్చే ఏడాది మెరుగుపడవచ్చు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలంటే భారతదేశం వస్తుసేవల వినియోగాన్ని, పెట్టుబడులను, ఎగుమతులను పెంచాలి. దీనికి కావలసిన నిధులు సమకూర్చుకోవాలంటే ద్రవ్యలోటును తగ్గించాలనే ఆరాటం వదలాలి.

దేశంలో 2013-2016 మధ్యకాలంలో ఉద్యోగాలు తగ్గిపోయాయని అధ్యయనాలు తెలుపుతున్నాయి. పెద్ద నోట్ల రద్దు తరవాత 15 లక్షల ఉద్యోగాలు గల్లంతైనట్లు భారత ఆర్థిక పరిశీలన కేంద్రం(సీఎంఐఈ) అధ్యయనం తేల్చింది. మరో



ఉపాధి అవకాశాలే కీలకం

వైపు సంఘటిత రంగంలో 70 లక్షల కొత్త ఉద్యోగాలు ఏర్పడినట్లు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే కొత్త ఉద్యోగాల్లో అత్యధికం తక్కువ స్థాయికి చెందినవే. వారిలో నైపుణ్యాలు కొరవడటమే దీనికి కారణం. ఐరోపాలో 70 శాతం కార్మికులకు, జపాన్, దక్షిణ కొరియాల్లో 80-90 శాతం మందికి నైపుణ్యాలు ఉంటే భారత్‌లో రెండు శాతానికే ఉన్నత నైపుణ్య సర్టిఫికెట్లు ఉన్నాయి. మన కార్మికులను అధిక నైపుణ్యాలతో అధిక ఉత్పాదకత సాధించగలిగేట్లు తీర్చిదిద్దడానికి బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయాలి.

రైతాంగానికి భరోసా

పారిశ్రామిక ఉద్యోగాల సృష్టి ఆశించిన స్థాయిలో జరగకపోవడం పెద్ద లోపం. 2016-17లో 7.9 శాతంగా ఉన్న పారిశ్రామిక వస్తూత్పత్తి రంగ వృద్ధి రేటు, 2017-18లో 4.6 శాతానికి తగ్గిపోయింది. ఈ వృద్ధిని మరింత పెంచినప్పుడు మాత్రమే ప్రభుత్వం ఆశించిన ప్రకారం పారిశ్రామిక ఉద్యోగ అవకాశాలు అందివస్తాయి. విస్తృత ఉద్యోగావకాశాలు కల్పించే భారీ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు బడ్జెట్‌లో ప్రోత్సాహమివ్వాలి. దేశ జనాభాలో 50 శాతానికి జీవనాధారమైన వ్యవసాయ రంగం 2016-17లో 4.9 శాతం వృద్ధి నమోదు చేసినా 2017-18లో అది 2.1 శాతానికి తగ్గిపోయింది. అసలు 2014-18 మధ్యకాలంలో ఈ రంగం ఏటా 1.9 శాతం అభివృద్ధితో సరిపెట్టుకొంటోంది. మోదీ ప్రభుత్వం లక్షిస్తున్నట్లు 2022 కల్లా రైతు ఆదాయాలను రెట్టింపు చేయాలంటే ఇప్పటి నుంచే వారి నిజ ఆదాయాలు ఏటా 10.4 శాతం చొప్పున పెరుగుతూ ఉండాలని అశోక్ దళ్వాయి సంఘం ఉద్ఘాటించింది. గడచిన నాలుగేళ్లలో వారి ఆదాయాలు ఏటా 2.5 శాతమే పెరుగుతూ వచ్చాయి. కేంద్ర బడ్జెట్ దీన్ని 10.4 శాతానికి పెంచడానికి తగు ప్రతిపాదనలు చేయాలి. 2015-16లో రూ. 96,703గా ఉన్న సగటు రైతు ఆదాయాన్ని 2022-23కల్లా రూ.1,93,406కు పెంచాలని దళ్వాయి కమిటీ సిఫార్సు చేసింది. దీన్ని సాధించడానికి రకరకాల మార్గాల్లో కృషి చేయాలి. కనీస మద్దతు ధరల సాయంతో వ్యవసాయ ధరలను మెరుగుపరచాలి. ప్రస్తుతం మధ్యప్రదేశ్ భాజపా ప్రభుత్వం విపణి ధరకన్నా అధికారిక కనీస మద్దతు ధర తక్కువగా ఉంటే తానే ఆ లోటును భర్తీ చేస్తోంది. 'భవంతర్ భుగ్తాన్ యోజన'గా వ్యవహరిస్తున్న ఈ పథకం వంటిది కర్ణాటకలోనూ అమలవుతోంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం 25 లక్షల టన్నుల నూనె, పప్పు గింజల ధరల్లో ఏర్పడిన వ్యత్యాసాన్ని భర్తీ చేయడానికి రూ.2,000 కోట్లు చెల్లించనుంది. ఈ డబ్బు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం లీటరు పాలకు పాడి సంస్థలు చెల్లిస్తున్న ధరకు అదనంగా అయిదు రూపాయల చొప్పున చెల్లిస్తోంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఎటూ రైతులకు నగదు చెల్లిస్తోంది కాబట్టి వ్యాపారులు కావాలని పంట ధరలు తగ్గించేస్తున్నారు. ఇటువంటివి జరగకుండా జాగ్రత్త వహిస్తూనే కేంద్రం తన బడ్జెట్‌లో ఈ తరహా పథకాలను ప్రవేశపెడితే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. వారి ఆదాయాలూ క్రమంగా పెరుగుతాయి.

సామాజిక రంగాలకు పెద్దపీట

రక్షణ రంగంపై నాలుగు లక్షల కోట్ల రూపాయలు మనదేశం ఖర్చుపెడుతోందని అంచనా. విద్యారంగానికి ఇందులో అయిదోవంతు అయిదో వంతు మొత్తాన్ని (రూ.78,000 కోట్లు) కేటాయిస్తున్నారు. ఆరోగ్య రంగానికి మరీ తక్కువగా ఎనిమిదో వంతు (రూ.48,000 కోట్లు) ఇస్తున్నారు. రక్షణ రంగానికి అధిక కేటాయింపులు అవసరమే. అదే సమయంలో సామాజిక రంగాలను విస్మరించరాదు. ప్రజల విద్యా ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడనిదే అభివృద్ధి సాధ్యం కాదు. ఈ నైపుణ్యాల యుగంలో సరైన విద్యార్హతలు లేకుంటే ఉద్యోగాలు పొందడం కష్టం. ఆరోగ్యం బాగాలేకపోతే వ్యక్తులు, కుటుంబాల ఆర్థికస్థితీ దెబ్బతింటుంది. కాబట్టి బడ్జెట్‌లో ఈ మేరకు సామాజిక వ్యయాన్ని పెంచడం ఆవశ్యకం. గ్రామాల్లో 14-18 ఏళ్ల వయసు విద్యార్థుల్లో 43 శాతం చిన్న చిన్న భాగహారాలైనా చేయలేకపోతున్నారని వార్షిక విద్యా స్థితిగతుల నివేదిక వెల్లడించింది. వీరిలో 25 శాతం రెండో తరగతి పాఠ్య పుస్తకం చదవలేని దుస్థితిలో ఉన్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంది కనుకనే చాలామంది ప్రాథమిక విద్యతోనే చదువు ముగించేస్తున్నారు. 2016-17లో భారత్‌లో ఉన్నత విద్యలో చేరినవారు 25.2 శాతం. చైనాలో 2015లోనే 43 శాతం ఉన్నత విద్యలో చేరారు. విద్యలో స్త్రీ పురుష భేదాలు తగ్గుతుండటం శుభవార్తే కానీ విద్యా ప్రమాణాలు పతనం కావడం అభిలషణీయం కాదు. వీటిని పెంచడం మీద కొత్త బడ్జెట్ దృష్టి పెట్టాలి. ఇక మధ్యతరగతివారు ఆదాయ పన్ను కుదించాలని, కంపెనీలైతే కార్పొరేట్ పన్ను 25 శాతానికి పరిమితం చేయాలని కోరుకుంటున్నాయి.

దేశంలో వినియోగం పెరగాలంటే ఈ దిశగా బడ్జెట్ తగు ప్రతిపాదనలతో ముందుకు రావాలి. ఆర్థిక వ్యవస్థ మళ్ళీ పరుగు తీయాలంటే గిరాకీని పెంచే విధానాలను అనుసరించక తప్పదు. ద్రవ్యలోటు కట్టడికి అతిగా ప్రాధాన్యమివ్వకుండా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోకి పెట్టుబడులు వచ్చేలా చూడాలి. మౌలిక వసతులపై ప్రభుత్వ వ్యయం పెరగాలి. తద్వారా ఉపాధి అవకాశాలు విజృంభించి అభివృద్ధి రెండంకెల రేటు అందుకోగలుగుతుంది. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు, ఉత్పత్తి, ఉత్పాదకత పెరగనిదే మోదీ ప్రభుత్వం ఆశిస్తున్న 'సబ్ కా సాథ్- సబ్ కా వికాస్' సాధ్యపడదు. ఈ లక్ష్యాన్ని నిజంచేయడానికి కేంద్ర బడ్జెట్‌ను సాధనంగా ఉపయోగించాలి.

(రచయిత- ఇందిరాగాంధీ అభివృద్ధి పరిశోధన సంస్థ సంచాలకులు, ఉపకులపతి)

రుచి కుదిరేనా...



- స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెంపుదలకు అధిక ప్రాధాన్యం
- దీర్ఘకాలిక వృద్ధిరేటు పెంపుదలపై దృష్టి
- ద్రవ్యలోటును తగ్గించాలి. వ్యవస్థాగత సంస్కరణలను ప్రవేశపెట్టాలి.
- ప్రైవేటు, ప్రభుత్వ రంగాలు రెండూ కొత్త పెట్టుబడులు పెట్టకపోవడం వల్లే ఉపాధి అవకాశాలు పెరగకపోవడానికి ఇదే ప్రధాన కారణం.
- పెట్టుబడి మార్గాలు లేకపోవడం వల్ల స్టాక్ మార్కెట్ల వైపు జనం పరుగు
- దేశ అభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పనపై పెట్టుబడులు ఎంతో అవసరం.
- ప్రజల విద్యా ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడాలి. అందుకోసం సామాజిక వ్యయాన్ని పెంచాలి.
- ద్రవ్యలోటు కట్టడికి అతిగా ప్రాధాన్యం ఇవ్వకుండా... ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోకి అధిక పెట్టుబడులు వచ్చేలా చూడాలి.


తమసోమా జ్యోతిర్గమయ

నేడు మృతవీరుల సంస్మరణ దినం. 70 ఏళ్ల క్రితం హంతకుడి తుపాకి గుళ్లకు మహాత్మాగాంధీ నేలకొరిగిన రోజు. స్వతంత్ర భారత చరిత్రలోనే అత్యంత విషాదకరమైన ఘటన అది. మహాత్ముడు మన జాతిపిత. విశ్వ శాంతిదూత. అంతటి మహనీయుడిని ఆనాడు హింసోన్మాదం పొట్టన పెట్టుకొంది. మనిషిలోని మృగత్వం జడలు విప్పి, కరాళనృత్యం చేసిన దుర్దినమది. మృతవీరుల సంస్మరణ దినం పాటించడమంటే అహింసామూర్తి మహాత్మాగాంధీ ఒక్కరికే నివాళి అర్పించడం కాదు, ప్రపంచవ్యాప్తంగా హింస, ఉగ్రవాదం ప్రబలుతున్న తీరుపైన నిరసన ప్రకటించడం కూడా! మహాత్ముడి సిద్ధాంతాల గురించి, వాటిని ఆయన ఆచరించి చూపిన విధానం గురించి చర్చించాల్సిన సందర్భమిది.

ఆత్మవినాశనం దిశగా వేగంగా సాగిపోతున్న మనిషిలో జీవితంపట్ల ఆశలు రగిలించి, కొత్తవెలుగుల బాటలో నడిపించేవే మహాత్ముడి ఆలోచనలు, ప్రవచనాలు, ఆచరణలు. స్వదేశీ అన్నది మహాత్ముడి తారకమంత్రం. అదే ఆయన జీవన విధానం. స్వదేశీ అంటే స్వావలంబన, స్వయంపోషకత్వం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, అన్నింటికి మించి నిస్వార్థంగా సేవచేయాలన్న భావన, తపన. స్వదేశీ సిద్ధాంతాన్ని విజయవంతంగా ఆచరించి చూపారు మహాత్మాగాంధీ. విదేశీగడ్డపై నుంచే స్వదేశీ ప్రయోగాలు ప్రారంభించారాయన. సామ్రాజ్యవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి, బానిస సంకెళ్లనుంచి ప్రజల్ని విముక్తం చేయడానికి ఆయన ఎంచుకొన్న మార్గం స్వదేశీ. అది ఆయన చేతిలోని దివ్యాస్త్రం. తిరుగులేని బ్రహ్మాస్త్రం.

సత్యాన్నే దైవంగా భావించారు మహాత్మాగాంధీ. దేవుడే సత్యం అన్నంత సునాయాసం కాదది. సత్యమనే దేవుడిలో మనిషి సంలీనమైనప్పుడే శాంతి లభిస్తుందని ఉద్బోధించారాయన. సత్యమార్గంలో పయనించడం ద్వారానే సంఘర్షణలను నివారించవచ్చునని అన్నారు. హింస ద్వారా ఘర్షణలను తాత్కాలికంగానే అణచివేయవచ్చునని, అహింసే శాశ్వత పరిష్కార మార్గమని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ దృష్టిలో సత్యం, అహింస అన్నవి నాణానికి బొమ్మాబొరుసు లాంటివి. సత్యం లక్ష్యమైతే, అహింస దాన్ని సాధించే మార్గమని అన్నారాయన. లక్ష్యం, మార్గం అభిభాజ్యమైనవి. ఆయన ప్రవచించిన దైవత్వానికి సత్యం, అహింస రెండు ముఖాలు. సత్యాన్ని శోధించి, సాధించాలంటే దేవుడిని గట్టిగా నమ్మాల్సి ఉంటుంది. అది ప్రేరణ ఇస్తుంది. మనోబలాన్ని ప్రసాదిస్తుంది. దానివల్ల లక్ష్యాన్ని సాధించడం సులువవుతుంది. దేవుడిని తెలుసుకోవడమంటే అహింసను ఆచరించడం ద్వారా జీవితంలో శాంతిని సాధించడమే. అలాంటి దేవుడిని తెలుసుకొనే మార్గాన్ని మతం చూపిస్తుంది, చూపించాలి. ఏ రూపంలోనైనా సరే హింసను ప్రేరేపించేది మతమే కాదు, అదెవరికీ సమ్మతం కారాదు. మతం అన్నది శాంతిని ప్రసాదించేది అయినప్పుడు మతపరమైన హింస అన్న పదాలే పరస్పర విరుద్ధమైనవి అవుతాయి. అసలు మతపరమైన హింస అన్నదే అర్థం లేనిది. హింస ఏ రూపంలో ఉన్నా, ఎలాంటిదైనా- హింస హింసే. ఏ మతంతోనూ దాన్ని ముడిపెట్టలేం.

మనిషి నిరామయుడిగా ఉండాలంటే సేవాభావం అలవరచుకోవాలి. ఎలాంటి త్యాగాలకైనా సంసిద్ధంగా ఉండాలి. అహం వదులుకోవాలి. మహా



గాంధీమార్గం అనుసరణీయం

త్మాగాంధీ ఈ సిద్ధాంతాలు, సూత్రాలను ప్రవచించడమే కాదు, ఆచరించి చూపారు. సామాజిక కార్యాచరణకు ఆయన చేపట్టిన ధర్మాయుధం సత్యాగ్రహం. అటు దక్షిణాఫ్రికాలోను, ఇటు భారతదేశంలోనూ పలు సందర్భాల్లో ఆయన ఈ ఆయుధాన్ని విజయవంతంగా ప్రయోగించి, సత్ఫలితాలు సాధించారు. సత్యం, అహింస- ఈ రెండింటి స్ఫూర్తితో రూపొందినదే సత్యాగ్రహ ఆయుధం. ఇతరులకు సేవ కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడాలన్నారు మహాత్ముడు. ఇది ఆయన ప్రబోధించిన దైవీభావం.

మహాత్మాగాంధీ కార్యాచరణ ప్రణాళికలో కొన్ని నిర్మాణాత్మక కార్యక్రమాలు ఉన్నాయి. అవి- 1. మత సామరస్యాన్ని పెంపొందించడం. 2. అంటరానితనాన్ని తొలగించడం, స్థూలంగా చెప్పాలంటే- అసమానతలను రూపుమాపడం. 3.అన్ని రకాల మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలను నిషేధించటం. 4. అట్టడుగు స్థాయిలో ప్రజానీకానికి సాధికారత కల్పించే ప్రక్రియలో భాగంగా ఖాదీని, గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించడం. 5. గ్రామీణ ప్రజారోగ్యాన్ని, పరిశుభ్రతను పెంపొందించడానికి పారిశుద్ధ్యాన్ని ప్రోది చేయడం. 6. ప్రాథమిక, వయోజన విద్యకు ప్రాధాన్యం. ముఖ్యంగా మహిళా అక్షరాస్యతపై ప్రత్యేక శ్రద్ధ. 7. జాతీయ భాషను నిర్లక్ష్యం చేయకుండానే ప్రాంతీయ భాషలకు అండదండ. 8. రైతులు, కూలీలు, వెలివేతకు గురైనవారు, గిరిజనులు తదితర అణగారిన వర్గాల సంక్షేమం. 9. సేవ, త్యాగనిరతి, ఇతరుల బాధలు తీర్చడానికి స్వయంగా బాధలు అనుభవించడానికైనా సిద్ధపడటం వంటి చర్యల ద్వారా ఆత్మశుద్ధి చేసుకోవడం.

మహాత్మాగాంధీకి స్ఫూర్తినిచ్చిన గ్రంథం భగవద్గీత. దేని మీదా వ్యామోహం పెంచుకొనకపోవడం, ఫలితాలు ఆశించకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించడం, ప్రతిఫలాపేక్ష లేకుండా కార్యాచరణకు సిద్ధపడటం- భగవద్గీత ద్వారా ఆయన నేర్చుకొన్న జీవిత సత్యాలు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే, భగవద్గీత ద్వారా అనాసక్తి యోగాన్ని ఆయన నేర్చుకొన్నారు. ఆత్మశుద్ధి అనేది గాంధేయ సంప్రదాయంలో కీలకం. తగినంత ఆధ్యాత్మిక వికాసం సాధించిన వ్యక్తి ఇతరులనూ ధర్మపథంలో నడపగలడని ఆయన నమ్మారు. పతంజలియోగ సూత్రాల నుంచి ఈ సత్యం గ్రహించారాయన. ఒకే ఒక్క వ్యక్తి పూనుకొంటేచాలు, జ్ఞాన దీపాలు వెలిగించి యావత్ ప్రపంచాన్ని ప్రకాశపథంలో నడపగలడనేందుకు రమణ మహర్షి, రామకృష్ణ పరమహంసలతోపాటు స్వయంగా మహాత్మాగాంధీ నిదర్శనం.

ప్రస్తుత ప్రపంచ స్థితిగతులు తీవ్ర భయోత్పాతం సృష్టిస్తున్నాయి. ఎల్లెడలా హింస, ఉగ్రవాదం పెట్రేగుతున్నాయి. ఉత్తర కొరియా వంటి దేశాల్లో దురహంకారంతో రగిలిపోతున్న నేతల చేతుల్లోని సామూహిక జనహనన ఆయుధాలు విశ్వవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మహాత్మాగాంధీ తన జీవితకాలంలో ఆచరించి చూపిన సిద్ధాంతాలు ప్రస్తుత పరిస్థితుల నుంచి సురక్షితంగా బయటపడేందుకు అనువైన మార్గాలు. పశు ప్రవృత్తితో చెలరేగిపోతున్నవారి కట్టడికి, తద్వారా మనిషి మనిషిగా బతకగలితే ఆశాజనక వాతావరణ సృష్టికి మహాత్ముడి మాటే మేలుబాట. ప్రపంచాన్ని చీకటి నుంచి వెలుగులోకి నడిపే దారి దీపమది... ధర్మరూపమది!

– ప్రొఫెసర్ కె.రామకృష్ణారావు

ఈనాడు లేఖలు

సహనంతోనే రాణింపు

దక్షిణాఫ్రికాపై మూడో క్రికెట్ టెస్టులో భారతజట్టు గెలిచినా, ఈ సిరీస్ జట్టులోని అనేక లోపాలను బయటకు తెచ్చింది. పరిమిత ఓవర్ల ఆటతో పోలిస్తే టెస్ట్ క్రికెట్ భిన్నమైంది. ఓర్పు, సహనాలతో బ్యాటింగ్ చేయాలి. ఆటగాడిలోని కళాత్మకతను టెస్ట్ క్రికెట్ వెలికితీస్తుంది. అన్ని రకాల పిచ్‌లపై దీటుగా రాణించేలా టీమిండియా ఆటగాళ్లు రాటుతేలాలి. దేశవాళీ క్రికెట్ అందుకు అవకాశం కల్పిస్తుంది. భిన్న పిచ్‌లపై సహనంతో ఆడగల ప్రాక్టీసును అందజేస్తుంది. కానీ, ఒక స్థాయికి చేరుకున్న తరవాత టీమిండియా సభ్యులు దేశవాళీ క్రికెట్‌కు దూరమవుతున్నారు. మరోవైపు పరిమిత ఓవర్ల క్రికెట్‌కు ఎక్కువగా ఆడుతున్నందువల్ల టెస్టుల్లోనూ అదే దూకుడు ప్రదర్శిస్తూ విఫలమవుతున్నారు. ఆ మేరకు సర్దుబాట్లు చేసుకోగలిగితే భారత్ బ్యాట్స్‌మెన్లు మరింత సమర్థంగా రాణించగలుగుతారు.

- జనమంచి వినీత్, మాదాపూర్, హైదరాబాద్

పరిహారం చెల్లింపులో అలసత్వం

న్యాయస్థానాలు చీవాట్లు పెట్టినా, అధికార యంత్రాంగం రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం చెల్లించకపోవడం దురదృష్టకరం. సేకరించగా మిగిలిన భూముల వివరాలు నమోదు చేయడం, వాటిని రైతులకు అందించడంలోనూ రెవిన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఆయా మండల రెవిన్యూ అధికారులు, జిల్లా పాలనాధికారులను ఆశ్రయించమని చెప్పి చేతులు దులుపుకొంటున్నారు. న్యాయస్థానాలు చెబుతున్నా పరిస్థితులు చక్కబడకపోతే వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుంది. ముఖ్యమంత్రి తక్షణం ఈ విషయంపై దృష్టి సారించి రైతుల ఇబ్బందులను పరిష్కరించాలి.

- ఆర్కే, ముస్తాబాద, కృష్ణాజిల్లా

రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం

కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకాల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలు ఒక్కతాటిపై నడవాలి. పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికగా ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వ్యవహరించాలి. ఈ విషయంలో కలహించుకొంటే ఎగువ రాష్ట్రాలు మరింతగా నదీ జలాలను బిగిస్తాయి. ఇప్పటికే ఈ విషయంలో తెలుగు రాష్ట్రాలు ఎంతగానో నష్టపోయాయి. వాస్తవానికి అంతర్జాతీయ నదీ సూత్రాలను పకడ్బందీగా అనుసరిస్తే జలాల పంపకం సులభతరమవుతుంది. ఎగువన నదీజలాలను అతిగా బిగబట్టడం వల్ల దిగువన పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతాయి. అందువల్లే కనీస ప్రవాహం నదీ పొడవునా ఉండేలా తొలుత జాగ్రత్తలు తీసుకోవాలి. ఎగువన నీటి బిగింపు వల్ల ఎదురవుతున్న పర్యావరణ సమస్యలపై కేంద్రప్రభుత్వం సమగ్ర అధ్యయనం జరిపించాలి. అధ్యయన ఫలితాల మేరకు నదీ జలాల కేటాయింపుల్లో తగిన మార్పులు చేయాలి.

- తాడిశెట్టి జయచంద్రమోహన్, షాపూర్, హైదరాబాద్

నమస్కారం

వ్యక్తి సంస్కారాన్ని తెలిపే సమున్నత ప్రక్రియ- నమస్కారం. అది ఎదిగిన మనసును ఆవిష్కరిస్తుంది. పరిపక్వత చెందిన వ్యక్తిత్వాన్ని చూపరుల మనసు వాకిట నిలుపుతుంది. ఎదుటివారిని గౌరవించాలనుకున్నప్పుడు నమస్కరిస్తారు. ప్రతినమస్కారం ద్వారా అవతలి వ్యక్తి నుంచీ గౌరవం, మన్నన పొందుతారు. డబ్బు, హోదా, పలుకుబడి... ఏదీ పనిచేయని సందర్భంలోనూ ఒక నమస్కారం అనేక పనులు చేసిపెడుతుంది. దానికి అంతటి మహత్తు ఉంది.

విద్యార్జన కోసం గురువును ఆశ్రయించిన శిష్యుడు, మొట్టమొదట నమస్కారంతోనే పలకరిస్తాడు. ఆ అనుబంధం ఏళ్ల తరబడి సాగిపోతుంటుంది. పవిత్రమైన ఆ విద్యాక్షేత్రంలో పలు జ్ఞాన కుసుమాలు వికసిస్తుంటాయి. వాటితో అనేకమందికి ఎంతో మేలు జరుగుతుంది. అన్నింటికీ తొలి బీజం నమస్కారమే! గర్భగుడిలో నిలుచున్నప్పుడు, భక్తుడు రెండు చేతులూ జోడించి దైవీ రూపాలకు దండం పెడతాడు. అలా నమస్కారం అనే క్రియ రెండు చేతులూ సమానమనే ఎరుక కలిగిస్తుంది.

భారతీయ సంస్కృతిలో ప్రణామానికి ఒక విశిష్టమైన స్థానమిచ్చారు. స్పందించే గుణం కలిగిన హృదయమే దానికి నాంది పలుకుతుంది. ప్రేమకు మాతృక నమస్కారం. హృదయాంతరాళంలో జనించే అనిర్వచనీయ మానసిక భావనకు అది భౌతిక రూపం. రెండు చేతులూ ఒక దరికి చేరడం వల్ల, నమస్కార ప్రక్రియ సంపూర్ణంగా ఆవిష్కృతమవుతుంది. పిల్లలు బుజ్జి చేతులతో దండం పెడితే, ఇంటికి వచ్చిన అతిథులు ముచ్చటపడతారు. ఆ చిన్నారుల్ని దగ్గరకు తీసుకుంటారు. ప్రేమతో ముద్దాడతారు. ఇంత చిన్నప్పుడే అంతటి మర్యాద నేర్పినందుకు తల్లిదండ్రుల పెంపకాన్ని అభినందిస్తారు.

నమస్కారం తెలిపే వ్యక్తి పట్ల ఎవరికైనా గౌరవ



భావం పెరుగుతుంది. సమాజం అతని పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంది. రెండు చేతుల జోడింపు- హృదయాన్ని ప్రతిఫలిస్తుంది కాబట్టి, ప్రజల ఆదరాభిమానాలు చూరగొనడానికి నాయకులు దాన్ని ఓ విధానంగా ఆచరిస్తారు.

యోగశాస్త్రంలో సూర్యనమస్కారాలదే కీలక పాత్ర. రోజూ ఉదయంవేళ సూర్యుడికి అభిముఖంగా నిలబడి నమస్కరిస్తే, ఆరోగ్య భాగ్యం కలుగుతుంది. ఆధునిక వైద్యశాస్త్రమూ అదే చెబుతోంది. నమస్కార భంగిమలో ఉన్నప్పుడు, మనిషిలో తేజస్సు ఉట్టిపడుతుంటుంది. పద్మాసనం వేసి, కళ్లు మూసి, చేతులు జోడించి చేసే నమస్కారం అతడి అంతరంగంలోని 'ఆత్మజ్యోతి'కి చెందుతుంది. పూర్వం రుషులు నమస్కార భంగిమలోనూ ధ్యానం చేసేవారు. అదే సాధనతో, వారు జీవిత లక్ష్యం సాధించేవారు!

– మునిమడుగుల రాజారావు

అమరావతి నిర్మాణంలో మేమూ..

- ఇటలీ సంస్థ 'అనస్ ఇంటర్నేషనల్' ఆసక్తి
- ముఖ్యమంత్రితో ప్రతినిధి బృందం భేటీ

ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతి నిర్మాణంలో పాలుపంచుకునేందుకు ఇటలీకి చెందిన ఇంజినీరింగ్, నిర్మాణ సంస్థ 'అనస్ ఇంటర్నేషనల్' ముందుకొచ్చింది. భారత్‌తో ఇటలీ కాన్సుల్ జనరల్ స్టెఫానియా కోస్టాంజా సారథ్యంలో ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసింది. రష్యా, ఖతార్, లిబియాల్లో ఇప్పటికే తమ సంస్థ అనేక ప్రాజెక్టులు చేస్తోందని, భారత్‌లోనూ కార్యకలాపాలు విస్తరించాలని భావిస్తున్నామని అనస్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు తెలిపారు. దోహాలో తాము నిర్మించిన ఐకానిక్ బ్రిడ్జి గురించి వివరించారు. అమరావతిలో రహదారి నిర్మాణ ప్రాజెక్టుల్లో భాగస్వాములవుతామని తెలిపారు. కృష్ణానదిపై నిర్మించే ఐకానిక్ వారధి నిర్మాణంపై ఆసక్తి కనబరిచారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదిత 'నిర్మాణ సామగ్రి నగరం'లో భాగస్వాములు కావాలని ఆ సంస్థను సీఎం కోరారు. రాజధానిలో ఏయే అంశాల్లో సహకరించేందుకు అవకాశాలున్నాయో సీఆర్‌డీఏ అధికారులతో చర్చించి, నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలని సూచించారు.

రాజధానిలో విస్తృత అవకాశాలు..

అమరావతిలో ప్రధాన మౌలిక వసతుల అభివృద్ధిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో రూ.29,798 కోట్ల పెట్టుబడులకు అవకాశముందని సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఇటలీ ప్రతినిధుల బృందం సోమవారం విజయవాడలోని ఒక హోటల్‌లో సీఆర్‌డీఏ అధికారులతో సమావేశమైంది. రాజధానిలో ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి, బాహ్య, అంతరవలయ రహదారుల పనుల్లో పీపీపీ విధానంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని సీఆర్‌డీఏ కమిషనర్ పేర్కొన్నారు. రాజధానిలో ప్రస్తుతం ఎల్పీఎస్ లేఅవుట్లు, టైర్-1, టైర్-2 మౌలిక వసతుల పనులకు పెట్టుబడులు అవసరమవుతాయని తెలిపారు. ఎల్పీఎస్ లేఅవుట్లకు సంబంధించి 1.5 బిలియన్ డాలర్ల విలువైన పనులకు హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో ఐదు విడతలుగా టెండర్లు పిలిచామని, ఆసక్తిఉంటే వీటిలో పాల్గొనవచ్చునని సూచించారు. రాజధాని నగరం చుట్టూ రూ.7,624 కోట్లతో 97 కి.మీ.ల మేర అంతరవలయ రహదారి నిర్మాణానికి డీపీఆర్ పూర్తయిందని, ఆరు నెలల్లో పనులు మొదలవుతాయని, దీనిలోనూ పెట్టుబడులకు అవకాశాలుంటాయని తెలిపారు. 180కి.మీ. పొడవైన బాహ్య వలయ రహదారి నిర్మిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. తమ సంస్థ వందేళ్లుగా రహదారుల డిజైన్, నిర్మాణం, నిర్వహణ, మరమ్మతులు వంటి అంశాల్లో పనిచేస్తోందని అనస్ ఇంటర్నేషల్ సంస్థ సీఈఓ బెర్నార్డో మాగ్రి పేర్కొన్నారు. సమవేశంలో అనస్ టెక్ సీఈఓ నికోలా చియారా, ఛైర్మన్ రేమండ్ మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం సచివాలయంలో ఇటలీ బృందంలోని మహిళా ప్రతినిధికి జ్ఞాపిక బహూకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ తదితరులు

గిడ్డంగులు అందుబాటులో ఉంచుకోండి: సీఎం

పెరుగుతున్న పంట దిగుబడుల దృష్ట్యా గిడ్డంగులను అందుబాటులో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. వేరుశనగ, మినుము, పప్పుధాన్యాల రైతులకు మద్దతు ధరలు దక్కేలా చూడాలని స్పష్టం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. నీరు-ప్రగతి, వ్యవసాయాభివృద్ధి అంశాలపై సోమవారం ఉదయం తన నివాసం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం.. వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. దావోస్ సదస్సులో వ్యవసాయం, ఆహారభద్రతపై ఫలవంతమైన చర్చ జరిగిందని, ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయంలో నమూనాగా నిలిచి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని వెల్లడించారు. సకాలంలో నీరందించి సేద్యం పనులు తొలకరిలో ప్రారంభించేలా చూడటం వల్లే పంట దిగుబడులు పెంచగలిగినట్లు పేర్కొన్నారు. వర్షాభావాన్ని అధిగమించి రాయలసీమ రైతాంగానికి సాగునీరు అందించడం సంతృప్తినిచ్చిందన్నారు. ఆక్వాలో కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు. కలుషితాల వల్ల ఆక్వా ప్రాధాన్యం తగ్గితే వృద్ధిరేటుపై గణనీయ ప్రభావం పడుతుందని హెచ్చరించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ లక్ష్యాలు 64శాతానికే చేరడంపై అసంతృప్తి వెలిబుచ్చారు. ఫిబ్రవరిలో సామూహిక గృహప్రవేశాలు పండగలా నిర్వహించాలని స్పష్టం చేశారు. పంటకుంటల తవ్వకంలో మొదటిస్థానంలో ఉన్నామని సీఎం వివరించారు. జియోట్యాగింగ్ చేశాకే ఉపాధి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మొక్కల పెరుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు చెప్పారు.

సీఏలో నాలుగో ర్యాంకు సాధించిన ఫణీష్‌రెడ్డికి సీఎం అభినందనలు

ఈనాడు అమరావతి: అఖిల భారత స్థాయిలో సీఏలో నాలుగో ర్యాంకు సాధించిన విజయవాడ బాలాజీనగర్‌కు చెందిన ఎం.ఫణీష్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం అభినందించారు. రూ.10 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. సీఏలో దక్షిణాది రాష్ట్రాల్లో ఫణీష్‌రెడ్డి మొదటిస్థానం సాధించడంపై సీఎం హర్షం వెలిబుచ్చారు. ఫణీష్‌రెడ్డి సాధించిన విజయం గురించి విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్యమంత్రికి వివరించారు. 21 ఏళ్ల ఫణీష్‌రెడ్డి 2017 నవంబరులో జరిగిన సీఏ ఫైనల్ పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే మంచి ప్రతిభ కనబరిచి అఖిల భారత స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. ఆయన సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చారు. తండ్రి శ్రీనివాసరెడ్డి ఒక ప్రైవేటు బస్సు ఆపరేటర్ దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తల్లి శోభారాణి గృహిణి. వీరి కుటుంబం కృష్ణలంకలో చిన్న అద్దె ఇంట్లో నివసిస్తోంది.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫణీష్‌రెడ్డి

విముక్తి ఉద్యమాలకు స్ఫూర్తిప్రదాత గాంధీజీ

- స్మరించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు అమరావతి: భారత స్వాతంత్ర్యోద్యమ నిర్మాత, అనేక దేశాల్లో విముక్తి ఉద్యమాలకు స్ఫూర్తిదాత మహాత్మాగాంధీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం మహాత్ముడి వర్ధంతి సందర్భంగా పూజ్య బాపూజీని చంద్రబాబు స్మరించుకున్నారు. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి దురహంకార వ్యతిరేక పోరాటాలకు, లాటిన్ అమెరికాలో అనేక విముక్తి ఉద్యమాలకు మహాత్మాగాంధీ అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలే స్ఫూర్తినిచ్చాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఇరవయ్యో శతాబ్దంలో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వ్యక్తుల్లో గాంధీజీ అగ్రగణ్యులన్నారు. నాడు అమెరికాలో మానవ హక్కుల ఉద్యమ నేత మార్టిన్ లూథర్‌కింగ్ నుంచి నిన్నటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా వరకు మహాత్ముడు ఎందరికో స్ఫూర్తినిచ్చారన్నారు. తాను గత ఏడాది అమెరికాలో పర్యటించినప్పుడు డాలస్‌లో మహాత్మాగాంధీ స్మారకాన్ని సందర్శించినట్లు ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.

6న కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ సమావేశం

ఈనాడు, హైదరాబాద్: ప్రధానమంత్రి కృషి సించయీ యోజన (పీఎంఎస్‌కేవై) కింద ఎంపిక చేసిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే విషయమై చర్చించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ ఫిబ్రవరి ఆరున దిల్లీలో సమావేశం ఏర్పాటు చేసింది. గతంలో సత్వరసాగునీటి ప్రయోజనం కింద కేంద్రం ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులను విడుదల చేసేది. 2015-16లో పీఎంఎస్‌కేవైలో సత్వరసాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ)తోపాటు బిందుసేద్యం, వాటర్‌షెడ్ తదితర పథకాలను చేర్చింది. గతంలో ఏఐబీపీ కింద గిరిజన ప్రాంతాల్లోని ప్రాజెక్టులు, కరవు పీడిత ప్రాంతాలు, ప్రధానమంత్రి ప్రత్యేక ప్యాకేజీ కింద ఎంపిక చేసిన ప్రాజెక్టులకు కేంద్రం 90 శాతం నిధులిచ్చేది. ఇతర ప్రాజెక్టులకు 25 శాతం వచ్చేవి. మిగిలిన మొత్తాన్ని రాష్ట్రాలు వ్యయం చేసేవి. పీఎంఎస్‌కేవై కింద ప్రత్యేక ప్రాజెక్టులకు ఇచ్చే నిధులను 90 శాతం నుంచి 60 శాతానికి తగ్గించింది. దేశవ్యాప్తంగా 99 ప్రాజెక్టులను ఎంపిక చేయగా, ఇందులో తెలంగాణ నుంచి 11 ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పురోగతి, నిధుల వ్యయం, కేంద్రం నుంచి నిధుల విడుదల తదితర అంశాలపై చర్చించేందుకు జలవనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఏపీలో ఆకర్షణీయమైన విధానాలు

- పెట్టుబడిదారులకు అనేక రాయితీలు కల్పిస్తున్నాం
- రియల్ టైం గవర్నెన్స్‌లో ప్రజాసమస్యల తక్షణ పరిష్కారం
- అమెరికాలో పెట్టుబడుదారులతో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: పారిశ్రామిక, తయారీ, ఐటీ రంగాల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌లో ఆకర్షణీయమైన విధానాలు తీసుకువచ్చామని ఐటీ శాఖల మంత్రి లోకేశ్ తెలిపారు. అనేక రాయితీలు కల్పిస్తున్నందున రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా సోమవారం పెట్టుబడుదారులతో నిర్వహించిన రోడ్డుషో, శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రవాసాంధ్ర తెదేపా ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జి సభ్యులతోనూ మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నదుల అనుసంధానం కోసం ఎంతో మంది మాట్లాడినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గోదావరి, కృష్ణా నదులను అనుసంధానించి చూపించారన్నారు. రియల్ టైం గవర్నెన్స్‌లో ప్రజా సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కరిస్తున్న విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రవాసాంధ్రులకు ఎలాంటి సమస్యలున్నా ప్రభుత్వం తరపున ఆంధ్రప్రదేశ్ ఎన్ఆర్ఐ వేదిక పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. అమెరికాలోని తెలుగువారి తలసరి ఆదాయాన్ని 86 వేల డాలర్ల నుంచి 1.50 లక్షల డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందుకోసం కావలసిన నైపుణ్యాభివృద్ధికి వసతులు కల్పిస్తామని అన్నారు.

★ రోడ్డు షోలో భాగంగా మంత్రి లోకేశ్ సిస్ ఇంటెలి కార్యానిర్వాహక అధికారి(సీఈవో) రవి హనుమారతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వంద మంది ఉద్యోగులతో కంపెనీ ప్రారంభిస్తామని.. వచ్చే రెండేళ్లలో వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పిస్తామని రవి హనుమార హామీ ఇచ్చారు.

★ రాష్ట్రంలోకంపెనీ ఏర్పాటుకోసం త్వరలో పూర్తిస్థాయి ప్రణాళికతో ముందుకొస్తామని ఎలక్ట్రో హెల్త్ కేర్ సీఈవో లక్ష్మణ్‌రెడ్డి.. మంత్రికి తెలిపారు. అడ్వాన్స్ బ్యాటరీ సిస్టమ్స్ కంపెనీని రాష్ట్రంలో ఏర్పాటుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆ సంస్థ సీఈవో రిచర్డ్ కెయిన్ హామీ ఇచ్చారు. సీఈవోతోపాటు వైస్ ప్రెసిడెంట్ మైక్ పాలోమీరాతో సమావేశమైన సందర్భంలో రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ తయారీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను మంత్రి లోకేశ్ వివరించారు.

★ సాఫ్ట్‌హెచ్క్యూ సంస్థ గుంటూరులో కంపెనీని ప్రారంభించే యోచనతో ఉన్నట్లు సీఈవో క్రాంతి పొన్నం.. మంత్రి లోకేశ్‌కు వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ, పునరుద్పాదక ఉత్పత్తుల తయారీ రంగానికి చెందిన ఎలిక్సిస్ సీటీఓ డాక్టర్ లోగనాథన్ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకొచ్చారు.

★ విశాఖలో కంపెనీ ప్రారంభించే యోచనతో ఉన్నట్లు 'ఐ స్పేస్' సీఈవో రాజేష్ కొత్తపల్లి మంత్రి లోకేశ్‌తో భేటీలో వెల్లడించారు. త్వరలో పూర్తిస్థాయి ప్రణాళికతో ముందుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని సెంట్రామెడ్, ప్రెస్ మార్ట్ డిజిటల్ మీడియా కంపెనీ సీఈవో విక్రమ్ తొర్రునూరి ప్రకటించారు.

★ ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలను విస్తరించే యోచనతో ఉన్నామని పిబి సిస్టమ్స్ కంపెనీ సీఈవో వేణు గార్నే మంత్రి లోకేశ్‌తో అన్నారు.



అమెరికాలో పెట్టుబడుదారులతో మంత్రి లోకేశ్

వెలిగొండ పనులకు ఆటంకం

విద్యుత్తు బకాయిలతో సరఫరా నిలిపివేత

ఈనాడు డిజిటల్-ఒంగోలు: ప్రకాశం జిల్లాలో సాగుతున్న వెలిగొండ ప్రాజెక్టు పనులకు ఆటంకం తలెత్తింది. ప్రధానమైన సొరంగాల తవ్వకానికి విద్యుత్తు సమస్య తలెత్తింది. రెండు సొరంగాలకు సంబంధించి విద్యుత్తు శాఖకు రూ.6.74 కోట్ల బకాయి ఉండటంతో ఆ శాఖ ఎస్ఏవో శ్రీనివాసరావు సోమవారం విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. రెండు సొరంగాలను వేర్వేరు గుత్తేదారులు తవ్వుతున్నారు. ఒక్కో సొరంగానికి నెలకు రూ.80 లక్షల వరకు విద్యుత్తు బిల్లు వస్తుంది. ఈ మొత్తాన్ని గుత్తేదారులే చెల్లించాలి. గత ఐదు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో తొలి సొరంగానికి రూ.4 కోట్లు, రెండో సొరంగానికి రూ.2.7 కోట్ల మేర విద్యుత్తు శాఖకు బకాయిపడ్డారు. ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపులో జాప్యమే దీనికి కారణమని గుత్తేదారులు చెబుతున్నారు. గతంలో కూడా ఇలాగే బకాయిల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపివేయగా, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హామీతో పునరుద్ధరించారు. మళ్లీ సోమవారం ఇదే సమస్య తలెత్తడంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే గుత్తేదారులతో మాట్లాడారు. విద్యుత్తు శాఖకు రూ.కోటి చెల్లించడంతో రాత్రి మొదటి సొరంగానికి విద్యుత్తును పునరుద్ధరించారు. ఈ విషయమై ప్రాజెక్టుల ఎస్ఈ రెడ్డియ్య 'ఈనాడు'కు వివరణ ఇస్తూ... బిల్లుల చెల్లింపుల్లో స్వల్ప జాప్యం ఉందన్నారు. తొలి సొరంగానికి రూ.4 కోట్ల బకాయిఉందని, రెండో సొరంగానికి ప్రభుత్వం నుంచి చెల్లించాల్సినది పెద్దగా లేదన్నారు. పనులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగిసిన మొదటి దశ పులుల గణన

ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా చేపట్టిన పులుల గణనలో భాగంగా నల్లమలలో మొదటి దశ లెక్కింపు ప్రక్రియ పూర్తయింది. ఈనెల 22 నుంచి లెక్కింపు చేపట్టారు. మొదటి మూడు రోజులు మాంసాహార జంతువులైన పులి, చిరుత, ఎలుగుబంటి, రేసు కుక్కల సర్వే చేశారు. చివరి మూడు రోజుల్లో శాఖాహార జంతువుల సర్వే నిర్వహించనున్నారు. ఈ ఏడాది కొత్తగా ఎకలాజికల్ యాప్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ డీఎఫ్‌వో సెల్వం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పులుల గణన నాలుగు దశల్లో జరుగుతుందన్నారు. 'మొదటి దశ సర్వే నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశాం. రెండో దశలో సేకరించిన అంశాలను విశ్లేషించి ప్రయోగశాలలో అంచనా వేస్తారు. మూడో దశ సర్వే ఏప్రిల్, మే నెలల్లో జరుగుతుంది. నిర్దేశించిన ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటుచేసి అందులో నమోదైన పులులు, చిరుతల దేహంపై ఉండే చారల ఆధారంగా వాటి సంఖ్య లెక్కిస్తారు. ఉపగ్రహ అనుసంధానంతో భౌగోళిక పరిస్థితులు అంచనా వేస్తారు. నాలుగో దశలో నిర్దేశించిన ప్రదేశాల్లో కెమెరా ట్రాప్‌లు ఏర్పాటుచేసి లెక్కిస్తారని' తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మ

దుర్గ ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన పద్మ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఆగమ శాస్త్రానికి అనుగుణంగా దుర్గ ఆలయాన్ని తీర్చిదిద్దుతామని, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ అభివృద్ధికి కృషి చేస్తామని ఈవో డాక్టర్ పద్మ చెప్పారు. విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా నియమితులైన ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేవస్థానంలోని ప్రతి శాఖను ప్రాధాన్య క్రమంలో ఈ గవర్నెన్స్ కిందకు తీసుకువస్తామని, సంబంధిత అధికారి జవాబుదారీతనం వహించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. పాలక మండలి, దేవస్థానం అధికారుల సమన్వయంతో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాలక మండలి ఛైర్మన్ గౌరంగబాబు, అధికారులు పాల్గొన్నారు.

ఆహారశుద్ధి పరిశ్రమలపై తిరుపతిలో నేడు సదస్సు

ఈనాడు అమరావతి: రాష్ట్రంలో ఆహారశుద్ధి రంగంలో ఉన్న అవకాశాల్ని, ప్రభుత్వ విధానాల్ని వివరించేందుకు ఆంధ్రప్రదేశ్ ఆహార శుద్ధి సంస్థ (ఏపీఎఫ్‌పీఎస్) మంగళవారం తిరుపతిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సు నిర్వహిస్తోంది. ఏపీఎఫ్‌పీఎస్, ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్, అసోచామ్ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నాయి. ఆహార శుద్ధి రంగానికి చెందిన నిపుణులు, విజయవంతంగా పరిశ్రమలు నిర్వహిస్తున్న వారు, అధికారులు, ఆయా వాణిజ్య, వ్యాపార సంఘాల ప్రతినిధులు ఈ సదస్సుకి హాజరవుతారని ఏపీఎఫ్‌పీఎస్ సీఈఓ వై.ఎస్.ప్రసాద్ సోమవారమిక్కడ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, ఆహారశుద్ధి శాఖ మంత్రి ఎన్.అమరనాథ్‌రెడ్డి సదస్సుని ప్రారంభిస్తారు.

డ్వాక్రా సంఘాలకు రూ.1140.41 కోట్ల పెట్టుబడి నిధి విడుదలకు అనుమతి

ఈనాడు, అమరావతి: డ్వాక్రా మహిళా సంఘాలకు పెట్టుబడి నిధి కింద రూ.1140.41 కోట్ల విడుదలకు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 70 లక్షల మంది డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రకటించిన రూ.10 వేల రుణమాఫీలో ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతలుగా రూ.6 వేలు చెల్లించిన విషయం తెలిసిందే. 2017-18 సంవత్సరంలో డ్వాక్రా సంఘాలకు కేటాయించిన రూ.1140.41 కోట్ల నిధులపై ఉన్న ఆంక్షలను తొలగించడంతోపాటు పరిపాలన అనుమతులిస్తూ తదుపరి చర్యల కోసం అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

ఆహా ఏమి రుచి.. అనరా మైమరచి

- గిరిజన సహకార సమాఖ్య ద్వారా అరకు వ్యాలీ 'ఇన్‌స్టెంట్ కాఫీ'
- మంత్రులు ఆనందబాబు, జవహర్‌ల ఆవిష్కరణ
- 2 గ్రా, 10 గ్రా సాచెట్లలో లభ్యం

ఈనాడు, అమరావతి: అరకు వ్యాలీ కాఫీ పొడి ఇక ఇన్‌స్టెంట్ కాఫీగా మార్కెట్‌లో లభిస్తుంది. గిరిజన సహకార సమాఖ్య (జీసీసీ) ఈ మేరకు సాచెట్లు తయారు చేసి సోమవారం విడుదల చేసింది. రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కె.జవహర్‌లు సోమవారం సచివాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో వీటిని విడుదల చేశారు. అరకులో ప్రసిద్ధి చెందిన కాఫీని గిరిజనులు 3లక్షల ఎకరాలలో పండిస్తున్నారు.

ప్రధాని వహ్వా అన్నారు..: ఈ కాఫీ పొడిని చంద్రబాబు కొన్ని జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాల్లోను పరిచయం చేశారని, ప్రధాని మోదీతోను తాగించి భేష్ అనిపించారని గిరిజనకార్పొరేషన్ ఎండీ రవిప్రకాష్ చెప్పారు. ఈ కాఫీతో ఫిల్టర్ ద్వారా కాఫీ తాగే వెసులుబాటు ఉండేదని, చాలా మంది ఇన్‌స్టెంట్ కాఫీని సరఫరా చేయాలని సూచించడంతో ప్రయివేటు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని ఇలా సాచెట్లు విడుదల చేస్తున్నామన్నారు. ఈ సాచెట్లు 2 గ్రా, 10 గ్రాముల ప్యాకెట్లలో లభ్యమవుతాయన్నారు. వీటిని కొనుగోలు చేస్తే గిరిజనులకు మేలు చేసినవారవుతారని చెప్పారు.

2 ఏళ్లలో రూ.500 కోట్లకు వ్యాపారం విస్తరణ: మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ వచ్చే రెండేళ్లలో రూ.500 కోట్లకు జీసీసీ వ్యాపారం పెరగనుందన్నారు. 10 సంవత్సరాల్లో రూ.526 కోట్లతో కాఫీ సాగును విస్తరింపజేసే ప్రాజెక్టు అమలు చేయనున్నామన్నారు. జీసీసీయే గిరిజన రైతులనుంచి కాఫీ సేకరించి శుద్ధి చేసి, అమ్మి ఆ సొమ్ము గిరిజనులకు అందించే బృహత్తర కార్యక్రమం జీసీసీ ప్రారంభించిందన్నారు. ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, సాంఘిక సంక్షేమశాఖ సంచాలకుడు రామారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అరకువ్యాలీ 'ఇన్‌స్టెంట్ కాఫీ' సాచెట్లను విడుదల చేస్తున్న మంత్రులు ఆనందబాబు, జవహర్, అధికారులు

వెయ్యి కి.మీ. పూర్తయిన జగన్ యాత్ర

- సైదాపురంలో పైలాన్ ఆవిష్కరణ

సైదాపురం, న్యూస్‌టుడే: వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర వెయ్యి కి.మీ. పూర్తయింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సాగుతున్న ఆయన పాదయాత్ర సోమవారం గూడూరు గ్రామీణ మండలం నుంచి వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురానికి చేరుకుంది. అక్కడితో వెయ్యి కి.మీ. పూర్తయిన గుర్తుగా సైదాపురం సమీపంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను జగన్ ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో రోడ్ షో జరిపి ప్రచార రథం నుంచి జగన్ ప్రసంగించాల్సి ఉండగా.. ఆయన నేరుగా విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన బసలోకి వెళ్లిపోయారు. కార్యక్రమంలో తిరుపతి, నెల్లూరు ఎంపీలు వరప్రసాద్, రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజధానిలో 'వాక్‌విత్ జగనన్న'

ఈనాడు, దిల్లీ: జగన్ పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తయినసందర్భంగా సోమవారమిక్కడ వైకాపా ఎంపీలు విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, మద్దతుదారులు, అభిమానులతో కలిసి ఏపీ భవన్ నుంచి ఇండియాగేట్ వరకు 'వాక్ విత్ జగనన్న' పేరుతో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. జగన్ ప్రకటించిన నవరత్న హామీలు మరింత పటిష్ఠంగా అమలు చేయడం కోసం పాదయాత్రలో లక్షలాది మంది ప్రజలను కలుస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీలు అమలు చేయకుండా రైతులు, మహిళలు, నిరుద్యోగులు, అన్ని వర్గాలను మోసం చేసిన నేపథ్యంలోనే ప్రతిపక్షనేత ప్రజాసంకల్ప యాత్ర చేపట్టారని సుబ్బారెడ్డి అన్నారు. మరోవైపు హైదరాబాద్‌లో వైకాపా రాష్ట్ర విభాగం అధ్యక్షులు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, వాసిరెడ్డి పద్మ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని లోటస్ పాండ్ కార్యాలయం నుంచి పెద్దమ్మగుడి వరకు పాదయాత్ర నిర్వహించారు.



పైలాన్‌ను ఆవిష్కరించిన జగన్, చిత్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు

ప్రతి అడుగులోనూ మీ మద్దతు తెలుస్తోంది: జగన్

ఈనాడు అమరావతి: యాత్ర వేయి కిలోమీటర్లకు చేరుకున్న సందర్భంగా జగన్ ట్విట్టర్‌లో ప్రజలనుద్దేశించి స్పందించారు. 'వేయి కి.మీ. పూర్తయింది. నా ప్రతి అడుగులోనూ మీ ఆప్యాయత, మద్దతు పొందగలిగాను. వైఎస్ పట్ల మీకున్న గౌరవాభిమానాలను చూశాను. ప్రభుత్వం పట్ల మీకున్న ఆగ్రహం గమనించాను. ప్రజా సంకల్పయాత్రను కొనసాగించేందుకు మీ ఆశీస్సులు బలాన్నిస్తున్నాయి' అని ట్వీట్ చేశారు.

మోసగించేందుకే వాక్ విత్ జగన్

ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్

ఈనాడు, అమరావతి: దళితుల భూముల్ని కొల్లగొట్టిన జగన్‌కు తోడుగా ప్రజల్ని రమ్మని పిలవడం పెద్ద మోసమని ఎక్సైజ్ శాఖా మంత్రి కె.ఎస్.జవహర్ అన్నారు. "వాక్ విత్ జగన్" కార్యక్రమం అతను ముఖ్యమంత్రి కావడానికి ఉద్దేశించిందే తప్ప ప్రజల కోసం కాదని వ్యాఖ్యానించారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనాల నెత్తిన చేతులు పెట్టడం, ఎదురొచ్చిన వారికి ముద్దులు పెట్టడం తప్ప జగన్ పాదయాత్రలో ఇంకేమి కనబడటం లేదన్నారు. "ఎన్నికలు సమీపించినప్పుడే జగన్‌కు ప్రత్యేక హోదా గుర్తొస్తోంది. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే వైకాపా ఎంపీలు ప్రత్యేక హోదా కోసం ఎందుకు రాజీనామా చేయడం లేదో సమాధానం చెప్పాలి. జగన్‌కు అధికారమే పరమావధి. పవన్ కల్యాణ్ మాత్రం యాత్ర చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటిని ప్రభుత్వానికి తెలుపుతూ ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారు. జనవరి 26వ తేదీన నా పుట్టినరోజు కావడం, ఆ రోజు నాకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే కార్యకర్తలను కలుసుకోవడం కోసం ఉండిపోవడం వల్లే దళిత తేజం కార్యక్రమానికి హాజరుకాలేకపోయాను. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేదు" అని జవహర్ పేర్కొన్నారు.

నీట్ ర్యాంకులతోనే ఆయుష్ సీట్ల భర్తీ

ఈనాడు, అమరావతి: ఆయుర్వేద, హోమియో, యునాని తదితర ఆయుష్ కోర్సుల్లో సీట్ల భర్తీని వచ్చే విద్యా సంవత్సరంలో పూర్తిగా నీట్ ర్యాంకుల ఆధారంగానే భర్తీ చేయడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ కన్వీనర్ కోటా సీట్లను నీట్ ర్యాంకుల ఆధారంగా భర్తీ చేశారు. యాజమాన్య కోటా సీట్ల భర్తీలో నీట్, ఎంసెట్ ర్యాంకులను పరిగణనలోకి తీసుకున్నారు. కేంద్రం ఆదేశాల నేపథ్యంలో 2018-19 విద్యా సంవత్సరం నుంచి యాజమాన్య కోటా సీట్లను కూడా నీట్ ర్యాంకుల ప్రాతిపదికన భర్తీ చేస్తామని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అప్పలనాయుడు వెల్లడించారు.

మూడు వర్సిటీల్లో సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీ నిలుపుదల

ఈనాడు, అమరావతి: విక్రమసింహపురి, కృష్ణా, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీ ప్రక్రియను నిలుపుదల చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఏర్పాటు చేసిన హేతుబద్ధీకరణ కమిటీ, రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ సక్రమంగా పాటించలేదని, ప్రస్తుతం పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కొందరు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 విశ్వవిద్యాలయాల్లో 1,110 సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి ఇటీవల అన్ని వర్సిటీలు నోటిఫికేషన్లు జారీ చేశాయి. మొదటిసారిగా అన్ని వర్సిటీలకు కలిపి ప్రాథమిక(స్క్రీనింగ్) పరీక్షను ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

దేవదాయశాఖ ఉద్యోగులకు కారుణ్య నియామకాల వర్తింపు

ఈనాడు-అమరావతి: దేవదాయశాఖలో పని చేస్తున్న పాలనాపరమైన ఉద్యోగులు, పెద్ద ఆలయాల్లో వేతన స్కేలు పొందుతున్న అర్చకులు తదితర సిబ్బందికి కారుణ్య నియామకాల వర్తింపు కల్పిస్తూ ఆ శాఖ సోమవారం జీవో వెలువరించింది. ఉద్యోగంలో ఉన్న తీవ్ర అనారోగ్యంతో నిస్సహాయులై విధులకు హాజరుకాలేని పక్షంలో(కొన్ని వ్యాధులకు సంబంధించి మాత్రమే) స్వచ్ఛందంగా వారు పదవీ విరమణ పొంది ఆ కుటుంబంలో ఒకరిని ఉద్యోగం ఇప్పించే వెసులుబాటు కల్పిస్తూ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. ఇంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న ఈ అవకాశం ఇప్పుడు దేవదాయశాఖ ఉద్యోగులకూ కల్పించారు. ఈమేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులు ఇచ్చారు.

ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి నిధులివ్వాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ ఎంపీ కొణతాల

ఈనాడు, దిల్లీ: ఉత్తరాంధ్ర, రాయలసీమలోని జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. మాజీ ఎంపీలు కణతి విశ్వనాథం, జ్ఞానేందర్‌రెడ్డి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తదితరులతో కలిసి చేపట్టిన 48 గంటల రైలు దీక్షను.. సోమవారం రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించిన తర్వాత ఆయన విరమించారు. అనంతరం ఏపీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. విభజన హామీలు అమలు చేయాలని, విశాఖ కేంద్రంగా తక్షణమే రైల్వేజోన్ ప్రకటించాలని కోరారు.

వచ్చే ఎన్నికల బరిలో జనసేన

- పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- కార్యకర్తలకు జనసేనాని నిర్దేశం
- అనంతలో ముగిసిన పవన్ పర్యటన

హిందూపురం, ధర్మవరం - న్యూస్‌టుడే

వచ్చే ఎన్నికల్లో జనసేన బరిలో నిలుస్తుందనీ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. 'ఛలోరె ఛలోరె ఛల్' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన అనంతపురం జిల్లా ధర్మవరం, హిందూపురం నియోజకవర్గాల్లో పర్యటించారు. ధర్మవరంలో చేనేత సదస్సులో, హిందూపురంలో జనసేన కార్యకర్తల సమావేశంలో పవన్ ప్రసంగించారు. ప్రత్యేక హోదాపై తెదేపా, భాజపా, వైకాపా స్పష్టమైన వైఖరి ప్రకటించాలన్నారు. రాజధాని విషయంలో రాయలసీమకు సరైన ప్రాధాన్యం కల్పించడం లేదని విమర్శించారు. సీమ ప్రజల ఇబ్బందులు తనకు తెలుసనీ. . ప్రభుత్వాలు వీరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమకు అండగా, కోనసీమకు బాసటగా నిలుస్తానన్నారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుకు ఒత్తిడి తేవాలని హిందూపురంలో న్యాయవాదులు పవన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఈ విషయం పెద్దలతో మాట్లాడతానన్నారు.

చేనేతకు వన్నె తెస్తా..

తెలుగు రాష్ట్రాల్లో చేనేత కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తానని పవన్ పేర్కొన్నారు. ఎంతో నైపుణ్యమున్న నేత కళాకారులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. తక్షణసాయం అందిస్తే ఎలాంటి ఉపశమనం పొందుతారో తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ధర్మవరం పట్టు చీరకు బ్రాండ్ తీసుకొచ్చి అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పిస్తామన్నారు. ధర్మవరంలో ప్రసంగిస్తూ పవన్ కొద్దిసేపు అస్వస్థతకు గురయ్యారు. కాసేపు తలవంచుకుని సేద తీరి.. నీరు తాగి ప్రసంగం ప్రారంభించారు.

ప్రేమమూర్తి..సత్యసాయి

ప్రభుత్వాలు చేపట్టలేని ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలను సత్యసాయి ప్రేమతో చేసి చూపించారని పవన్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పుట్టపర్తిలో బస చేసిన ఆయన సోమవారం ఉదయం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సర్వమతాల సన్నిధికి రావడం తన అదృష్టమన్నారు. ధర్మవరంలో ఎమ్మెల్యే సూర్యనారాయణను నేరుగా కలిసి.. పుట్టపర్తి ఎమ్మెల్యే, చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డితో చరవాణిలో సంభాషించి ఆయా ప్రాంతాల సమస్యలపై పవన్ వారితో చర్చించారు.

అభిమాని దుర్మరణం

హిందూపురంలోని మోడల్‌కాలనీకి చెందిన రామకృష్ణ (34) పవన్ అభిమాని. సోమవారం జనసేన కార్యకర్తల సమావేశానికి వచ్చాడు. పవన్ కార్యకర్తల సమావేశం ముగించుకొని బెంగళూరుకు పయనమవగా.. వాహన శ్రేణి వెంట రామకృష్ణ ద్విచక్ర వాహనంపై సాగారు. లేపాక్షి మండలం మల్లిరెడ్డిపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన బొలేరో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. హిందూపురం ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు వదిలాడు. అతడికి భార్య, ఒక పాప, ఒక బాబు ఉన్నారు.



సత్యసాయి మహాసమాధికి నమస్కరిస్తున్న పవన్

అపశ్రుతులు: పురంలో పవన్ ప్రసంగిస్తుండగా.. అభిమానులు అరుపులు కేకలతో హోరెత్తించడంతో ఆయన విసిగి కాసేపు గదిలోకి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత మళ్లీ వచ్చి ప్రసంగించారు. హిందూపురంలో అంబేడ్కర్ కూడలి వద్దకు చేరుకున్న పవన్ కాన్వాయ్‌లోని ఓ వాహనం మూడు చక్రాల బండిపై వెళుతున్న దివ్యాంగుడిని ఢీకొట్టింది. దీంతో అతను వాహనంతో సహా కింద పడ్డాడు. ఒక చక్రం పూర్తిగా దెబ్బతింది. ఢీ కొట్టిన వాహనదారుడు ఎలాంటి సాయం అందించకుండానే వెళ్లిపోయాడు.



హిందూపురంలో కాన్వాయ్‌లో ఓ వాహనం ఢీ కొని పడిపోయిన దివ్యాంగుడు

ప్రతి సమస్యను పరిష్కరించాలి

- పురపాలక సంస్థల అధికారులకు మంత్రి నారాయణ పిలుపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఈనాడు, అమరావతి: పురపాలక, నగర పాలక సంస్థల్లో ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేలా అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సూచించారు. సోమవారం విశాఖకు వచ్చిన ఆయన జీవీఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రిగా ఉన్న తన వద్ద గంట కంటే ఎక్కువ సేపు ఏ ఒక్క దస్త్రం ఉండకుండా పరిష్కరిస్తానని, ఇదే స్ఫూర్తిని అధికారులు అందిపుచ్చుకోవాలన్నారు. మార్చి నెలాఖరు నుంచి మున్సిపాలిటీల్లో ఏ స్థాయిలో అధికారైనా మూడు రోజుల కంటే ఎక్కువగా ఆలస్యం చేయకుండా దస్త్రాలను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్ భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసేవారు కచ్చితమైన వివరాలు పొందుపరచాలని, తప్పులు చేస్తే భవనాలు కూల్చివేయాల్సి ఉంటుందని నారాయణ హెచ్చరించారు.

'ఆస్తి పన్ను'పై అక్రమాలను ఉపేక్షించొద్దు

పురపాలక, నగరపాలక సంస్థల్లో ఆస్తి పన్ను విధింపులో లోపాలను, సిబ్బంది అక్రమాలను ఉపేక్షించరాదని నారాయణ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాలకు, కొత్త నిర్మాణాలకు, అదనపు అంతస్తులకు పన్నులు వేయకపోవడంపై 'ఈనాడు' ప్రధాన పత్రికలో సోమవారం ప్రచురించిన 'వారు కట్టరు.. వీరు పట్టించుకోరు' శీర్షికతో వెలువడిన కథనంపై ఆయన విశాఖలో జరిగిన సమావేశంలో స్పందించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరికల్‌వలవెన్, సంచాలకుడు డాక్టర్ కన్నబాబు, ఇతర అధికారులతో ఫోన్లో మాట్లాడారు. పురపాలక, నగరపాలక సంస్థల కమిషనర్లతోనూ 'టెలీ కాన్ఫరెన్స్' నిర్వహించి ఆస్తి పన్ను విధింపు, వసూళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అవినీతి నిరోధక శాఖకు చిక్కుతున్న పట్టణ ప్రణాళిక, సంబంధిత విభాగాల అధికారుల అంశాన్ని ప్రస్తావిస్తూ.. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నేటి నుంచి కడప పెద్దదర్గా ఉరుసు

కడప, న్యూస్‌టుడే: కడప అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) ఉరుసు మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 2 వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. మంగళవారం గంధం, 31న ఉరుసు మహోత్సవం జరగనుంది.

రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు
- తెదేపాలో చేరిన చిత్తూరు మాజీ జెడ్పీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యంరెడ్డి

ఈనాడు, అమరావతి, తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని, ప్రభుత్వానికి మద్దతివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. అధికార దాహంతో రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడేలా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేద్దామన్నారు. చిత్తూరు జిల్లా మాజీ జెడ్పీ ఛైర్మన్, వైకాపా నాయకుడు, కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుపై మూడుసార్లు పోటీ చేసిన సుబ్రహ్మణ్యంరెడ్డి సోమవారం తెదేపాలో చేరారు. చిత్తూరు జిల్లా నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు, మద్దతుదారులతో సోమవారం రాత్రి ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి రాగా.. చంద్రబాబు వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆరుగురు సర్పంచ్‌లు, నలుగురు ఎంపీటీసీలు సహా 654 మంది తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... సుబ్రహ్మణ్యంరెడ్డి 1999, 2004, 2009 ఎన్నికల్లో తనపై పోటీ చేశారని, తనపై మూడుసార్లు పోటీ చేసిన వ్యక్తి ఆయన ఒక్కరేనని పేర్కొన్నారు. ఆయన రాజకీయాల్లో నీతి నిజాయతీలతో, హుందాగా వ్యవహరించారని ప్రశంసించారు. ప్రజలకు న్యాయం చేయాలంటే తెదేపా తప్ప మరో మార్గం లేదని సుబ్రహ్మణ్యంరెడ్డి కూడా తెదేపాలోకి వచ్చారని పేర్కొన్నారు. కొందరు స్వార్థం కోసం రాజకీయాలు చేస్తున్నారు. ప్రతిపక్ష నేత ఎన్ని తప్పులు చేయాలో అన్నీ చేశారు. అందుకే ప్రతి శుక్రవారం కోర్టుకి వెళుతున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో వైకాపా పూర్తిగా ఖాళీ అవుతుందని ఆయన పేర్కొన్నారు.


ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా

వైకాపాలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని, అగచాట్లు పడ్డానని సుబ్రహ్మణ్యంరెడ్డి పేర్కొన్నారు. తన లాంటి వాళ్ల ఉసురు జగన్‌కు తగులుతుందన్నారు. వైఎస్‌పై అభిమానంతో జగన్ వెంట నడిచిన తనలాంటి చాలా మందిని ఆయన నామరూపాల్లేకుండా చేశారని, డబ్బు కోసం ప్రతి జిల్లాకు ఒక గుత్తేదారుని పెట్టి తమను దెబ్బకొట్టారని తెలిపారు. జగన్ నైజం ఏంటో అందరికీ తెలుసునని, మొదట్లో ఆయన వెంట ఉన్నవారెవరూ ఇప్పుడు కనపడరని ఆయన పేర్కొన్నారు. ' వైఎస్ మనస్తత్వమే జగన్‌కీ ఉంటుందనుకున్నాను. కానీ ఒక గుత్తేదారు కోసం నాకు టిక్కెట్ ఇవ్వలేదు. ఎవర్నో తృప్తి పరచడానికి నన్ను పార్టీ నుంచి తప్పించే ప్రయత్నం చేశారు. నమ్ముకున్నవారిని నట్టేట ముంచుతున్నారని జగన్‌కే చెప్పాను" అని పేర్కొన్నారు. 'మంచి జరిగే చోట, ఉడతాభక్తిగా నా వంతు సాయం చేయాలన్న ఉద్దేశంతో తెదేపాలో చేరుతున్నాం" అని చంద్రబాబును ఉద్దేశించి ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఫ్యాప్టో ధర్నాలు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ డిమాండ్ల సాధన కోసం సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం, కర్నూలు జిల్లాల్లో పాల్గొన్న ఫ్యాప్టో ఛైర్మన్, ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి, జి.హృదయరాజులు మాట్లాడుతూ.. మూడున్నర సంవత్సరాలైనా పీఆర్సీ 10నెలల బకాయిలు చెల్లించలేదని, రెండు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే 11వ పీఆర్సీ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. రూ. 398 వేతనంతో పనిచేసిన ప్రత్యేక ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, 2008 డీఎస్సీ వారికి వేతన వ్యత్యాసాన్ని సవరించాలని కోరారు. ఏలూరు, కడపల్లో పాల్గొన్న కో-ఛైర్మన్లు జోసేఫ్ సుధీర్‌బాబు, నారాయణరెడ్డిలు మాట్లాడుతూ.. విద్యాశాఖ రూపొందించిన కేలండర్‌ను అమలు చేయకుండా రోజుకో ప్రభుత్వ ప్రచార కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులతో చేయిస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యపరుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫ్యాప్టోతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో అసెంబ్లీ సమావేశాల సమయంలో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామన్నారు.

ఫిబ్రవరి 4
ప్రపంచ క్యాన్సర్ దినం



యుద్ధం నేర్చాం!
వ్రణంతో అనాదిగా సాగుతున్న రణంలో
గుట్టుమట్లన్నీ శోధించి..
అస్త్రశస్త్రాలన్నీ సంధించి..
ఇప్పటికి శత్రువును సమర్థంగా మట్టుబెట్టగలుగుతున్నాం!
అనుమానమేం లేదు.. ఇప్పుడు క్యాన్సర్‌పై మనది పైచెయ్యే.
కానీ ఇక్కడితో ఆగితే ఈ యుద్ధానికి అర్థం లేదు.
ఇప్పుడు వేగం తగ్గిస్తే పడిన కష్టానికి ఫలితం ఉండదు.

అందుకే ఈ 'ప్రపంచ క్యాన్సర్ దినం' సందర్భంగా ఇన్నేళ్ల క్యాన్సర్ చికిత్సా ప్రస్థానంలో ఇప్పుడు మనం ఎక్కడున్నాం... ఈ ప్రయాణంలో ఇప్పుడు మనం చెయ్యాల్సిందేమిటో చెప్పండంటూ ముగ్గురు ప్రముఖ క్యాన్సర్ వైద్యులను ప్రశ్నించింది సుఖీభవ. 'అసలు యుద్ధం అవసరమే రాకుండా నివారించుకోవటం! వచ్చినా.. ఆదిలోనే దాని ఆనవాళ్లు పట్టుకుని మట్టుబెట్టెయ్యటం!! ... ఈ రెండే మన ముందున్న బృహత్ లక్ష్యాలంటూ వారు వెలిబుచ్చిన అమూల్య అభిప్రాయాలు.. ఆచరణాత్మక సలహాసూచనలూ.. ఈ వారం 'సుఖీభవ' ప్రత్యేకం!

యుద్ధం..
మరో అడుగు ముందు కేద్దాం!

ఇప్పుడు మన చింత చికిత్సల గురించి కాదు..

ఇప్పుడు మనం క్యాన్సర్ చికిత్సల గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన పని లేదు. ఎందుకంటే ఇప్పుడు క్యాన్సర్‌కు చక్కటి చికిత్సలు చెయ్యటమే కాదు.. చాలా కేసులను పూర్తిగా నయం చెయ్యగలుగుతున్నాం కూడా. ఇప్పుడు మనం ఆలోచించాల్సిందల్లా.. వీలైనంత త్వరగా, తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించటమెలాగన్న దాని గురించే!

పదేళ్ల క్రితం 70% బాధితులంతా కూడా క్యాన్సర్ బాగా ముదిరిపోయిన దశలోనే.. అంటే బాగా 'లేట్ స్టేజ్‌లోనే' వైద్యుల వద్దకు వచ్చేవాళ్లు. ఆ సమయంలో చికిత్సలు కూడా కష్టంగా ఉండేవి. కానీ ఇటీవలికాలంలో ప్రజల్లో క్యాన్సర్ పట్ల అవగాహన బాగా పెరగటంతో 70% మంది అంతగా ముదరకముందే వైద్యుల వస్తున్నారు. కాబట్టి మనం ప్రజల్లో ఇప్పుడు అవగాహన మరింతగా పెంచాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మనం ఎప్పుడు, ఎలాంటి లక్షణాలు కనబడితే క్యాన్సర్‌ను అనుమానించాలన్న అవగాహన బాగా పెరగాలి.



డా॥ విజయానంద్ పి.రెడ్డి
డైరెక్టర్
అపోలో క్యాన్సర్ హాస్పిటల్
జూబిలీహిల్స్, హైదరాబాద్

రెండోది- ఒకసారి క్యాన్సర్ వస్తే ఇక అది నయం కాదన్న అపోహ ఇప్పటికీ మన సమాజంలో చాలామందిలో బలంగా పాతుకుపోయింది. అదొస్తే ఇక జీవితం అయిపోనియట్లేనని భావించేవాళ్లూ ఉంటున్నారు. దీంతో కొన్నికొన్ని అనుమానాలు, లక్షణాలు కనబడుతున్నా కూడా కొంతమంది.. ఎక్కడ క్యాన్సర్ అంటారోనన్న భయంతో వ్యాధి ముదిరే వరకూ కూడా వైద్యుల వద్దకు వెళ్లకుండా తాత్సారం చేస్తున్నారు. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదు. క్యాన్సర్ అంటే అంత భయపడక్కర్లేదు, దాన్ని ఎంత త్వరగా గుర్తిస్తే అంత పూర్తిగా నయం చెయ్యొచ్చని గుర్తించాలి.

మూడోది- క్యాన్సర్ చికిత్సలు ఇప్పుడు చాలా తేలిక అయ్యాయి, దుష్ప్రభావాలు బాగా తగ్గిపోయాయి, సమర్థ చికిత్సతో రోగుల ఆయుర్దాయమూ గణనీయంగా పెరిగింది. చాలామంది క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్నప్పుడూ, ఆ తర్వాతా కూడా హాయిగా ఉండగలుగుతున్నారు. ఇవాళ్టి రోజున క్యాన్సర్‌తో వస్తున్న వారిలో దాదాపు 70%-75% మందికి క్యాన్సర్‌ను పూర్తిగా నయం చెయ్యగలుగుతున్నాం కూడా. 1వ స్టేజీలో వస్తున్న వాళ్లే కాదు.. 4వ స్టేజ్‌లో వస్తున్న వాళ్లలో కూడా పూర్తిగా నయం చెయ్యగలుగుతున్నాం. కాబట్టి క్యాన్సర్ అంటే భయపడి.. వైద్యుల వద్దకు రాకుండా ఉండాల్సిన అవసరం ఇవాళ్టి రోజున లేనేలేదు.

క్యాన్సర్..
దేశంలో ఏటా కొత్తగా నమోదవుతున్నది
7 లక్షలు

ఏటా మరణాలు
5.5 లక్షలు

5 అతిపెద్ద క్యాన్సర్లు
1. రొమ్ము
2. గర్భాశయ ముఖద్వారం
3. నోరు
4. ఊపిరితిత్తులు
5. పెద్దపేగు, మలద్వారం

ఆయుర్దాయం పెరుగుతోంది
క్యాన్సర్ నయమై, ఐదేళ్లకు పైగా జీవించినవారి శాతం..

1975-77 మధ్య
49%

2005-2011 మధ్య
69%

మొత్తం క్యాన్సర్లలో పొగాకు సంబంధ క్యాన్సర్లదే అధిక భాగం. పొగాకు తీవ్రమైన క్యాన్సర్ కారకం. దాన్ని వదిలించుకోగలిగితే దాదాపు 50-60% శాతం క్యాన్సర్లు నిలిచిపోతాయి.

గ్రాఫిక్: హరిసింగ్

గురి చూసి అస్త్రం వేస్తున్నాం...

ఒకప్పటి కంటే ఇప్పుడు మనం క్యాన్సర్ల నిర్ధారణలో ఎంతో కచ్చితత్వాన్ని సాధించాం. వాస్తవానికి మనం క్యాన్సర్లు అంటాంగానీ అవన్నీ ఒకటే కాదు. ప్రతి క్యాన్సర్లోనూ చాలా రకాలుంటాయి. తాజా పరిణామం.. మనం ఈ క్యాన్సర్లను నిర్ధారించటంలో అద్భుతమైన కచ్చితత్వాన్ని సాధించటం. ఉదాహరణకు ఒకప్పుడు మనం కేవలం ఊపిరితిత్తుల క్యాన్సర్ అనేసేవాళ్లం. కానీ ఇప్పుడు అలా కాదు.. దానిలో ఏ రకం, ఎలాంటి రకం అన్నది చాలా సూక్ష్మంగా గుర్తిస్తున్నాం. ప్రతి రకానికీ ప్రత్యేకమైన, నిర్దుష్టమైన చికిత్స అందిస్తున్నాం. కొన్ని సందర్భాల్లో క్యాన్సర్‌కు కారణమవుతున్న జన్యువేమిటో గుర్తించి.. ఆ జన్యువును 'స్విచ్ఛాఫ్' చేసేస్తున్నాం. దీన్నే ఇప్పుడు 'ప్రిసిషన్ ఆంకాలజీ' అంటున్నారు. లోపాలు తలెత్తి, క్యాన్సర్‌కు కారణమవుతున్న జన్యువును 'బ్లాక్' చెయ్యటం ఈ చికిత్స లక్ష్యం. క్యాన్సర్ చికిత్సల్లో ఈ విధానం విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. ఇలా మనం మందును కచ్చితంగా గురి చూసి వదులుతాం కాబట్టి.. అది రామబాణంలా కేవలం క్యాన్సర్‌ను మాత్రమే తుదముట్టిస్తుంది. ఇలా గురిచూసి మందు ఇవ్వటం వల్ల చికిత్సలు చాలా సులభతరంగా మారిపోయాయి. కాబట్టి ఒకప్పటిలా ఇప్పుడు క్యాన్సర్ చికిత్స అంటే భయపడి పాయిపోవాల్సిన పని లేదు. క్యాన్సర్ చికిత్స అనగానే చాలామంది- వాంతులు, జుట్టు రాలిపోవటం, రక్తకణాలు తగ్గిపోవటం, లివర్ దెబ్బ తినటం, విరేచనాలవ్వటం, నోరంతా పూచిపోవటం, తీవ్రమైన ఇన్ఫెక్షన్లు రావటం.. ఇలా రకరకాల దుష్ప్రభావాలు గుర్తుకొచ్చి కంగారుపడిపోతుంటారు. కానీ ఇప్పుడీ సమస్యలన్నీ లేకుండానే.. మనం మధుమేహానికీ, హైబీపీకీ ఎలా చికిత్స చేస్తామో క్యాన్సర్‌కూ అలా చేసే రోజులు వచ్చేశాయి. రోజూ ఒక మాత్ర వేసుకుంటే చాలు, క్యాన్సర్ వదిలిపోయే చికిత్సలు వచ్చాయి. ఇప్పుడు క్యాన్సర్ కూడా చాలా వరకూ 'మందులతో చికిత్స చేయదగ్గ దీర్ఘకాలిక సమస్య' అని చెప్పుకోవచ్చు. పదింట తొమ్మిది రకాల క్యాన్సర్లకు ఇదే రకం చికిత్స సరిపోతుంది. ఇంకా చెప్పాలంటే కొన్ని రకాల క్యాన్సర్లకు కొంతకాలం మందులు వాడి, ఆ తర్వాత ఆ మందులు కూడా మానేసే పరిస్థితి.. అంటే క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసే అవకాశం కూడా ఉంది.



డా॥ డి.రఘునాధరావు
డైరెక్టర్
హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్
అగనంపూడి, విశాఖపట్నం

ఒకప్పుడు అన్ని క్యాన్సర్లకూ కీమోథెరపీ ఇచ్చేసేవాళ్లం. అది ఒక రకంగా పోలీసు కాల్పుల్లాంటిది. తూటాలు మంచివాళ్లు, చెడ్డవాళ్లు అందరికీ తగిలేవి. కొన్నిసార్లు చెడ్డవాళ్లు తప్పించుకున్నట్టే.. క్యాన్సర్ కణాలూ తప్పించుకునేవి. కానీ ఇప్పుడు కచ్చితంగా గురి చూసి క్యాన్సర్ కణాలనే కొట్టటమనేది వచ్చేంది. దీనివల్ల దుష్ప్రభావాలు బాగా తగ్గిపోయాయి.

అలాగే నిన్నమొన్నటి వరకూ.. ఇంకేం చెయ్యలేమనుకున్న క్యాన్సర్ల విషయంలో కూడా ఇప్పుడు ఆయుర్దాయం బాగా పెరిగింది. ఉదాహరణకు ఒకప్పుడు ఆర్నెల్లు కూడా బతకరని అనుకున్న నాలుగోదశ ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులు ఇప్పుడు నాలుగున్నరేళ్లకు పైగా జీవిస్తున్నారు. ఇదీ ఆఖరి దశలో గుర్తించినా! అది గొప్ప మార్పు. చిన్నపిల్లల్లో చాలా క్యాన్సర్లను ఇప్పుడు పూర్తిగా నయం చెయ్యగలం. పెద్దవాళ్లనూ చాలా రకాలు నయం చెయ్యొచ్చు. చికిత్సలకు అయ్యే ఖర్చులు తగ్గటం కూడా మనం తప్పనిసరిగా గుర్తించాల్సిన అంశం. ఒకప్పుడు నెలకు సుమారు రూ.లక్షన్నర వరకూ అయ్యే చికిత్సలు కూడా ఇప్పుడు రూ.800-900లకు తగ్గిపోతున్న సందర్భాలుంటున్నాయి. కాబట్టి ఇప్పుడు మనమందరం కూడా.. క్యాన్సర్లను ఎంత తొలిదశలో గుర్తించగలిగితే అంత మేలు జరుగుతుందని గుర్తించాలి.

విస్మరించరాని సంకేతాలు

1. మలమూత్ర విసర్జనలో ఏ రకమైన మార్పు వచ్చినా
2. పుండు ఏదైనా మానకుండా వేధిస్తున్నా..
3. ఏ శరీర భాగం నుంచైనా అసహజంగా రక్తస్రావం వస్తున్నా..
4. ఆకలి, అకారణంగా బరువు తగ్గిపోతున్నా..
5. మింగటం కష్టంగా ఉన్నా, అజీర్ణం వీడకుండా వేధిస్తున్నా
6. పుట్టుమచ్చల్లో, పులిపిర్లలో అసహజ మార్పులు కనిపిస్తున్నా..
7. దగ్గుగానీ, గొంతు బొంగురుగానీ వీడకుండా వేధిస్తున్నా..

...ఈ లక్షణాలుంటే తప్పకుండా క్యాన్సర్‌ను అనుమానించాలి!

నివారించుకునే వీలుందని గుర్తించండి...

మనందరం గుర్తుంచుకోవాల్సిన మొట్టమొదటి విషయం- స్త్రీపురుషులిరువురిలోనూ కనబడుతున్న నూటికి 60 క్యాన్సర్లు పూర్తిగా నివారించుకోదగ్గవే! మనం దీన్ని విస్మరించి.. అది ముంచుకొచ్చిన తర్వాత నానా తంటాలూ పడుతున్నాం. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ఎలాగో చూద్దాం.

మొత్తం క్యాన్సర్లలో పొగాకు సంబంధ క్యాన్సర్లదే అధిక భాగం. చాలామంది పొగాకు వల్ల నోరు, ఊపిరితిత్తులకు సంబంధించిన క్యాన్సర్లు మాత్రమే వస్తాయని అనుకుంటారుగానీ.. ఇది పెద్ద పొరపాటు. పొగాకు అనేది తీవ్రమైన క్యాన్సర్ కారకం. దానివల్ల నోటితో మొదలై.. మెడ-గొంతు, అన్నవాహిక, జీర్ణాశయం, ఊపిరితిత్తులు, క్లోమం, కిడ్నీ, మూత్రాశయం.. ఇలా బోలెడన్ని రకాల క్యాన్సర్లు సంప్రాప్తించే అవకాశం ఉంది. అందుకే పొగాకును ప్రపంచ మానవాళికి మహాశాపంలా చెప్పుకోవచ్చు. ఇది సాధారణ కణాన్ని చాలా సులభంగా క్యాన్సర్ కణంగా మారేలా ప్రేరేపిస్తుంది. కాబట్టి ఇన్ని క్యాన్సర్లకు మూలమవుతున్న 'పొగాకు'ను మనం వదిలించుకోగలిగితే దాదాపు 50-60% శాతం క్యాన్సర్లు నిలిచిపోతాయి.



డా॥ సింహాద్రి చంద్రశేఖర్‌రావు
సర్జికల్ ఆంకాలజిస్ట్
సౌమ్య హాస్పిటల్స్
కార్ఖానా, హైదరాబాద్

రెండోది- ఇప్పుడు టీకాలతో నివారించుకునే క్యాన్సర్లు కూడా కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు యుక్తవయసు ఆడపిల్లలందరికీ 'హెచ్‌పీవీ' టీకా ఇవ్వటం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను చాలా వరకూ నిలువరించొచ్చు. అలాగే అందరికీ హెపటైటిస్-బి టీకాతో లివర్ క్యాన్సర్లనూ కొంతమేర నివారించొచ్చు. ఇలా టీకాలతో ఈ రెండు రకాల క్యాన్సర్లనూ బాగా తగ్గించేసుకోవచ్చు.

మూడోది- ఊబకాయం వల్ల పుట్టుకొస్తున్న క్యాన్సర్లూ ఎక్కువే. రొమ్ము, గర్భాశయ, అండాశయ, అన్నవాహిక క్యాన్సర్లకు కొంత వరకూ మూలాలు ఊబకాయంలో ఉన్నాయి. దీన్నీ మనం నివారించుకోవచ్చు. నెలసరి ఆగిపోయిన తర్వాత బరువు పెరగకూడదు. ఒంట్లో బరువు పెరిగితే ఈస్ట్రోజెన్ హార్మోన్ల స్థాయులు పెరుగుతాయి. దానివల్ల ఆడవారిలో రొమ్ముక్యాన్సర్, ఎండోమెట్రియల్ క్యాన్సర్ల ముప్పు పెంచుతాయి. ఇవన్నీ కూడా మనంతట మనం చేజేతులా తెచ్చిపెట్టుకుంటున్న క్యాన్సర్లు. కొన్నిరకాల క్యాన్సర్లు జన్యుపరంగానూ, ఇతరత్రా కారణాల వల్లనూ రావచ్చు, వాటిని మనమేం పెద్దగా ఆపలేం. కానీ మనం నిలువరించటానికి వీలున్న వాటిని ఆపే ప్రయత్నం చెయ్యకపోవటం స్వయంకృతాపరాధమే అవుతుంది. అందరం ఊబకాయం రాకుండా చూసుకోవటం, పొగాకు మానెయ్యటం, కొన్ని టీకాలు తీసుకోవటం.. ఇలాంటి చర్యలతో క్యాన్సర్ కేసులను గణనీయంగా తగ్గించొచ్చు. ఇక కొన్ని క్యాన్సర్లను నివారించలేకపోయినా.. తొలిదశలోనే గుర్తించటం సాధ్యమవుతుంది. ఎందుకంటే ఈ రకం క్యాన్సర్లు చాలా నిదానంగా పెరుగుతుంటాయి. ఉదాహరణకు నోటి క్యాన్సర్. ఇది చాలా నిదానంగా పెరుగుతుంది, మనం కేవలం నోటిని పరీక్షించుకోవటం ద్వారానే దీన్ని తొలిదశలో గుర్తించొచ్చు, వెంటనే పూర్తిగా నయం చేసుకోవచ్చు కూడా. అలాగే ఏటా పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవటం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను కూడా చాలా చాలా ముందే పట్టుకోవచ్చు. రొమ్ముక్యాన్సర్‌ను కూడా ఒక వయసు వచ్చిన దగ్గర నుంచీ క్రమం తప్పకుండా మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవటం ద్వారా ఆదిలోనే పట్టుకోవచ్చు. ఇలా తొలిదశలో కనుక్కోవటం వల్ల కీమోథెరపీ, రొమ్ములు పూర్తిగా తీసెయ్యటం, ఖర్చు ఎక్కువకావటం వంటి సమస్యలన్నీ ఉండవు. పెద్దపేగు క్యాన్సర్లను కూడా మలంలో సూక్ష్మస్థాయుల్లో రక్తం పడుతోందేమో (మోషన్ ఫర్ అకల్ట్ బ్లడ్) పరీక్ష చేయించుకోవటం ద్వారా చాలా ముందు పట్టుకోవచ్చు. ఇంట్లో ఈ క్యాన్సర్ చరిత్ర ఉన్నవాళ్లు ఈ పరీక్షల విషయంలో మరింత శ్రద్ధగా ఉండాలి. చాలామంది క్యాన్సర్ రోగులు ఇప్పటికీ మన దేశంలో బాగా ముదిరిన తర్వాత గానీ వైద్యుల వద్దకు రావటం లేదు. దగ్గులాంటి బాధలు వీడకుండా వేధిస్తున్నా కూడా అదేదోలే అనుకుని చిట్కా వైద్యాలు చేయించుకుంటూ కాలం వృథా చేస్తున్నారు, ఈ లోపు వ్యాధి ముదిరిపోతోంది. కాబట్టి క్యాన్సర్ ముందస్తు సంకేతాలను ఎట్టిపరిస్థితుల్లోనూ విస్మరించకూడదు.

ఇవి ఎక్కువ

పురుషుల్లో	స్త్రీలలో
పెదవులు, నోరు, ఊపిరితిత్తులు, జీర్ణాశయం, పెద్దపేగు, మలద్వారం, గొంతు	రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, పెద్దపేగు, మలద్వారం, అండాశయాలు, నోరు

ఈనాడు సినిమా



అప్పుడు సిగ్గు... ఇప్పుడు ఎదిగా!

తెలుగమ్మాయినే అని చెప్పుకొనే ఉత్తరాది భామల్లో రాశీ ఖన్నా ఒకరు. 'ఊహలు గుసగుసలాడే'తో పరిచయమైన ఆమె అప్పట్నుంచి తెలుగు సినిమాతో మమేకమైంది. అంతకుముందు బాలీవుడ్‌లో సినిమా చేసినా... తెలుగుతోనే నా ప్రయాణం అంటూ ఇక్కడే అవకాశాలు అందుకొంటూ కెరీర్‌ని నిర్మించుకొంది. 'బెంగాల్ టైగర్', 'సుప్రీమ్', 'జై లవకుశ' చిత్రాలతో విజయాల్ని అందుకొని రవి తేజతో కలిసి 'టచ్ చేసి చూడు'తో సందడి చేయబోతోంది. ఆ చిత్రం ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది రాశి. ఆ విషయాలివీ...

■ "స్వతహాగా నాకు కామెడీ అంటే చాలా ఇష్టం. అయితే కథా నాయికలకి కామెడీ చేసే అవకాశం చాలా తక్కువ. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు కూడా అరుదుగా దొరుకుతుంటాయి. రవితేజ సినిమాల్లో అయితే కథానాయిక అందం గురించే ఎక్కువగా మాట్లాడుకొంటుంటారు. కానీ ఈ సినిమాలో మాత్రం అందుకు భిన్నమైన పాత్ర లభించింది నాకు. ఆద్యంతం నవ్వించే పాత్ర నాది. రవి తేజ, నేను కలిసి కనిపించే సన్నివేశాలన్నీ వినోదాత్మకంగా సాగుతాయి. 'సుప్రీమ్' తర్వాత మరోసారి నవ్వించే పాత్ర చేయడాన్ని ఎంతగానో ఆస్వాదించా. అయితే బెల్లం శ్రీదేవి పాత్రతో పోలిస్తే ఇది పూర్తి భిన్నం. ఇందులో నా పాత్ర పేరు పుష్ప. నృత్య శిక్షకురాలిగా కనిపిస్తా. పాత్ర రీత్యా ఓ సన్నివేశంలో నృత్యం చేస్తూ కనిపించాలి. అందుకోసం వెస్ట్రన్ స్టైల్ నృత్యం కూడా నేర్చుకొన్నా. ఐదు రోజులపాటు ప్రత్యేకంగా తర్ఫీదు పొందా. అది ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నా".

■ "రవితేజతో కలిసి పనిచేయడమంటే ఎప్పుడూ హుషారుగా ఉంటుంది. ఆయన సెట్‌లో ఎల్లప్పుడూ ఉత్సాహంగా నవ్వుతూ, నవ్విస్తూ గడుపుతుంటారు. రవితేజతో కలిసి 'బెంగాల్ టైగర్' చేసినప్పుడు నాలో సిగ్గు ఎక్కువగా ఉండేది. 'సుప్రీమ్' తర్వాతే పూర్తిస్థాయి నటినయ్యా అనే భావన కలిగింది. 'టచ్ చేసి చూడు'తో నటిగా ఎదిగానన్న తృప్తి లభించింది. కామెడీ చేయడం అంత సులభం కాదు. చిన్న చిన్న హావభావాలపై కూడా ప్రత్యేకంగా దృష్టిపెడుతూ టైమింగ్‌ని ప్రదర్శించాలి. రవితేజ కామెడీ చేయడంలో సిద్ధహస్తులు. ఆయనతో కలిసి పనిచేస్తూ చాలా మెలకువలు నేర్చుకొన్నా. అలాగే దర్శకుడు విక్రమ్‌కి కూడా కామెడీపై మంచి పట్టుంది. ఇందులో డబ్బింగ్ చెప్పుకొందామనుకున్నా. కానీ సమయం లేకపోవడం వల్ల కుదరలేదు".

■ "వాణిజ్య చిత్రాలకే పరిమితం కావడం నాకు ఇష్టం ఉండదు. నటనపై కూడా దృష్టిపెట్టా. గతేడాది 'జై లవకుశ'తో పాటు మలయాళంలో 'విలన్' చేశా. అది చాలా సీరియస్‌గా సాగే పాత్ర. నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అలా వాణిజ్య ప్రధానమైన చిత్రాలు చేస్తూనే, నటిగా నిరూపించుకొనే చిత్రాలు కూడా చేస్తూ సమతూకం పాటించాలని ఉంది. నా అదృష్టం కొద్దీ అలాంటి కథలే లభిస్తున్నాయి. తెలుగు, తమిళం, మలయాళం... మూడు భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా గడుపుతున్నా".

■ "నాజూగ్గా మారడానికి సినిమాలే కారణం కాదు. నా ఆరోగ్యం కోసం కూడా. ఫిట్‌నెస్ కోసం ఇలాగే ఉండాలని నిర్ణయించుకొన్నా. అయితే బరువు తగ్గడం పాత్రలకి కూడా పనికొస్తుంది. 'తొలి ప్రేమ'లో నేను మూడు కోణాల్లో సాగే పాత్రలో కనిపిస్తా. అలాంటప్పుడు నాజూగ్గా కనిపించడం అవసరం. బొద్దుగా ఉంటే అలా కనిపిస్తావని, నాజూగ్గా ఉంటే ఇలా ఉంటావని చెబుతుంటారు. నాకు మాత్రం ఇలా ఉండటమే ఇష్టం. ప్రస్తుతం నా దృష్టంతా దక్షిణాది చిత్రాలపైనే. హిందీలో నటించడం గురించి ఆసక్తి లేదు. ఒకవేళ మంచి కథ ఏదైనా వస్తే అప్పుడు ఆలోచిస్తా".



రామ్ చరణ్

లుక్‌తో షాక్ ఇస్తాడు!

రామ్ చరణ్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. కైరా అడ్వాని కథానాయిక. డి.వి.వి.దానయ్య నిర్మాత. ఇటీవలే హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభమైంది. పది రోజుల పాటు తొలి షెడ్యూల్ నడిచింది. స్నేహా తదితరులపై కుటుంబ నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కించారు. వచ్చే నెలలో ప్రారంభమయ్యే రెండో షెడ్యూల్ నుంచి రామ్ చరణ్ ఎంట్రీ ఇస్తారు. కథానాయకుడ్ని ధీరోదాత్తంగా చూపించడం బోయపాటి శైలి. దానికి తగ్గట్టుగా కుటుంబ బంధాల్ని, భావోద్వేగాల్నీ సమపాళ్లలో ఆవిష్కరిస్తారు. ఇవన్నీ మేళవించిన కథ ఇదని చిత్రబృందం తెలిపింది. 'రంగస్థలం'లో చరణ్‌ని కొత్తగా చూస్తున్నారు. పల్లెటూరి కుర్రాడు చిట్టిబాబుగా కనిపించబోతున్నారు. బోయపాటి శ్రీను సినిమా కోసం దానికి పూర్తి విభిన్నమైన గెటప్‌లోకి మారబోతున్నారు. చరణ్ మేకోవర్ అభిమానులకు నచ్చే విధంగా ఉంటుందని నిర్మాత తెలిపారు. ప్రశాంత్, వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.



నజియా, శ్రీకాంత్

దెయ్యం రమ్మంటోంది

శ్రీకాంత్, నజియా సీతా నారాయణ ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం 'రా..రా'. విజి చరీష్ దర్శకత్వం వహించారు. ఎం. విజయ్ నిర్మాత. శ్రీమిత్ర చౌదరి సమర్పకులుగా వ్యవహరించారు. ఫిబ్రవరి 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. శ్రీకాంత్ మాట్లాడుతూ "ఇప్పుడొస్తోన్న హారర్ కామెడీ చిత్రాల తరహాలోనే కొత్తకోణంలో సాగుతుంది. నా కెరీర్‌లో చేసిన తొలి హారర్ కామెడీ చిత్రం. ఇందులో ఓ దర్శకుడిగా కనిపిస్తా. ఓ మంచి సినిమా తీసి విజయాన్ని పొందాలనుకునే తపన ఉన్న కుర్రాడి కథ" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ " ఊరవతల బంగ్లాలో ఉండే దెయ్యాల నేపథ్యంలో నడిచే కథ. మనుషుల్ని చూసి భూతాలు భయపడటం అనేది కొత్త అంశం. మూడు పాటలున్నాయి. దెయ్యాలు పాడుకుంటూ డ్యాన్సులు చేసే పాట ఒకటుంద"న్నారు. "హారర్‌తో పాటుగా వినోదం బోనస్‌గా ఇస్తున్నామ"ని శ్రీమిత్ర చౌదరి తెలిపారు. అలీ, రఘుబాబు, జీవా, పృథ్వీ, షకలక శంకర్, పోసాని, హేమ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: పూర్ణ, సంగీతం: రాప్‌రాక్ షకీల్

ఎక్కడుందో నా ప్రేమ



మనోజ్ నందం, సౌందర్య

మనోజ్ నందం, సౌందర్య జంటగా నటించిన చిత్రం 'ఎక్కడ నా ప్రేమ'. ఎం.డి. హుస్సేన్ దర్శకుడు. ఎస్. రామ కృష్ణ, వడ్డే గోపాల్ నిర్మాతలు. ఘన శ్యామ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని గీతాలు సోమవారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "ప్రేమపై రెండు తరాల భిన్న అభిప్రాయాల్ని నేపథ్యంగా తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. తల్లిదండ్రుల ఆంక్షలు భరించలేక ఇంటి నుంచి బయటకు వచ్చేసిన ఓ అమ్మాయిని ఓ అబ్బాయి ఎలా ఆదుకున్నాడో చూపించాం. వచ్చే నెల 22న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు.

అలా పుట్టిందే... 'ఛలో' !



"కొత్తగా మెగాఫోన్ పట్టే ప్రతి దర్శకుడిపైనా, రచన పరంగా త్రివిక్రమ్ ప్రభావం ఉంటుంది. నామీద కూడా ఉంది కానీ... ఆయన్ని అనుకరించే ప్రయత్నం మాత్రం చేయలేదు" అన్నారు దర్శకుడు వెంకీ కుడుముల. త్రివిక్రమ్ దగ్గర 'అఆ' సినిమాకి సహాయ దర్శకుడిగా పనిచేసిన ఆయన నాగశౌర్య కథానాయకుడిగా 'ఛలో' చిత్రాన్ని తెరకెక్కించారు. ఆ చిత్రం ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈసందర్భంగా వెంకీ కుడుముల సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

● "నాగశౌర్యతో 'జాదూగాడు' నుంచి స్నేహం ఉంది. దర్శకుడిగా నా తొలి సినిమాని నాగశౌర్యతోనే చేయాలనుకొనేవాణ్ని. అయితే నేనెప్పుడూ ఆయన్ని సినిమా అడగలేదు. 'అఆ' పూర్తయిన వెంటనే ఒక రోజు నాగశౌర్యనే ఫోన్ చేసి 'కథ సిద్ధం చేయ్, మనం సినిమా చేద్దాం' అన్నారు. దాంతో వెంటనే ఓ క్రైమ్ కామెడీ కథని చెప్పా. ఇలాంటిది వద్దు, ఇంకేదైనా చేద్దామన్నప్పుడు స్వతహాగా నాగశౌర్యలోని ఉత్సాహాన్ని తెరపై చూపించేలా ఓ కథ సిద్ధం చేయాలనుకొన్నా. అలాంటి పాత్రతో రూపుదిద్దుకొన్న చిత్రమే 'ఛలో'. మాది అశ్వారావు పేట. ఇదివరకు ఖమ్మం జిల్లాలో ఉండేది. రాష్ట్రం విడిపోయాక భద్రాచలం జిల్లాలో భాగమైంది. మా ఇంటి నుంచి రెండు కిలోమీటర్లు వెళితే ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వస్తుంది. ఆ ఆలోచనల దగ్గర పుట్టిన కథే ఇది. అయితే చిత్రం మాత్రం తమిళనాడు, ఆంధ్ర సరిహద్దుల్లోని ఓ గ్రామం నేపథ్యంలో నడుస్తుంది".

● "ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రం 'ఛలో'. నాగశౌర్య నటనలో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది. రష్మిక ఆకట్టుకుంటుంది. నాగశౌర్యకి నాపై నమ్మకమెక్కువ. ఈ కథ వినగానే సొంత సంస్థలో నిర్మించాలని నిర్ణయించారు. ఉషా మూల్పూరి, శంకర్ ప్రసాద్ మూల్పూరి ఏ విషయంలోనూ రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించారు".

● "చిన్నప్పట్నుంచి సినిమాలంటే పిచ్చి. అందుకే హైదరాబాద్‌కి వచ్చి కమర్షియల్ అగ్రికల్చర్ బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుతూ సినిమా అవకాశాల కోసం ప్రయత్నించా. రచయిత్రి బలభద్రపాత్రుని రమణి పరిచయం అయ్యాక, ఆవిడ ద్వారా తేజ దగ్గర సహాయ దర్శకుడిగా చేరా. ఆ తర్వాత యోగి దగ్గర 'జాదూగాడు', 'తుఫాన్' చిత్రాలకి పనిచేశా. త్రివిక్రమ్ దగ్గర 'అఆ'కి పని చేశా. ముగ్గురు దర్శకుల దగ్గర ఒకొక్క సినిమాకే పనిచేశాను కాబట్టి వాళ్ల శైలి ప్రభావం నామీద తక్కువే. చిరంజీవి అభిమానిని నేను. ఆయన మా సినిమా వేడుకకి రావడం గొప్ప అనుభూతినిచ్చింది".



ఆరోహి

ఆత్మలు చెప్పే కథ

ఆరోహి, సుప్రియ, కల్యాణ్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'దెయ్యం చెప్పిన కథ'. ప్రదీప్ దర్శకుడు. పెనాక దయాకర్ రెడ్డి నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "దెయ్యం కథలు ఇప్పటి వరకూ చాలా వచ్చాయి. వాటన్నింటికీ భిన్నంగా ఉండే కథ ఇది. భారీ సెట్టింగులు, ఇతర హంగులూ ఏమీ ఉండవు. కథే ఈ చిత్రానికి బలం. 29 మంది నటీనటుల్ని ఈచిత్రం ద్వారా పరిచయం చేస్తున్నాం. మార్చిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం. ఇదే సంస్థలో 'దెయ్యంతో ఓ రాత్రి' అనే చిత్రాన్ని వచ్చే నెలలో సెట్స్‌పైకి తీసుకెళ్తున్నా" అన్నారు.

'సూయి ధాగా'లో సూదీ దారం పట్టి..!



అనుష్క శర్మ

'సూయిధాగా'.. దేశంలో ఖాదీ పరిశ్రమల నేపథ్యంగా సాగే చిత్రం. 'మేడ్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో వరుణ్‌ధావన్, అనుష్కశర్మ కీలక పాత్రధారులు. కొన్ని రోజుల క్రితం వరుణ్ ధావన్ తను టైలరింగ్ చేస్తున్నట్టు ఉన్న ఫొటోను పంచుకున్నాడు. మరి అనుష్కశర్మ పాత్ర ఎలా ఉండబోతుందోనని ఆత్రుతగా ఎదురుచూశారు అభిమానులు. తాజాగా ఆమె ట్విట్టర్‌లో పంచుకొన్న ఫొటో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందో చెబుతోంది. సూది దారం పట్టుకొని ఎంబ్రాయిడరీ చేస్తున్నట్టు ఉన్న ఫొటోను ట్వీట్ చేసింది అనుష్క. "స్వావలంబనకు సంబంధించిన కథ ఇది. ప్రతి భారతీయుడి మదిని తాకుతుంది"అంటోంది అనుష్క.

ఇంట్లోనూ ఎంబ్రాయిడరీ సాధన: పాత్రల కోసం ఎంతటి కష్టానికైనా సిద్ధంగా ఉంటుంది అనుష్కశర్మ. ఎవరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి పొందుతూ ఎంబ్రాయిడరీ చేసే ఓ మహిళ పాత్రను 'సూయి ధాగా'లో పోషిస్తోంది అనుష్క. దీని కోసం చిత్రబృందం ఏర్పాటు చేసిన పలు వర్క్‌షాపులకు హాజరైంది. అక్కడితో ఆగకుండా ఇంటి వద్ద ఎంబ్రాయిడరీ సాధన చేస్తోంది. నిర్మాత మనీష్ శర్మ మాట్లాడుతూ "ఈ చిత్రంలో మేం అనుకున్న పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసే నటి కోసం వెతికాం. నిశబ్దంలోనూ భావాలు పలికించేలా ఉండాలనుకున్నాం. మేం అనుకున్నట్టే అనుష్క పాత్రకు బాగా కుదిరింది. ఎంత స్టార్ అయినా కథలోని పాత్రలోకి ఎంత వరకు మారుతున్నారనేది ప్రేక్షకులు గమనిస్తున్నారు"అని చెప్పారు. "అనుష్క ఇంత త్వరగా ఎంబ్రాయిడరీ నేర్చుకొంటుందనుకోలేదు. ఎవరో బాగా నేర్పిస్తున్నారు అనుకున్నాను. కానీ తర్వాత తెలిసింది ఏంటంటే ఆమె వర్క్‌షాప్స్‌లో నేర్చుకోవడంతో ఆగిపోలేదు. మెటీరియల్‌ను ఇంటి వద్దకు తీసుకెళ్లి ప్రాక్టీస్ చేసేది. నటులు పాత్ర కోసం పరిధులు దాటి కష్టపడటం చాలా సంతోషంగా అనిపించింది" అంటున్నారు దర్శకుడు శరత్ కటారియా. వచ్చే నెల్లో ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లబోతున్నారు.

చిక్కుల్లో చెన్నై చిన్నోడు



జి.వి.ప్రకాష్‌కుమార్, రక్షిత

జి.వి.ప్రకాష్‌కుమార్, నిక్కీ గల్రానీ, రక్షిత నాయకానాయికలుగా నటించిన ఓ తమిళ చిత్రం 'చెన్నై చిన్నోడు' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తోంది. వీడి లవ్‌లో అన్నీ చిక్కులే... అనేది ఉపశీర్షిక. ఎం.రాజేష్ దర్శకుడు. వి.జయంత్ కుమార్ నిర్మాత. హైదరాబాద్‌లో నిర్మాత కె.వి.సత్యనారాయణ ఫస్ట్ లుక్‌ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "తమిళంలో విజయవంతమైన చిత్రమిది. మంచి పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నార"న్నారు. చిత్ర నిర్మాత మాట్లాడుతూ "ఆద్యంతం నవ్వించే చిత్రమిది. జి.వి.ప్రకాష్ నటన, ప్రకాష్‌రాజ్ పోషించిన పోలీసు పాత్ర చిత్రానికి ప్రధానబలం. పాటల్లో వినోదం పండటం ఈ సినిమా ప్రత్యేకత" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.కృష్ణ, సి.హెచ్.పూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

'గాయత్రి' ఆ కోరిక తీర్చింది



శ్రియ

"మోహన్‌బాబు నటించిన 'గాయత్రి'లో ఓ కీలక పాత్రను పోషించడం ఆనందంగా ఉంద"ంటోంది నటి శ్రియ. మదన్ దర్శకత్వం వహించిన చిత్రం 'గాయత్రి'. ఫిబ్రవరి 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం శ్రియ విలేకర్లతో మాట్లాడింది. "రజనీకాంత్, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున వంటి పలువురు అగ్ర కథానాయకుల చిత్రాల్లో నటించా. మోహన్‌బాబు నటించిన 'గేమ్' సినిమాలో అతిథి పాత్రలో కనిపించాను. అయినా.. మోహన్‌బాబు చిత్రంలో మంచి పాత్ర చేయాలనే కోరిక అలానే ఉండిపోయింది. దానిని ఈ 'గాయత్రి' తీర్చింది. సినిమా చూశాకే నా పాత్రకి ఎంత ప్రాధాన్యతుందనేది తెలుస్తుంది. నా కెరీర్‌లో చాలా రకాలైన పాత్రలు చేశా. మంచి పాత్రలు నన్ను వెదుక్కుంటూ రావడం నా అదృష్టం. అందువల్లే పదిహేనేళ్లు దాటినా నా కెరీర్ నడుస్తూనే ఉంది. ఇలా ఎన్నేళ్లు? అని నన్నంతా అడుగుతున్నారు. ప్రముఖ హాలీవుడ్ నటి మెరిల్ అరవై ఏళ్లు పైబడినా ఇంకా నటిస్తూనే ఉంది. ఆమెలా నేనెందుకు కొనసాగకూడదు? ప్రస్తుతం తమిళంలో కార్తిక్ నరేన్ దర్శకత్వంలో 'నరకాసురన్' చిత్రం చేస్తున్నా. 'నరకాసురుడు'గా తెలుగులో అనువాదమవుతుంది. మరో ద్విభాషా చిత్రం చేస్తున్నాను. తెలుగు చిత్రం 'వీరభోగ వసంతరాయలు'లో పోలీస్ పాత్రలో కనిపిస్తా. హిందీలో 'తడ్కా' చేస్తున్నా" అంది. తన ఇష్టాల గురించి చెబుతూ "స్వతహాగా కథక్ డ్యాన్సర్‌ని. ప్రపంచ వ్యాప్తంగా భరతనాట్యం, కూచిపూడి నృత్యాలకి అనన్యమైన ఖ్యాతి ఉంది. సినిమాల్లో బిజీ అవ్వడం వల్ల పదేళ్ల కిందటే అభ్యాసన ఆపేశా. మళ్లీ ఇప్పుడు నృత్యాలలో తర్ఫీదు పొందుతున్నాను. నృత్యం ధ్యానం లాంటిది. కాబట్టి ఈ తరం వాళ్లంతా సంప్రదాయ నృత్యాలపై దృష్టి పెట్టాల"న్నారు.

గోరువెచ్చనినీళ్లు తాగి చూడండి

నీళ్లు ఎంత ఎక్కువగా తాగితే ఆరోగ్యానికి అంత మంచిదని మనకు తెలుసు. కానీ గోరువెచ్చని నీటిని ఎక్కువగా తాగడం వల్ల కలిగే లాభాలు అంతకన్నా ఎక్కువేనట. ఇంతకీ ఆ అవేంటంటే...



- ఉదయం లేవగానే గోరువెచ్చని నీళ్లు తాగడం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుంది. అలాగే కొవ్వును కరిగించడంలోనూ దీని పాత్ర ముఖ్యమైందే. బరువు తగ్గాలనుకునే వారు ఈ నీటిని తాగడం మంచిది.
- కడుపు నొప్పి, తలనొప్పులతో బాధపడుతున్నప్పుడు గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగడం వల్ల వెంటనే ఉపశమనం కలుగుతుంది.
- జలుబూ, గొంతునొప్పి ఉన్నప్పుడు మాట్లాడటానికి ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లు శ్వాస తీసుకోవడమూ కష్టమే. అలాంటప్పుడు గోరువెచ్చని నీరు తాగి చూడండి. ఫలితం కనిపిస్తుంది.
- మాడుకు రక్తప్రసరణ బాగా జరిగి జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే గోరువెచ్చని నీరు తాగడమే సరైన పరిష్కారం.
- ఈ గోరువెచ్చటి నీటికి కాస్త నిమ్మరసాన్ని కలిపి తాగితే రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.
- నెలసరి సమయంలో పొత్తి కడుపులో వచ్చే నొప్పిని నివారించడంలోనూ గోరువెచ్చని నీళ్లు బాగా పనిచేస్తాయి.
- కాస్త వేడిగా ఉన్న నీళ్లు తాగడం వల్ల ఒంట్లో ఉష్ణోగ్రత పెరిగి చెమట ఎక్కువగా వస్తుంది. దీని ద్వారా ఎక్కువ క్రిములు బయటికి పోయే అవకాశం ఉంటుంది.
- క్రమం తప్పకుండా గోరువెచ్చని నీళ్లే తాగడం వల్ల చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. అలా వృద్ధాప్యఛాయలూ త్వరగా మొదలుకావు.

సరదాగా సన్నబడదాం!



బరువు తగ్గడానికి కసరత్తులు చేస్తుంటాం కానీ అప్పుడప్పుడూ బోర్‌కొట్టి మానేస్తుంటాం. కానీ కొన్ని పనులతో ఆ కొద్దిపాటి సమయాన్ని కూడా ఉల్లాసంగా, ఆసక్తిగా మార్చుకోవచ్చు. అదెలాగంటే..

- ఒంటరిగా వెళ్లి జిమ్‌లో చేరడం కన్నా ఏదైనా బృందంతోనో, మిత్రులతోనో కలిసి వెళ్లండి. క్రమం తప్పకుండా వెళ్లగలుగుతారు.
- జిమ్‌కు వెళ్లి కసరత్తులు చేయడంతో పాటూ కాస్త ఆటలు ఆడేందుకూ ప్రయత్నించాలి. ఆనందంతో పాటూ కెలోరీలూ తగ్గుతాయి.
- అరగంట వ్యాయామం చేయగానే చిరాగ్గా అనిపిస్తే అక్కడితో ఆపేయండి. దానివల్ల ఇష్టం ఉన్నంత సేపే చేస్తారు. వీలైతే రెండు మూడు విడతల్లో వ్యాయామానికి సమయం కేటాయించాలి.
- ఎప్పటికప్పుడు చేసే కసరత్తుల్లో మార్పు చేసుకోవాలి. కొత్తవి ప్రయత్నించాలి. అప్పుడే చేయాలనే కుతూహలం పెరుగుతుంది.
- ఏదైనా పుస్తకం చదవాలనుకుంటే వాటి ఆడియో బుక్‌లు డౌన్‌లోడ్ చేసుకోండి. కసరత్తులు చేస్తున్నప్పుడు ఇయర్ ఫోన్స్ పెట్టుకుంటే వ్యాయామం, పుస్తకం చదవడం ఒకేసారి పూర్తయిపోతాయి.
- మీకు డ్యాన్స్ చేయడం ఇష్టమైతే అలాంటి తరహా వాటినే ఎంచుకోండి. జిమ్‌లో కాకపోతే ఇంట్లో కూడా ప్రయత్నించొచ్చు.

ఆ రంగాల్లో ఈ మహిళలు నిష్ణాతులే కాదు... తొలి అడుగు కూడా వాళ్లదే కావడం విశేషం. అంతేనా... సవాళ్లను ఎదుర్కొన్నారు. సమస్యల్నీ అధిగమించారు. అలా తొలి మహిళలుగా తమను తాము నిరూపించుకోవడమే కాదు.. ఇటీవల రాష్ట్రపతి చేతులమీదుగా పురస్కారాలూ అందుకున్నారు. అలాంటివారిలో అరుదైన రంగాల్లో తమదైన ముద్రవేసిన వారి గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

అడుగుపెట్టారు... ఔరా అనిపించారు!

ఇందుశ్రీ రవీంద్ర

మొదటి మహిళా వెంట్రిలాక్విస్ట్



బెంగళూరుకు చెందిన ఇందుశ్రీ రవీంద్ర ప్రముఖ వెంట్రిలాక్విస్ట్. పెదాలు కదపకుండా చేతిలో ఉన్న బొమ్మతో మాట్లాడించేలా భ్రమింపచేసే కళలో నిష్ణాతురాలు. భారతదేశంలోనే మొదటి మహిళా వెంట్రిలాక్విస్ట్‌గా గుర్తింపు తెచ్చుకుందామె. ఆమె తన మాటలూ, బొమ్మ చేత హావభావాలు పలికించి, ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. అయిదుసార్లు లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. పలు టీవీ షోల ద్వారా అందరికీ సుపరిచితురాలే. ఈమె ప్రదర్శనలు ప్రపంచంలోని గొప్ప గొప్ప వెంట్రిలాక్విస్ట్‌ల అభిమానాన్ని చూరగొన్నాయి. తన ప్రదర్శనలతో ద్వారా ఎయిడ్స్ లాంటి ప్రాణాంతక వ్యాధుల గురించి అవగాహన కల్పించడంతోపాటు ఇతర ప్రముఖ కార్యక్రమాల్లో కూడా పాలు పంచుకుంటోంది. ఇందుశ్రీకి చిన్నతనం నుంచీ అద్దం ముందు నిల్చుని సాధన చేసేది. ఆమె తండ్రి బొమ్మల్ని తయారుచేస్తారు. ఆ వాతావరణం నుంచి రావడం వల్లే చాలా కష్టమైనా సరే... పట్టుబట్టి మరీ ఎంతో సాధన చేసి ఈ కళను నేర్చుకుంది. అదే ఆమెకు అరుదైన గుర్తింపును తెచ్చిపెట్టింది.

ధన్యా మీనన్

మొదటి మహిళా సైబంక్రైమ్ ఇన్విస్టిగేటర్



నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. సైబర్ నేరాల సంగతి చెప్పక్కర్లేదు. సాంకేతికతను ఉపయోగించి అమాయకులను ఎలా మోసం చేస్తున్నారో మనం రోజు చూస్తూనే ఉన్నాం. సైబర్ నేరాలు అంతకంతకు పెరుగుతున్న సమయంలో దాన్ని తగ్గించేందుకు సిద్ధమయ్యారు ధన్యామీనన్. సైబర్ క్రైమ్ సవాళ్లనే తన కెరీర్‌గా ఎంచుకున్నారు. భారతదేశంలోని మొదటి సైబర్ క్రైమ్ ఇన్విస్టిగేటర్ గా గుర్తింపు పొందారు. ఆమె లక్ష్యం సైబర్ నేరగాళ్ల నుంచి సాధారణ ప్రజల్ని కాపాడటమే. ఇంకా చెప్పాలంటే ఫోన్‌లూ, ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాలు వాడుతున్న యువతా, మిగతావారికి వాటిపట్ల పూర్తి అవగాహన కల్పించాలన్నదే ఆమె ఆశయం. కార్పొరేట్ సంస్థలూ, పోలీసులూ, ఇతర ప్రభుత్వ సంస్థలు సైబర్ నేరాలకు బలవకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతూ శిక్షణా తరగతులు తీసుకునేవారు. దాంతోపాటూ కేసులను పరిశోధించేవారు. ప్రస్తుతం దేశంలోని సైబర్ నేరాలను తగ్గించడానికి కృషి చేస్తున్నారు. అందులోభాగంగా 400 పాఠశాలలతో కలిసి పనిచేస్తున్నారు. ధన్యా మీనన్ సైబర్ క్రైమ్ ఇన్విస్టిగేటర్ మాత్రమే కాదండోయ్ మంచి నృత్యకారిణి కూడా. ఆమెకు కూచిపూడీ, మోహినీఆట్టంలో ప్రావీణ్యం ఉంది.

చంద్రాణీ ప్రసాద్

మొదటి మైనింగ్ ఇంజినీర్



ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ 2016 మేలో అమ్మాయిలు మైనింగ్ ఇంజినీరింగ్ చెయ్యడానికి అనుమతులిచ్చింది. కానీ మహారాష్ట్రకు చెందిన చంద్రాణీ ప్రసాద్ మాత్రం 1999 సంవత్సరంలోనే మైనింగ్ ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్న మొట్టమొదటి మహిళగా తనదైన ముద్ర వేసింది. చంద్రాణి తండ్రి కూడా మైనింగ్‌లోనే పనిచేసేవారు. దాంతో చిన్నప్పటి నుంచే ఆయన చెప్పే విశేషాలన్నీ విని తను కూడా అదే విభాగంలో ఉద్యోగం చేయాలనుకుంది. అనుకున్నట్లుగానే పదో తరగతి పూర్తయ్యాక మైనింగ్‌లోనే డిప్లొమా చేసింది. ఆ తరువాత కూడా దానికి సంబంధించిన శిక్షణే తీసుకుంది. కానీ అదంతా అంత సులభంగా అయిపోలేదు. డిగ్రీలో మైనింగ్ విభాగంలో ఎవరూ చేర్చుకోలేదు. దానికి కారణం అప్పట్లో అమ్మాయిలకు ఆ చదువు చదివే అనుమతి లేకపోవడమే. కానీ వెనకడుగు వేయకుండా కోర్టులో పిటిషన్ వేసిందామె. ఎంత కాలమైనా పోరాడటానికి సిద్ధపడింది. ఒక సంవత్సరం పాటు వేచిచూసింది. ఆ తరువాత ప్రత్యేక విభాగం కింద కోర్టు నుంచి అనుమతి వచ్చింది. అంతే ఉత్సాహంగా తను అనుకున్న విభాగంలో డిగ్రీ పూర్తి చేసింది. డిగ్రీలో కళాశాల టాపర్‌గా నిలిచింది. కానీ ఏ ఒక్క సంస్థ ఆమెకు ఉద్యోగం ఇవ్వడానికి ముందుకు రాలేదు. దానికి కారణం చంద్రాణి అమ్మాయి కావడమే. దాంతో అదే కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ పీహెచ్‌డీ కూడా పూర్తిచేసింది. ఆ తరువాత సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రీసెర్చిలో ఉద్యోగం కోసం వెళ్లింది. అక్కడ కూడా కాస్త వ్యతిరేకత ఎదుర్కొంది. కానీ ఆమెలో ఉన్న పట్టుదల గుర్తించిన డా. ఘోష్ చంద్రాణికి ఉద్యోగం ఇచ్చారు. 'డా. ఘోష్ వల్లే నేనీరోజు సి.ఎస్.ఐ.ఆర్‌లో పనిచేస్తున్నాను. నేను ఎదుర్కొన్న సమస్యలను అధిగమించడంలో ఆయన నాకిచ్చిన చేయూత మరవలేనిది. ఇంకా ముమ్ముందు ఏ సమస్యలొచ్చినా ఎదుర్కోడానికి నేను సిద్ధం' అంటుంది డా. చంద్రాణి.

డా.భారతి లావేకర్

శానిటరీ ప్యాడ్‌బ్యాంక్ ఆద్యురాలు



ఈ మధ్య మనకు శానిటరీ వెండింగ్ మెషిన్ అన్న పదం ఎక్కువగా వినబడుతోంది. అయితే దానికి ఆద్యురాలు మాత్రం మహారాష్ట్రకు చెందిన ఎమ్మెల్యే డా.భారతి లావేకర్. తను ప్రారంభించిన టీ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా 2017 మే 28న మొట్టమొదటి డిజిటల్ శానిటరీ ప్యాడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఇప్పటివరకు తను ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలో అయిదు పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్‌వెండింగ్ మెషిన్లను ఏర్పాటు చేశారు. దాంతో పాటే వ్యక్తిగత శుభ్రతకు అవసరమయ్యే మరికొన్ని వస్తువులూ దీంట్లో ఉంచుతున్నారు. 'రాత్రి పూట ఒకమ్మాయికి శానిటరీ న్యాప్‌కిన్ అవసరం వస్తే పబ్లిక్ టాయిలెట్లో కూడా అవి అందుబాటులో ఉండాలి. అలాంటి ఏర్పాటు చేయడమే నా లక్ష్యం' అంటారు భారతి లావేకర్. ఈ శానిటరీ న్యాప్‌కిన్లు పేద పిల్లలకు ఇవ్వడానికి ఎవరైనా ముందుకు వచ్చి డబ్బు ఇస్తే దానికి సరిపడా న్యాప్‌కిన్లు తయారుచేసి ఈ బ్యాంక్ ద్వారా అందిస్తారామె. అలా ఇప్పటివరకూ రెండు లక్షల శానిటరీ న్యాప్‌కిన్లను అందించారు. ఇక, 2011 గణాంకాల్లో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఉన్న శిరూర్ కసర్ తాలూకాలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్నట్లు తేలింది. 1000 మంది అబ్బాయిలకు అమ్మాయిలు 669 మాత్రమే ఉన్నారని గణాంకాలు తెల్పాయి. ఈ పరిస్థితిని ఆమె ఎలాగైనా మార్చాలనుకున్నారు. ఆమె ప్రారంభించిన ఎన్జీఓ ద్వారా 2011, ఆగస్టు నెలలో ఆ ప్రాంతాన్ని దత్తత తీసుకున్నారు. అమ్మాయి పుట్టిన వెంటనే అయిదువేల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే పద్ధతి తీసుకొచ్చారు. తను పాటించిన ఇంకొన్ని సూత్రాల వల్ల ఇప్పుడు అక్కడ అమ్మాయిలు, అబ్బాయిల నిష్పత్తి 921:1000కి చేరింది. ఇంతేకాదు అమ్మాయిలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే తన ముందున్న లక్ష్యం అంటారామె.

నేనూ డబ్బు గురించి తెలుసుకోవాలనుకుంటున్నా !

? నేనూ, మావారు ఇద్దరం ఉద్యోగస్తులమే. మూడేళ్ల కిందట మేం ఒక ఇల్లు కొనుక్కున్నాం. ఇద్దరం కలిసే ఈఎమ్‌ఐలు కడుతున్నాం. అంతకు మించి నేను డబ్బులకు సంబంధించిన ఏ విషయంలోనూ పెద్దగా జోక్యం చేసుకోను. అన్నీ మావారే చూసుకుంటారు. నేను పనిచేసే ఆఫీసులో నాకో స్నేహితురాలు ఉంది. తనూ, వాళ్లాయన ఆర్థిక పరంగా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కలిసే తీసుకుంటారు. మా ఇంట్లో మాత్రం అలాంటి వాతావరణం ఉండదు. తనని చూస్తే చాలా గర్వంగా అనిపిస్తుంది. నాలా ఉద్యోగం చేసే మహిళలు ఆర్థికంగా ఏవిధంగా స్వతంత్రంగా ఉండాలో చెబుతారా?

– ఓ సోదరి

✔ ఆర్థికంగా స్వతంత్రంగా వ్యవహరించడం, ఆర్థికంగా సాధికారత సాధించడం అనేవి ఉద్యోగినులకు ఉండే గొప్ప వెసులుబాట్లు. కానీ చాలామంది ఈ విషయంలో తమని తాము తక్కువ అంచనా వేసుకుంటారు. అందుకే ఆర్థికంగా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా వెనకడుగు వేస్తారు. దానికి తగ్గట్టుగా చాలామంది మహిళలు... 'ఇంటిని చక్కదిద్దడం, పిల్లలని పెంచడం మాత్రమే మేం చేస్తాం. తక్కినవి మానాన్నో, మవారో చూస్తారండి'..అని గర్వంగా చెబుతుంటారు. నిజానికి ఇది బాధపడాల్సిన విషయం. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఉద్యోగినులు, ఆర్థికంగా స్వతంత్ర్యంగా ఉండాలనుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మరోపక్క అంతర్జాతీయ అధ్యయనాలు కూడా పొదుపూ, పెట్టుబడుల విషయంలో మగవాళ్లతో పోలిస్తే మహిళలే ఒక అడుగు ముందుంటారనే విషయాన్ని నొక్కి చెబుతున్నాయి. ఇక మీ విషయానికి వస్తే మీరు లేదా మీ కుటుంబం చేస్తున్న పొదుపు ఏంటనేది తెలుసుకోవడంతో మొదలుపెట్టండి. ఏవైనా పెట్టుబడులు ఉన్నాయా? ఒక వేళ లేకపోతే ముందు పొదుపు పథకాలు గురించి తెలుసుకోండి. భవిష్యత్తులో ఉపయోగపడే పెన్షన్, బీమా, పొదుపు పథకాల గురించి ఆరా తీయండి. అవేవీ అర్థం చేసుకోలేనంత రాకెట్ సైన్స్ ఏం కావు. మీరు దృష్టి పెట్టడం మొదలుపెడితే నెమ్మదిగా అర్థం అవుతాయి. ఈ రోజుల్లో ప్రతిబ్యాంకులోనూ రిలేషన్ మేనేజర్లు ఉంటారు. మీకు అర్థం కాని విషయాలని వాళ్లని అడిగినా చెబుతారు.

ఇక భూములూ, షేర్లు వంటి వాటికి మార్కెట్‌లో నిపుణులు ఉంటారు. ఇంటాబయటా చాలా పాత్రలు పోషించే మహిళలు డబ్బు దగ్గరకు వచ్చే సరికి మనకెందుకులే అనుకుంటారు. కానీ మీవారు తీసుకునే నిర్ణయాలని గురించి తెలుసుకోండి. మొదట్లో నన్ను నమ్మడం లేదు కదూ వంటి మాటలు వినాల్సివస్తుంది. అవి పట్టించుకోవద్దు. సర్దిచెప్పండి. కానీ మీరు కూడా ఆలోచించి మీ అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేయండి. అప్పుడే మీకు డబ్బు విషయంలో పరిజ్ఞానం, స్వతంత్రంగా వ్యవహరించడం తెలుస్తుంది.



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్



బంగారం వెండి

29న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,330	31,500	30,100	31,300
ఆర్నమెంట్	29,260	29,420	28,800	29,100
వెండి (కిలో)	40,500	41,100	41,000	41,500

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,880	30,750	30,950	31,350
ఆర్నమెంట్	28,660	28,480	28,950	29,320
వెండి (కిలో)	40,600	39,900	39,800	40,400

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,160	31,420	-------	-------
ఆర్నమెంట్	29,980	29,220	2,895	2,922 గ్రా
వెండి (కిలో)	41,500	41,500	42.60	43.10 గ్రా

నజరానా

పావుకప్పు టొమాటోరసంలో కొద్దిగా పసుపు కలిపి ముఖానికి రాసుకుని ఇరవై నిమిషాల తరువాత చన్నీళ్లతో కడిగేయాలి. ముఖం పై ఉండే ముడతలు క్రమంగా తగ్గుముఖం పడతాయి.

ఆ విషయాలు చెప్పకండేం!

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడానికి రకరకాల కారణాలు ఉంటాయి. వైవాహిక జీవితాన్ని ఆస్వాదించాలంటే వాటిని అధిగమించగలగాలి. అదెలా సాధ్యం అంటే ఎవరికి వారు చిన్న చిన్న పొరపాట్లు చేయకుండా చూసుకోగలగాలి.

- మీ ఇద్దరి వ్యక్తిగత జీవితం గురించి ఇతర కుటుంబసభ్యులకే కాదు.. స్నేహితులకూ చెప్పకుండా ఉండాలి. ఎంత క్లిష్టమైన సమస్య అయినా సరే.. ఇద్దరూ పరిష్కరించుకోవాలని చూసుకోవాలే తప్ప మూడో వ్యక్తి ప్రస్తావన తీసుకురాకూడదు.
- భార్యాభర్తల మధ్య మనస్పర్థలూ, వాదనలు సర్వసాధారణం. అలాంటప్పుడు దాన్ని భూతద్దంలో చూసి సమస్యను ఇంకా పెంచుకోకుండా ఎలా పరిష్కరించుకోవాలో కలిసి ఆలోచించుకోవాలి. నేను చెప్పిందే రైట్ అనుకుంటే ఆ సమస్య ఎప్పటికీ పరిష్కారం కాదు.
- పెళ్లయ్యాక భాగస్వామి కోసం.. కొన్ని అలవాట్లు మార్చుకోవడం అనేది మామూలే. అలాగని అభిరుచులూ, ఆసక్తులూ, స్నేహితులు ఇలా ప్రతిదీ త్యాగం చేయాలని లేదు. భాగస్వామికి సమయం కేటాయిస్తూనే వ్యక్తిగత జీవితానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.
- 'ఎందుకొచ్చిన గొడవలే...' అనుకుంటూ కొన్ని సమస్యల్ని అలాగే వదిలేస్తున్నారా.. అది సరికాదు. అదే ఇద్దరి మధ్య దూరం పెరుగుతుంది. సమస్యను సమస్యలానే చూసి... ఏం చేయాలనేది ఆలోచించాలి.
- ఇంటికొచ్చినా వాట్సాప్ లేదా కంప్యూటరు చూస్తూ గడపడం...లేదా ఎవరు తోచిన పని వారు చేసుకోవడం సరికాదు. దానివల్ల ఇద్దరిమధ్యా తెలియకుండానే దూరం పెరుగుతుంది. అందుకే కలిసి గడిపే సమయాన్ని పెంచుకోవాలి.



- మనకంటూ కొన్ని నమ్మకాలూ, అభిప్రాయాలు ఉంటాయి. వాటిని మీరే పాటించాలి తప్ప ఎదుటివారూ నమ్మాలనే ధోరణి ఉండటం సరికాదు. దాని వల్ల ఎలాంటి ప్రయోజనం లేకపోగా వాదనలు మొదలవుతాయి.



బ్యాగు కొనేముందు...

రోజూవాడే హ్యాండ్‌బ్యాగులూ, పర్సులు సరైన పద్ధతిలో ఎంచుకోకపోతే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందుకే వాటి ఎంపికలో ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.


- కొన్ని బ్యాగులకు సరైన ఆకృతంటూ ఉండదు. వాటివల్ల బరువు మొత్తం ఒకే ప్రదేశంలో కేంద్రీకృతమవుతుంది. అలా కాకుండా ఒక ఆకృతి ఉన్న దాన్ని ఎంచుకోవాలి.
- పొడవాటి చైన్లూ, లేసులున్న హ్యాండుబ్యాగులు భుజానికి తగిలించుకోడానికి అనువుగా ఉండవు. వీలైనంత తక్కువ పొడవున్న వాటినే ఎంచుకోవాలి. అప్పుడే బరువు తక్కువగా అనిపిస్తాయి.
- హ్యాండ్‌బ్యాగును ఎక్కువ సేపు ఒకే భుజానికి వేసుకోకుండా మారుస్తూ ఉండాలి. లేదంటే మెడా, భుజాల నొప్పి రావచ్చు.
- ల్యాప్‌టాప్ వంటి బరువైన వస్తువులను మోస్తున్నప్పుడు సాధ్యమైనంతవరకు బ్యాక్‌ప్యాక్ మంచిది. ఒకే భుజానికి తగిలించడం వల్ల వెన్నునొప్పి వచ్చే అవకాశం లేకపోలేదు.
- హ్యాండ్‌బ్యాగు బెల్టులు కాస్త వెడల్పుగా ఉండేలా చూసుకోవాలి. వీటివల్ల ఎక్కువ సేపు బ్యాగు వేసుకున్నా నొప్పి అంతగా ఉండదు.
- జేబులు ఎక్కువగా ఉన్న బ్యాగులను ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల బ్యాగు బరువు అంతటా సమానంగా ఉంటుంది.

ఇల్లు మారుతున్నారా?




బదిలీ మీదో, లేదంటే ఏదైనా అవసరం రీత్యా ఇల్లు మారుతున్నారా? అయితే సామాన్లు సర్దుకునేముందు ఈ జాగ్రత్తలు తీసుకుని చూద్దామా..

- టీవీలూ, కంప్యూటర్లు.. ఇతర ఎలాక్ట్రానిక్ వస్తువుల కనెక్షన్లు గుర్తుంచుకోవడం కాస్త కష్టమైన పనే. అందుకే వాటిని ఒక ఫొటో తీసి పెట్టుకోండి. ఆ తర్వాత సులువుగా వైర్లు అమర్చుకోవచ్చు.
- అన్ని వస్తువులను ఒకేచోట కలిపి సర్దేయకూడదు. గదుల్లోని వస్తువుల్ని బట్టి విడివిడిగా సర్దుకుని వాటిపై రాసుకోవాలి.
- విలువైన వస్తువులన్నింటినీ ప్రత్యేకంగా ఒక బ్యాగులో వేసుకుని మీతోనే పెట్టుకుంటే మంచిది.
- మీరు మారబోతున్న ఇళ్లకు అనుగుణంగా ఎక్కడ ఏం పెట్టాలో ముందుగానో ఆలోచించండి. వెళ్లగానే వాటి వాటి స్థానాల్లో సులువుగా అమర్చేయొచ్చు. వీలైతే ఒక చిన్న చార్టు లాంటిది గీసుకుని చూడండి.
- పింగాణీ పాత్రలూ, గ్లాసులు ఉంటే వాటిని ప్యాకింగ్ చేయడంలో కాస్త శ్రద్ధ తప్పనిసరి. ప్లాస్టిక్ ప్లేట్ల మధ్యలో వాటిని ఒకదానితో ఒకటి తగలకుండా జాగ్రత్తగా ఉంచాలి.
- ఒక్కరోజులోనే పూర్తి చేయాలని కాకుండా కొన్ని రోజుల ముందునుంచే ఒక గంట సర్దడానికి కేటాయించడం వల్ల పని సులువవుతుంది. ఎక్కడ ఏ వస్తువు పెట్టామన్న విషయం కూడా సరిగ్గా గుర్తుంటుంది.



మీ అభిప్రాయాలు పంపాల్సిన మా చిరునామా
వసుంధర,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ, అనాజ్‌పూర్,
హయత్‌నగర్ మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512
vasundhara@eenadu.net

■ e-mail: edc@eenadu.in



తల్లిదండ్రుల బలవంతంతో ఇష్టంలేని గ్రూప్ తీసుకున్నా.. అందమైన ఆకర్షణల మధ్య సర్దుకున్నాడు సతీశ్. ప్రణాళిక లేకుండా చదవడంతో రివిజన్ విషయం పట్టించుకోలేదు. అన్నీ వచ్చేసినట్లే ఉన్నా ఏదీ గుర్తుకు రావడం లేదని ఆందోళన చెందడం మొదలుపెట్టాడు. అర్ధరాత్రి దాటినా నిద్రపట్టదు. పగలు కునుకులేస్తున్నాడు. అంతా అయోమయంగా ఉంది. ఇవన్నీ ఒత్తిడి లక్షణాలు. వీటిని సరైన సమయంలో గుర్తించి సానుకూల దృక్పథంతో వ్యవహరించకపోతే పరిస్థితి ప్రతికూలంగా మారిపోతుంది.

పరీక్షల ఒత్తిడిని ఓడిద్దాం!

శ్రద్ధగానే చదువుతున్నా విద్యార్థులందరిలోనూ అలాంటి పరిస్థితే ఎంతోకొంత కనిపిస్తుంటుంది. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలూ, ఎంసెట్, నీట్, జేఈఈ, ఇంకా డీమ్డ్ యూనివర్సిటీల ప్రవేశపరీక్షల కోసం సిద్ధమయ్యేవారూ, డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులూ ఓ పక్క ప్రిపరేషన్లో మునిగిపోతూ మరో పక్క పరీక్షల ఆలోచనల ఒత్తిడితో సతమతమవుతుంటారు. ఈ ఒత్తిడి మితిమీరకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. పరీక్షలు బాగా రాసి, ఆశించిన మార్కులు తెచ్చుకోవాలంటే ఇది తప్పనిసరి.

సుజాత వేల్పూరి
ఎడ్యుకేషన్ కౌన్సెలర్

తలనొప్పి, ఆహారం జీర్ణం కాకపోవడం, వాంతి అయ్యేలా ఉండటం, ఎక్కువ తినెయ్యటం, నిద్రలేమి, అలసట.. ఇవన్నీ ఒత్తిడిని సూచించే లక్షణాలు. మానసికంగా చూస్తే... కోపం, అసహనం, నిరాశ, ఆత్మవిశ్వాసం లేకపోవటం, మూడ్ తరచూ మారిపోతుండటం లాంటివి గమనించవచ్చు.

పరీక్షల ఒత్తిడి, దానివల్ల ఏర్పడే భయాలకు కొన్ని మూల కారణాలుంటాయి. వాటిని మొదట అర్థం చేసుకోవాలి. ఆపై కొన్ని సులభమార్గాలతో అధిగమించవచ్చు.

కాస్త వ్యాయామం... సానుకూలత

- కొద్దిసేపు సైక్లింగ్, చిన్నపాటి శారీరక వ్యాయామం చేయటం ఒత్తిడిని తగ్గిస్తాయి.
- బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్, పాజిటివ్ సజెషన్స్ ఇచ్చుకోవడం, ధ్యానం, అవసరమైతే వైద్యులను సంప్రదించి కొద్దిపాటి మందులు వాడుతూ ఒత్తిడి తగ్గించుకోవచ్చు.




- కొన్నిసార్లు విటమిన్ల లోపం కూడా ఒత్తిడికి కారణం కావొచ్చు. ఈ విషయంలో వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.
- చుట్టూ ఉన్న పరిసరాల్లోని చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని కలిగించి ఒత్తిడిని దూరం చేసేవి చాలా ఉంటాయి. ఉదయిస్తున్న సూర్యుడు, వికసిస్తున్న పూలు, ఆడుకుంటున్న పిల్లలను చూడటం, చల్లగాలిని ఆస్వాదించడం, శ్రేయోభిలాషులతో కాసేపు మాట్లాడటం, ఆహ్లాదకరమైన సంగీతం వినడం ఇవన్నీ ఒత్తిడిని తగ్గించడానికి దోహదం చేసేవే.
- సానుకూల దృక్పథంతో ఉండాలి. ఆ దిశగా ఆలోచనలను మళ్లించాలి. ఇది ఒత్తిడిని తగ్గించడానికి అన్నింటికంటే బాగా పనిచేసే మందు.

జ్ఞాపకశక్తి లోపం

చాలామంది విద్యార్థులు ఎంత చదివినా, చదివిందేదీ గుర్తుండటం లేదని బాధపడుతుంటారు. నిజానికి వీళ్లు పరీక్షలు బాగానే రాస్తారు. కానీ ఎంత చదివినా గుర్తు ఉండకపోవడమనేది పరీక్షల ముందు రోజుల్లో ఎదురయ్యే భయం.

పాఠ్యాంశాన్ని అర్థం చేసుకుని 'నేర్చుకునే పద్ధతి' (లెర్నింగ్ మోడ్)లో చదివితే మర్చిపోవడం కష్టం. అర్థమైన విషయాన్ని ఎవరూ మర్చిపోరు. సబ్జెక్టు మీద ఇష్టంతో, ఆసక్తితో చదివినపుడు పాఠ్యాంశాన్ని మర్చిపోయే ప్రసక్తి ఉండదు. ఇష్టమైన సినిమాలో ప్రతి దృశ్యాన్నీ ఎలా గుర్తు పెట్టుకోగలుగుతున్నాం? దానికి పెద్దగా ప్రయత్నం కూడా చేయడం లేదే? ఇది కూడా అంతే!



ఏకబిగిన గంటలతరబడి చదవకుండా 40-45 నిమిషాలకోసారి 5-10 నిమిషాల విరామం ఇస్తూ చదవటం వల్ల సబ్జెక్టును చక్కగా ఆకళింపు చేసుకోవచ్చు. బాగా గుర్తుంటుంది కూడా! బట్టీ పద్ధతిలో చదివితే ఒక పాయింట్ మధ్యలో గుర్తుకు రాకపోతే ఇక మిగిలిన పాయింట్లన్నీ కూడా దాని వెనకే మాయమైపోతాయి. విద్యార్థి అయోమయంలో పడతాడు. అందుకే, ప్రతి పాఠ్యాంశాన్నీ శ్రద్ధగా ఆకళింపు చేసుకుంటే చదివినదాన్ని మర్చిపోయే సమస్య రాదు.

నిద్రలేమి

చాలామంది అర్ధరాత్రి దాటాక కూడా చదువుతూ పగలు కునికిపాట్లు పడుతుంటారు. అలాగే వివిధ పోటీపరీక్షలకు సైతం అమితంగా శ్రమించడం వల్ల తరచూ నిద్రలేమికి గురవుతుంటారు. అటువంటి సమయంలో అలసటకు లోనై ఆలోచనలు బలహీనపడతాయి. పరీక్షలు సరిగా రాయలేమేమో అని భయం కలుగుతుంది.

ఎక్కువ సమయాన్ని చదువుకోసం కేటాయించడం వల్ల నిద్రలేమి సమస్య బాధిస్తుండటం సహజమే! మరికొంత మంది ఒత్తిడి వల్ల ఎక్కువ నిద్రపోలేరు. దీనికి కనీస సమయమైనా నిద్రపోవడం తప్ప వేరే మార్గం లేదు. నిద్రలేమి ప్రభావం మానసిక, శారీరక ఆరోగ్యాల మీద తప్పకుండా పడుతుంది. కాబట్టి విద్యార్థులు వారి వయసునిబట్టి తగినన్ని గంటలపాటు నిద్రపోవాలి. ఒత్తిడితో, ఆందోళనతో నిద్ర పట్టనివారు ఒత్తిడిని జయించే కొన్ని ఎక్సర్‌సైజ్‌లు చేయడం వల్ల దీన్ని అధిగమించవచ్చు.

ప్రణాళిక లేకుండా చదవడం

ప్రణాళిక లేకుండా చదవడం వల్ల ఏ పాఠ్యాంశం మీదా పట్టుని సాధించలేక, ఏ ఒక్కదాన్నీ పూర్తి చేయలేకపోయామని పరీక్షలు సమీపిస్తున్నకొద్దీ కంగారు మొదలవుతుంది. ఆ కంగారులో మరిన్ని పొరబాట్లు చేస్తారు.

ప్రణాళికబద్ధంగా చదివితే పరీక్షలనాటికి చాలా సిలబస్‌ను రివిజన్ కూడా చేసి పరీక్షలకు సంసిద్ధంగా ఉండగలుగుతారు. చాలా మంది సులభంగా ఉండే ప్రశ్నలు లేదా లెక్కలు ముందుగా ప్రిపేరవుతూ కష్టమనుకున్నవి చివర్లో చదవొచ్చని వాయిదా వేస్తారు. కష్టమైన అధ్యాయాన్నో, అంశాన్నో చివరివరకూ అట్టిపెట్టుకుంటే ఆ సమయంలో దాన్ని సరిగా అర్థం చేసుకోలేక ఒత్తిడి పెరుగుతుంది. దాని ప్రభావం సులభమైన మిగతా పాఠ్యాంశాల మీద కూడా పడొచ్చు.

ఏ రోజు ఏ సబ్జెక్టును ఎంత పరిమాణంలో చదవాలనేది ముందుగానే నిర్దేశించుకుని పరీక్షల తేదీ రావడానికి ముందే రివిజన్ మొదలుపెట్టాలి.

రివిజన్ ప్రాధాన్యం గ్రహించకపోవడం

చాలామంది పరీక్షల సమయం ముంచుకొస్తే తప్ప రివిజన్ జోలికే వెళ్లరు. పరీక్షలు దగ్గరపడ్డాక చదవాల్సింది కొండంతగా కనబడి, భయకంపితులవుతారు.

రివిజన్‌ను కూడా ప్రణాళిక ప్రకారం చేయాల్సిందే! పాఠ్యాంశం మొత్తం మళ్లీ చదవటం కాకుండా నోట్సునూ, హైలైట్ చేసుకున్న ముఖ్యాంశాలనూ చదువుతూ వెళ్ళటమే రివిజన్ అవుతుంది. ఒక చాప్టర్‌ను చదివాక అది పూర్తిగా వచ్చేసిందన్న భరోసాతో విద్యార్థులు చాలారోజుల వరకూ దాన్ని మళ్లీ ముట్టుకోరు. వారం తరువాత దాన్ని చూస్తే.. మొత్తం మళ్లీ చదవాల్సి వస్తుంది. విద్యార్థి శ్రద్ధగా చదివిన ఒక అంశాన్ని 24 గంటల తరువాత తిరిగి చెప్పమని అడిగితే అందులో 16 శాతం మాత్రమే గుర్తుంటుందని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే-

- ✤ ఏ పాఠ్యాంశమైనా మొదటిసారి చదివిన 24 గంటల లోపు మరోసారి చదవాలి.
- ✤ తర్వాత 7 రోజులకూ, 15 రోజులకూ, 30 రోజులకూ కూడా దాన్ని చదవాలి.
- ✤ ఇలా చేస్తే ఆ పాఠ్యాంశాన్ని మర్చిపోవటమనేది ఉండదు.

అందుకే రివిజన్ చార్ట్ తయారుచేసుకుని పాటిస్తుండాలి.

ముఖ్యంగా పరీక్షలు దగ్గరపడ్డాక రివిజన్‌ను ఏమాత్రం విస్మరించకూడదు.

కెరియర్ సంబంధ ఆలోచనలు

సుదూర భవిష్యత్ గురించిన ఆలోచనలు విద్యార్థులను తరచూ భయపెడుతుంటాయి. సీనియర్ ఇంటర్ విద్యార్థులకు చదువు ఒత్తిడితోపాటు భవిష్యత్తు గురించి కొంత ఆందోళన, భయాలు ఉంటాయి. ఏ ర్యాంకు వస్తే ఎలాంటి కాలేజీలో సీటు వస్తుంది, ఏ కోర్సు ఎంచుకోవాలి, దానికి ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి.. వంటి ఆలోచనలు వేధిస్తుంటాయి.

ఈ సందేహాలు తీర్చుకోవటానికి పరీక్షలకు ముందే విద్యార్థులు కెరియర్ కౌన్సెలింగ్ కార్యక్రమాలకు హాజరుకావొచ్చు. ఎప్పుడో చేయబోయే ఉద్యోగాల గురించి ఇప్పుడు అనవసర ఆందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదు. 'వంతెన దగ్గరకు చేరుకున్నాకే దాన్ని దాటాలి' అనే సూక్తిని విద్యార్థులు ఒంటబట్టించుకుంటే మంచిది.

కౌమార దశ భావోద్వేగాలు

హార్మోన్ల కారణంగా యువతీయువకుల మధ్య కలిగే పరస్పర ఆకర్షణలు చదువుమీద నుంచి ధ్యాస మళ్లడానికి చాలా వరకూ కారణమవుతాయి. కొందరైతే అటువంటి భావనలు కలగడం నైతికంగా తప్పనే అపరాధ భావనతో ఉంటారు.

టీనేజ్ దశలో పరస్పర ఆకర్షణలు సహజమే అయినా, వాటి ప్రభావంతో చదువు దెబ్బతినకుండా జాగ్రత్తపడాలి. ఎక్కువ సేపు ఫోన్లలో కబుర్లతో గడపడం, ఒంటరిగా ఉండాలనిపించడం, ఊహల్లో విహరించడం.. వీటన్నిటి ప్రభావం చదువు మీద తప్పకుండా పడుతుంది. ప్రస్తుతం తమ ముందు ఉన్న ప్రాధాన్యాల్లో ముఖ్యమైనదాన్ని, సరైనదాన్ని ఎంచుకునేలా వారిని తల్లిదండ్రులూ, కౌన్సెలర్లూ ప్రభావితం చేయగలగాలి. ఆకర్షణలూ, లైంగిక భావనలూ కలగడం తప్పు కాదు కానీ ప్రస్తుతం అది విద్యార్థుల ప్రాధాన్యం కాకూడదు.

ఇష్టంలేని గ్రూప్ తీసుకుని ఉండటం

కొంతమంది విద్యార్థులు తల్లిదండ్రుల ఇష్టప్రకారం గ్రూప్ తీసుకుని, తరువాత దాంట్లో ఆసక్తిలేక చదువులో రాణించలేరు. అటువంటి సందర్భంలో వారు చదువు మీద, తరగతిలో ఏమాత్రం ఏకాగ్రత చూపించలేరు. ఫలితంగా, సబ్జెక్టు కష్టంగా ఉండటం, చదివింది గుర్తు ఉండకపోవడం, పరీక్షలు దగ్గరకు వస్తుండగానే ఉత్తీర్ణులం కాలేమనీ, తల్లిదండ్రులకు మొహం చూపించలేమనీ ఆందోళనలతో సతమతమవుతుంటారు.

ఆసక్తిలేని సబ్జెక్టును శ్రద్ధగా చదవడం ఎవరికైనా సమస్యే! గ్రూప్ తీసేసుకున్నారు. కాబట్టి శ్రద్ధగా చదివి ముందుకు నడిచి కోర్సు పూర్తిచేయడమే తక్షణ కర్తవ్యం. తమ అభిరుచుల ప్రకారం పై చదువులు చదవడానికి ఏ గ్రూప్‌లోనైనా అవకాశాలు ఉన్నాయనేది గ్రహించి భవిష్యత్తు మీద ఆశ కల్పించుకోవటం ముఖ్యం. అదే సమయంలో ఎటువంటి పైచదువులకైనా ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు తెచ్చుకోవడం అవసరమేననేది విద్యార్థులు గ్రహించాలి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

పోస్టు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఖాళీలు: 56 (ప్రొఫెసర్-18, అసోసియేట్ ప్రొఫెసర్-20, అసిస్టెంట్ ప్రొఫెసర్-18)

అర్హత: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు ఆయా విభాగాల్లో పీహెచ్‌డీతోపాటు పరిశోధన/ బోధన రంగాల్లో అనుభవం ఉండాలి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పీజీతోపాటు నెట్/ స్లెట్/ సెట్ లేదా పీహెచ్‌డీ ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా (వర్సిటీ ఇతర ఎంపిక ప్రక్రియలూ అనుసరించవచ్చు).

దరఖాస్తు: ఆన్‌లైన్ **ఫీజు:** రూ.1000

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 01.02.2018 నుంచి 05.03.2018 వరకు

వెబ్‌సైట్: https://www.uohyd.ac.in/

స్కాలర్‌షిప్స్

జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రిసెర్చ్, బెంగళూరు

1) ప్రాజెక్ట్ ఓరియెంటెడ్ కెమిస్ట్రీ ఎడ్యుకేషన్ (పీఓసీఈ) - 11 ఖాళీలు

అర్హత: మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు.

2) ప్రాజెక్ట్ ఓరియెంటెడ్ బయాలజీ ఎడ్యుకేషన్ (పీఓబీఈ) - 10 ఖాళీలు

అర్హత: సైన్సు సబ్జెక్టులతో బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు.

ప్రాజెక్టు కాలవ్యవధి: 6 - 8 వారాలు (ఏటా వేసవి సెలవుల్లో)

స్కాలర్‌షిప్: నెలకు రూ.6000

ప్రోగ్రామ్ ప్రత్యేకతలు: ఎంపిక చేసిన డిగ్రీ ప్రథమ సంవత్సర అభ్యర్థులకు వేసవి సెలవుల్లో శిక్షణ ఇస్తారు. స్కాలర్‌షిప్‌తోపాటు వివిధ ప్రాజెక్టులు, పరిశోధనల్లో పనిచేసే అవకాశం కల్పిస్తారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ చూపినవారికి డిగ్రీ తర్వాత ఎంఎస్ - పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రాధాన్యం ఇస్తారు.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్

చివరితేది: 02.03.2018

వెబ్‌సైట్: http://jncasr.ac.in/fe/

ప్రవేశాలు

నేషనల్ ఇన్సూరెన్స్ అకాడమీ, పుణె

కోర్సు: పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం)

కాలవ్యవధి: 2 సంవత్సరాలు

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు క్యాట్/ సీమ్యాట్ స్కోరు ఉండాలి.

వయసు: 28 సంవత్సరాలు మించకూడదు.


ఎంపిక: గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్

చివరితేది: 15.03.2018

వెబ్‌సైట్: www.niapune.org.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ఎంసెట్, జేఈఈ లేకుండా బీటెక్ చేయవచ్చా?



ఎంసెట్‌గానీ, జేఈఈగానీ రాయకుండా బీటెక్ చదవడం సాధ్యమేనా?

- శిరీష, తిమ్మసముద్రం

జ: ఎంసెట్ కానీ, జేఈఈ కానీ రాయకుండా బీటెక్‌లో ప్రవేశం పొందడం సాధ్యమే. సదరు విశ్వవిద్యాలయంవారు నిర్వహించే వారి సొంత ప్రవేశపరీక్ష ద్వారా ప్రవేశం పొందవచ్చు. ఉదాహరణకు- వీఐటీ విశ్వవిద్యాలయం



వీఐటీఈఈఈ (వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామ్) ద్వారా, గీతం విశ్వవిద్యాలయం జీఏటీ (గీతం అడ్మిషన్ టెస్ట్), ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఎస్ఆర్ఎం జేఈఈ ద్వారా బీటెక్ కోర్సుల్లోకి ప్రవేశాలను కల్పిస్తున్నాయి. ఇవేకాకుండా కళాశాలలకు కేటాయించిన మేనేజ్‌మెంట్ కోటా సీట్ల ద్వారా కూడా బీటెక్‌లోకి ప్రవేశాన్ని పొంది, తమ విద్యను కొనసాగించవచ్చు.

● *ప్రొ. బి.రాజశేఖర్,* కెరియర్ కౌన్సెలర్

నాణ్యమైన న్యాయవిద్యకు క్లాట్!

ప్రభుత్వరంగ సంస్థల్లో న్యాయవిద్య సంబంధిత ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, పర్యావరణం తదితర చట్టాల నేపథ్యంలో న్యాయ నిపుణుల అవసరాలు కూడా ఎక్కువయ్యాయి. ఆదాయం, హోదాపరంగా ఉన్నతమైన స్థానాన్ని అందించే కెరియర్ కావడంతో యువత న్యాయవిద్య వైపు మొగ్గు చూపుతోంది. ఏ విభాగంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసినా లా చదవడానికి అర్హత లభించడం కూడా ప్రధాన ఆకర్షణగా మారింది.

దేశంలోని జాతీయస్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందడానికి నిర్వహించే ప్రవేశపరీక్ష- క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్). దీని ప్రకటన వెలువడింది. కొచ్చిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ ఈ ఏడాది పరీక్షను నిర్వహిస్తోంది. ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రాముల్లో సీటు లభిస్తుంది. క్లాట్ ద్వారా ప్రవేశం కల్పించే సుప్రసిద్ధ విద్యాసంస్థల్లో అత్యాధునిక కరిక్యులమ్, మౌలిక వసతులూ, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది ఉండటం మూలంగా నాణ్యమైన విద్య లభిస్తుంది. ప్రాంగణ నియామకాలూ ఉంటాయి. క్లాట్-2018 ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలో నల్సార్ (హైదరాబాద్), ఆంధ్రప్రదేశ్‌లో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (విశాఖపట్నం)లో ప్రవేశాలు పొందవచ్చు.

››› పరీక్ష విధానం

క్లాట్ ఆన్‌లైన్ పరీక్ష. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం నిర్వహించే ఈ పరీక్షలో 200 ప్రశ్నలు 200 మార్కులకు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. ఇంగ్లిష్ - 40, జనరల్ నాలెడ్జ్/ కరెంట్‌అఫైర్స్ - 50, ఎలిమెంటరీ మ్యాథ్స్ (న్యూమరికల్ ఎబిలిటీ) - 20, లీగల్ ఆప్టిట్యూడ్ - 50, లాజికల్ రీజనింగ్ - 40 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల కోసం నిర్వహించే పరీక్ష 150 ప్రశ్నలతో 150 మార్కులకు ఉంటుంది. లా కు సంబంధించిన మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. రుణాత్మక మార్కులున్నాయి. తప్పుగా గుర్తించిన ప్రతి ప్రశ్నకు పావు మార్కు చొప్పున తగ్గిస్తారు. ఈ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఆలోచనాత్మక, వివరణాత్మక ప్రతిభా పాటవాలను అంచనావేస్తూ వారి అనువర్తన తీరును పరిశీలిస్తారు. గత ప్రశ్నపత్రాలను పరిశీలించి అధ్యయన ప్రణాళికలు రూపొందించుకోవాలి.

››› అవకాశాలు

బహుళజాతి సంస్థలూ, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులూ, ప్రైవేటు ఈక్విటీ కంపెనీలూ, కన్సల్టింగ్ సంస్థలూ, అకౌంటింగ్ కంపెనీల్లో న్యాయశాస్త్ర పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, కార్పొరేట్ లా, సైబర్ లా, లీగల్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్‌లకు అవకాశాలు పెరుగుతున్నాయి.



››› గడువు తేదీ, అర్హతలు

- ఎల్ఎల్‌బీ 5 సంవత్సరాల (యూజీ), ఎల్ఎల్ఎం సంవత్సరం (పీజీ) కోర్సుల్లోకి ప్రవేశం.
- 5 సంవత్సరాల కోర్సులో చేరే విద్యార్థులు 10+2 లేదా సమాన పరీక్షను 45% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ విద్యార్థులు 40% మార్కులతో పాసై ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు కూడా క్లాట్ రాయవచ్చు.
- ఎల్ఎల్ఎం కోర్సులో చేరదల్చినవారు ఎల్ఎల్‌బీ పరీక్షను 55% మార్కులతో; ఎస్సీ, ఎస్టీవారు 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు కూడా క్లాట్ రాసుకోవచ్చు.
- అభ్యర్థుల వయసుకు సంబంధించి పరిమితులు లేవు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 31.03.2018.

ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.4000; ఎస్సీ, ఎస్టీలకు రూ.3500. **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 13.05.2018

క్లాట్-2018 పూర్తి వివరాలకు www.clat.ac.in చూడవచ్చు.

ప్రవేశాలు కల్పించే సంస్థలు ఇవే!

క్లాట్ ర్యాంకు ఆధారంగా 19 ప్రఖ్యాత న్యాయశాస్త్ర విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

◆ నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, బెంగళూరు (ఎన్ఎల్ఎస్ఐయూ) ◆ నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రిసెర్చ్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్ (నల్సార్) ◆ ద నేషనల్‌లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ, భోపాల్ (ఎన్ఎల్ఐయూ) ◆ ద వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జూరిడికల్ సైన్సెస్, కోల్‌కతా (డబ్ల్యూబీఎన్‌యూజేఎస్) ◆ నేషనల్ లా యూనివర్సిటీ, జోధ్‌పూర్ (ఎన్ఎల్‌యూజే) ◆ హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, రాయ్‌పూర్ (హెచ్ఎన్ఎల్‌యూ) ◆ గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ, గాంధీనగర్ (జీఎన్ఎల్‌యూ)

◆ డా.రామ్‌మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ, లఖ్‌నవూ (ఆర్ఎంఎల్ఎన్ఎల్‌యూ) ◆ రాజీవ్‌గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా, పంజాబ్ (ఆర్‌జీఎన్‌యూఎల్) ◆ చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ, పట్నా (సీఎన్ఎల్‌యూ) ◆ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్, కొచ్చి (ఎన్‌యూఏఎల్ఎస్) ◆ నేషనల్ లా యూనివర్సిటీ ఒడిశా, కటక్ (ఎన్ఎల్‌యూఓ)

◆ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రిసెర్చ్ ఇన్ లా, రాంచీ (ఎన్‌యూఎస్ఆర్ఎల్) ◆ నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యుడిషియల్ అకాడమీ, అసోం (ఎన్ఎల్‌యూజేఏఏ) ◆ దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ, విశాఖపట్నం (డీఎస్ఎన్ఎల్‌యూ) ◆ తమిళనాడు నేషనల్ లా స్కూల్, తిరుచిరాపల్లి (టీఎన్ఎన్ఎల్ఎస్) ◆ మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, ముంబయి (ఎంఎన్ఎల్‌యూ) ◆ మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, నాగ్‌పూర్ (ఎంఎన్ఎల్‌యూ) ◆ మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, ఔరంగాబాద్ (ఎంఎన్ఎల్‌యూ)

వీటితోపాటు పలు ప్రైవేటు సంస్థలు క్లాట్ స్కోర్‌తో న్యాయవిద్యలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

‘జమిలి’ జమానా రావాలి

- పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

ఈనాడు – దిల్లీ

అటు లోక్‌సభకు, ఇటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు అవసరమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. దీనిపై రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరంతరం ఎక్కడో చోట ఎన్నికలు జరగడం వల్ల వనరులపై పెను భారం పడుతోందని, అభివృద్ధికి అవరోధంగా మారిందని పేర్కొన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన పార్లమెంటు ఉభయ సభల సభ్యులనుద్దేశించి సెంట్రల్ హాల్‌లో ప్రసంగించారు. ప్రభుత్వం చేపడుతున్న గృహనిర్మాణం, నిరంతర విద్యుత్ సరఫరా, పేదలకు వంట గ్యాస్ కనెక్షన్లు వంటి పథకాలు, రైతు సంక్షేమం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. అన్ని గ్రామాలను రోడ్లతో అనుసంధానించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నెరిపిన దౌత్యం వల్ల మిత్రదేశాలు, ప్రధాన దేశాలతో భారత్ సంబంధాలు బలపడ్డాయన్నారు.

రాష్ట్రపతి హోదాలో పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించడం ఇదే మొదటిసారి. దేశంలో నిత్యం ఏదోఒక చోట ఎన్నికలు జరుగుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వీటివల్ల ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతోందని చెప్పారు. అందువల్ల జమిలి ఎన్నికల నిర్వహణపై నిరంతర చర్చ జరగాలని. రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలని కోరారు.



పార్లమెంటుకు వస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ, స్పీకరు సుమిత్రా మహాజన్ తదితరులు

నవ భారత స్వప్నం.. ఒక్క రాజకీయ పార్టీకో, సంస్థకో చెందింది కాదని కోవింద్ పేర్కొన్నారు. ఈ కలను సాకారం చేయడానికి పూర్తి అంకిత భావంతో అందరూ కలసిపనిచేయాలని కోరారు. జాతి నిర్మాణానికి అవసరమైన లక్ష్యాలను నిర్దిష్టకాలపరిమితిలో సాధించాలన్నారు. 2022 సంవత్సరంలో 75 ఏళ్ల స్వాతంత్ర ఉత్సవాలు జరుపుకొనే నాటికి.. స్వాతంత్ర్య సమరయోధుల కలలను నెరవేర్చడమేకాకుండా నవభారత పునాదులను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

■ దశాబ్దాల తరబడి ముస్లిం మహిళలు రాజకీయ ప్రయోజనాలకు బందీలయ్యారు. వారిని బంధవిముక్తుల్ని చేసే అవకాశం దేశానికి వచ్చింది. ప్రభుత్వం పార్లమెంటు ముందుకు తెచ్చిన ‘ముమ్మారు తలాక్’ బిల్లును ఉభయసభలు ఆమోదించి, చట్టంగా మారుస్తాయని నమ్ముతున్నా. అది చట్టం రూపం దాలిస్తే ముస్లిం మహిళలు ఆత్మగౌరవంతో ధైర్యంగా జీవించగలుగుతారు.

★ గత ఏడాదిలోనే ఉపకారవేతనాలు తదితరాలతో 45 లక్షలమంది విద్యార్థులు ప్రయోజనం పొందారు.

★ రైతుల ఆదాయాన్ని పెంచడానికి రూ.11వేల కోట్లతో డెయిరీ మౌలికవసతుల అభివృద్ధి నిధి ఏర్పాటుచేశాం.

★ ప్రభుత్వ చర్యలవల్ల యూరియా ఉత్పత్తి పెరిగింది. రామగుండం, గోరఖ్‌పూర్, బరౌనీ, సింద్రి, తాల్చేర్ ఎరువుల కర్మాగారాల పునరుద్ధరణ కార్యక్రమం వేగవంతంగా జరుగుతోంది.

★ మారుమూల ప్రాంతాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 2.70 లక్షల ఉమ్మడి పౌరసేవా కేంద్రాలు ఏర్పాటుచేసి పౌరులకు చౌకధరల్లో డిజిటల్ సేవలు అందిస్తున్నాం. భారత్ నెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం 2.50 లక్షల గ్రామపంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పిస్తోంది. తొలిదశలో లక్షకుపైగా గ్రామ పంచాయతీలకు సౌకర్యం కల్పించాం.

★ అంబేడ్కర్ సిద్ధాంతాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, ఆర్థిక ప్రజాస్వామ్యం బలోపేతానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సామాన్యుడి జీవనాన్ని సులభతరం చేయడానికి కంకణబద్ధమైంది.

★ బలహీనవర్గాల ఆకాంక్షలను నెరవేర్చడానికి జాతీయ ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించే రాజ్యాంగసవరణ బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చింది. వెనుకబడిన తరగతుల్లో అత్యంత వెనుకబడిన వారికి విద్య, ఉద్యోగాల్లో మరింత ప్రయోజనం కల్పించడానికి వర్గీకరణ కోసం కమిషన్‌ను ఏర్పాటుచేసింది.

★ స్వాతంత్ర సమరంలో గిరిజనులు చేసిన పోరాటాన్ని గౌరవిస్తూ గుజరాత్‌లో ఆదివాసీ స్వతంత్ర సంగ్రాం సంగ్రహాలయాలను ఏర్పాటుచేస్తున్నాం. త్వరలో ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, కేరళ తదితర చోట్ల వీటిని నిర్మిస్తాం.

★ దేశంలో తొలిసారి లక్ష్యాన్ని మించి విద్యుత్తు ఉత్పత్తి సాధ్యమైంది. ఇప్పుడు భారత్ విద్యుత్తు నికర ఎగుమతిదారుగా మారింది.

★ దేశ ఆర్థిక అనుసంధానత కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందుకోసమే జీఎస్టీని ప్రవేశపెట్టింది.

★ అవినీతిపై పోరు కొనసాగుతుంది. ఇందుకోసం గత ఏడాదిలో 3.5 లక్షల అక్రమ కంపెనీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశాం.

■ ప్రభుత్వ వ్యవసాయ అనుకూల విధానాలతో ఈ సంవత్సరం రికార్డుస్థాయిలో 275 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు, 300 మిలియన్ టన్నుల ఉద్యానవన ఉత్పత్తుల దిగుబడి సాధ్యమైంది. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దశాబ్దాల తరబడి సాగుతూ వస్తున్న 99 సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిచేస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలవల్ల గత ఏడాది పప్పుదినుసుల ఉత్పత్తి రికార్డుస్థాయిలో 38% పెరిగింది.

■ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్నప్పటికీ భారత వృద్ధి రేటు అద్భుతంగా కొనసాగుతోంది. 2016-17లో తొలి త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ తాత్కాలికంగా మందగమనంలో సాగినప్పటికీ 2017-18 రెండో త్రైమాసికంలో ఈ పరిస్థితి మారింది. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వ ద్రవ్య, కరెంటు ఖాతా లోటులో సరాసరిన తగ్గుదల నమోదైంది. విదేశీ మారక నిల్వలు 410 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

నాగాలాండ్‌లో ఎన్నికల బహిష్కరణ

- అధికార ఎన్‌పీఎఫ్, కాంగ్రెస్, భాజపా సహా 11 పార్టీల ఏకగ్రీవ నిర్ణయం

కోహిమా: నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలలో పాల్గొనరాదని అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్) సహా 11 రాజకీయ పార్టీలు నిర్ణయించాయి. ఎన్నికల కన్నా నాగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తమకు ముఖ్యమని ఆ పార్టీల ప్రతినిధులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. నాగా శాంతి ఒప్పందాన్ని అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నాగా గిరిజనుల అత్యున్నత మండలి అయిన నాగా హోహో, పౌర సంఘాలు నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఎన్‌పీఎఫ్, కాంగ్రెస్, భాజపా, నేషనల్ డెమోక్రటిక్ పీపుల్స్ పార్టీ, నాగాలాండ్ కాంగ్రెస్, యునైటెడ్ నాగాలాండ్ డెమోక్రటిక్ పార్టీ, ఆప్, ఎన్సీపీ, ఎల్‌జేపీ, జేడీ(యు), నేషనల్ పీపుల్స్ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల బహిష్కరణ విషయాన్ని సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. ‘ఎన్నికలకు ముందే పరిష్కారం’ నినాదంతో పౌరసంఘాలు ఒక ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించాయి.

నాలుగేళ్లలో రూ.637 కోట్లను... రాజకీయ పార్టీలకు అందించిన ట్రస్టులు

దిల్లీ: రాజకీయ పార్టీలకు 2013-14 నుంచి 2016-17 మధ్య కాలంలో తొమ్మిది ట్రస్టులు (దాతృత్వ సంస్థలు) రూ.637.54 కోట్లు వితరణ చేసినట్లు ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) తాజా నివేదికలో సోమవారం తెలిపింది. ఈ మొత్తంలో భాజపాకు రూ.488.94 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.86.65 కోట్లు దక్కినట్లు పేర్కొంది. ఐదు జాతీయ పార్టీలు మొత్తంగా దీనిలో 92.30 శాతం (రూ.588.44 కోట్లు) పొందినట్లు వెల్లడించింది. 16 ప్రాంతీయ పార్టీలు మిగతా 7.70 శాతం (రూ.49.09 కోట్లు) అందుకున్నట్లు వివరించింది.

అనర్హతపై ఆప్ ఎమ్మెల్యేల పిటిషన్లు డివిజన్ ధర్మాసనానికి..

దిల్లీ: లాభదాయక పదవులు నిర్వహించారన్న కారణంతో అనర్హత వేటుకు గురైన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యేలు తమపై వేటును రద్దు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను దిల్లీ హైకోర్టు డివిజన్ ధర్మాసనానికి బదిలీ చేసింది. జస్టిస్ విభు భ్ఖ్రూ ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి పిటిషన్లపై విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.



మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నిర్వహిస్తున్న ఖాస్‌దర్ సాంస్కృతిక్ మహోత్సవ్ 2018 ముగింపు వేడుకల్లో ద్రౌపది నృత్య నాటికను ప్రదర్శిస్తున్న భాజపా ఎంపీ హేమమాలిని

ఒకేసారి ఎన్నికలపై అభిప్రాయం చెప్పండి

- ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు ప్రధానమంత్రి సూచన

ఈనాడు, దిల్లీ: జమిలి ఎన్నికలపై రాజకీయపార్టీలు ఏకాభిప్రాయానికి రావాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరంద్ర మోదీ కూడా సోమవారం ఎన్డీయే మిత్రపక్షాల సమావేశంలో ఆ అంశాన్ని చర్చకు పెట్టారు. దీనిపై ఎన్డీయే భాగస్వామ్యపక్షాలు అభిప్రాయం చెప్పాలని కోరినట్లు ఈ సమావేశంలో పాల్గొన్న తెదేపా నాయకులు సుజనాచౌదరి, తోట నరసింహం చెప్పారు.

“తరచూ ఎక్కడోచోట ఎన్నికలు జరగడం వల్ల అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నిరంతర ఎన్నికల నిర్వహణ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఒకేసారి ఎన్నికల నిర్వహణపై ఎన్డీయే పక్షాలనే కాకుండా అన్ని రాజకీయపార్టీలతో సంప్రదించి ఒక నిర్ణయానికి వస్తే బాగుంటుంది” అని ప్రధాని అభిప్రాయపడినట్లు సుజనా చౌదరి చెప్పారు. దీనిపై తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుతో మాట్లాడి ఒక సలహాపత్రాన్ని అందిస్తామని పేర్కొన్నారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను గుర్తుచేసినట్లు చెప్పారు. ఈనెల 12న మోదీని చంద్రబాబు కలిసి నివేదిక అందించినప్పుడు ఆయన మరికొన్ని వివరాలు కోరారని, దానిపై ఒక నివేదిక తయారుచేశామని తెలిపారు. ఒకటి రెండురోజుల్లో ప్రధానికి అందజేస్తామని చెప్పారు. రెండు పార్టీల మధ్య పాటించాల్సిన మిత్రధర్మం గురించి అమిత్‌షా చర్చించనున్నట్లు చెప్పారు. ఇరుపార్టీలూ సంయమనం పాటించాలన్నది చంద్రబాబు ఉద్దేశమని పేర్కొన్నారు. తోట నరసింహం మాట్లాడుతూ.. రైల్వే జోన్. కడప ఉక్కు కర్మాగారం, ఇతర అంశాలను త్వరితగతిన పూర్తిచేయడానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని కోరినట్లు చెప్పారు.

తలాక్ బిల్లుపై రాజకీయాలొద్దు: ముమ్మారు తలాక్ బిల్లును పార్లమెంటు సత్వరమే ఆమోదిస్తుందన్న ఆశాభావాన్ని రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు. అత్యంత ముఖ్యమైన ఈ బిల్లుకు అంగీకారం తెలపటంలో రాజకీయాలకు తావివ్వొద్దని హితవు పలికారు. రాష్ట్రపతి కోవింద్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. సమావేశం అనంతరం సంప్రదాయం ప్రకారం పార్లమెంటు వెలుపల ప్రధాని మోదీ విలేకరులతో మాట్లాడారు. ఇద్దరు నేతలూ ముమ్మారు తలాక్ బిల్లును తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు. ఇదే విషయాన్ని ప్రధాని ప్రస్తావిస్తూ...బిల్లును ఆమోదించాలని సభ్యులను వినమ్రంగా అభ్యర్థిస్తున్నానన్నారు. ఈ బిల్లు విషయంలో రాజకీయాలకు తావివ్వరాదన్నది ప్రజలు, కేంద్ర ప్రభుత్వ అభిప్రాయంగా ఆయన పేర్కొన్నారు. 2018 సంవత్సరంలో ముస్లిం మహిళలకు ఈ బిల్లును బహుమతిగా అందజేద్దామని తెలిపారు.

ఏపీ భాజపాకు త్వరలో పర్యవేక్షకుడు

మరో మూడు రాష్ట్రాలకు కూడా

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాలకు భాజపా త్వరలో పార్టీ ఇన్‌ఛార్జిలను నియమించనుంది. ఫిబ్రవరిలో పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు ముందు అమిత్‌షా పార్టీని పునర్వ్యవస్థీకరించేటప్పుడే ఆంధ్రప్రదేశ్, అసోం, ఝార్ఖండ్, గోవా రాష్ట్రాలకు ఇన్‌ఛార్జిలను నియమిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌కు పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్న సిద్ధార్థ నాథ్ సింగ్ యూపీలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో గత ఏడాది మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆ పదవి ఖాళీగా ఉంది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో భాగస్వామ్య పార్టీలతో మెరుగైన సమన్వయం నెరపాలని పార్టీ ఇన్‌ఛార్జిలకు అమిత్‌షా సూచించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. భాగస్వామ్య పక్షాలతో విభేదాలున్న పక్షంలో రాష్ట్రస్థాయిలోనే వాటిని పరిష్కరించే బాధ్యతలను కూడా అప్పగిస్తారని ఆ వర్గాలు వెల్లడించాయి. చాలా మంది పార్టీ ఆఫీస్ బేరర్లు వివిధ ప్రభుత్వ పదవులు చేపట్టారు. దీంతో భాజపాలో దాదాపు 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు ముందుగానే ఈ పోస్టులను భర్తీ చేస్తారు.

భూకబ్జా వ్యవహారంపై చంద్రబాబు సీరియస్

- పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశం
- ఎమ్మెల్యే బొండా ఉమా ప్రమేయంపై ఆరా

ఈనాడు, అమరావతి: విజయవాడలో వెలుగుచూసిన భూ కబ్జా వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు ప్రభుత్వం కేటాయించిన భూమి కబ్జా కావడాన్ని తీవ్రంగా పరిగణించాలని స్పష్టం చేశారు. ‘ఈ అంశంపై నమోదైన సీఐడీ కేసు, ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించిన వివరాలు, ఇప్పటివరకూ దర్యాప్తులో తేలిన విషయాలు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఆయన కుటుంబ సభ్యుల ప్రమేయం.. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న రామిరెడ్డి కోటేశ్వరరావు అనే వ్యక్తి ఎమ్మెల్యే అనుచరుల నుంచి ప్రాణహాని ఉందంటూ పోలీసులకు చేసిన ఫిర్యాదు’ తదితర అంశంపై ఆరా తీశారు. మొత్తం వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తిండిలేదు కానీ.. కోట్ల భూమికి యజమానట!

- బొండా ఉమా భూ కబ్జా ఆరోపణల్లో ప్రధాన నిందితుడి దైన్య స్థితి ఇది
- రేకుల ఇంట దుర్భర జీవితం
- పేదరికానికి తోడు క్యాన్సర్‌తో సతమతం
- భార్య అంగన్వాడీ ఆయా.. ప్రస్తుతం ఆమే ఆసరా

ఈనాడు డిజిటల్, విజయవాడ: దయనీయ పరిస్థితిలో కనిపిస్తున్న ఈయన పేరు అబ్దుల్ మస్తాన్.. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుపై వచ్చిన భూకబ్జా ఆరోపణల్లో ఈయనే ప్రధాన నిందితుడు. 1988లో మస్తానే స్వాతంత్ర్య సమరయోధుల భూమిని కొన్నట్టుగా డాక్యుమెంట్లు ఉన్నాయి. నిజానికి అబ్దుల్ నిరుపేద.. ఈయనకు రూ.25 కోట్ల స్థలం కాదు కదా.. కనీసం గజం భూమి కూడా లేదు. కానీ.. భూకబ్జాలకు పాల్పడే పెద్దలు మస్తాన్‌ని అడ్డుపెట్టుకుని దర్జాగా స్వాతంత్ర్య సమరయోధుల స్థలాన్ని ఆక్రమించారు. ఈయన మాత్రం విజయవాడ తాడిగడపలోని బందరు కాలువ కట్టపై ఇరుకైన ఓ రేకుల గదిలో నివాసం ఉంటున్నాడు. ఇదేంటి.. రూ.కోట్ల ఖరీదైన భూమి ఉంటే.. ఎందుకింత దుర్భర పరిస్థితుల్లో ఉంటున్నాడనే సందేహం కలగమానదు. అక్కడే ఉంది.



అబ్దుల్ మస్తాన్ నివాసం ఉంటున్న ఇల్లు అంతర చిత్రంలో అసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిన మస్తాన్

అసలు మాయ.. అదే భూ మాయ..: మస్తాన్ విజయవాడ ఆటోనగర్‌లో ఓ పైపుల మరమ్మతుల దుకాణంలో పనిచేసుకుంటూ దశాబ్దాలుగా బతుకుతున్నాడు. రోజుకు రూ.250 కూలీగా వచ్చేది. 20 ఏళ్ల కిందట తాడిగడపకు చెందిన దిల్‌షాద్ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తూ ఆయనను పోషిస్తోంది. మస్తాన్ కేన్సర్‌తో బాధపడుతూ. . ఎన్టీఆర్ వైద్యసేవ కింద స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. భార్యే అన్నీ చూసుకుంటోంది. ప్రస్తుతం ఈయన ఉంటున్న ఈ రేకుల ఇల్లు కూడా భార్యకు చెందినదే. అది కట్టుకునేందుకూ డబ్బు లేక అప్పు చేయాల్సి వచ్చింది. అది తీర్చలేకపోవడంతో వీరి కుమార్తె, అల్లుడు ఆ రుణం నుంచి గట్టెక్కించారు. ఇపుడు ఇంటిలోని సగభాగంలో వారుంటున్నారు. విజయవాడలో అసలు తమకు గజం కూడా స్థలం లేదని మస్తాన్ భార్య, కుమార్తె వెల్లడించారు. మస్తాన్‌ను మధ్యలో పెట్టి 2014-16 మధ్య నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడినట్టు తెలిసింది. ప్రస్తుతం కబ్జా చేసిన స్థలం 5.75 ఎకరాలు. దీనిని మస్తాన్‌తో పాటూ రామిరెడ్డి కోటేశ్వరరావు అనే వ్యక్తి కలిసి కొన్నట్టుగా నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ స్థలం ప్రస్తుతం ఎకరా రూ.10 కోట్ల వరకూ పలుకుతోంది. అంటే.. సగం స్థలానికి హక్కుదారుగా పేర్కొంటున్న మస్తాన్‌కు కనీసం రూ.25 కోట్ల వరకూ ఆస్తి ఉండాలి!

పంజాబ్‌లో డీఎస్పీ ఆత్మహత్య

సర్వీస్ రివాల్వర్‌తో నుదిటిపై కాల్చుకున్న అధికారి

ఫరీద్‌కోట్: ధర్నాకు దిగిన కళాశాల విద్యార్థులను సముదాయించి పంపించే యత్నం చేసిన డీఎస్పీ వారి నుంచి విమర్శలు రావటంతో అక్కడికక్కడే ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన పంజాబ్‌లోని ఫరీద్‌కోట్‌లో సోమవారం జరిగింది. కొద్ది రోజుల క్రితం ఇద్దరు విద్యార్థులను పోలీసులు చితకబాదటాన్ని నిరసిస్తూ ఓ కళాశాల విద్యార్థులు ధర్నాకు దిగారు. పాటియాలాకు చెందిన డీఎస్పీ బల్‌జిందర్ సింగ్ సంధు(50) వారికి నచ్చచెప్పి పంపించేందుకు యత్నించారు. అయితే, విద్యార్థులు ఆయన నిజాయితీని ప్రశ్నిస్తూ విమర్శించటంతో బల్‌జిందర్ సింగ్ ఆవేదనకు గురై తన సర్వీస్ రివాల్వర్‌ను కణతకు గురిపెట్టుకుని కాల్చుకున్నారు.

అఫ్గాన్‌లో మళ్లీ మారణహోమం

11 మంది సైనికుల దుర్మరణం

కాబూల్: అఫ్గానిస్థాన్‌లో నరమేధం కొనసాగుతోంది. దేశ రాజధాని కాబూల్‌లో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాదులు సోమవారం తెల్లవారుజామున బీభత్సం సృష్టించారు. స్థానిక సైనిక శిక్షణ కేంద్రం ‘మార్షల్ ఫాహిమ్ అకాడమీ’పై దాడికి తెగబడి 11 మంది సైనికులను పొట్టనపెట్టుకున్నారు. ఈ ఘటనలో మరో 16 మంది గాయపడ్డారు. తొలుత ఆత్మాహుతి దళ సభ్యుడొకరు తనను తాను పేల్చేసుకున్నాడని.. అనంతరం ఉగ్రవాదులు కాల్పులు జరిపారని రక్షణ శాఖ అధికార ప్రతినిధి దవాల్ట్ వజీరీ తెలిపారు. మొత్తం ఐదుగురు ఉగ్రవాదులు దాడిలో పాల్గొన్నారని చెప్పారు. వారిలో ఇద్దరు తమను తాము పేల్చేసుకోగా.. ఇద్దర్ని భద్రతా దళాలు కాల్పుల్లో మట్టుబెట్టాయని వెల్లడించారు. మరో ఉగ్రవాదిని ప్రాణాలతో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.



ముర్షీదాబాద్ జిల్లాలోని నదిలో పడిపోయిన బస్సును క్రేన్ సాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

36 మంది జల సమాధి

- కాల్వలో పడిన బస్సు
- పశ్చిమ బెంగాల్‌లో దుర్ఘటన

బహరంపుర్: పశ్చిమ బెంగాల్‌లో సోమవారం ఉదయం ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఓ బస్సు కాల్వలో పడిపోవడంతో 36 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో 10 మంది మహిళలున్నారు. ఉత్తర బెంగాల్ రాష్ట్ర రవాణా సంస్థ(ఎన్‌బీఎస్‌టీసీ)కు చెందిన బస్సు నదియా జిల్లాలోని శికర్‌పుర్ నుంచి మాల్దాకు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ముర్షిదాబాద్ జిల్లాలోని బలిర్‌ఘాట్ వద్ద వంతెన రెయిలింగ్‌ను ఢీకొట్టిన బస్సు.. ఘోగ్రా కాల్వలోకి పడిపోయింది. దాదాపు 8 గంటలపాటు శ్రమించి అధికారులు బస్సును కాల్వ నుంచి బయటకు తీశారు. ఘటనలో మొత్తం 36 మంది మృతి చెందినట్లు ప్రస్తుతానికి నిర్ధారించారు. ప్రమాద సమయంలో బస్సులో దాదాపు 60 మంది ప్రయాణికులున్నట్లు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కొందరిని స్థానికులు రక్షించారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాద స్థలానికి పోలీసులు ఆలస్యంగా చేరుకున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులపై దాడి చేశారు. వారి వాహనానికి నిప్పు పెట్టారు. ఆ మంటలను ఆర్పేందుకు వచ్చిన అగ్నిమాపక దళం వాహనాన్ని ధ్వంసం చేశారు. ప్రమాదం చోటుచేసుకున్న స్థలాన్ని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సందర్శించారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు.

రాజ్యసభ ఎంపీలుగా నలుగురి ప్రమాణం

దిల్లీ: రాజ్యసభ ఎంపీలుగా నలుగురు కొత్త సభ్యులు సోమవారం ప్రమాణం చేశారు. వారిలో ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన ముగ్గురు నేతలు, కేంద్రమంత్రి హర్దీప్ పూరి(భాజపా) ఉన్నారు. మరోవైపు, రాజ్యసభ మాజీ సభ్యులు మొహిందర్ సింగ్ కల్యాణ్, ఖగెన్ దాస్‌ల మృతిపట్ల సభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు సంతాపం ప్రకటించారు. ఇటీవల షార్జాలో నిర్వహించిన అంధుల క్రికెట్ ప్రపంచ కప్‌ను గెల్చుకున్న భారత జట్టుపై పెద్దల సభ ప్రశంసలు కురిపించింది. ఇటీవలే 100వ ఉపగ్రహ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేసిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)ను అభినందించారు. వచ్చే నెల 1న రాజ్యసభ తిరిగి భేటీకానుంది.

‘ఏకపక్షంగా మైనర్ల మతమార్పిడి చెల్లదు’

కౌలాలంపూర్: మైనర్ పిల్లల మతమార్పిడికి వారి తల్లిదండ్రులిద్దరూ సమ్మతి తెలపాల్సిన అవసరం ఉందని మలేసియా సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తనకు చెప్పకుండా మాజీ భర్త తమ ముగ్గురు పిల్లల్ని ఇస్లాంలోకి మార్చేశారని ఎం.ఇందిరాగాంధీ అనే హిందూ మహిళ దాఖలు చేసిన పిటిషన్లో ఆమె వాదనతో ధర్మాసనం సంపూర్ణంగా ఏకీభవించింది. ఆమె భర్త ముస్లింగా మారి, పిల్లల్నీ 2009లో ఇస్లాం మతంలోకి మారేలా చేశారు. 11 నెలల వయసున్న పాపను బలవంతంగా తీసుకుపోయాడంటూ ఆయనపై ఇందిరాగాంధీ ఫిర్యాదు చేశారు. మతమార్పిడిపై 9 ఏళ్లుగా న్యాయపోరాటం కొనసాగించారు.

‘గ్లోబల్ బ్యాటరీ అలయన్స్ ప్రిన్సిపల్’గా గల్లా జయదేవ్

ఈనాడు, దిల్లీ: తెదేపా ఎంపీ గల్లా జయదేవ్‌ను ‘గ్లోబల్ బ్యాటరీ అలయన్స్ ప్రిన్సిపల్’, ‘ఎలక్ట్రిసిటీ ఇండస్ట్రీస్ గవర్నర్’గా నియమిస్తున్నట్లు ప్రపంచ ఆర్థిక సదస్సు వెల్లడించింది. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ వస్తువుల వాడకం ఎక్కువ కావడంతో ఈ-వేస్ట్ ఎక్కువైందని , దీన్ని పునరుత్పాదన చేసేలా కృషి చేయాలన్నారు. తనకు పదవులు ఇచ్చినందుకు ప్రపంచ ఆర్థిక సదస్సుకి సోమవారం ఓ ప్రకటనలో ఎంపీ గల్లా జయదేవ్ కృతజ్ఞతలు తెలిపారు.

14 మంది ఐఐటీ విద్యార్థులకు ప్రతిష్ఠాత్మక అవార్డులు

దిల్లీ: మొత్తం 14 మంది ఐఐటీ విద్యార్థులకు ప్రతిష్ఠాత్మక ‘యంగ్ ఇంజినీర్ అండ్ సైంటిస్ట్’ అవార్డులను సోమవారం ప్రదానం చేశారు. 2017-18 సంవత్సరానికి ఇచ్చిన ఈ అవార్డు కింద ఒక్కో విద్యార్థికి దాదాపు రూ.లక్షా 90 వేల మేరకు ఉపకారవేతనం లభిస్తుంది. ‘హోండా మోటార్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్’ ఈ అవార్డులను ఐఐటీ విద్యార్థులకు అందచేసింది. వీరందరినీ కూడా ఉన్నత విద్యాభ్యాసానికి జపాన్ పంపుతారు. ఈ పురస్కారాలను పొందిన వారిలో హైదరాబాద్, దిల్లీ, ముంబయి, చెన్నై, ఖరగ్‌పూర్, కాన్పూర్‌లకు చెందిన విద్యార్థులున్నారు.

సెన్సెక్స్ ▲ 233 — 36283 | **నిఫ్టీ ▲ 61 — 11130**

రూపాయి 63.58 ▼ (ఒక అమెరికా డాలరుకు) 03 పైసలు

బంగారం 30,385 ▼ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 210

వెండి 39,385 ▼ ముంబయిలో కిలో రూ.లలో 385

ముడి చమురు 69.47 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	26,536	−81
నాస్‌డాక్	7,494	−12
నిక్కీ 225 (జపాన్)	23,629	−03
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,577	+10
షాంఘై(చైనా)	3,523	−35
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,672	+06
డాక్స్ (జర్మనీ)	13,324	−16


డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.88	67.11
పౌండ్ స్టెర్లింగ్	81.80	94.88
యూరో	71.82	82.30
జపనీస్ యెన్/100	53.23	61.74
ఆస్ట్రేలియా డాలరు	46.83	54.19
సింగపూర్ డాలరు	44.25	52.42
థాయ్ బాత్/100	184.88	221.11
బహ్రెయిన్ దీనార్	156.75	179.63
కువైట్ దీనార్	175.61	218.62
సౌదీ రియాల్	15.39	18.24
యూఏఈ దిర్హమ్	15.75	18.41
మలేషియా రింగిట్	14.63	18.00
చైనీస్ యువాన్	7.11	11.56

సోమవారం నిఫ్టీ కదలికలు



తెలుగు రాష్ట్రాల పన్ను దూకుడు

9 నెలల్లో రూ. 47,000 కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు

● వృద్ధి 30.9% ● మొత్తం ఏడాదికి రూ.50 వేల కోట్ల లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలలకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఆకర్షణీయంగా పెరిగాయని, దేశంలోనే అత్యధిక వృద్ధిరేటు నమోదైందని ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) ఎస్.పి.చౌదరి తెలిపారు. 2017-18లో డిసెంబరు నెల వరకూ దేశ వ్యాప్తంగా ప్రత్యక్ష పన్ను వసూళ్లు 18 శాతానికి పైగా పెరిగితే.. తెలుగు రాష్ట్రాల్లో వృద్ధిరేటు 30.9 శాతం ఉందని చెప్పారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులు (కార్పొరేట్, వ్యక్తిగత) ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టాప్సీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ సంఘం (టీపీపీటీబీపీ) కలిసి ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగతంగా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.47,000 కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలైనట్లు చెప్పారు. మొత్తం ఏడాదికి రూ.50,000 కోట్ల పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. చాలా మంది రిటర్న్‌లను దాఖలు చేయడం లేదని.. గత మూడేళ్లుగా రిటర్న్‌లు దాఖలు చేయని వారు దాఖలు చేయాలని కోరారు. దీనిపై దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో మొదటి తొమ్మిది నెలలకు అడ్వాన్స్ పన్ను వసూళ్లు 31.8 శాతం, మూలం వద్ద పన్ను వసూళ్లు (టీడీఎస్) 17.8 శాతం పెరిగినట్లు వివరించారు.

దేశ వ్యాప్తంగా..

దేశ వ్యాప్తంగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 18 శాతానికి పైగా పెరిగి రూ.6.89 లక్షల కోట్లకు చేరాయని, 2017-18కి మొత్తం రూ.9.8 లక్షల కోట్లను వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌టాప్సీ ప్రెసిడెంట్ గౌర శ్రీనివాస్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ లుహరుకా, ప్రత్యక్ష పన్నుల కమిటీ ఛైర్మన్ సురేశ్ కుమార్ జైన్, టీపీపీటీబీపీ ప్రెసిడెంట్ టి.రామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్‌టాప్సీ సదస్సులో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎస్.పి.చౌదరి (ఎడమ నుంచి రెండో వ్యక్తి). పక్కన ఎఫ్‌టాప్సీ ప్రెసిడెంట్ గౌర శ్రీనివాస్.

హెచ్‌డీఎఫ్‌సీ లాభం రెండింతలు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో తనఖా రుణాల సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఏకీకృత ప్రాతిపదికన రూ.6,677.06 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.2,728.66 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది రెండింతలు అధికం కావడం విశేషం. ఇక మొత్తం ఏకీకృత ఆదాయం రూ.14,988.87 కోట్ల నుంచి రూ.16,846.77 కోట్లకు చేరింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం 7.8 శాతం వృద్ధితో రూ.9,673.05 కోట్లకు పెరిగింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో బీమా ప్రీమియం ఆదాయం 18.5 శాతం అధికమై రూ.6,182.24 కోట్లకు వృద్ధి చెందింది. కేటాయింపులు సైతం రూ.153.13 కోట్ల నుంచి రూ.165.54 కోట్లకు చేరాయి. స్టాండలోన్ ప్రాతిపదికన.. అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ రూ.5,670.21 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది రూ.1,701.21 కోట్లుగా ఉంది. ఇక మొత్తం ఆదాయం రూ.8,148.61 కోట్ల నుంచి రూ.8,695.09 కోట్లకు చేరాయి.

రాణించిన టెక్‌మహీంద్రా

దిల్లీ: అక్టోబరు-డిసెంబరులో రూ.943.1 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని టెక్ మహీంద్రా నమోదు చేసింది. 2016-17 ఇదే కాలంలో ఆర్జించిన రూ.856 కోట్ల నికరలాభంతో పోలిస్తే, ఈసారి 10.17 శాతం పెరిగింది. మార్జిన్లు 15.7 శాతం నుంచి 16.3 శాతానికి చేరడం ఇందుకు దోహదపడింది. ఇదే సమయంలో ఆదాయం రూ.7,557.5 కోట్ల నుంచి 2.9 శాతం వృద్ధితో రూ.7,776 కోట్లకు చేరింది. డాలర్లలో చూస్తే నికరలాభం 16.5 శాతం పెరిగి 147 మిలియన్ డాలర్లకు, ఆదాయం 8.3 శాతం అధికమై 1.2 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంతో పోలిస్తే రూపాయల్లో నికరలాభం 12.8 శాతం, ఆదాయం 2.2 శాతం పెరిగాయి. భారత అకౌంటింగ్ ప్రమాణాల ప్రకారం ఈ ఫలితాలు విడుదల చేశామని, ప్రతి షేరుకు ఆర్జన రూ.10.73గా ఉందని సంస్థ తెలిపింది. ఈ త్రైమాసికంలో 18 మంది జతచేరడంతో, మొత్తం చురుకైన ఖాతాదారుల సంఖ్య 903కు చేరినట్లు వెల్లడించింది

తగ్గిన ఆర్‌కామ్ నష్టం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కాం) రూ.130 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నమోదు చేసిన రూ.531 కోట్ల నికర నష్టంతో పోలిస్తే ఈ సారి తగ్గడం గమనార్హం. నష్టాలు తెస్తున్న మొబైల్ వ్యాపారాన్ని మూసివేయడం ఇందుకు కలిసొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై- సెప్టెంబరులో కంపెనీ రూ.2,712 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. మొబైల్ వ్యాపారం నుంచి వైదొలగడం అనుకున్నదానికంటే మెరుగైన ఫలితాలు ఇచ్చిందని, నికర నష్టం 95 శాతం తగ్గిందని ఆర్‌కామ్ ఛైర్మన్ అనిల్ అంబానీ పేర్కొన్నారు. వచ్చే త్రైమాసికాల్లో కంపెనీ మరింత మెరుగైన ఫలితాలు నమోదు చేస్తుందని వెల్లడించారు. బీ2బీ సొల్యూషన్లు, అంతర్జాతీయ డేటా కేంద్రాలు, అంతర్జాతీయ సబ్‌మెరైన్ కేబుల్ నెట్‌వర్క్‌లను కంపెనీ కొనసాగించనుంది. ఇక మొత్తం ఆదాయం సైతం రూ.1,698 కోట్ల నుంచి 30 శాతం తగ్గి రూ.1,176 కోట్లకు పరిమితమైందని ఆర్‌కామ్ తెలిపింది.

నవభారత్ లాభం రూ.20 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: నవభారత్ వెంచర్స్ నికర లాభం స్వల్పంగా పెరిగింది. అంతక్రితం ఏడాదికి ఇదే కాలంతో పోలిస్తే 2017, డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన నికర లాభం 4.1 శాతం వృద్ధితో రూ.19.01 కోట్ల నుంచి రూ.19.79 కోట్లకు చేరిందని కంపెనీ తెలిపింది. ఆదాయం 53.21 శాతం పెరిగి రూ.595.97 కోట్లకు చేరింది. 2016, డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో ఆదాయం రూ.389 కోట్లుంది. స్టాండ్ అలోన్ ప్రాతిపదికన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి రూ.320.71 కోట్ల ఆదాయంపై రూ.31.56 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 14.15 శాతం, నికర లాభం 21.15 శాతం పెరిగాయని కంపెనీ తెలిపింది. దేశీయ విద్యుత్ వ్యాపారంలో తక్కువ మార్జిన్లు ఆదాయంపై ప్రభావం చూపాయని వివరించింది. ఫెర్రో అల్లాయిస్‌లో రికార్డు ఉత్పత్తిని నమోదు చేసింది.

22% తగ్గిన లారస్ ల్యాబ్స్ లాభం

ఈనాడు, హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు లారస్ ల్యాబ్స్ ఏకీకృత ప్రాతిపదికన రూ.34.87 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.45 కోట్లతో పోలిస్తే 22.5 శాతం తగ్గిందని కంపెనీ వెల్లడించింది. ఇదే కాలానికి మొత్తం ఆదాయం కూడా రూ.522.69 కోట్ల నుంచి 6.4 శాతం తగ్గి రూ.488.87 కోట్లకు పరిమితమైంది. నికర లాభం మార్జిన్ 7.3 శాతం ఉన్నట్లు లారస్ ల్యాబ్స్ పేర్కొంది. జనరిక్ ఏపీఐ పోర్టుఫోలియోలో స్వల్ప క్షీణత నమోదైనప్పటికీ.. సింథసిస్ విభాగం మంచి పనితీరు కనబరిచిందని కంపెనీ సీఈఓ చావా సత్యనారాయణ తెలిపారు.

బడ్జెట్ విన్నపాలు

● బడ్జెట్‌లో ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించి, కనీసం 4 శాతమైనా నిధులు కేటాయించాలి. 80 ఏళ్లకు పైబడిన సూపర్ సీనియర్ పౌరులకు పన్ను మినహాయింపు పరిమితి పెంచాలి.
– ప్రభంజన, శ్రీకాకుళం జిల్లా

● జీఎస్‌టీ వల్ల మధ్యతరగతి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలి. పన్ను ఎగవేతదారులపై కఠిన చట్టాలు అమలు చేయాలి. బ్యాంక్ లావాదేవీలను ప్రోత్సాహించాలంటే లావాదేవీలపై గల ఛార్జీలను ఎత్తివేయాలి.
– ఉప్పల రామేశం, కరీంనగర్

● రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టాలి. గోదాములు, శీతల గిడ్డంగులు వంటి మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్ద పీట వేయాలి. కొత్త బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.
తోకల సంపత్, నిజామాబాద్

● రైతులకు బ్యాంక్ రుణాలు సులభంగా లభించేలా చర్యలు చేపట్టాలి. శాస్త్ర, సాంకేతిక, విద్యా రంగాలకు కేటాయింపులు పెంచాలి. ఈపీఎఫ్ వడ్డీ రేట్లను 8.5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలి. గృహ రుణ వడ్డీ రేట్లను తగ్గించాలి, పసిడిపై పన్నులు హేతుబద్ధీకరించాలి.
– ఆంజనేయులు, షాద్‌నగర్, అనపర్తి వంశీ, విశాఖపట్నం

బడ్జెట్ నుంచి ఏమి ఆశిస్తున్నారో మీ ఫొటోతో సహా మాకు పంపండి
businessdesk@eenadu.net,
eenadubusinessdesk@gmail.com
పాఠకుల మరిన్ని వినతులు
www.eenadu.net బడ్జెట్-2018 స్పెషల్ విభాగంలో

జీఎస్‌టీ — సతీశ్ సరాఫ్ వ్యాసం రేపటి సంచికలో

మారుతీ సునామీ

● 4 శాతం పెరిగిన షేరు
● కొత్త గరిష్ఠాలకు సూచీలు
● కలిసొచ్చిన ఆర్థిక సర్వే

సమీక్ష

వాహన దిగ్గజం మారుతీ సుజుకీ షేరు లాభాల సునామీ సృష్టించింది. సెన్సెక్స్ షేర్లలోనే అత్యధిక లాభాన్ని మూటగట్టుకుంది. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలను కంపెనీ ప్రకటించడమే ఇందుకు నేపథ్యం. ఇంట్రాడేలో 4.72 శాతం పెరిగిన షేరు.. చివరకు 3.85 శాతం లాభంతో రూ.9,634.50 వద్ద ముగిసింది. ఇక జీడీపీ వృద్ధి 7- 7.5 శాతం మేర ఉండొచ్చని ఆర్థిక సర్వే అంచనా వేయడం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. ఫలితంగా మార్కెట్లు సరికొత్త జీవన కాల గరిష్ఠాలను అధిరోహించాయి. కొత్త డెరివేటివ్ కాంట్రాక్టుల ప్రారంభం నేపథ్యంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఆసియా మార్కెట్లు డీలాపడగా.. ఐరోపా షేర్లు సానుకూలంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 36,106.36 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం కొనుగోళ్ల మద్దతుతో అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 36,443.98 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే లాభాల స్వీకరణతో చివరకు 232.81 పాయింట్లు పెరిగి 36,283.25 వద్ద ముగిసింది. సెన్సెక్స్ గత అత్యధిక ముగింపు 36,161.64 పాయింట్లను అధిగమించింది. ఇక నిఫ్టీ సైతం 11,171.55 పాయింట్ల దగ్గర జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 60.75 పాయింట్ల లాభంతో 11,130.40 దగ్గర స్థిరపడింది. నిఫ్టీకి సైతం ఇది రికార్డు ముగింపు కావడం విశేషం.

రాణించిన న్యూజెన్

న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదైన తొలిరోజే రాణించాయి. బీఎస్ఈలో ఇష్యూ ధరైన రూ.245తో పోలిస్తే 3.26 శాతం ఎక్కువగా రూ.253 వద్ద షేరు నమోదైంది. చివరకు అక్కడే ముగిసింది. ఒకానొకదశలో షేరు రూ.266.50 వద్ద గరిష్ఠాన్ని తాకింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ 2.66%, టీసీఎస్ 2.48%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.02%, హీరో మోటోకార్ప్ 1.97%, హిందుస్థాన్ యునిలీవర్ 1.90%, టాటా స్టీల్ 1.79%, బజాజ్ ఆటో 1.78%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.49%, ఎం అండ్ ఎం 1.10%, సన్‌ఫార్మా 1.09%, ఎల్ అండ్ టీ 1.09% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్ (5.92%), భారతీ ఎయిర్‌టెల్ (2.66%), ఐటీసీ (1.85%), యెస్ బ్యాంక్ (1.64%), ఓఎన్‌జీసీ (1.58%), యాక్సిస్ బ్యాంక్ (1.36%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో వాహన 1.60% లాభపడింది. ఐటీ 1.16%, టెక్ 0.92%, మన్నికైన వినిమయ వస్తువులు 0.60% చొప్పున రాణించాయి. పీఎస్‌యూ, మౌలిక, ఆరోగ్య సంరక్షణ, చమురు- గ్యాస్, విద్యుత్, స్థిరాస్తి, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు డీలాపడ్డాయి.

ఐఎస్‌బీ ఎంబీఏకు 28వ ర్యాంకు

ఈనాడు, హైదరాబాద్: ఫైనాన్షియల్ టైమ్స్ గ్లోబల్ ఎంబీఏ 2018 ర్యాంకింగ్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌కు 28 ర్యాంక్ లభించింది. మొదటి 100 గ్లోబల్ ఎంబీఏ కోర్సుల్లో ఐఎస్‌బీ కోర్సు 28 స్థానంలో ఉందని ఐఎస్‌బీ పేర్కొంది. భారత్‌లో అత్యధిక ర్యాంక్ కలిగిన బిజినెస్ స్కూల్ అని తెలిపింది. వేతన పెంపు శాతం, ప్లేస్‌మెంట్ల పరంగా కూడా అంతర్జాతీయంగా ఐఎస్‌బీ మొదటి అయిదు స్థానాల్లో ఉంది. భవిష్యత్తులో పరిశోధన కేంద్రాలు, ఫేకల్టీపై పెట్టుబడులు కొనసాగుతాయని, ప్రపంచ స్థాయి బిజినెస్ విద్యను అందించడంపై ఐఎస్‌బీ దృష్టి కొనసాగుతుందని ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవత్సవ తెలిపారు. ఇప్పటి వరకూ ఐఎస్‌బీలో ఉన్నత విద్యను అభ్యసించిన 8,600 మంది 42 దేశాల్లో ఉన్నారని చెప్పారు.

ఏపీకి 10 కొత్త విమాన సర్వీసులు: స్పైస్‌జెట్

దిల్లీ: దేశంలో 20 కొత్త విమాన సర్వీసులను ఫిబ్రవరి 11 నుంచి ప్రవేశపెడుతున్నట్లు స్పైస్‌జెట్ ప్రకటించింది. వీటిలో దక్షిణాదిలోనే 18 సర్వీసులుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 4 నగరాలకు 10 కొత్త విమాన సర్వీసులు నిర్వహిస్తామని సంస్థ తెలిపింది. బెంగళూరు నుంచి రాజమహేంద్రవరం, తిరుపతి నగరాలకు; చెన్నై నుంచి విశాఖపట్నం, విజయవాడ నగరాలకు; కోల్‌కతా నుంచి విశాఖపట్నం మార్గాల్లో కొత్త, అదనపు సర్వీసులు ఉంటాయని సంస్థ తెలిపింది.

మార్కెట్ కబుర్లు

✦ హెచ్ఐవీ-1 ఇన్‌ఫెక్షన్ చికిత్సలో ఉపయోగించే టెనోఫోవిర్ డిసోప్రోక్సిల్ ఫ్యుమరేట్ మందుబిళ్లలకు అమెరికా ఆహార ఔషధ, నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి అనుమతులు లభించాయని **సిప్లా, స్ట్రైడ్స్ శాసన్**‌లు తెలిపాయి. ఈ మందుబిళ్లలు జిలీడ్ సైన్సెస్‌కు చెందిన విరీడ్ మందుబిళ్లలకు జనరిక్ రూపం.

✦ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ నుంచి రూ.413 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయని **కేఎస్‌బీ పంప్స్** వెల్లడించింది.

✦ ఫిబ్రవరి 6 తేదీన జరిగే డైరెక్టర్ల బోర్డు సమావేశంలో రెండో మధ్యంతర డివిడెండు అంశాన్ని బోర్డు పరిశీలించనుందని **నాట్కో ఫార్మా** తెలిపింది.

✦ బీహార్‌లో ఆరు లేన్ల రహదారి నిమిత్తం ఎన్‌హెచ్ఏఐ నుంచి రూ.882 కోట్ల ఆర్డరు చేజిక్కించుకున్నట్లు **రిలయన్స్ ఇన్‌ఫ్రా** వెల్లడించింది.

✦ రుణాల చెల్లింపులు చేయడంలో అశక్తతను కారణంగా చూపుతూ దివాలా దరఖాస్తును **రికో ఇండియా** సమర్పించింది.

✦ వచ్చే ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం కింద రూ.4,000 కోట్లను వెచ్చించనున్నట్లు **మారుతీ సుజుకీ** వెల్లడించింది. ఇందులో కొంత మొత్తాన్ని కొత్త ఉత్పత్తుల అభివృద్ధికి ఉపయోగించనుంది.

✦ **పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్**‌లో 1.47 శాతం వాటాను బహిరంగ విపణి లావాదేవీ ద్వారా మోర్గాన్ స్టాన్లీ విక్రయించింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
సెంచురీ టెక్స్‌టైల్స్	89.94	17.16	2,086.57	1,938.25
ఐడీఎఫ్‌సీ (కన్సా)	107.89	101.28	2,794.67	2,825.13
మహీంద్రా లాజిస్టిక్స్	15.46	11.45	836.50	717.12
ఓరియెంట్ సిమెంట్	(17.67)	(11.66)	513.51	532.02
వోకార్డ్ (కన్సా)	(40.76)	(53.91)	1,005.30	995.56
నొవార్టిస్ ఇండియా	18.74	13.03	170.55	179.45
హిమాద్రీ స్పెషాలిటీ	70.14	20.11	501.8	393.36
ఇమామీ (కన్సా)	147.08	134.34	762.16	734.12
ఐనాక్స్ లీజర్ (కన్సా)	13.19	3.75	328.85	300.15

నేటి బోర్డు సమావేశాలు

★ ఐటీసీ ★ గోద్రేజ్ కన్జూమర్ ప్రోడక్ట్స్ ★ టీవీఎస్ ★ రిలయన్స్ పవర్ ★ సువెన్ లైఫ్ సైన్సెస్ ★ ఎస్‌బీఐ లైఫ్ ★ బీఈఎల్ ★ భారత్ ఫైనాన్షియల్ ★ అశోకా బిల్డ్‌కాన్ ★ పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్ ★ ఇంజినీర్స్ ఇండియా ★ జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ★ లక్ష్మీ విలాస్ బ్యాంక్ ★ మహీంద్రా లైఫ్‌స్పేస్ ★ ఓరియెంటల్ బ్యాంక్ ★ గ్రాఫైట్

29వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	370	వరంగల్	372
చిల్లరగా(ఒక గుడ్డు)	4.30	విశాఖపట్నం	382
బెంగళూరు	380	చెన్నై	390
30న		చిత్తూరు	383
విజయవాడ/గోదావరి	372	నమక్కల్	375

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 436.65 (436.50) 2126497
AMBUJA CEMEN 263.65 (263.00) 1420895
ASIAN PAINTS 1152.05 (1150.45) 1538762
AUROBIND PHA 635.25 (639.70) 1317269
AXIS BANK LT 605.55 (616.10) 7017160
BAJAJ AUTO L 3363.90 (3311.70) 365342
BAJAJ FINANC 1715.30 (1710.30) 643137
BHARTI AIRTE 440.60 (452.70) 24459885
BHARTI INFRA 353.40 (343.45) 4249433
BOSCH LTD 19879.20 (19642.50) 12310
BPCL 469.80 (480.65) 2647116
CIPLA 615.00 (621.40) 1564268
COAL INDIA L 301.75 (299.40) 3557035
DR. REDDYS 2357.10 (2507.75) 1154567
EICHER MOTOR 27453.65 (26519.40) 127423
GAIL 474.35 (493.75) 4257007
HCL TECH 1012.05 (1009.55) 2006648
HDFC 1967.60 (1908.30) 6305147
HDFC BANK 1999.65 (1974.95) 2058973
HERO MOTOCOR 3641.75 (3571.20) 403110
HINDALCO IND 258.60 (258.95) 5990929
HINDUSTAN UN 1397.30 (1372.75) 1406390
HPCL 375.15 (384.15) 14148623
ICICI BANK 357.65 (360.80) 17855095
INDIABULLS H 1421.15 (1394.00) 2220889
INDIAN OIL 399.65 (392.30) 3058457
INDUSINDBANK 1742.50 (1730.20) 1232573
INFOSYS LTD 1182.90 (1175.40) 5411501
ITC 275.65 (281.25) 9569723
KOTAK MAHIND 1115.10 (1092.35) 2215014
LARSEN & TOU 1431.95 (1416.50) 2945415
LUPIN 912.20 (949.65) 1520775
M&M 764.35 (757.80) 2074165
MARUTI SUZIK 9630.70 (9278.20) 1546624
NTPC LTD 171.05 (171.95) 10765685
ONGC 205.15 (208.50) 7620080
POWER GRID C 194.15 (194.30) 6189131
RELIANCE IND 964.50 (965.90) 4524605
SBI 312.10 (313.15) 23600898
SUN PHARMA 587.95 (579.85) 6006564
TATA CONSULT 3198.85 (3121.05) 1570530
TATA MOTORS 399.25 (400.30) 5789602
TATA STEEL L 783.15 (769.15) 6508012
TECH MAHINDR 604.80 (598.45) 3352495
ULTRATECH 4390.70 (4359.95) 263874
UPL LIMITED 788.50 (768.95) 5546134
VEDANTA LIMI 345.00 (345.60) 13215637
WIPRO 311.15 (311.95) 3523977
YES BANK LTD 358.00 (361.60) 7931235
ZEE ENTERTAI 608.90 (595.85) 4384110

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1621.80 (1659.30) 95398
ACC 1738.70 (1726.40) 214335
ASHOK LEYLAN 125.40 (122.30) 13757107
AVENUE SUPER 1181.90 (1159.30) 3086852
BAJAJ FINSER 4912.40 (4933.05) 100404
BANK OFBAROD 162.35 (167.15) 12013160
BEL 175.65 (176.90) 3623490
BHEL 101.90 (103.00) 8267296
BRITANNIA 4692.10 (4625.60) 110221
CADILA HEALT 419.80 (418.15) 455894
COLGATE PALM 1148.80 (1151.00) 108093
CONTAINER 1400.40 (1440.40) 180621
CUMMINS INDI 897.20 (911.10) 122578
DABUR INDIA 359.70 (353.75) 1118359
DLF LIMITED 254.05 (253.60) 5914647
EMAMI LIMITE 1230.45 (1202.45) 323705
GLAXOSMI CON 6476.65 (6477.05) 20405
GLAXOSMI PHA 2449.55 (2466.70) 12073
GLENMARK PHA 622.10 (634.25) 670198
GODREJ CONSU 1060.00 (1075.00) 1292913
HAVELLS INDI 575.50 (580.55) 1633198
HINDUSTAN ZI 304.15 (298.55) 3747559
ICICI PRU LI 417.20 (429.90) 1414943
IDEA CELLULR 93.60 (95.10) 23282771
INTERGLOBE A 1200.40 (1238.05) 350043
JSW STEEL LT 293.45 (290.80) 4673841
LIC HOUS.FIN 547.80 (555.85) 2737937
MARICO LIMIT 310.70 (307.45) 781405
MCDOWELL 3284.75 (3367.55) 473389
MOTHERSON 369.95 (370.15) 3659051
MRF 66906.75 (67543.65) 7203
NHPC LTD 29.85 (29.70) 4151765
NMDC LTD 143.30 (143.70) 3226331
OIL INDIA 366.45 (381.70) 796360
ORACLE FIN S 4206.15 (4230.80) 26336
P&G HYG&HEAL 9252.15 (9301.75) 3355
PETRONET LNG 250.50 (244.00) 4019177
PIDILITE IND 893.60 (877.25) 601009
PIRAMAL ENTE 2794.05 (2771.20) 100328
PNB 173.95 (180.90) 18481283
POWER FIN CO 117.60 (118.75) 2880079
RURAL ELEC C 157.60 (157.85) 1706389
SAIL 91.85 (93.95) 7819606
SHREE CEMENT 17826.70 (18161.85) 40951
SHRIRAM TRAN 1431.45 (1446.20) 784900
SIEMENS 1288.05 (1296.10) 113041
SUN TV LTD 1021.10 (1033.70) 431187
TATA POWER 90.05 (89.95) 4361006
TITAN IND 896.20 (884.10) 1151570
TORRENT PHAR 1378.35 (1421.40) 311847

ఘనం (+)

నిఫ్టీ	29న	మార్పు %
MARUTI SUZUKI	9630.70	3.80
EICHER MOTORS	27453.65	3.52
HDFC	1967.60	3.11
BHARTI INFRATEL	353.40	2.90
UPL	788.50	2.54
TCS	3198.85	2.49
ZEE ENTERTAINMENT	608.90	2.19

గ్రహణం (-)

నిఫ్టీ	29న	మార్పు%
DR. REDDYS LAB	2357.10	-6.01
LUPIN	912.20	-3.94
GAIL	474.35	-3.93
BHARTI AIRTEL	440.60	-2.67
HPCL	375.15	-2.34
BPCL	469.80	-2.26
ITC	275.65	-1.99

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 916.55 (918.45) 1983
AMAR RAJA BA 807.95 (840.90) 222892
ANDHRA BANK 54.25 (56.05) 277456
ANDHRA CEMEN 12.05 (12.47) 41071
ANDHRA PAPER 347 (359.25) 17725
ANDHRA PETRO 72.85 (76.65) 178995
ANDHRA SUGAR 651.95 (671.85) 2250
ASTRA MICROW 117.70 (111.95) 201187
AUROBINDO PH 635.20 (641.35) 92854
AVANTEL SOFT 526.90 (501.85) 7291
AVANTI FEEDS 2378.25 (2438.55) 11409
BALAJI AMIN 719.25 (751.60) 28725
BARTRONICS 14.16 (14.17) 13375
BHAGIRA CHEM 315.65 (307.10) 3071
BRILLIANT SE 15.28 (14.56) 503839
CAMBRIDGE TE 88 (89.50) 5209
CONT COFFEE 290.75 (292.10) 1435
COROMAN FERT 532.90 (543.75) 520301
CYBERMATE 3.60 (3.70) 119795
CYIENT LIMIT 649.25 (642.85) 57831
DECCAN CEMEN 580.40 (592.35) 367
DIVI'S LAB 1100.25 (1122) 42679
DR REDDY 2355.75 (2504) 97407
GATI CORPN 133.20 (134.45) 159409
GAYATRI PROJ 217.05 (220.40) 22164
GMR INFRASTR 22.70 (22.80) 4744549
GOLDST INFRA 215.20 (216.70) 25566
GRANULES (I) 134.95 (136.60) 103169
GVK POWER 20.20 (21.20) 468048
HBL NIFE POW 64.25 (65.05) 113829
HERITAGE FOO 777.10 (800.95) 1618
HYD INDUS 1844.10 (1801.50) 9374
IKF SOFT 0.87 (0.73) 1837898
ILFS ENGINEE 46.65 (48.20) 5939
INNAREDY COM 4.30 (4.52) 13149
IVRCL INFRAS 5.44 (5.24) 275316
KAKATIYA CEM 371.10 (379.10) 6364
KALLAM SPG 21.65 (22.05) 35155
KAVERI SEED 504.40 (513.10) 43915
KCP LTD 145.85 (147.75) 18651
KNR CONSTRUC 313.55 (315.10) 6822
LANCO INDUS 393.10 (391.75) 9669
LANCO INFRAT 1.61 (1.69) 5156885
LAURUS LABS 538.65 (547.35) 12916
MADHUCON PRO 32.20 (33.55) 33369
MIC ELECTRON 9.19 (8.77) 220962
MOLD-TEK.TEC 69.80 (70.90) 2541
MOLDTK PLA 351.70 (364.80) 1900
NAGARJAGRICH 53.95 (53.85) 28291
NATCO PHARMA 982.85 (995.15) 18449
NAVA BH VENT 159.45 (162.10) 76306
NCC 127 (127.80) 244538
NCL IND 278.30 (283.45) 16309
NETTLINX 85.90 (84.25) 55492
NEULAND LAB 865.35 (888.20) 2748
NIHAR INFO 14.60 (14.09) 500
NILE 940.40 (946.15) 8686
OIL COUNTRY 54.35 (53.30) 47885
PANYAM CEMEN 58.80 (58.85) 7716
PENNER IND 62.20 (63.90) 94195
PIONEER DIST 205.80 (202) 1203
POKARNA 219.05 (226.25) 8036
PRAJAY ENGS 15.45 (16.25) 20626
PREMIER EXPL 442.60 (452.65) 42923
PRISM CEMENT 130.30 (134.55) 125053
PRUDENTL PHA 4.89 (5.07) 128233
RAIN INDUSTR 403.30 (419) 417578
SAGAR CEM 1011.75 (1040.15) 3883
SAMKRG PIST 330.85 (328.65) 7368
SAMPRE NUTRI 72.05 (75.25) 14409
SATVAH. ISPA 27.70 (28.75) 13631
SMS PHARMA 100.30 (101.30) 15085
SREE RAYAL A 65.15 (69.15) 273214
STEEL EXCHAN 34.35 (35.10) 134046
SUJANA METAL 1.60 (1.56) 16000
SUJANA UNIVE 1.02 (0.98) 129800
SURYALATA SP 170.50 (174.30) 1578
SUVEN PHARMA 240 (215.10) 1143860
TAJ GVK HOTE 175.80 (183.10) 8850
TANLA 33.55 (34.80) 205342
TERA SOFTWAR 73.50 (68.85) 28969
VICEROY HOTE 17.80 (19.15) 103296
VIJAY TEXTIL 62.95 (63.90) 28659
VIMTA LABS 208.15 (215.60) 65939
VIVIMED LABS 89.45 (89.70) 112454
YBRANT DIGIT 6.46 (6.63) 225534
ZENTECH 125.20 (125.80) 28659

ఆర్థిక సర్వే ముఖ్యాంశాలు

- జీడీపీ వృద్ధి రేటు ఈ ఏడాది 6.75%, 2018-19లో 7-7.5% మధ్య ఉండొచ్చు. దీంతో అత్యంత వేగంగా పురోగమిస్తున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తన ప్రాభవాన్ని కొనసాగిస్తుంది.
- చమురు ధరలపై ఆందోళన కొనసాగవచ్చు. వినియోగదార్ల నుంచి గిరాకీ పెరగవచ్చు.
- అంతర్జాతీయ ముడి చమురు ధరలు 10 డాలర్లు పెరిగితే జీడీపీ 0.2-0.3% తగ్గవచ్చు.
- ఈ ఏడాది తయారీ రంగం 8 శాతం వృద్ధి రేటును నమోదు చేయవచ్చు.
- వచ్చే ఏడాది ఉద్యోగాలు, వ్యవసాయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. జీఎస్టీని స్థిరపరచాలి. బ్యాంకులకు మూలధన పునర్నిర్మాణ ప్రణాళికను పూర్తి చేయాలి.
- వ్యవసాయ రంగ వృద్ధి రేటు ఈ ఏడాది 2.1 శాతంగా నమోదయ్యే అవకాశం ఉంది.
- పెద్ద నోట్ల రద్దు అనంతరం, జీఎస్టీ అమలు నేపథ్యంలో 18 లక్షల మంది కొత్త పన్ను చెల్లింపుదార్లు జతచేరారు. పరోక్ష పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 50 శాతం పెరిగింది.
- దివాలా చట్టాన్ని సమర్థంగా అమలు చేయడంవల్ల ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతాయి.
- పెద్ద నోట్ల రద్దు వల్ల ఆర్థిక పొదుపునకు ప్రోత్సాహం లభించింది.
- దివాలా స్మృతి వల్ల మొండి బకాయిల సమస్యల పరిష్కారానికి ఒక సాధనం లభించింది.
- రిటైల్ ద్రవ్యోల్బణం గత ఆరు ఆర్థిక సంవత్సరాల్లోనే అతి తక్కువగా ఈ సారి(2017-18) సగటున 3.3 శాతంగా నమోదు కావొచ్చు.
- సంస్కరణల నేపథ్యంలో 2017-18లో సేవల రంగంలో ఎఫ్‌డీఐ 15 శాతం పెరిగింది.
- కార్మిక చట్టాలను మెరుగ్గా తీసుకురావడానికి సాంకేతికతను ఉపయోగించుకోవాలి.


అరవింద్ సుబ్రమణియన్

10 అంశాలు కొత్త కొత్తగా..

1. ప్రత్యక్ష, పరోక్ష పన్ను చెల్లింపుదార్ల సంఖ్య పెరిగింది. పరోక్ష పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 50 శాతం పెరిగింది. ఏప్రిల్-నవంబరు 2017లో ప్రత్యక్ష పన్నులు 13.7%; పరోక్ష పన్నులు 18.3 శాతం వృద్ధి రేటును నమోదు చేసిన నేపథ్యంలో మొత్తం మీద ఇవి లక్ష్యాలను చేరేలా కనిపిస్తున్నాయి.
2. వ్యవసాయేతర ఉద్యోగాలు అంచనాల కంటే ఎక్కువగా ఉన్నాయి.
3. భారత చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్రాలకు చెందిన అంతర్జాతీయ ఎగుమతుల గణాంకాలను ఆర్థిక సర్వేలో పొందుపరచారు. ఈ గణాంకాలు ఎగుమతుల పనితీరుకు, రాష్ట్రాల జీవన ప్రమాణాలకు మధ్య గట్టి అనుబంధాన్ని సూచిస్తున్నాయి.
4. రెండు మూడేళ్ల పాటు ప్రతికూలంగా కనిపించిన ఎగుమతుల వృద్ధి రేటు 2016-17లో సానుకూలంగా మారింది. 2017-18లో మరింత వేగంగా పరుగులు తీస్తుంది.
5. దుస్తులకిచ్చిన ప్రోత్సాహక ప్యాకేజీ రెడీమేడ్ దుస్తుల ఎగుమతులకు ఊతమిచ్చింది.
6. భారత్‌లో తల్లిదండ్రులు కుమారులు పుట్టేంతవరకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇంకా కుమారులు పుట్టాలనే బలమైన కోరిక కనిపిస్తూనే ఉంది. దీని వల్ల గర్భవిచ్ఛిత్తులు(అబార్షన్లు) ఉంటూనే ఉన్నాయి. దీని వల్ల 6.3 కోట్ల మంది మహిళలు 'కనుమరుగవుతున్నా'రని అంచనా.
7. న్యాయ వ్యవస్థలో అధిక పనిభారం వల్ల ఆలస్యాలు, వాయిదాలు ఎక్కువగా ఉంటున్నాయి. పన్ను వివాదాల్లోనూ ప్రతి దశలోనూ వివిధ ప్రక్రియల (ఇంజెంక్షన్లు, స్టేలు) కారణంగా తీర్పులు ఆలస్యమవుతూనే ఉన్నాయి.
8. వృద్ధికి ఊతమివ్వడానికి పొదుపు చేయడం కంటే పెట్టుబడులు చాలా ముఖ్యం. పొదుపులో వృద్ధి వల్ల ఆర్థిక వృద్ధి కనిపించదు.. కానీ పెట్టుబడులు ఆ పనిని చేయగలవని సర్వే పేర్కొంది.
9. రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాల ప్రత్యక్ష పన్నులు ఇతర దేశాల్లోని ఆయా వ్యవస్థలతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయి.
10. తీవ్ర వాతావరణ ప్రభావం వల్ల వ్యవసాయ దిగుబడులపై ప్రభావం కనిపిస్తోంది. ఉష్ణోగ్రతలు పెరగడం; వర్షపాతం పెరగడం వంటి మార్పుల వల్ల వ్యవసాయంపై ప్రభావం ఉంటోంది.

మలుపులున్నా.. అలుపు లేదు

ఆర్థిక సర్వే.. భారత ఆర్థిక స్థితిగతులను ఆవిష్కరించింది. భారత వృద్ధి బాటలో కొన్ని గతుకులు ఎదురవుతాయని చెప్పింది. అయితే వాటిని సమర్థంగా అధిగమించి ప్రపంచంలోనే అత్యంత వేగంగా పరుగులు తీస్తున్న ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని నొక్కి చెప్పింది. జీఎస్టీ రాకతో పన్ను పరిధిలోకి లక్షల కొద్దీ వ్యక్తులు వచ్చిచేరారని చెప్పింది. జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు ప్రతికూలతలు కనుమరుగై.. ఇక సానుకూల ఫలితాలు రావడమే ఆలస్యమని భవిష్య వాణి చెప్పింది. వివిధ అంశాలపై కూలంకషంగా చర్చించింది. ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. ఆ అంశాలను అవలోకిస్తే..

అంచనాలకు మించి సంఘటిత రంగంలో ఉద్యోగాలు

సంఘటితరంగంలో అంచనా వేసిన దానికంటే అధిక సంఖ్యలో ఉద్యోగాలున్నాయని ఆర్థిక సర్వే తెలిపింది. ఉపాధి వయస్సులోని యువత సంఖ్య అధికమవుతున్నందున, వారికి నాణ్యమైన ఉద్యోగాలు కల్పించడం మధ్యకాలానికి సవాలేనని పేర్కొంది. ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్‌ఓ), కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) సమాచారం ప్రకారం వ్యవసాయేతర సంఘటితరంగంలో 7.5 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారని భావిస్తే, వాస్తవంలో 12.7 కోట్ల మంది పనిచేస్తున్నారని తెలిపింది. సామాజిక భద్రతా పథకాల ప్రకారం సంఘటితరంగంలోని ఉద్యోగుల సంఖ్య 6 కోట్లు మాత్రమే. రక్షణ బలగాలు మినహా, ప్రభుత్వ ఉద్యోగాల్లో 1.5 కోట్ల మంది ఉన్నారని, ఫలితంగా మొత్తం ఉద్యోగుల సంఖ్య 7.5 కోట్లుగా నమోదైందని పేర్కొంది. స్థిర, సమగ్ర, తాజా వివరాలు అందుబాటులో లేకపోవడమే ఈ తేడాలకు కారణమని పేర్కొంది.

- వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి పొందుతున్న వారు 24 కోట్ల మంది. దీనిప్రకారం సంఘటిత రంగంలో 31 శాతం మంది వ్యవసాయేతర రంగంలో ఉన్నారు.
- పన్ను గణాంకాల ప్రకారం సంఘటితరంగ ఉద్యోగులు 11.2 కోట్ల మంది. ప్రభుత్వ ఉద్యోగులు జతైతే, ఈ సంఖ్య 12.7 కోట్లు అవుతుంది. అంటే వ్యవసాయేతర రంగాల్లో 54 శాతం మంది సంఘటిత వ్యవస్థల్లో పనిచేస్తున్నారు.
- జీఎస్టీలో నమోదైన చిన్న సంస్థలు కూడా తమ కొనుగోళ్లపై పన్ను క్రెడిట్ పొందవచ్చు. దీనివల్ల జీఎస్టీ ఆవల ఉండే ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి రంగాల్లోని ఉద్యోగులు నమోదు కాకపోవచ్చు.

పన్ను పరిధిలోకి 34 లక్షల మంది

జీఎస్టీ అమలు కారణంగా పరోక్ష పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 50 శాతం పెరిగింది. పన్ను పరిధిలోకి 34 లక్షల మంది కొత్తగా వచ్చారని ఆర్థిక సర్వే పేర్కొంది. స్వచ్ఛందంగా రిజిస్ట్రేషన్లు పెరగడంతో జీఎస్టీ నమోదిత వ్యక్తుల సంఖ్య భారీగా పెరిగింది. ముఖ్యంగా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను అందిపుచ్చుకోవడం కోసం చిన్న కంపెనీలు వరుస కట్టాయి. జీఎస్టీ కారణంగా ఆదాయ పన్ను వసూళ్లు పెరిగాయి. ఇది నిజంగా ఆశ్చర్యకరమే. జులైలో రూ.95,000 కోట్లు, ఆగస్టులో రూ.91,000 కోట్లు; సెప్టెంబరులో రూ.92,150 కోట్లు, ఆక్టోబరులో రూ.83,000 కోట్లు; నవంబరులో రూ.80,808 కోట్లు; డిసెంబరులో రూ.86,703 కోట్లు చొప్పున వసూలయ్యాయి. అత్యధికంగా జీఎస్టీ నమోదులు జరిగిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, గుజరాత్‌లు న్నాయి. పాత పన్ను విధానంతో పోలిస్తే అధికంగా పన్ను నమోదిత వ్యక్తుల సంఖ్య పెరిగిన విషయంలో ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బంగలు ముందు నిలిచాయి. రూ.20 లక్షల కంటే ఆదాయ పన్ను తక్కువగా ఉన్నప్పటికీ 17 లక్షల మంది వ్యాపారస్తులు జీఎస్టీలోకి చేరడం విశేషం.

- డిసెంబరు 2017 నాటికి 98 లక్షల మంది వ్యాపారులు జీఎస్టీలో చేరారు. జీఎస్టీకి ముందు కేంద్రం, రాష్ట్రాల పన్ను వసూళ్లు రూ.9.7 లక్షల కోట్లు ఉండగా.. జీఎస్టీ వార్షిక వసూళ్లు రూ.10.9 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా.

మొండి బకాయిల పరిష్కారం.. దివాలా చట్టంతో

కొత్త దివాలా స్మృతి చట్టం ద్వారా బ్యాంకింగ్ రంగంలోని మొండి బకాయిల సమస్యలను పరిష్కరించడానికి చురుగ్గా ప్రయత్నం చేస్తున్నారు. కొత్త చట్టంల న్యాయ అంశాల చేదోడు ఎక్కువగా ఉంది. దీని కింద కఠిన సమయ పరిమితులుండడం ఇందుకు నేపథ్యం. దివాలా చట్టం తీసుకువచ్చిన ప్రణాళిక కారణంగా కార్పొరేట్లు తమ బ్యాలెన్స్‌షీట్లలను ప్రక్షాళించుకోవడానికి, రుణాలను తగ్గించుకోవడానికి వీలవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగ పనితీరు ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్తబ్దుగా ఉండొచ్చు. సెప్టెంబరు 30, 2017 నాటికి ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో మొత్తం బ్యాంకు ఆస్తుల్లో 17 శాతాన్ని, బ్యాంకు డిపాజిట్లలో 0.26 శాతాన్ని కలిగి ఉన్నాయి. వీటి ఏకీకృత బ్యాలెన్స్ సీట్ పరిమాణం 5 శాతం(మార్చి 2017తో పోలిస్తే సెప్టెంబరు 2017లో) పెరిగి రూ.20.7 లక్షల కోట్లకు చేరింది.

- మార్చి 2017 నుంచి సెప్టెంబరు 2017 మధ్య వాణిజ్య బ్యాంకుల్లో స్థూల నిరర్థక ఆస్తుల అడ్వాన్సుల(జీఎన్‌పీఏ) నిష్పత్తి 9.6 శాతం నుంచి 10.2 శాతానికి పెరిగింది.
- భారీమొత్తంలో రుణాలు ఎగవేసిన 11 కంపెనీలకు సంబంధించి రూ.3.13 లక్షల కోట్ల విలువైన క్లెయిమ్‌లు దివాలా స్మృతి ప్రక్రియకు చేరాయని సర్వే తెలిపింది.

చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు రుణాలు దొరకట్లేదు

వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడానికి భారత్‌లోని సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి(ఎమ్ఎస్ఎమ్ఈ) కంపెనీలకు సరైన రుణ సదుపాయాలు లభించడం లేదు. మొత్తం రుణాల జారీలో ఈ రంగానికి కేవలం 17.4 శాతం వాటానే దక్కుతోంది. సూక్ష్మ, చిన్న కంపెనీలకిచ్చే రుణాల్లో వృద్ధి 4.6 శాతం పెరగ్గా.. మధ్య స్థాయి వాటికి 8.3 శాతం వరకు తగ్గింది. 2016-17లో ప్రధాన్ మంత్రి ముద్ర యోజన కింద ఇచ్చిన రుణాలు లక్ష్యాన్ని(రూ.1.8 లక్షల కోట్లు) అధిగమించాయి. ఇందులో రూ.1.23 లక్షల కోట్లు బ్యాంకులివ్వగా.. రూ.57,000 కోట్లు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలిచ్చాయి.

ఎగుమతుల పన్నులపై పునరాలోచించాలి

కొత్త పన్ను(జీఎస్టీ) కింద లేదా బయట ఎగుమతుల ఉత్పత్తులపై పడే పలు పన్నుల విషయాన్ని జీఎస్టీ మండలిని సమీక్షించాలి. వాటిలో పన్నుపై పన్ను పడే అంశాలను తొలగించడం వల్ల ఆ రంగానికి ఊతమివవ్వచ్చు. దుస్తుల రంగానికిచ్చిన రూ.6000 కోట్ల ప్యాకేజీ వల్ల పట్టు, నూలు వంటి ఉత్పత్తులపై సానుకూల ప్రభావం కనిపించినట్లు గణాంకాలు తెలపడం లేదు. అంతర్జాతీయ దుస్తుల ఎగుమతుల విషయంలో చైనా వాటా తగ్గుతున్న ఈ నేపథ్యంలో ఆ అవకాశాలను భారత్ అందిపుచ్చుకోవడం లేదు.

> మదుపర్ల నుంచి మ్యూచువల్ ఫండ్లకు మంచి స్పందన వచ్చింది. 2016-17లో వీటిలో పెట్టుబడులు 400 శాతం మేర పెరిగింది. బ్యాంకు డిపాజిట్లు, జీవిత బీమా ఫండ్‌లు, షేర్లు, డిబెంచర్లలోకి వెళ్లిన పెట్టుబడులు వరుసగా 82%, 66%, 345% చొప్పున పెరిగాయి.

రుణాలు, ఛార్జీల యుద్ధం వల్లే టెలికాం సంస్థలపై ఒత్తిడి

భారీ రుణాలతో పాటు కాల్స్, డేటా విషయంలో ఛార్జీల యుద్ధం వల్ల నష్టాలు పెరుగుతుండటం, సహేతుకం కాని రీతిలో ఉన్న స్పెక్ట్రమ్ ధరల వల్ల టెలికాం సంస్థలకు ఆదాయం తగ్గి, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. రిలయన్స్ జియో పేరును ప్రస్తావించకుండానే, కొత్త సంస్థ అతి తక్కువ ధరలకు డేటా సేవలు ఇవ్వడం వల్ల పాత టెలికాం సంస్థల ఆదాయం పడిపోయిందని పేర్కొంది. ఇందువల్ల ఏర్పడిన సంక్షోభంతో పెట్టుబడిదారులు, రుణదాతలు, భాగస్వాములు, టెలికాం సంస్థలకు సేవలు, ఉత్పత్తులు సరఫరా చేసిన విక్రయదార్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపింది. టెలికాం రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) అధికంగా వస్తున్నాయని తెలిపింది.

- వేలంలో స్పెక్ట్రమ్, ఇతర ఆస్తుల ధరలు మితిమీరి పెరగకుండా చూసేలా విధానాలు రూపొందించాలని సూచించింది. ప్రోత్సాహకాలను ఎలా వినియోగిస్తున్నారో చూడాలని తెలిపింది. చట్టపరమైన వివాదాల వల్ల, అవరోధాలు ఎదురవుతున్నాయని, నూతన టెలికాం విధానంలో వీటికి పరిష్కారాలు చూడాలని తెలిపింది.

ద్రవ్యోల్బణం సగటు 3.3 శాతం

ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉంది. 2017-18లో రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయి అయిన 3.3 శాతానికి చేరింది. గత నాలుగేళ్లలో ఆర్థిక వ్యవస్థ అధిక ద్రవ్యోల్బణం నుంచి.. స్థిరమైన ధరల దిశగా మార్పు చెందింది. వరుసగా నాలుగో ఏడాదీ సీపీఐ ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ద్రవ్యోల్బణం తగ్గింది. వ్యవసాయ దిగుబడి రాణించడం; ప్రభుత్వం నిరంతరం ధరలను పర్యవేక్షించడం వల్ల ఇది సాధ్యమైంది. ఇటీవల కొద్ది నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం పెరిగింది. ఇందుకు కూరగాయలు, పళ్ల ధరలు కారణమయ్యాయి.

- 2017-18లో రాష్ట్రాల వారీగా ద్రవ్యోల్బణాన్ని చూస్తే.. చాలా వరకు రాష్ట్రాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం బాగా తగ్గింది. 17 రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం 4 శాతంలోపే నమోదు కావొచ్చు.

> ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరులో భారత కంపెనీలు ప్రాథమిక మార్కెట్ల ద్వారా రూ.70,000 కోట్లకు పైగా నిధులను సమీకరించాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇవి 45 శాతం ఎక్కువ. ఇందులో రూ.66,420 కోట్లు ఈక్విటీ, మిగతా రూ.3896 కోట్లు రుణ మార్గంలో సమీకరించాయి.

వ్యాపార వివాదాల పరిష్కారం వేగవంతం కావాలి

ప్రభుత్వానికి, న్యాయ వ్యవస్థకు మధ్య సహకారం ఉంటే.. వాణిజ్య పరమైన వివాదాల జాప్యం తగ్గించవచ్చు. అప్పిలేట్, కోర్టుల్లో ఈ ఆలస్యాలను పరిహరించి వ్యాపారాలను సులువుగా నిర్వహించుకోవడానికి వీలు కల్పించాలి. వివాదాల పరిష్కారాలను ఆపడం, పెట్టుబడులను నిరుత్సాహపరచడం, ప్రాజెక్టులను ఆపడం, పన్ను చెల్లింపుదార్లపై ఒత్తిడి తీసుకురావడం వంటి వాటిని అడ్డుకోవాలి. ప్రపంచ బ్యాంకు ఇచ్చిన సులువుగా వ్యాపారం నిర్వహించుకోవడానికి వీలయ్యే దేశాల జాబితాలో 100వ స్థానానికి భారత్ ఎగబాకినప్పటికీ.. వివాదాల పరిష్కారాల విషయంలో ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. సుప్రీం కోర్టు, ఎకనమిక్ ట్రైబ్యునల్‌లలో పెండింగ్‌లో ఉన్న ఆర్థిక కేసుల సంఖ్య అధికంగా ఉంది. న్యాయ వ్యవస్థలో ఉన్న అధిక పనిఒత్తిడి వల్ల కూడా ఈ జాప్యాలు జరుగుతున్నాయి. కేవలం కోర్టులు, ట్రైబ్యునళ్లకే ఈ వివాదాల పరిష్కార జాప్యం పరిమితం కావడం లేదు. పన్ను విభాగాల్లోనూ ఈ పరిస్థితులున్నాయి. ప్రభుత్వాలు, కోర్టులు కలిసి భారీ సంస్కరణలను తీసుకురావడం ద్వారా పరిస్థితులను చక్కదిద్దాలి.

- 2017 నాటికి హైకోర్టుల్లో 35 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధాన హైకోర్టుల్లో సగటున ఒక్కో కేసు 4.3 ఏళ్ల పాటు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇక కమిషనర్(అప్పీళ్లు), సీఈఎస్టీఏటీ, హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో కలిపి మార్చి 2017 త్రైమాసికం చివరకు మొత్తం 1.45 లక్షల అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి.


పెరుగుతున్న పర్యాటక 'మారకం'


పర్యాటక రంగానికి 2017లో 27.7 బిలియన్ డాలర్ల విదేశీ మారకం లభించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 20.8 శాతం ఎక్కువ. ప్రభుత్వం ఈ రంగం కోసం తీసుకున్న పలు చర్యలు ఇందుకు దోహదం చేశాయి. 2017లో మొత్తం 1.02 కోట్ల మంది విదేశీ పర్యాటకులు వచ్చారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 15.6 శాతం ఎక్కువ. 2016లో వీరి ద్వారా వచ్చిన విదేశీ మారక నగదు 22.9 బిలియన్ డాలర్లుగా ఉంది. 163 దేశాల పౌరులకు ఇ-వీసా అమలు, అంతర్జాతీయ స్థాయిలో మాధ్యమాల్లో ప్రచారం, 'ద హెరిటేజ్ ట్రయల్' పేరిట వినూత్న కార్యక్రమం.. తదితరాల వల్ల విదేశీ పర్యాటకులను భారత్ ఆకర్షించింది.


- తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్, కర్ణాటకలు పర్యాటకులను ఆకర్షించడంలో తొలి అయిదు స్థానాల్లో నిలిచాయి. 2016లో వచ్చిన విదేశీ పర్యాటకుల్లో 61.3 శాతం మంది ఈ రాష్ట్రాలకే వచ్చారు.


మూడో అతిపెద్ద దేశీయ విమానయాన విపణి మనదే


ప్రయాణికుల టికెట్ల విక్రయాల పరంగా ప్రపంచంలో మూడో అతిపెద్ద, శరవేగంగా వృద్ధి చెందుతున్న దేశీయ విమానయాన విపణి మనదే అని ఆర్థిక సర్వే తెలిపింది. ఇప్పటివరకు విమానయాన సేవలు పొందని, అత్యంత స్వల్పంగా లభిస్తున్న వారికోసం ప్రాంతీయ విమానయాన పథకం (ఉడాన్) ప్రారంభించి, పలు మార్గాలు వివిధ సంస్థలకు కేటాయించినట్లు వివరించింది. గిరాకీకి అనుగుణంగానే చిన్న విమానాశ్రయాల పునరుద్ధరణ, అభివృద్ధి ఉంటుందని, విమానయాన సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కీలకమని పేర్కొంది. ఈ ఏడాది డిసెంబరులోగా 50 విమానాశ్రయాల అభివృద్ధికి రూ.4,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపింది. ఇందువల్ల వృద్ధి వేగవంతమవుతుందని పేర్కొంది.
















ప్రభుత్వ బడులు బాగుపడ్డాయ్!

- విద్యార్థులు-తరగతిగదుల నిష్పత్తి... ● విద్యార్థులు-ఉపాధ్యాయుల నిష్పత్తి..
- పాఠశాలల్లో బాలికల చేరిక, వసతులు తదితరాల్లో దేశవ్యాప్తంగా మెరుగుదల
- 2017-18 ఆర్థిక సర్వే వెల్లడి



దిల్లీ: అనేక సమస్యలతో సతమతమయ్యే ప్రభుత్వ బడుల్లో పరిస్థితులు గత కొన్నాళ్లుగా మెరుగుపడ్డాయని 2017-18 ఆర్థిక సర్వే వెల్లడించింది. లింగ సమానత్వ సూచీ(జీపీఐ)లో అంతరం తగ్గుముఖం పట్టిందని, పాఠశాలల్లో చేరే బాలికల సంఖ్య గణనీయంగా పెరిగిందని సర్వే పేర్కొంది. తాగునీరు, మరుగుదొడ్ల వంటి వసతులూ సమకూరాయని తెలిపింది. ఇక పాఠశాల చదువులు పూర్తిచేసే వారి సంఖ్యా అధికమయ్యిందని, మధ్యలోనే ఎగనామం పెట్టే వారి సంఖ్య తగ్గుముఖంపట్టిందని వివరించింది. ప్రాథమిక పాఠశాలల స్థాయిలో ఉపాధ్యాయుల నియామకాలు, అదనపు తరగతి గదుల నిర్మాణంపైనా సంతృప్తి వ్యక్తంచేసింది. మొత్తంగా విద్యార్థులు-తరగతి గదుల నిష్పత్తి(ఎస్‌సీఆర్), విద్యార్థులు-ఉపాధ్యాయుల నిష్పత్తి (పీటీఆర్) మెరుగుపడి ప్రభుత్వ విద్యలో నాణ్యతకు బాటలుపరిచిందని సర్వే వివరించింది.

ప్రతి 30 మంది విద్యార్థులకు ఓ తరగతి గది...

ఒక విద్యాసంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుని ఎంత మంది విద్యార్థులకు ఒక తరగతి (ఎస్‌సీఆర్)ఉండాలో నిర్ణయించారు. దీని ప్రకారం ప్రతి 30 మంది చిన్నారులకు ఒక తరగతి గది ఉండటం ఆదర్శప్రాయం.

- 2009లో 30 మందికన్నా ఎక్కువ మంది విద్యార్థులున్న తరగతి గదుల జాతీయ సగటు 43 శాతం.
- 2015-16లో అవి 25.7 శాతానికి తగ్గాయి.
- కొన్ని వ్యత్యాసాలున్నప్పటికీ దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఎస్‌సీఆర్ మెరుగుపడిందని సర్వే వెల్లడించింది.

రాష్ట్రాల వారీగా పీటీఆర్..

విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో జాతీయ సగటు మెరుగ్గానే ఉన్నా బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇక్కడి పీటీఆర్ 60:1గా ఉండటం గమనార్హం. ఝార్ఖండ్, మధ్యప్రదేశ్‌లలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని సర్వే పేర్కొంది. ఈ నాలుగు రాష్ట్రాలలోనూ పీటీఆర్‌ను 30:1స్థాయికి తీసుకురావాల్సి ఉందని సర్వే అభిప్రాయపడింది.

విద్యార్థులు - ఉపాధ్యాయ నిష్పత్తి (పీటీఆర్)లో...

ప్రాథమిక విద్యలో పీటీఆర్ 30:1, ప్రాథమికోన్నత విద్యలో 35:1గా ఉండటం ఆదర్శప్రాయంగా భావిస్తారు. అయితే 2015-16లో మన జాతీయ సగటు నిష్పత్తి 23:1గా ఉంది. అంటే ప్రతి 23 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు.

- మనలాంటి సామాజిక, ఆర్థిక పరిస్థితులున్న దేశాల పీటీఆర్‌తో పోల్చినప్పుడు భారత్‌లో విద్యార్థులు-ఉపాధ్యాయుల నిష్పత్తి మెరుగ్గానే ఉందని యునెస్కో గణాంక సంస్థ సమాచారం వెల్లడిస్తోంది.
- 2015లో పీటీఆర్‌లో అంతర్జాతీయ సగటు 23.4:1
- అదే సమయంలో చైనాలో పీటీఆర్ 16.3:1, బ్రెజిల్‌లో 20.9:1, రష్యాలో 19.8:1, దక్షిణాఫ్రికాలో 33.6:1గా ఉంది.
- పొరుగుదేశాలైన శ్రీలంకలో పీటీఆర్ 23.2:1, నేపాల్‌లో 23.1:1, భూటాన్‌లో 26.7:1, పాకిస్థాన్ 46.3:1.

లైంగిక సమానత్వ సూచీ(జీపీఐ)లో...


బేటీ పడావో, బేటీ బచావో వంటి కార్యక్రమాల అమలుతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేరే బాలికల సంఖ్య గణనీయంగా పెరిగిందని సర్వే వెల్లడించింది. అయితే, ఉన్నత విద్యాసంస్థల్లో బాలికల సంఖ్య ఇప్పటికీ తక్కువగానే ఉందని పేర్కొంది.

విధాన నిర్ణయాల్లో మహిళ పాత్ర తక్కువే



దిల్లీ: రాజకీయ రంగం, విధానపర నిర్ణయాలు తీసుకునే వ్యవహారాల్లో మహిళల పాత్ర తక్కువగా ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇంటి బాధ్యతలు; సామాజిక, ఆర్థిక అంశాలు, కుటుంబ సభ్యుల నుంచి ప్రోత్సాహం లేకపోవడం, నమ్మకం తక్కువగా ఉండడం ఇందుకు కారణాలని విశ్లేషించింది. రువాండాలాంటి ఆఫ్రికన్ దేశంలో 60 శాతం మంది ప్రజాప్రతినిధులు మహిళలే ఉన్నారు. భారత్ జనాభాలో 49 శాతం మంది మహిళలు ఉన్నప్పటికీ పార్లమెంటులో వారి ప్రాతినిధ్యం 11 శాతంగా ఉంది. లోక్‌సభలో 64 మంది (11.8%), రాజ్యసభలో 27 మంది (11%) మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా 4,118 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో మహిళల సంఖ్య కేవలం ఎనిమిది శాతం మాత్రమే. 2010-17 మధ్యకాలంలో పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం కేవలం ఒక్క శాతం మాత్రమే పెరిగింది. పంచాయతీ స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం బాగుంది. 43% మంది మహిళా సర్పంచులు ఉండగా, 44.2% మంది మహిళా ప్రతినిధులు ఉన్నారు.

ఆరుబయట అలవాటుకు 8 రాష్ట్రాలు దూరం



దిల్లీ: ఆరుబయట మల విసర్జన అలవాటు నుంచి 8 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు పూర్తిగా బయటపడ్డాయని ఆర్థిక సర్వే పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో మరుగు అవసరాల కోసం ఆరుబయలు స్థలాలకు వెళ్లేవారు 2014 అక్టోబరులో 55 కోట్లు ఉంటే ఇప్పుడు 25 కోట్లకు తగ్గారని తెలిపింది. 'పరిశుభ్రమైన వాతావరణం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 296 జిల్లాలు, 3,07,349 గ్రామాలు బహిరంగ మల విసర్జన నుంచి బయటపడ్డాయి. సిక్కిం, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, హరియాణా, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్‌ప్రదేశ్, గుజరాత్, దమణ్-దీవ్, చండీగఢ్‌లు ఈ అలవాటుకు స్వస్తి పలికాయి. ఆరుబయట అలవాటు కొనసాగుతున్న జిల్లాల్లో అతిసార కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్)గ్రామాల ప్రజలు ఆరోగ్యపరంగానే కాకుండా ఆర్థికంగానూ ప్రయోజనం పొందుతున్నారు. ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం పారిశుద్ధ్య సదుపాయాల లేమి వల్ల భారత్ 6% మేర స్థూల జాతీయోత్పత్తిని నష్టపోతోంది. ఓడీఎఫ్ గ్రామాల్లో ఒక్కో కుటుంబం ఏటా రూ.50వేలు ఆదా చేయగలుగుతుందని యూనిసెఫ్ అంచనా' అని ఆర్థిక సర్వే వివరించింది.

కేంద్రం క్రియాశీలతతో సజావుగా రహదారుల పనులు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న క్రియాశీల చర్యల కారణంగా ఆగిపోయిన రహదారుల పనులు పునఃప్రారంభమయ్యాయని ఆర్థిక సర్వే పేర్కొంది. రహదారుల మంత్రిత్వశాఖ రూ.3.17 లక్షల కోట్ల వ్యయంతో 482 ప్రాజెక్టులు చేపట్టగా అందులో 117 రహదారుల పనులు ఆగిపోయాయి. ఇందులో 43 ప్రాజెక్టుల వ్యయం పెరిగింది. 74 ప్రాజెక్టుల గడువు పెరిగింది. ప్రభుత్వం తగిన విధంగా సమస్యలు పరిష్కరించడంతో 88 శాతం పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. భూ సేకరణ, పర్యావరణ అనుమతులు, గుత్తేదార్లు సక్రమంగా పనిచేయకపోవడం, స్థానికుల ఆందోళనలు తదితర కారణాలు రహదారుల పనులకు అడ్డంకిగా మారాయి. రాష్ట్రప్రభుత్వాలు, గుత్తేదారులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించింది. రహదారుల పనులకు వివిధ సంస్థల నుంచి నిధులు అందేలా చర్యలు తీసుకొంది. రహదారుల ప్రాజెక్టులకు 2012-13లో రూ.1,27,430 కోట్లు రుణాలు ఇవ్వగా, గత సెప్టెంబరు నాటికి రూ.1,80,277 కోట్లు ఇచ్చారు. ఇదే సమయంలో రుణాల తిరిగి చెల్లింపులు బాగా తగ్గాయి. 2012-13లో బాకీలు 1.9 శాతం ఉండగా, ప్రస్తుతం 20.3 శాతానికి పెరిగాయి.

వ్యవసాయం మహిళల ఆధారితం



దిల్లీ: మహిళల ఆధారిత వ్యవసాయ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని సర్వే సిఫార్సు చేసింది. పురుషులంతా పట్టణాలకు వలస వెళ్తుండడంతో మహిళలు కూడా రైతులు, కార్మికులు పాత్రలను సమర్థంగా పోషిస్తున్నారు. ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్ర విస్మరించలేనిది. అందువల్ల భూమి, నీరు, రుణాలు, సాంకేతిక పరిజ్ఞానం, విత్తనాలు, మార్కెట్ తదితర సౌకర్యాలను వారికి చేరువ చేయాలని పేర్కొంది. మహిళలకు అనుకూలమైన పరిజ్ఞానం, శిక్షణ ఉండాలని సూచించింది. ఈ దశగా ఇప్పటికే ప్రభుత్వాలు అడుగేస్తున్నాయి. పథకాల లబ్ధిదారుల్లో కనీసం 30 శాతం మంది మహిళలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాయి. మహిళా స్వయం సేవా సంఘాలకు రుణ సదుపాయాలు కల్పిస్తున్నాయి.

కార్మిక చట్టాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకత

దిల్లీ: దేశంలో కార్మిక చట్టాలను సమర్థంగా అమలు చేయడానికి సాంకేతిక పరిజ్ఞానం ఉపకరిస్తుందని, మరింత పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకొస్తుందని సర్వే వెల్లడించింది. శ్రమసువిధ పోర్టల్, సార్వత్రిక ఖాతా సంఖ్య, జాతీయ కెరియర్ సేవా పోర్టల్ వంటి వాటిని ప్రస్తావించింది. 2017-18లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద మునుపెన్నడూ లేనంత కేటాయింపులు చేసినట్లు వివరించింది. 4.6 కోట్ల కుటుంబాలకు ఉపాధి లభించిందని, 177.8 కోట్ల పనిదినాలు లభించాయని తెలిపింది.

మెరిసిన బాలీవుడ్ డైలాగులు




దిల్లీ: మూసధోరణికి భిన్నంగా ఈ ఏడాది ఆర్థిక సర్వే కళకళలాడింది. బాలీవుడ్ డైలాగులు, ప్రముఖ కవులు, నోబెల్ గ్రహీతల వ్యాఖ్యలతో తళతళ మెరిసింది. షేక్‌స్పియర్ నుంచి రవీంద్రనాథ్ ఠాగూర్ వరకూ, జాన్ కీట్స్ నుంచి కీన్స్ వరకూ ప్రముఖ రచయితల వ్యాఖ్యలు చాలా అధ్యాయాల ప్రారంభంలో దర్శనమిచ్చాయి. కోర్టు విచారణ ప్రక్రియల్లో జాప్యాన్ని ప్రస్తావిస్తూ.. సంచలన హిందీ చిత్రం దామినీలోని ప్రఖ్యాత సంభాషణలనూ ఉటంకించారు. తారీఖ్ పర్ తారీఖ్, తారీఖ్ పర్ తారీఖ్ (రోజులు మీద రోజులు, రోజులు మీద రోజులు) అంటూ ఈ సినిమాలో హిందీ నటుడు సన్నీ దేవోల్ చెప్పిన డైలాగ్‌ను సంధించారు. వాతావరణ మార్పులు, వ్యవసాయం గురించి ప్రస్తావిస్తూ "ఉపకార్" సినిమాలోని 'మేరే దేశ్ కీ ధర్తీ సోనా ఉగ్లే ఉగ్లే హీరే మోతీ (బంగారం, వజ్రాల్లాంటి పంటలు పండే నా పుణ్య భూమి)'అంటూ సాగిపోయే ప్రఖ్యాత గీతాన్నీ ఉటంకించారు.

మౌలిక వసతులకు రూ.301 లక్షల కోట్లు

- రానున్న 25 ఏళ్లలో చేయాల్సిన వ్యయంపై అంచనాలు

దిల్లీ: దేశంలో రానున్న 25 ఏళ్లలో మౌలిక వసతుల అభివృద్ధికి 4.5 ట్రిలియన్ డాలర్లు (రూ.301 లక్షల కోట్లు) అవసరమవుతాయని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇందులో 3.9 ట్రిలియన్ డాలర్లు (రూ.261 లక్షల కోట్లు) సొంతంగా సమకూర్చుకోగలుగుతుందని పేర్కొంది. ప్రస్తుత పద్ధతుల్లోనే మౌలిక సౌకర్యాల కల్పన జరిగితే 2040 నాటికి భారీ కొరత ఉంటుందని తెలిపింది. ప్రయివేటు సంస్థల సహకారంతో ఈ లోటును భర్తీ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. కేవలం మౌలిక వసతుల ప్రాజెక్టులకే నిధులు ఇచ్చే నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎన్‌ఐఐబీ), ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ), న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (గతంలో బ్రిక్స్ బ్యాంకు)ల సహాయం తీసుకోవచ్చని సూచించింది. మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం విధానం విఫలమవడమూ ఇందుకు ఒక కారణంగా. భూమి, అడవుల అనుమతులు సకాలంలో రాక ఇంధనం, టెలికాం రంగాల్లో పెట్టుబడులు పెట్టిన ప్రయివేటు సంస్థలకు నష్టాలు రావడంతో వీటి ఆసక్తి తగ్గిందని పేర్కొంది. రైల్వే, విమానయాన, నౌకాయానంతో పాటు మొత్తం రవాణా రంగం, టెలికాం రంగాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై విశ్లేషించింది.



- రహదారుల పొడవు (2001లో) 33.73 లక్షల కి.మీ.
- 2017లో: 57.17 లక్షల కి.మీ.
- వాహనాల సంఖ్య (2017లో): 22.90 కోట్లు (2001తో పోల్చితే నాలుగు రెట్లు పెరుగుదల)
- రహదారుల సాంద్రత: చదరపు కి.మీ.కి 1.66 కి.మీ. (అమెరికా, చైనా, రష్యా, బ్రెజిల్‌కన్నా అధికం)
- దేశంలో మెట్రో రైల్ పొడవు: 425 కి.మీ.

రాయితీ 10 శాతం పెంపు!

- ఆహార ధాన్యాలు, ఎరువులపైనే

ఈనాడు-దిల్లీ : రాయితీల మొత్తాన్ని తగ్గించి గత ప్రభుత్వాల సంప్రదాయాన్ని తిరగరాసిన మోదీ ప్రభుత్వం ఈ సారి బడ్జెట్‌లో మాత్రం అందుకు కేటాయించే మొత్తాన్ని పెంచే అవకాశాలున్నాయి. రాయితీల కొనసాగింపు లేదా పెంపు ప్రభుత్వాల సంప్రదాయంగా వస్తుండగా 2014 నుంచి మోదీ ప్రభుత్వం భిన్నమైన పంథాను ఎంచుకుంది. మొత్తం వ్యయంలో రాయితీల శాతాన్ని తగ్గించుకుంటూ వచ్చింది. 2014-15లో మొత్తం వ్యయంలో రాయితీల మొత్తం 15.52 శాతం కాగా 2017-18లో 11.2శాతానికి తగ్గింది. అయితే ఈ ఏడాది 8 రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనుండడంతో పాటు వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సారి బడ్జెట్‌లో రాయితీల మొత్తాన్ని ఆర్థిక మంత్రి జైట్లీ పెంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాయితీ బిల్లు రూ.2.40లక్షల కోట్లు కాగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.2.60లక్షల కోట్లకు చేరవచ్చు. అంటే దాదాపు 10శాతం పెంపు ఉండవచ్చు.



ఆహార రాయితీ: ఆహార రాయితీ బిల్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 1.45లక్షల కోట్లు కాగా దాదాపు పదిశాతం పెంచవచ్చు. అంటే రూ.1.60లక్షల కోట్లకు చేరుతుంది. బియ్యం, గోధుమల కనీస మద్దతు ధర 7.5శాతానికి పెరిగిందని, ఈ పెంపు ఆహార రాయితీ బిల్లులోనూ ప్రతిఫలిస్తుందని ఒక అధికారి వెల్లడించారు.

ఎరువుల రాయితీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎరువులపై ఇస్తున్న రాయితీ రూ.70వేల కోట్లు కాగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఈ మొత్తాన్ని రూ.74వేల కోట్లకు పెంచవచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరగడమే ఎరువుల రాయితీ పెంపునకు కారణమవుతోంది. ఎరువులపై రాయితీని ప్రత్యక్ష నగదు బదిలీ కింద ఇచ్చే విధానం ఈ ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల రాయితీ సద్వినియోగమై కొంత మొత్తం ఆదా అవుతుందని, ఆ తర్వాత ఎరువులపై ఇచ్చే రాయితీ బిల్లు తగ్గవచ్చని ఒక అధికారి వెల్లడించారు.

ఇంధన రాయితీ: ప్రభుత్వం ప్రస్తుతం కిరోసిన్, వంటగ్యాస్‌కు మాత్రమే రాయితీ ఇస్తోంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో వంటగ్యాస్ రాయితీలకు ప్రభుత్వం రూ.16,076 కోట్లు కేటాయించింది. కిరోసిన్‌పై రూ.8,924 కోట్లు కేటాయించింది. ఈ రెండింటిపై రాయితీ ఇలాగే కొనసాగవచ్చు లేదా ఇంకా తగ్గవచ్చు. పెట్రోల్, డీజిల్‌పై రాయితీ లేని ప్రస్తుత వ్యవస్థే కొనసాగుతుందని ఇటీవల చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. కిరోసిన్‌పైనా రాయితీని క్రమంగా ఎత్తివేసే ప్రయత్నం జరుగుతోంది. కిరోసిన్‌పై రాయితీ పూర్తిగా ఎత్తేసేంత వరకు ధరను క్రమంగా పెంచుకుంటూ పోవాలని చమురు మార్కెటింగ్ సంస్థలకు కేంద్రంఆగస్టులో సూచించింది.

పిల్లాడికే ప్రాధాన్యం


- ఆడపిల్లల ఆవశ్యకతను చాటేలా గులాబీ రంగులో నివేదిక
- ప్రభుత్వ పథకాలు బాగున్నాయని సర్వే కితాబు

దిల్లీ: మన దేశంలో ఆడపిల్లల పట్ల వివక్షను రూపుమాపాల్సిన అవసరం ఉందని చాటడానికి ఆర్థిక సర్వే నివేదికను గులాబీ రంగు అట్టతో తీర్చిదిద్దారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి మద్దతుగా ఈ రంగును ఎంచుకున్నారు. మగబిడ్డ మాత్రమే కావాలనుకునే ప్రాధాన్యాన్ని సమాజం విడనాడాల్సిన అవసరం ఉందని సర్వే పేర్కొంది. లింగ నిష్పత్తిలో అసమానతల వల్ల 6.30 కోట్ల మంది మహిళలు గల్లంతయ్యారని తెలిపింది. దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఉపాధి, గర్భనిరోధక సాధనాల వాడుక, పాప కావాలా-బాబు కావాలా అనే ఎంపికల విషయంలో మాత్రం వెనుకబడిపోయిందని వివరించింది. సరళతర వ్యాపార నిర్వహణలో ర్యాంకును మెరుగుపరచుకున్నరీతిలోనే లింగ సమానత్వంలోనూ సాధించాలని ఆకాంక్షించింది.

పనిచేసే మహిళల సంఖ్య తగ్గింది

పనిచేసే మహిళల సంఖ్య **2005-06**లో **36%** ఉంటే **2015-16** నాటికి అది **24** శాతానికి తగ్గిపోయింది. మహిళలను విద్య, ఉద్యోగ రంగాల్లో ప్రోత్సహించడానికి రాష్ట్రాలు, ఇతర భాగస్వామ్య సంస్థలు కీలకపాత్ర పోషించాలని సర్వే సూచించింది.

- ☛ మగపిల్లాడు పుట్టేవరకు పిల్లల్ని కంటూ ఉండే సంప్రదాయం చాలామందిలో ఉంది. దీనివల్ల సహజంగానే 'అవాంఛిత' ఆడపిల్లల సంఖ్య పెరుగుతోంది. ఇలాంటివారు దాదాపు **2.10** కోట్ల మంది ఉంటారు.
- ☛ తమ ఆరోగ్యం విషయంలో నిర్ణయాలు తీసుకునే మహిళల సంఖ్య **2005-06**లో 62.3% ఉంటే పదేళ్లలో అది **74.5** శాతానికి పెరిగింది.
- ☛ భౌతిక, భావోద్వేగ హింసకు గురికాని మహిళల సంఖ్య **63%** నుంచి **71** శాతానికి పెరిగింది.
- ☛ తొలిసారి పిల్లల్ని కంటున్నవారి సగటు వయసు **1.3** ఏళ్లు పెరిగింది.



సరకు రవాణాపై మోత

- ధరల క్రమబద్ధీకరణతో కాస్తంత మెరుగుపడుతున్న పరిస్థితి
- మెట్రో రైళ్లకు రాష్ట్రాల్లో ఆదరణ



దిల్లీ: రుసుములను ఆకర్షణీయమైన రీతిలో నిర్ణయించకపోవడం వల్ల సరకు రవాణాలో భారతీయ రైల్వే వాటా గత కొన్నేళ్లలో క్రమంగా పడిపోతోంది. ప్రయాణికుల టికెట్ రుసుములు దాదాపు ఒకే విధంగా ఉంటున్నా సరకు రవాణాకు వసూలు చేసే మొత్తాలు మాత్రం గణనీయంగా పెరిగాయని ఆర్థిక సర్వే గుర్తుచేసింది. 'రైలు రవాణాను ఆకర్షణీయంగా మార్చి, రైల్వేవాటా మరింతగా పడిపోకుండా చూడడానికి 2017 ఆర్థిక సంవత్సరంలో వివిధ చర్యలు చేపట్టారు. ధరల హేతుబద్ధీకరణ, వేర్వేరు స్టేషన్ల కోసం భిన్నమైన మార్గదర్శకాలు రూపొందించడం, ఇనుప ఖనిజం ఎగుమతికి ద్వంద్వ ధరల విధానాన్ని ఉపసంహరించుకోవడం, బొగ్గు రవాణా ధరల్ని క్రమబద్ధం చేయడం వంటి చర్యల్ని ఇటీవల తీసుకున్నారు. వీటన్నింటి వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సర ప్రథమార్థంలో రైల్వేలు 55.81 కోట్ల టన్నుల సరకుల్ని రవాణా చేయగలిగాయి. అంతకు ముందు సంవత్సర ప్రథమార్థంతో (53.12 కోట్ల టన్నులు) పోలిస్తే ఇది 5% అధికం' అని వివరించింది. సామర్థ్యంతో పాటు అనుసంధానతను, ప్రైవేటు/ విదేశీ పెట్టుబడుల్ని పెంచడం వంటి చర్యల్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపింది. రైల్వేస్టేషన్ల చుట్టుపక్కల రైల్వే ఆధీనంలో ఉన్న మిగులు స్థలాలను వాణిజ్య ప్రాతిపదికన అభివృద్ధి చెందించడానికి ఉద్దేశించిన 'స్టేషన్ల పునరభివృద్ధి పథకా'నికి శ్రీకారం చుట్టిందని గుర్తుచేసింది. దిల్లీ మెట్రో రైలు విజయవంతం కావడంతో ఇలాంటి వ్యవస్థ కోసం అనేక రాష్ట్రాలు ప్రయత్నిస్తున్నాయని తెలిపింది. దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ సహా వివిధ నగరాల్లో 425 కి.మీ. మేర మెట్రో రైలు వ్యవస్థ ఉందనీ, వివిధ నగరాల్లో మరో 684 కి.మీ. వ్యవస్థ నిర్మాణమవుతోందనీ వివరించింది.

రైతు రాబడిపై వాతావరణం

- 25 శాతం వరకూ ప్రతికూల ప్రభావం
- వ్యవ'సాయ' విధానాల్లో మార్పులు తప్పనిసరి
- ఆర్థిక సర్వే అంచనాలు.. సూచనలు

ఈనాడు, హైదరాబాద్ : వాతావరణ మార్పులు రైతుల ఆదాయంపై దాదాపు 25 శాతం వరకూ ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక సర్వే (2017-18) హెచ్చరించింది. సగటున ప్రతిరైతుకు 15-18 శాతం, వర్షాధార భూముల వారికి గరిష్ఠంగా 25 శాతం ఆదాయం తగ్గుతుందని వెల్లడించింది. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం వాటా తగ్గుతున్నా.. ప్రగతికి చోదకశక్తిగానే ఉంటుందని పేర్కొంది. సాగునీటి కొరత, నీటి పారుదల పథకాల్లో పరిమిత సామర్థ్యం నేపథ్యంలో వ్యవసాయానికి పూర్తిస్థాయిలో నీళ్లందించడం భవిష్యత్తులో సవాల్‌గా మారనుందని తెలిపింది. ఈమేరకు నిర్మాణాత్మక మార్పులను సూచించింది. గణాంక సహితంగా ప్రభుత్వానికి కీలక సిఫార్సులు చేసింది.



తీవ్రతకు 'గణాంకాలు'..

- దేశంలో నీటి కొరత పెరుగుతోంది.. చైనా, అమెరికాలకన్నా రెట్టింపు స్థాయిలో భూగర్భ జలాలు తోడేస్తుండటంతో గత 30 ఏళ్లలో 13 శాతం తగ్గిపోయాయి.
- అధికవర్షాల కారణంగా ఖరీఫ్‌లో - పప్పుధాన్యాలు (18%); జొన్న, వరి (15%); వేరుసెనగ (14%); రబీలో - కంది (10%); ఆవాలు (4%) పంటల్లో ఉత్పాదకత తగ్గింది.
- ఒకే ఏడాదిలో ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగితే సగటున ఖరీఫ్‌లో రైతుకు 6.2%, రబీలో 6% వరకూ వర్షాధార భూముల్లో ఆదాయం తగ్గుతోంది. సాధారణం కన్నా 100 మి.మీ.ల వర్షపాతం తగ్గితే ఖరీఫ్‌లో 15, రబీలో 7 శాతం ఆదాయాన్ని రైతులు కోల్పోతున్నారు. ఈ శతాబ్దం ఆఖరునాటికి దేశంలో 3 నుంచి 4 డిగ్రీల వరకూ సగటు ఉష్ణోగ్రత పెరిగే అవకాశాలున్నాయి.
- వర్షాకాలంలో ఒకసారి వర్షం కురిసిన రోజు నుంచి.. మరోసారి వర్షం పడే రోజు వరకు ఉండే కాలమే పొడి విరామం. ఇది ఎన్ని రోజులు గరిష్ఠంగా ఉందనే అంశాన్ని బట్టి పంటల ఉత్పాదకత, రైతుల ఆదాయంలో మార్పులు వస్తాయి. ఉదాహరణకు గత వానాకాలంలో తెలంగాణలో కొన్ని మండలాల్లో ఈ పొడి విరామం 20 రోజులు సైతం నెలకొంది. 1970-2015 మధ్యకాలంలో దేశంలో ఇలాంటి పొడి విరామాలు 42 నుంచి 45 శాతానికి పెరిగాయి.
- వర్షాకాలంలో అత్యంత వేడిగా ఉండే రోజులు 4.8% నుంచి 6.5% పెరిగాయి. మరోవైపు చల్లగా ఉండే రోజులు 7 నుంచి 3 శాతానికి తగ్గాయి.

సూచనలు.. సిఫార్సులు

- రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి.. వ్యవసాయ రంగంలో సంస్కరణలకు జీఎస్టీ మండలి తరహాలో యంత్రాంగం ఏర్పాటు.
- విద్యుత్తు, ఎరువుల రాయితీలకు బదులు ప్రత్యక్ష నగదు బదిలీ.
- నీటి పారుదల, ఆధునిక సాంకేతిక పద్ధతుల వినియోగంలో గణనీయమైన పురోగతి అవసరం. సమర్థమైన బిందు, తుంపర్ల (సాంకేతిక) విధానాల అమలు. ప్రతి నీటిబొట్టుకూ అధిక పంట దిగుబడులు సాధించేలా నీటి యాజమాన్య పద్ధతులు.
- సమగ్ర పంటల బీమా పథకం అమలు. వాతావరణానికి అనుగుణంగా రైతులకు నష్ట పరిహారం అంచనాలు.. వారాల వ్యవధిలోనే చెల్లింపు. ఇందుకుగాను డ్రోన్లు వంటి సాంకేతిక పద్ధతులు, వ్యవసాయ విజ్ఞానం అందుబాటులోకి తేవడం. ప్రస్తుతం ఉన్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన విస్తరణ.
- రైతులకు ఇతర ఆదాయ అవకాశాల కల్పన. ఇందుకు అనుగుణంగా పాడి, మత్స్య తదితర రంగాల అభివృద్ధి.

పర్యాటకుల్లో ఏపీకి 3వ స్థానం



● ఎగుమతుల్లో తెలంగాణకు 5వ స్థానం

ఏపీలో 676 కి.మీ. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేశారు. తెలంగాణలో ఇది 119 కి.మీ.గా ఉంది.

ఈనాడు, దిల్లీ: వివిధ రంగాల్లో అగ్రస్థాయిలో నిలిచిన దేశంలోని తొలి అయిదు రాష్ట్రాల్లో రెండు తెలుగు రాష్ట్రాలు స్థానం సంపాదించాయి. సోమవారం కేంద్ర ఆర్థికమంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2017-18 ఆర్థిక సర్వే నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. విదేశాలకు జరిగే ఎగుమతుల్లో తెలంగాణ 5వ స్థానం సాధించగా, దేశీయ పర్యాటకులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో నిలిచింది. ఇళ్లకు వందశాతం విద్యుత్తు ఇచ్చిన రాష్ట్రాల సరసన ఏపీ నిలిచింది.

- దేశంలో చాలా రాష్ట్రాలు రాష్ట్ర ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేసినా వాటి సిఫార్సులను కొన్నే పరిగణలోకి తీసుకున్నాయి. పంచాయతీరాజ్ డెవెల్యూషన్ నివేదిక (2015-16) ప్రకారం కర్ణాటక అత్యల్పంగా 11% సిఫార్సులను ఆమోదించింది. పశ్చిమబెంగాల్, ఏపీ, రాజస్థాన్‌లు 50% వరకు ఆమోదించాయి.
- కర్ణాటక, తమిళనాడు, కేరళతో పోలిస్తే ఏపీలో ఇంటి పన్ను వసూలు బాగానే ఉంది. ఇక్కడ 40% దాకా వసూలవుతోంది.
- కేరళ, ఏపీ, కర్ణాటకల్లో సొంత పన్ను వసూళ్లు, కొన్ని ప్రత్యక్ష పన్నులు వసూలవుతున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లాంటి రాష్ట్రాలు పూర్తిగా కేంద్రం పంచే పన్ను వాటాలపైనే ఆధారపడ్డాయి.
- గత దశాబ్ది కాలంలో ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో, రాయలసీమలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న అనంతపురం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు దాదాపు 0.5 డిగ్రీలమేర తగ్గాయి. దక్షిణ తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల్లో 0.25 నుంచి 0.75 డిగ్రీల దాకా పెరిగాయి.
- పదేళ్లలో తెలంగాణలోని కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దునున్న కొన్ని జిల్లాల్లో మినహాయించి ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణల్లోని మిగతా జిల్లాల్లో వర్షపాతం 50 మిల్లీమీటర్ల వరకు పెరిగింది.
- లింగనిష్పత్తి విషయంలో దేశంలోని ప్రధాన రాష్ట్రాల కంటే ఈశాన్య రాష్ట్రాలే మంచి పనితీరు కనబరుస్తున్నాయి. ఏపీ, తమిళనాడులాంటి రాష్ట్రాల్లో వాటి అభివృద్ధి స్థాయితో పోలిస్తే లింగనిష్పత్తి పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఇప్పటికీ కుమారులకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు.



- కేరళ, తమిళనాడు, ఏపీ, గోవా, గుజరాత్, పంజాబ్‌లు ఇళ్లకు వందశాతం విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చాయి. బిహార్, ఝార్ఖండ్, నాగాలాండ్‌లలో ఇది 50%కంటే తక్కువ ఉంది.
- దేశంలో 18 హరిత విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించింది. వాటిలో ఉత్తరాంధ్రలోని భోగాపురం, రాయలసీమలోని ఓర్వకల్లు ఉన్నాయి. తెలంగాణలోని కొత్తగూడెం విమానాశ్రయానికి కేంద్రం స్థలానుమతి దక్కింది.
- 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 5%, పట్టణ ప్రాంతాల్లో 31% మంది అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారు. పట్టణీకరణ అధికంగా ఉన్న గుజరాత్, మహారాష్ట్ర, ఏపీలో అద్దె ఇళ్లలో ఉన్న వారి శాతం అధికంగా ఉంది. చిన్న పట్టణాల్లో 28% మంది, మధ్యస్థాయి పట్టణాల్లో 36% మంది, పెద్ద నగరాల్లో 40% మంది అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారు.
- సేవల వృద్ధిలో ఏపీ 21వ స్థానంలో నిలిచింది. తొలి రెండు స్థానాల్లో చండీగఢ్, దిల్లీ, ఆరోస్థానంలో తెలంగాణ ఉన్నాయి.
- మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణల నుంచే అంతర్జాతీయంగా 70% ఎగుమతులు జరుగుతున్నాయి. ఇందులో మహారాష్ట్ర వాటా 22.3%, గుజరాత్ వాటా 17.2%, కర్ణాటక వాటా 12.7%, తమిళనాడు వాటా 11.5%, తెలంగాణ వాటా 6.4% ఉంది. ఏపీ వాటా కేవలం 2.8% మాత్రమే. ఎగుమతుల్లో తెలంగాణ దేశంలో 5వ స్థానంలో, ఏపీ 9వ స్థానంలో ఉన్నాయి.
- మొత్తం సాగుభూమిలో నికర సాగునీటి సౌకర్యం ఉన్న భూమి ఏపీలో 30%పైగా, తెలంగాణలో 20%పైగా ఉంది. ఈ విషయంలో ఏపీ దేశంలో 7వ స్థానంలో, తెలంగాణ 10వ స్థానంలో ఉన్నాయి.
- దేశీయ పర్యాటకులు అత్యధికంగా వచ్చిన తొలి అయిదు రాష్ట్రాల్లో ఏపీ మూడోస్థానంలో నిలిచింది. 2016లో దేశీయ పర్యాటకుల్లో 61.3% మంది తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, ఏపీ, మధ్యప్రదేశ్, కర్ణాటకలకు వచ్చారు.

పోషకాహార లోపమే పెద్ద ముప్పు



దిల్లీ: భారతీయుల ఆరోగ్యానికి పెను సవాల్ విసురుతున్న ముప్పుల్లో "మాతా శిశు పోషకాహార లోపం" ప్రధానమైనదిగా కొనసాగుతోందని ఆర్థిక సర్వే తెలిపింది. వాయు కాలుష్యం, ఆహార సంబంధిత ముప్పులు, రక్తపోటు, మధుమేహాలనూ ప్రధాన ఆరోగ్య ముప్పులుగా పేర్కొంది. అయినప్పటికీ భారతీయుల ఆరోగ్య స్థితిగతులు గణనీయంగా మెరుగుపడ్డాయని నొక్కిచెప్పింది. 1990 నుంచి 2015 మధ్య కాలంలో జీవన కాలం దాదాపు పదేళ్లు పెరగడమే దీనికి నిదర్శనమని వివరించింది. మరోవైపు వ్యాధుల నియంత్రణ, రోగులకు మెరుగైన చికిత్సల్లో.. నాణ్యమైన వైద్య సేవల అందుబాటు, కొనుగోలు శక్తి లాంటి అంశాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. అనారోగ్యం బారిన పడితే సొంతంగా ఖర్చు పెట్టాల్సిన మొత్తం (ఓవోపీఈ) 62 శాతంగా ఉంటోందని, ఇది పేదల పాలిట శరాఘాతంగా మారుతోందని, ఆర్థిక అసమానతలనూ పెంచుతోందని వివరించింది. వ్యాధి నిర్ధరణ పరీక్షల ధరలు ఒక్కోనగరంలో ఒక్కోలా ఉంటున్న విషయాన్నీ ప్రస్తావించింది. వీటి నాణ్యత తగ్గకుండా చూడటంతోపాటు ధరల హేతుబద్ధీకరణా జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడింది.

పంచాయతీల్లో పన్నుల వసూలు సవాలే

దిల్లీ: పంచాయతీల స్థాయిలో పన్నుల వసూళ్లు అత్యంత తక్కువగా ఉంటుండడంపై సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. 'పంచాయతీలు సొంత వనరుల ద్వారా 5% నిధుల్నే సమీకరించుకుంటున్నాయి. మిగతా 95% కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు తగినన్ని పన్ను అధికారాలను పంచాయతీలకు ఇవ్వలేదు. ఆస్తిపన్ను, వినోదపన్ను వంటివి పంచాయతీలు వసూలు చేస్తున్నా... భూమి శిస్తు, రహదారి సుంకం వంటివి మాత్రం వాటి పరిధిలో లేవు. ఆస్తులకు తక్కువ విలువ కట్టడం, పన్నునే తక్కువగా నిర్ణయించడం వల్ల రెవెన్యూ వసూళ్లు 7 నుంచి 19 శాతమే ఉంటున్నాయ'ని తెలిపింది. 'ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలు తమకు ప్రభుత్వాల నుంచి అందే నిధులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. దీనికి కారణం... తమకున్న అధికారాలను అవి పూర్తిగా వాడుకోకపోవడమే'నని విశ్లేషించింది.

కేసులు కొలిక్కిరాక
ప్రాజెక్టుల అమల్లో జాప్యం

దిల్లీ: న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు పేరుకుపోతున్న ప్రభావం వివిధ ప్రాజెక్టుల అమలుపై కనిపిస్తోందని ఆర్థిక సర్వే పేర్కొంది. పనులు త్వరగా పూర్తి కావాలంటే తీర్పులు కూడా సకాలంలో రావాలని అభిప్రాయపడింది. ఈ విషయంలో న్యాయవ్యవస్థ, ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాలంది. కేసుల కారణంగా విద్యుత్తు, రైల్వేలు, రహదారుల మంత్రిత్వ శాఖలు చేపడుతున్న పనులు ఆగిపోతున్నాయి. ఇలాంటి కేసుల విలువ దాదాపు రూ.52 వేల కోట్లుగా ఉంది. ఈ కేసులు కోర్టులపైనా భారం మోపుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కలిసి భారీ సంస్కరణలు చేపట్టాల్సి ఉంది. ఆర్థిక, వాణిజ్యానికి సంబంధించిన వ్యాజ్యాలు విచారించేలా కింది స్థాయి కోర్టులను బలోపేతం చేసి తద్వారా హైకోర్టు, సుప్రీంకోర్టులపై భారం తగ్గించాలి. కోర్టుల ఆధునికీకరణ, డిజిటలైజేషన్‌పై దృష్టి పెట్టి తగిన నిధులు కేటాయించాలి. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉంటే వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. పెండింగ్ కేసుల్లో అలహాబాద్ హైకోర్టు ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడ సివిల్/క్రిమినల్ కేసుల సగటు కాలం 10.71 సంవత్సరాలుగా ఉంది. కలకత్తా హైకోర్టులో 3.01 ఏళ్లు, మద్రాసు హైకోర్టులో 2.92 ఏళ్లు, బాంబే హైకోర్టులో 2.49 ఏళ్లుగా ఉంది.

పన్ను వివాదాల పరిష్కరణకు ప్రత్యేక ధర్మాసనాలు



దిల్లీ: పన్ను సంబంధిత వివాదాల పరిష్కరణకు హైకోర్టుల్లో ప్రత్యేక ధర్మాసనాలు ఏర్పాటుచేయాలని ఆర్థిక సర్వే సిఫార్సు చేసింది. "సుప్రీం కోర్టులో పన్ను వివాద పరిష్కార ధర్మాసనం చక్కగా పనిచేస్తోంది. ఇతర ఆర్థిక, వాణిజ్య అంశాలపైనా ఇలాంటి ధర్మాసనాలను ఏర్పాటుచేయాలి. హైకోర్టులూ ఇదే విధానాన్ని అనుసరించాలి'అని సర్వే సూచించింది. ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుచేసిన అనంతరం సుప్రీం కోర్టులో పోగుపడుతున్న పన్ను కేసుల కథ పూర్తిగా మారిందని వివరించింది. 'ఇలాంటి ధర్మాసనాలతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ప్రత్యేక చట్టాలపై న్యాయమూర్తులు దృష్టికేంద్రీకరిస్తూ సమర్థంగా కేసులను పరిష్కరించగలుగుతారు'అని తెలిపింది. న్యాయవ్యవస్థపై పెరుగుతున్న పని ఒత్తిడి వల్లే పన్ను కేసులు పోగుపడుతున్నాయని పేర్కొంది.

విద్య, ఆరోగ్యానికి విశేష ప్రాధాన్యం






దిల్లీ: నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రజల విద్య, ఆరోగ్య సంబంధ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నిరంతరంగా ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆర్థిక సర్వే పేర్కొంది. "వర్ధమాన ఆర్థిక వ్యవస్థ కావడంతో భారత్‌లో విద్య, ఆరోగ్యం వంటి కీలక సామాజిక మౌలిక వసతుల్లో వ్యయాన్ని పెంచడానికి సరిపడా నిధులు లేవు. అయినా ప్రజల విద్య, ఆరోగ్య స్థితిగతులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిరంతరంగా ప్రాధాన్యం ఇస్తోంది" అని వివరించింది.

- జీఎస్‌డీపీలో సామాజిక సేవల వాటా 6 శాతం (2014-15) నుంచి 6.9 శాతాని (2016-17)కి పెరిగింది.
- పాఠశాలల్లో చేరిక, పాఠశాల భవనాలు, తరగతి గదులు, తాగునీటి వసతులు, మరుగుదొడ్ల నిర్మాణం, ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయుల నియామకం వంటి సంఖ్యాపరమైన సూచికల్లో భారత్ గణనీయ పురోగతి సాధించింది. అయితే బిహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సరిపడా టీచర్లు లేని పాఠశాలలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.
- బాలికా రక్షణ, విద్యను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'బేటీ బచావో బేటీ పడావో' పథకాన్ని దేశంలోని 640 జిల్లాలకు విస్తరించడానికి ప్రభుత్వం అంగీకరించింది.
- ఈ ఆర్థిక సంవత్సరం నుంచి జాతీయ పోషకాహార మిషన్ ఏర్పాటుకు సమ్మతించింది. ఇది.. పోషకాహార లోపం, రక్తహీనత, తక్కువ బరువుతో శిశు జననాలు వంటివాటిని తగ్గించడానికి ఉపయోగపడుతుంది.
- ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద కాలుష్యానికి వీల్లేని వంట గ్యాస్‌ను అందించడం ద్వారా మహిళలు, చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి వీలవుతుంది. ఈ నెల 18 నాటికి 3.3 కోట్ల కనెక్షన్లు ఇచ్చారు.
- 2020 నాటికి రాష్ట్రాలు తమ బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి 8 శాతం కన్నా ఎక్కువ నిధులు కేటాయించాలని జాతీయ ఆరోగ్య విధానం-2017 సూచిస్తోంది.

విజ్ఞాన ఖనిగా అవతరించాలి

దిల్లీ: అభివృద్ధి పరంగా ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కోవాలంటే మన దేశం క్రమేణా విజ్ఞాన ఖనిగా అవతరించాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే ఆకాంక్షించింది. వాతావరణ మార్పుల నుంచి భద్రతపరమైన సవాళ్ల వరకు అనేక రకాల ముప్పులను, సైబర్ యుద్ధాలను, డ్రోన్ల వంటి స్వతంత్ర వ్యవస్థలను ఎదుర్కొని పునరుత్థానం పొందడానికి విజ్ఞాన ఖని వీలు కల్పిస్తుందని పేర్కొంది. శాస్త్ర పరిశోధనల విస్తృతిలో పురోగతి తక్కువగా ఉందని పెదవి విరిచింది. నాస్కాం అంచనా ప్రకారం ఐ.టి. పరిశ్రమ గత ఆర్థిక సంవత్సరంలో 8.1% వృద్ధి సాధించి 140 బిలియన్ డాలర్లను (సుమారు రూ.9,38,000 కోట్లు) చేరిందని తెలిపింది. ఐ.టి. ఎగుమతుల్లో 7.6% వృద్ధి నమోదైందని తెలిపింది.

ఐసీటీలో పోటీ ఇస్తున్న చైనా, బ్రెజిల్



దిల్లీ: సమాచార సాంకేతిక విజ్ఞానం (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ-ఐసీటీ) ఎగుమతుల్లో భారత్ పోటీ ఎదుర్కొంటోంది. ప్రధానంగా చైనా, బ్రెజిల్‌లు పోటీ ఇస్తున్నాయి. రష్యా, ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్ వంటి దేశాలు కూడా రంగంలో ఉన్నాయి. ప్రపంచబ్యాంకు నివేదిక ఆధారంగా ఈ నిర్ణయానికి వచ్చింది. 2006లో భారత్ నుంచి ఎగుమతి అయిన మొత్తం సేవల్లో ఐటీసీ వాటా 68 శాతం కాగా, 2016 నాటికి అది 67 శాతానికి తగ్గింది. ఇది స్వల్పమే అయినప్పటికీ, మిగిలిన దేశాల నుంచి పోటీ ఎదురవుతోందన్న విషయాన్ని గుర్తుచేస్తోందని తెలిపింది. ఇదేసమయంలో చైనా, బ్రెజిల్‌ల నుంచి ఎగుమతులు గణనీయంగా పెరగడంతో ఆ రెండు దేశాల నుంచి గట్టిపోటీ ఉన్నట్టు గమనించాల్సి ఉంటుందని పేర్కొంది. యూరోప్, ఆఫ్రికా, చైనా, జపాన్‌లలో కొత్త అవకాశాలు వచ్చే అవకాశం ఉండడంతో ఐ.టి.రంగంలో ప్రగతి బాగుంటుందని అంచనా వేసింది.

'ఒడిశా ధాన్యాన్ని నివారించేందుకు చర్యలు'

పౌరసరఫరాల శాఖ వివరణ

ఈనాడు, అమరావతి: ఒడిశా నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉందని.. ఈ సరకును మన రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నమోదు చేయించకుండా చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల శాఖ తెలిపింది. పొరుగు రాష్ట్రాల ధాన్యాన్ని ఇక్కడి రైతుల పేరుతో పీపీసీల్లో మిల్లర్లు నమోదు చేయిస్తుండడంపై సోమవారం 'ఈనాడు'లో 'సర్కారు సొమ్మే ప్రాధాన్యం' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆ శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో ముఖ్య కార్యదర్శి వివరణ ఇచ్చారు. "ధాన్యం రవాణాపై పరిమితుల్లేవు. మిల్లర్లు వారి సొంత వ్యాపారాలకు ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల ప్రకారం పీపీసీల్లో కొనుగోళ్లను పరిమితం చేస్తున్నాం" అని పేర్కొన్నారు.

ఉద్యోగార్థుల 'చిరునామా' గల్లంతు!

- **పంచాయతీ రాజ్‌లో నిలిచిన 16 మంది ఈవోల నియామకం**
- **వివరాల్లేవన్న ఏపీపీఎస్సీ సమాధానంతో పక్కకెళ్లిన జాబితా**

ఈనాడు - అమరావతి

ఉద్యోగార్థులను ఎంపిక చేశాక చిరునామా తెలియడం లేదని జాబితాను పక్కన(రిజర్వులో) పెట్టడం ఎక్కడైనా విన్నారా? పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి(పీఆర్) శాఖలో 16 కార్యనిర్వాహక అధికారుల(ఈఓపీఆర్‌డీ) పోస్టుల విషయంలో అలాంటిదే చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూపు-2(బి) పోస్టుల కోసం 1999లో నోటిఫికేషన్ జారీ చేసి సుప్రీం కోర్టు ఆదేశాలపై తాజాగా కొన్ని సవరణలతో వివిధ ప్రభుత్వశాఖలకు ఉద్యోగార్థులను కేటాయించింది. ఇందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు 46 మంది కార్యనిర్వాహక అధికారుల జాబితాను ఏపీపీఎస్సీ అందజేసింది. ఈ మేరకు అధికారులు ఉద్యోగార్థి చిరునామాకు సమాచారాన్నిచ్చి వెంటనే ఉద్యోగంలో చేరాలని సూచిస్తుంటారు. కార్యనిర్వాహక అధికారుల్లో 16 మందికి చెందిన వివరాలు(చిరునామా) జాబితాలో లేకపోవడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగార్థుల పేర్లు మాత్రమే జాబితాలో ఉన్నందున వారందరికీ సమాచారాన్ని చేరవేయడం సాధ్యం కాలేదు. 46 మంది ఈవోల కేటాయింపుల్లో 30మందిని నియమించిన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మిగతా అభ్యర్థుల చిరునామా పంపిస్తే తదుపరి నియామక ప్రక్రియ పూర్తిచేస్తామని ఏపీపీఎస్సీకి రాసింది. అభ్యర్థుల చిరునామా తమ దగ్గర లేదన్న సమాధానంతో అధికారులు మిగిలిన ఈవోల నియామక ప్రక్రియను పక్కన పెట్టారు.

ఉమ్మడి రాష్ట్రంలో 1999లో ఏపీపీఎస్సీ గ్రూపు-2(బి) ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీచేసి ఎంపిక ప్రక్రియను 2005లో పూర్తిచేసింది. ఎంపికను సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు తదనంతరం న్యాయపోరాటం చేయగా సుప్రీం కోర్టు ఆదేశాలతో ఏపీపీఎస్సీ కొన్ని సవరణలు చేస్తూ 2017 ఆగస్టులో పునర్నియామక ఉత్తర్వులిచ్చింది. ఈ సందర్భంలో ఉద్యోగార్థుల సమగ్ర సమాచారం అందించకపోవడంతో ప్రత్యేకించి కార్యనిర్వాహక అధికారుల ఉద్యోగ నియామకాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చేతులెత్తేశారు. ఉద్యోగార్థుల చిరునామా అందుబాటులో లేనందున తామేమీ చేయలేమని, పోస్టులైతే రిజర్వులో పెట్టామని అధికారులు చెబుతున్నారు. అభ్యర్థులెవరో తెలిస్తే ధ్రువపత్రాలు పరిశీలించి నియామక ప్రక్రియను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

శ్రీవారిమెట్టు వద్ద పేలుడు సామగ్రి స్వాధీనం



కార్యదళం స్వాధీనం చేసుకున్న ప్రమాదకరమైన పేలుడు సామగ్రి

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీవారి మెట్టుకు కూతవేటు దూరంలో సోమవారం రాత్రి ప్రత్యేక కార్యదళ బృందం అత్యంత ప్రమాదకరమైన పేలుడు సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకుంది. శేషాచల అడవిలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించే క్రమంలో ఐజీ కాంతారావు ఆధ్వర్యంలో బృందం శ్రీవారిమెట్టు ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. ఈ క్రమంలో వాహనాల పార్కింగ్‌కు సమీపంలో గోనెసంచిలో భారీ పేలుళ్లకు వినియోగించే ప్రమాదకరమైన ఎలక్ట్రానిక్ పరికరాలు గుర్తించింది. వాటిలో కండెన్సర్లు, సెల్‌ఫోన్‌లో వినియోగించే పలు పరికరాలు, కెపాసిటర్లు, సర్క్యూట్ బోర్డులు ఉన్నాయి. తిరుపతి నుంచి బాంబ్‌స్క్వాడ్ శ్రీవారి మెట్టు ప్రాంతానికి చేరుకుంది. వీటిని తిరుమలకు తీసుకెళ్లేందుకు ముందుగా ఇక్కడ దాచారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పీఏసీఎస్ పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

డీసీసీబీ, ఆప్కాబ్‌లకూ కొనసాగింపు

ఈనాడు, అమరావతి: ప్రాథమిక సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, ఆప్కాబ్ పాలకవర్గాల పదవీకాలాన్ని మరో ఆర్నెల్లపాటు పొడిగించారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ కార్యక్రమంలో అధికారులు నిమగ్నమై ఉన్నందున వీరి పదవీకాలాన్ని పొడిగిస్తున్నట్లు సోమవారం ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. సహకార సంఘాల పదవీకాలం ఈ నెల 30, వచ్చే నెల 3తో ముగుస్తుంది. కేంద్ర బ్యాంకు పాలకవర్గాలకు ఫిబ్రవరి 17 వరకు గడువుంది. ఆప్కాబ్ పాలకుల పదవీకాలం ఫిబ్రవరి 26తో పూర్తవుతుంది. ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో వీరంతా మరో ఆరు నెలల పాటు పదవుల్లో కొనసాగే వీలు కలిగింది.

కంప్యూటరీకరణ కోసమే: దేశవ్యాప్తంగా రూ.1,900 కోట్లతో పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో చేపట్టిన కంప్యూటరీకరణకు ప్రభుత్వం తన వాటా 35శాతం కింద రూ.24.60కోట్లు విడుదల చేసింది. దీని కోసం పద్దు పుస్తకాలు సిద్ధం చేసుకోవడం, లెక్కలు సక్రమంగా నిర్వహించుకోవాలి. ఆడిటర్లను నియమించుకోవాల్సి ఉంది. ఇందులో భాగంగా పీఏసీఎస్ సీఈఓ, పర్యవేక్షకుడు, ఆడిటర్‌తో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీలు నియమించారు.

'స్థానికత'లో కీలక మార్పులు!

7వ తరగతిలోపు 4 ఏళ్లు ఒకేచోట చదివి ఉండాలి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి స్థానికతకు ఉన్న నిబంధనలో కొన్ని కీలక మార్పులు జరగనున్నాయి. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడ వారికి స్థానికత లభిస్తుంది. ఈమేరకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఛైర్మన్‌గా 'జోన్లు, స్థానికత'పై నియమించిన కమిటీ నిర్ణయించింది. ముసాయిదాను ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలనకు పంపారు. ఇప్పటివరకు 4 నుంచి 10వ తరగతి వరకు ఏడేళ్ల చదువులో నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడ స్థానికత (లోకల్) హోదా లభించే విధానం అమల్లో ఉంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో 6వ తరగతి నుంచే తల్లిదండ్రులు పిల్లలను ఇతర జిల్లాలకు, నగరాలకు పంపి చదివిస్తున్నారు. దీనివల్ల కుటుంబం, నివాసం ఒక జిల్లాలో ఉంటే.. ఉద్యోగాల ఎంపిక వద్దకు వచ్చేసరికి మరో జిల్లాకు స్థానికులు అవుతున్నారు. ప్రస్తుతం జిల్లాల పెంపుతో అది మరింత పెద్ద సమస్య అయింది. అందుకే ప్రాథమిక విద్యను ఎక్కువగా సొంత గ్రామంలో/మండలంలో/జిల్లాలో చదువుతారు కాబట్టి 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువును పరిగణలోకి తీసుకోవాలని కమిటీ సిఫారసు చేసినట్లు తెలిసింది. అంటే ఆ ఏడేళ్ల విద్యలో నాలుగేళ్లు ఏ జిల్లాలో చదివితే ఆ జిల్లాకు/జోనల్/రాష్ట్రానికి స్థానికుడు అవుతారు. నివాసం ఆధారంగా స్థానికతను పరిగణలోకి తీసుకోవాలని భావించినా అక్రమంగా ధ్రువపత్రాలు సృష్టించే అవకాశం ఉందని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. ఉద్యోగాల ఎంపికకు, బదిలీకి జిల్లా, జోనల్, రాష్ట్ర అనే మూడు కేడర్లు మాత్రమే ఉంటాయి. మొదట్లో మల్టీ జోనల్ కూడా పెట్టాలని భావించినా దానిపై కమిటీ సుముఖత చూపలేదు.

మద్యం మత్తులో ఇన్‌స్పెక్టర్ వీరంగం

కారుతో జనంపైకి నడపడంతో ముగ్గురికి తీవ్రగాయాలు




గిరీష్ నారాయణ

ఈనాడు, హైదరాబాద్: పోలీస్ ఇన్‌స్పెక్టర్ గిరీష్ నారాయణ మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. వేగంగా కారు నడుపుతూ జనంపైకి దూసుకెళ్లడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జవహర్ నగర్ యాప్రాల్ సమీపంలోని మిలిటరీ హనుమాన్ దేవాలయం వద్ద సోమవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో జరిగింది. అంబర్‌పేటలో పోలీస్ శిక్షణ కేంద్రంలో గిరీష్ నారాయణ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం అక్కడి నుంచి ఇంటికి కారులో వెళ్లే క్రమంలో మిలిటరీ హనుమాన్ దేవాలయం దాటాక ఉన్న మలుపు వద్ద గిరీష్ వాహనం వేగంగా దూసుకువచ్చింది. ఆటో, రెండు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. ద్విచక్రవాహనంపై ఉన్న భార్యాభర్తలు భిక్షపతి, సత్యలక్ష్మి, స్కూటీపై వెళుతున్న చంద్రశేఖర్, ఆటోలో వెళుతున్న యువతికి తీవ్రంగా గాయాలయ్యాయి.

మూడు తరాల్ని చిదిమేశాడు

- **అత్త, నాలుగేళ్ల కూతురిని గొంతు నులిమేశాడు**
- **రోకలిబండ రాయితో మోది భార్యను చంపేశాడు**





హత్యకు గురైన జయలక్ష్మి, మనుమరాలు కార్తికేయి, అపర్ణ ★ నిందితుడు మధు

ఈనాడు, హైదరాబాద్: ఒకే ఇంట్లో మూడు మృతదేహాలు.. దారుణ హత్యలు.. భార్యకు తెలియకుండా మరొకరిని పెళ్లి చేసుకున్న ఓ వ్యక్తి గొడవలు రేగడంతో రెండో భార్యను, కుమార్తెతో పాటు అత్తను చంపి పరారయ్యాడు. హైదరాబాద్ చందానగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది.. ఇక్కడి వేముకుంటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో జయలక్ష్మి (50), ఆమె కుమార్తె అపర్ణదేవి (30), మనమరాలు కార్తికేయి (4) రెండు నెలలుగా ఉంటున్నారు. సోమవారం ఉదయం పాలు పోసే వ్యక్తి వచ్చి చూడగా వారి ఇంటికి బయటినుంచి తాళం వేసి ఉండగా.. ఇంట్లోంచి దుర్వాసన వస్తోంది. పోలీసులు వచ్చి పరిశీలించి తాళం పగలగొట్టి చూడగా అపర్ణ వంట గదిలో రక్తపు మడుగులో చనిపోయి కనిపించింది. గదిలో మంచంపై జయలక్ష్మి, చిన్నారి కార్తికేయి మృతదేహాలు కనిపించాయి. అపర్ణ తలపై రోకలిబండ రాయితో మోది చంపగా.. మిగిలిన ఇద్దరిని గొంతు నులిమి చంపినట్లు అనుమానిస్తున్నారు.

రెండో పెళ్లి బహిర్గతమైన విభేదాలు: పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన జయలక్ష్మి (50), మురళి భార్యాభర్తలు. చాన్నాళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి ఉంటున్నారు. వారికి కుమార్తె అపర్ణదేవి (30), కుమారుడు వంశీ ఉన్నారు. కొడుకు తాడేపల్లిగూడెంలో దుకాణం నడుపుతుంటాడు. అపర్ణ ఇక్కడే ఓ షోరూంలో పని చేస్తోంది. అపర్ణకు గతంలో పశ్చిమగోదావరి జిల్లా ఉల్లంపర్రుకు చెందిన మధుతో పరిచయం ఏర్పడి ప్రేమకు దారి తీసింది. అపర్ణ తండ్రి మురళి వారి పెళ్లికి నిరాకరించాడు. ఆ తర్వాత మురళి చనిపోవడంతో తల్లి జయలక్ష్మి అపర్ణ, మధులకు పెళ్లి జరిపించింది. అయితే మధుకు అప్పటికే యామిని అనే మహిళతో పెళ్లయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అపర్ణను రెండోపెళ్లి చేసుకుంటున్నట్లు ఇంట్లో తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. ఈ విషయం యామినికి తెలియడంతో గొడవలు మొదలయ్యాయి. ఇదేసమయంలో అపర్ణ మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందని అనుమానం రావడంతో మధు ఆమెపై కక్ష పెంచుకున్నాడు.

ఒకరిపై మరొకరు పోలీసు కేసులు: గొడవల నేపథ్యంలో మధుపై యామిని, అపర్ణ పోలీసు స్టేషన్లలో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. నాలుగురోజుల క్రితం అపర్ణ.. యామినికి ఫోన్ చేసి గొడవ పడింది. యామిని దాన్ని రికార్డు చేసి మధుకు వినిపించింది. తరచూ ఇలా గొడవలు జరుగుతుండటంతో విసిగిపోయిన మధు.. అపర్ణ కుటుంబాన్ని అంతమొందించాలని పథకం వేశాడు. శనివారం మధ్యాహ్నం పూటుగా మద్యం తాగి అపర్ణ ఇంటికి వెళ్లాడు. అత్త జయలక్ష్మి తాగి వచ్చినందుకు మధుతో గొడవ పడింది. అప్పటికే వారిపై కోపంతో ఉన్న మధు.. ఆమెను బలంగా కొట్టాడు. కిందపడిపోవడంతో గొంతుకు తువ్వాలు బిగించి హత్యచేశాడు. తర్వాత నాలుగేళ్ల కుమార్తెను గొంతు నులిమి చంపేశాడు. కాసేపటికి అపర్ణ ఇంటికి రావడంతో రోకలిబండతో తలపై మోది చంపేసి ఇంటికి తాళం వేసి పారిపోయాడు. సోమవారం విషయం బయటికి పొక్కడంతో చందానగర్ ఠాణాలో లొంగిపోయాడు.

వైకాపా ర్యాలీలో తుపాకుల అలజడి

ఈనాడు డిజిటల్, ఒంగోలు: ప్రకాశం జిల్లా కనిగిరిలో వైకాపా శ్రేణుల మధ్య ఘర్షణ జనాల్లో భయాందోళనలు రేకెత్తించింది. వైకాపాలోని ఇరువర్గాల మధ్య ఘర్షణ సందర్భంలో కొందరు ప్రైవేటు భద్రత సిబ్బంది తుపాకులు తీసి బెదిరించడంతో స్థానికంగా భయాందోళనలు రేగాయి. కనిగిరిలో 'వాక్ విత్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి మధుసూదనయాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్తున్నారు. చెన్నై కేంద్రంగా బిట్‌కాయిన్ వ్యాపారం నిర్వహించే సైకం రామకృష్ణారెడ్డి కూడా దీనికి అనుచరులతో తరలివచ్చారు. తన ప్రైవేటు గన్‌మెన్, ఇతర రాష్ట్రాల వ్యక్తులతో కలిసి ఆయన ర్యాలీలోకి ప్రవేశించబోయారు. ఈ గన్‌మెన్ అత్యుత్సాహం, రామకృష్ణారెడ్డి అనుచరుల హంగామాను గమనించి కార్యకర్తలు వీరిని అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి, ఘర్షణకు దారితీసింది. పిడిగుద్దులు, తోపులాటతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో రామకృష్ణారెడ్డి వెంట వచ్చిన భద్రతా సిబ్బంది తుపాకులు బయటకు తీసి బెదిరించడంతో కార్యకర్తలంతా భయంతో చెల్లాచెదురయ్యారు. పోలీసులు రంగంలోకి దిగి తుపాకులతో వచ్చిన వారిని అదుపులోకి తీసుకున్నారు. రామకృష్ణారెడ్డి సహా ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదుచేసి, అరెస్టు చేశారు.

నిస్వార్థసేవతో ప్రజలకు ప్రయోజనం

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు

ఈనాడు డిజిటల్, విజయవాడ: సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకున్న వ్యక్తులు నిస్వార్థంగా ప్రజలకు సేవచేస్తే ప్రయోజనం ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన స్వస్థ కుటుంబం క్లినిక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. టాటా వంటి వ్యాపారవేత్తలతో కాసేపు మాట్లాడేందుకు సమయం దొరకడమే కష్టమని, అలాంటిది ఏకంగా టాటా ట్రస్ట్‌నే విజయవాడ పార్లమెంట్ పరిధిలో సేవలందించేందుకు తీసుకొచ్చిన ఘనత ఎంపీ కేశినేని నానికే దక్కుతుందన్నారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ పరిధిలో 72వేల మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయడంలో టాటా ట్రస్ట్ సహకారం మరువలేదన్నారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ దక్షిణ భారత ఇన్‌ఛార్జి పవిత్రకుమార్, ట్రస్ట్ ప్రతినిధి ఆర్.రాజేంద్రబాబు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

పురపాలక ఎన్నికల్లోనూ 'నోటా' ఓటు

ఈనాడు, అమరావతి: పురపాలికలు, నగరపాలక సంస్థల ఎన్నికల్లోనూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం)లో 'నోటా' ఓటు ఐచ్ఛికాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు చట్టాన్ని సవరిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సంస్కరణల్లో భాగంగా గత సాధారణ ఎన్నికల నుంచి ఈవీఎంలతోపాటు బ్యాలెట్ పత్రాల్లో 'నోటా'ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

ఛాంపియన్స్



ఆమె తోడుంటే..

మెల్‌బోర్న్: తాను టెన్నిస్‌లో కొనసాగుతున్నానంటే కారణం భార్య మిర్కా వల్లేనని స్విస్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ అన్నాడు. ఆమె అండగా లేకుంటే ఇక్కడిదాకా వచ్చేవాడిని కాదని. నాతో మిర్కా ప్రయాణించినంత కాలం తాను టెన్నిస్ ఆడతానని అతనన్నాడు. "గత 12 నెలలల్లో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాను. నమ్మబుద్ధి కావట్లేదు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి కెరీర్‌లో 20వ టైటిల్ సాధించా. అసలు 20 టైటిళ్లు సాధిస్తానని ఊహించనే లేదు. టైటిల్‌ను నిలబెట్టుకుంటానని అస్సలు అనుకోలేదు. ఇదే జోరు కొనసాగించాలంటే షెడ్యూల్ జాగ్రత్తగా చూసుకోవాలి. టోర్నీల ప్రణాళిక విషయంలోనే శ్రద్ధ తీసుకోవాలి. నా భార్య మిర్కా ఈ విషయంలో ఎంతో మద్దతు ఇస్తుంది. ఏ టోర్నీ ఆడాలి.. ఏది ఆడకూడదో తనకు బాగా తెలుసు. మిర్కా, నా తల్లిదండ్రుల అండగా ఉన్నారు కాబట్టే ఇంకా టెన్నిస్‌లో కొనసాగగలుతున్నా. ముఖ్యంగా మిర్కా నాతో ప్రయాణించినంత కాలం టెన్నిస్ ఆడతా" అని రోజర్ చెప్పాడు.

నంబర్‌వన్‌కు చేరువలో...: ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన రోజర్ ఫెదరర్ నెమ్మదిగా నంబర్‌వన్ ర్యాంకుకు చేరువవుతున్నాడు. సోమవారం ఏటీపీ తాజా ర్యాంకింగ్స్‌లో ఫెదరర్ 9605 పాయింట్లతో రెండో ర్యాంకులో ఉన్నాడు. అతనికి అగ్రస్థానంలో ఉన్న రఫెల్ నాదల్ (స్పెయిన్, 9760)కు మధ్య తేడా 155 పాయింట్లు మాత్రమే.



వోజ్నియాకి నంబర్‌వన్: ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచిన డెన్మార్క్ భామ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ఆమె సిమోనా హలెప్ (రుమేనియా)ను వెనక్కినెట్టి అగ్రస్థానంలో నిలిచింది. ఆమె చివరిగా 2012లో నంబర్‌వన్ అయింది. స్విటోలెనా (ఉక్రెయిన్) మూడో స్థానంలో ఉండగా.. ముగురుజ (స్పెయిన్) నాలుగో స్థానంలో కొనసాగుతోంది.



హరికృష్ణ పెళ్లి..

హైదరాబాద్, ఈనాడు: భారత అగ్రశ్రేణి చెస్ క్రీడాకారుడు పెంటేల హరికృష్ణ త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్నాడు. అతను సెర్బియా చెస్ క్రీడాకారిణి నద్జాను వివాహం చేసుకోబోతున్నట్లు వెల్లడైంది. మార్చి 3న హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్లో హరికృష్ణ పెళ్లి జరగనుంది. హరికృష్ణ జూనియర్ స్థాయిలో చెస్ ఆడే రోజుల్లోనే నద్జా పరిచయమైందట. ఆ తర్వాత ఇద్దరికీ స్నేహం కుదిరి.. తర్వాత అది ప్రేమగా మారింది. పెద్దల అంగీకారంతో ఈ పెళ్లి జరగనున్నట్లు హరికృష్ణ తండ్రి నాగేశ్వరరావు 'ఈనాడు'తో వెల్లడించారు.



కింగ్స్ ఎలెవన్ పేరు మార్పు?

దిల్లీ: ఐపీఎల్ ఫ్రాంఛైజీ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ పేరు మారబోతుందా? ఔననే అంటున్నాయి బీసీసీఐ వర్గాలు. తమ జట్టు పేరు మార్చుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ కింగ్స్ ఎలెవన్ సహ యజమాని బీసీసీఐకి దరఖాస్తు చేసుకున్నట్లుగా బోర్డు అధికారి ఒకరు తెలిపారు. అసలు తమ ఫ్రాంఛైజీని మొహాలి నుంచి వేరే నగరానికి మార్చేయాలని కింగ్స్ యాజమాన్యం కోరుకుంటున్నట్లు కొన్నేళ్ల కిందట్నుంచే వార్తలొస్తున్నాయి.

ఐపీఎల్ సిత్రాలు

వీరేంద్ర సెహ్వాగ్ కుటుంబ సభ్యుడు ఈసారి ఐపీఎల్‌లో ఆడబోతున్నాడు..
ఇంకా అంతర్జాతీయ క్రికెట్టే ఆడని ఒక కుర్రాడిని ఓ ఐపీఎల్ ఫ్రాంఛైజీ రూ.8 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది..
బ్యాట్స్‌మెన్ జోరు కొనసాగే ఐపీఎల్‌లో ఎక్కువగా బౌలర్లకే భారీ ధరలు పలికాయి..
గొప్ప పేరు, అనుభవం ఉన్న సీనియర్ల కంటే జూనియర్ స్థాయి కుర్రాళ్లకే పెద్ద పీట వేస్తున్నాయి..
అంతర్జాతీయ క్రికెట్లో పసికూన అనదగ్గ జట్టులో ఉన్నప్పటికీ ఆ జట్టు ఆటగాళ్లు ఐపీఎల్‌లో హీరోలవుతున్నారు..
ఈసారి ఐపీఎల్ వేలంలో ఇలాంటి సిత్రాలెన్నో చోటు చేసుకున్నాయి. ఈ సిత్రాలేంటో వివరంగా తెలుసుకుందాం పదండి.

వీరూ అల్లుడు.. బిర్లా తనయుడు

సెహ్వాగ్ అల్లుడు.. కాంపౌండర్ కొడుకు

ఐపీఎల్ వేలం ప్రతిసారీ కొందరు కొత్తవాళ్లను వెలుగులోకి తెస్తుంది. ఈసారి కూడా అలాంటి వాళ్లు కొందరున్నారు. టీమ్‌ఇండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అల్లుడైన యువ బ్యాట్స్‌మన్ మయాంక్ దాగర్‌ను వీరూ మెంటార్‌గా ఉన్న పంజాబ్ రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. ఇక భారత కుబేరుల్లో ఒకడైన కుమార మంగళం బిర్లా కొడుకు విక్రమ్ బిర్లా.. కశ్మీర్‌లో ఓ పేద కూలీ కుటుంబానికి చెందిన మంజూర్ దర్ కూడా ఐపీఎల్‌లో ఆడబోతున్నారు. ఇక రాజస్థాన్‌లో ఓ కాంపౌండర్ కొడుకైన ఖలీల్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ ఏకంగా రూ.3 కోట్లు పెట్టి కొనుగోలు చేయడం విశేషం. ఆ డబ్బుతో తన తల్లిదండ్రులకు ఒక ఇల్లు కట్టి ఇస్తానని అంటున్నాడు ఖలీల్.




సెహ్వాగ్‌తో మయాంక్

కెప్టెన్లు ఎవరు?



సన్‌రైజర్స్‌కు వార్నర్.. ముంబయికి రోహిత్.. చెన్నైకి ధోని.. బెంగళూరుకు కోహ్లి.. మరి మిగతా నాలుగు జట్ల మాటేంటి? అదే తేలాల్సి ఉంది. ఆ నాలుగు జట్లకు కొత్త కెప్టెన్లను చూడబోతున్నాం. రాజస్థాన్ అట్టిపెట్టుకున్న స్టీవెన్ స్మితే ఆ జట్టు సారథి కావచ్చు. కోల్‌కతా నుంచి దిల్లీకి వచ్చిన గంభీర్‌కు ఆ జట్టు పగ్గాలు అప్పగించడమూ లాంఛనమే కావచ్చు. కోల్‌కతా సంగతే అంతుబట్టకుండా ఉంది. ఇక్కడ కెప్టెన్సీ అనుభవం ఉన్న వాళ్లు కనిపించట్లేదు. దినేశ్ కార్తీక్, ఉతప్పల్లో ఒకరికి అవకాశం దక్కొచ్చని భావిస్తున్నారు. ఇక పంజాబ్ జట్టు రూ.7.6 కోట్లు పెట్టి కొన్న అశ్విన్‌ను కెప్టెన్‌ను చేస్తుందా? లేక మాజీ కెప్టెన్ యువరాజ్‌కే మళ్లీ పగ్గాలప్పగిస్తుందా అన్నది చూడాలి.



శాంసన్

కుర్రాళ్లోయ్ కుర్రాళ్లు

ఇంకా ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడని.. పెద్దగా దేశవాళీ అనుభవం కూడా లేని కుర్రాళ్లకు ఈ వేలంలో కళ్లు చెదిరే ధరలు పలికాయి. అండర్-19 జట్టులో సత్తా చాటుతున్న నాగర్‌కోటి (రూ.3.2 కోట్లు), శివమ్ మావి (రూ.3.2 కోట్లు), శుభ్‌మన్ గిల్ (రూ.1.8 కోట్లు) మంచి ధర దక్కించుకున్నారు. ఇంకా సంజు శాంసన్ (రూ.8 కోట్లు), ఇషాన్ కిషన్ (రూ.6.2 కోట్లు), కుల్‌దీప్ (రూ.5.8 కోట్లు), వాషింగ్టన్ సుందర్ (రూ.3.2 కోట్లు), సైని (రూ.3 కోట్లు), ఖలీల్ అహ్మద్ (రూ.3 కోట్లు), సిరాజ్ (రూ.2.6 కోట్లు) అనూహ్యమైన రేటు పలికారు.

అఫ్గానోళ్లా మజాకా!

ఐపీఎల్‌తో అత్యధిక ప్రయోజనం పొందింది వెస్టిండీస్ క్రికెటర్లే. ఇప్పుడు అఫ్గానిస్థాన్ లాంటి చిన్న జట్టు కూడా ఇలాగే ఐపీఎల్‌తో ప్రయోజనం పొందేలా ఉంది. ఆ దేశ యువ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఏకంగా రూ.9 కోట్లు పలికాడు. 16 ఏళ్ల కొత్త స్పిన్నర్ ముజీబ్ జాద్రాన్ రూ.4 కోట్లతో పంజాబ్ సొంతమయ్యాడు. నబికి కూడా రూ.కోటి పలికాడు.



రషీద్ ఖాన్



స్టార్క్

బౌలర్లకు పంటే..

ఐపీఎల్ అంటే బ్యాట్స్‌మెన్ టోర్నీ అంటారు కానీ.. ఐపీఎల్ వేలంలో మాత్రం బౌలర్లదే హవా. స్పెషలిస్టు బౌలర్లు, బౌలింగ్ కూడా చేయగల ఆల్‌రౌండర్లకు ఫ్రాంఛైజీలు పెద్ద పీట వేశాయి. ఈసారి వేలంలో అత్యధికంగా రూ.12.5 కోట్లు పలికిన స్టోక్స్ ఆల్‌రౌండర్. భారత ఆటగాళ్లలో అత్యధిక ధర (రూ.11.5 కోట్లు) పలికిన ఉనద్కట్ బౌలర్. మాక్స్‌వెల్ (రూ.11 కోట్లు), స్టాయినిస్ (రూ.6.2 కోట్లు), పొలార్డ్ (రూ.5.4 కోట్లు) లాంటి ఆల్‌రౌండర్లు.. స్టార్క్ (రూ.9.4 కోట్లు), రషీద్ (రూ.9 కోట్లు), ఆండ్రూ టై (రూ.7.2 కోట్లు), ఆర్చర్ (రూ.7.2 కోట్లు), చాహల్ (రూ.6 కోట్లు), కమిన్స్ (రూ.5.4 కోట్లు), కర్ణ్ శర్మ (రూ.5 కోట్లు) లాంటి బౌలర్లు అంచనాల్ని మించిపోయారు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ కోసం కూడా ఫ్రాంఛైజీలు భారీగా ఖర్చు చేశాయి. దినేశ్ కార్తీక్ (రూ.7.4 కోట్లు), ఉతప్ప (రూ.6.4 కోట్లు), ఇషాన్ కిషన్ (రూ.6..2 కోట్లు), సాహా (రూ.5 కోట్లు) మంచి రేటు పలికారు.



యువరాజ్

స్టార్లా.. అయితే ఏంటి?

ఐపీఎల్‌లో ఘన చరిత్ర ఉన్న సీనియర్లు, స్టార్లకు ఈసారి వేలంలో చుక్కెదురైంది. టీ20 చరిత్రలోనే అత్యంత ఆకర్షణీయ ఆటగాళ్లలో ఒకడైన గేల్ దాదాపుగా ఈసారి ఐపీఎల్‌కు దూరమయ్యే పరిస్థితి కనిపించింది. రెండుసార్లు వేలంలో అతను అమ్ముడవలేదు. ఆఖర్లో పంజాబ్ అతడిని కనీస ధరకు కొనుగోలు చేసింది. 2015లో రూ.16 కోట్లు పలికిన యువరాజ్ ఈసారి రూ.2 కోట్లకు పరిమితమయ్యాడు. గంభీర్ (రూ.2.8 కోట్లు), హర్భజన్ (రూ.2 కోట్లు), మురళీ విజయ్ (రూ.2 కోట్లు), అంబటి రాయుడు (రూ.2.2 కోట్లు) ధరలు కూడా బాగా పడిపోయాయి. ఇక అంతర్జాతీయ స్థాయిలో పెద్ద స్టార్లేమీ కానప్పటికీ కేఎల్ రాహుల్ (రూ.11 కోట్లు), మనీష్ పాండే (రూ.11 కోట్లు), కేదార్ జాదవ్ (రూ.7.8 కోట్లు), కరుణ్ నాయర్ (రూ.5.6 కోట్లు) కళ్లు చెదిరే రేటు పలికారు. ఇంకా అంతర్జాతీయ క్రికెట్ ఆడని కృనాల్ పాండ్య (రూ.8.8 కోట్లు), కె.గౌతమ్ (రూ.6.2 కోట్లు), సిద్దార్థ్ కౌల్ (రూ.3.8 కోట్లు), హుడా (రూ.3.6 కోట్లు), సందీప్ శర్మ (రూ.3 కోట్లు) లాంటి వాళ్లకు ఊహించని ధర పలికింది.

నాన్నకు సత్కారం.. కుమార్తె ఉద్వేగం



సోమవారం దిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు నుంచి బాయ్ జీవిత కాల సాఫల్య పురస్కారం అందుకుంటున్న బ్యాడ్మింటన్ దిగ్గజం ప్రకాశ్ పదుకొనె (కింది చిత్రం). ఈ సందర్భంగా ఉద్వేగానికి గురైన ప్రకాశ్ కుమార్తె దీపికా పదుకొనె



భారత యువ జట్టు రసవత్తర సెమీఫైనల్‌కు సన్నద్ధమైంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్ నేడే. ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన పృథ్వీ షా నేతృత్వంలోని భారత జట్టు.. అదే జోరు కొనసాగించాలని తహతహలాడుతోంది.

ఫైనల్ కోసం పాక్‌తో సై

- భారత్ సెమీఫైనల్ పోరు నేడే
- అండర్-19 ప్రపంచకప్

తెల్లవారుజామున 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో





క్రైస్ట్‌చర్చ్

భారత యువ ఆటగాళ్లు జోరుమీదున్నారు. ఐపీఎల్‌లో మంచి ధరలు రావడం కూడా వారి ఉత్సాహాన్ని మరింత పెంచింది. ఈ నేపథ్యంలో యువ జట్టు మంగళవారం జరిగే అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్లో పాకిస్థాన్‌తో తలపడనుంది. రెండు సార్లు ఛాంపియన్ అయిన పాక్ గట్టి ప్రత్యర్థి అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ రెండు జట్లు సెమీస్‌కు చేరిన తీరు భిన్నం. మూడుసార్లు ఈ టోర్నీ విజేత భారత్.. క్వార్టర్‌ఫైనల్లో బంగ్లాదేశ్‌పై ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. పాక్ ప్రయాణం మాత్రం అంత సాఫీగా సాగలేదు. తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ చేతిలో కంగుతిన్న ఆ జట్టు.. తర్వాతి మూడు మ్యాచ్‌ల్లో నెగ్గింది. కానీ చివరి రెండు మ్యాచ్‌ల్లో శ్రీలంక, దక్షిణాఫ్రికాలపై కష్టపడింది. ఎడమచేతి వాటం పేసర్ షహీన్ అఫ్రిది నేతృత్వంలో బౌలింగ్ పాక్ విజయాల్లో కీలక పాత్ర పోషించింది. కానీ బ్యాట్స్‌మెనే పెద్దగా రాణించలేకపోయారు. అలీ జర్యాబ్ అసిఫ్ ఒక్కడే నిలకడగా ఆడుతున్నాడు. కీలక పోరులో మిగతా బ్యాట్స్‌మెన్ కూడా రాణించాలని పాక్ కోరుకుంటోంది. మరోవైపు భారత్‌కు ఎలాంటి సమస్యలూ లేవు. అన్ని విభాగాల్లోనూ జట్టు పటిష్టంగా ఉంది. కమ్లేశ్ నాగర్‌కోటి, శివమ్ మావితో భారత పేస్ విభాగం బలంగా ఉంది. ఐపీఎల్‌లో మంచి ధరలు పలకడం వీరి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతోంది. నాగర్‌కోటిని రూ.3.2 కోట్లకు, మావిని 3 కోట్లకు కోల్‌కతా కొనుక్కుంది. ఇక ఎడమచేతి వాటం స్పిన్నర్లు అనుకుల్ రాయ్, అభిషేక్ వర్మలను ముంబయి ఇండియన్స్, దిల్లీ డేర్‌డెవిల్స్‌లు రూ.20 లక్షలు, రూ.55 లక్షలకు సొంతం చేసుకున్నాయి. కెప్టెన్ పృథ్వీ షా, శుభమన్ గిల్‌లతో భారత బ్యాటింగ్ బలంగా ఉంది. కోల్‌కతా అతణ్ని రూ.1.8 కోట్లకు సొంతంగా చేసుకోగా.. షాను రూ.1.2 కోట్లకు ముంబయి దక్కించుకుంది. షా ఓపెనింగ్ భాగస్వామి మంజోత్ కల్రాను దిల్లీ రూ.20 లక్షలకు తీసుకుంది. ఐతే ఆటగాళ్లిక వేలం గురించి ఆలోచించకుండా ఆటపై దృష్టిపెట్టాలని కోచ్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు.

కోహ్లి.. సచిన్‌లా కాదు!



జోహానెస్‌బర్గ్: ప్రస్తుతం భారత జట్టులో కోహ్లికి, మిగతా బ్యాట్స్‌మెన్‌కు అంతరం చాలా ఎక్కువని వెస్టిండీస్ దిగ్గజ ఫాస్ట్‌బౌలర్ మైకేల్ హోల్డింగ్ అభిప్రాయపడ్డాడు. ''గతంలో సచిన్ భారత జట్టులో అత్యుత్తమ బ్యాట్స్‌మన్. ఐతే ద్రవిడ్, లక్ష్మణ్ లాంటి ఆటగాళ్లకు, అతడికి అంతరం తక్కువుండేది. కానీ ఇప్పుడు కోహ్లికి, మిగతా వాళ్లకు చాలా ఎక్కువ తేడా ఉంది. ఇక విరాట్ ఇంగ్లాండ్‌లోనూ సత్తా చాటి తన గొప్పదనాన్ని చాటుతాడని ఎదురు చూస్తున్నా" అన్నాడు. వివ్ రిచర్డ్స్ తరహాలోనే కోహ్లి ముందు ముందు దూకుడు తగ్గి ప్రశాంతంగా మారతాడని హోల్డింగ్ చెప్పాడు. "ప్రస్తుతం కోహ్లి యువ కెప్టెన్. అతను నేర్చుకునే దశలో ఉన్నాడు. ఒక కెప్టెన్‌గా ఉండాలంటే ఏం చేయాలో అర్థం చేసుకుంటున్నాడు. కోహ్లి కొంచెం ఎక్కువ ఉత్సాహం, ఉద్వేగంతో కనిపిస్తుంటాడు. కొన్నిసార్లు ఉద్వేగం ఎక్కువ కావడం వల్ల ప్రత్యర్థులకే కాక సహచరులకు కూడా అతడిని చూస్తే భయం కలుగుతుంది. కోహ్లిని రిచర్డ్స్‌తో బ్యాటింగ్‌లోనే కాదు, కెప్టెన్సీ విషయంలోనూ పోలుస్తాను. రిచర్డ్స్ కెప్టెన్ అయ్యాక ప్రశాంత చిత్తుడిగా మారాడు. తర్వాత ఫలితాలు వాటంతటవే వచ్చాయి. విరాట్ విషయంలోనూ ఇలాగే జరుగుతుందని భావిస్తున్నా. దక్షిణాఫ్రికాతో తొలి రెండు టెస్టులకు రహానెను తప్పించడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అందరూ అతను శ్రీలంకతో సిరీస్‌లో బాగా ఆడలేదని అంటున్నారు. కానీ రహానెకు విదేశాల్లో మంచి రికార్డుంది. పరుగులు చేయకపోయినా అతడికి జట్టులో చోటివ్వాలి" అన్నాడు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో సత్తా చాటిన బుమ్రా.. ఇంగ్లాండ్‌లో మాత్రం రాణించలేడని, తానైతే అతడిని అక్కడ తుది జట్టులో ఆడించనని హోల్డింగ్ చెప్పాడు.

అప్పుడు వాష్ రూంలో..

ముంబయి: అండర్-19 ప్రపంచకప్‌లో సంచలన బౌలింగ్ ప్రదర్శనతో ఐపీఎల్ ఫ్రాంఛైజీల దృష్టిని ఆకర్షించిన కుర్రాడు నాగర్‌కోటి. అతడిని ఏకంగా రూ.3.2 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది కోల్‌కతా నైట్‌రైడర్స్. ఐతే వేలంలోకి తన పేరు వచ్చిన సమయంలో తాను ఒత్తిడికి గురైనట్లు



అతను చెప్పాడు. "ఆ సమయంలో నా స్నేహితులు అదే పనిగా నాకు ఫోన్ చేస్తూ ఉన్నారు. అందుకే నేను నా వేలం పాటను చూడలేదు. నా గదిలో సహచరుడు పంకజ్ లైవ్ చూపించే ప్రయత్నం చేసినా నేను చూడలేదు. వెళ్లి వాష్ రూం లోపల కూర్చుండిపోయా. నా వేలం పూర్తయ్యే వరకు బయటికి రాలేదు. ఇప్పటిదాకా స్టేడియానికెళ్లి ఐపీఎల్ మ్యాచ్‌లు చూశా. ఇప్పుడు నేను కూడా మ్యాచ్‌లు ఆడబోతుండటం సంతోషంగా ఉంది'' అని నాగర్‌కోటి అన్నాడు.

అఫ్గాన్ పరుగు ఆగింది

అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా

క్రైస్ట్‌చర్చ్: అండర్-19 ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్ సంచలనాలకు తెరపడింది. టోర్నీలో ఆస్ట్రేలియా ఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో ఆసీస్ 6 వికెట్ల తేడాతో అఫ్గానిస్థాన్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్.. మెర్లో (4/24), ఎవాన్స్ (2/26) ధాటికి 48 ఓవర్లలో 181 పరుగులకే ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ఇక్రమ్ అలీ ఖిల్ (80) మాత్రమే రాణించాడు. మిగతా బ్యాట్స్‌మెన్ నుంచి అతడికి సరైన సహకారం లభించలేదు. లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 37.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఎడ్వర్డ్స్ (72), పరమ్ ఉప్పల్ (32 నాటౌట్) రాణించారు.

ఫేవరెట్లుగా సింధు, సైనా

ఇండియా ఓపెన్ నేటి నుంచే



దిల్లీ: ఫామ్‌లో ఉన్న సైనా నెహ్వాల్.. డిఫెండింగ్ ఛాంపియన్ పి.వి.సింధు ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఫేవరెట్లుగా బరిలో దిగుతున్నారు. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో సింధు టాప్ సీడ్‌గా, సైనా నాలుగో సీడ్‌గా పాల్గొంటున్నారు. 2015లో విజేతగా నిలిచిన సైనా.. ఇండోనేషియా మాస్టర్స్‌లో ఫైనల్ చేరడంతో ఆమెపై అంచనాలు పెరిగాయి. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సోఫీ డాల్ (డెన్మార్క్)తో సైనా తలపడుతుంది. నిరుడు ఇండియా ఓపెన్ టైటిల్‌తో సత్తాచాటిన సింధు తొలి రౌండ్లో నటాలియా రోడ్ (డెన్మార్క్)తో పోటీపడుతుంది. డ్రా ప్రకారం సెమీస్ వరకు ప్రత్యర్థుల్ని ఓడిస్తే.. సైనా, సింధు ఫైనల్లో ఎదురుపడతారు. శ్రీకాంత్ ఈ టోర్నీతో కొత్త ఏడాదికి శ్రీకారం చుట్టనున్నాడు. అతడు పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లీ చుక్ (హాంకాంగ్)తో తలపడతాడు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00